1-4Pg1exHMNWJQE.qxd:1-4Pg1exHMNWJQE.qxd 1/1/02 7:10 AM Page 1




ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు

సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు

ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

విశాఖపట్నం

: fb.com/vaartha Digital

Published from Visakhapatnam,Vijayawada, Hyderabad, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

1-4-2026 బుధవారం సంపుటి: 32 సంచిక: 60 పేజీలు: 16 వెల: 6.50


శీతలాష్టమి ఆలయంలో తొక్కిసలాట, 8మంది మృతి 5లో

శబరిమల బంగారం స్కాంపై మోడీ ఎందుకు మాట్లాడరు?: రాహుల్

# రాష్ట్రమంతా 'సంజీవిని'

### జూలైలోగా అమలు చేయడానికి కార్యాచరణ

### ఉచిత నగదు రహిత ఆరోగ్యబీమా కూడా అమలు

### ప్రతి నెల 4వ శనివారం స్వర్ణాంధ్ర గ్రామసభలు

### ప్రాజెక్టుపై సమీక్షలో సీఎం చంద్రబాబు



మంగళవారం సంజీవిని ప్రాజెక్టుపై క్యాంపు కార్యాలయంలో సమీక్షిస్తున్న సిఎం చంద్రబాబు

**విజయవాడ,మార్చి31,ప్రభాతవార్తప్రతినిధి:** సంజీవిని ప్రాజెక్టును జూలై లోగా రాష్ట్రమంతటా అమలయ్యేందుకు కీలక కార్యచరణ చేపట్టాలని ఏపీ చంద్రబాబు నాయుడు ఆదేశించారు.మెరుగైన ప్రజారోగ్యం కోసం అందరూ ఉద్యమంలా కృషిచేయాలని సీఎం పిలుపు నిచ్చారు. ఏప్రిల్ నుంచి ఎంపీలు, ఎమ్మెల్యేలు, కలెక్టర్లు, వైద్యా ధికారులు ప్రజల్లోకి వెళ్లాలని సూచించారు. ప్రతీ నెల 4వ శనివారం స్వర్ణాంధ్ర పాపులేషన్ మేనేజ్‌మెంట్ గ్రామసభలు, హెల్త్ క్యాం పులు, అవగాహనా కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. సంజీవని ప్రాజెక్టుపై క్యాంపు కార్యాలయంలో సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, సీఎస్ సాయిప్రసాద్, వైద్యారోగ్య శాఖ కార్య దర్శి సౌరబ్ గౌర్, సంయుక్త కార్యదర్శి రోణంకి గోపాలకృష్ణ పాల్గొ న్నారు. ఇప్పటికే చిత్తూరుజిల్లా, కుప్పం, నారావారిపల్లెలో సమర్థ వంతంగా అమలు అవుతోన్న ఈ ప్రాజెక్టును జూలై కల్లా రాష్ట్రమం తటా అమలయ్యేలా చూడాలని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. వచ్చే ఏడాదిలోగా రాష్ట్రంలో 56.40 లక్షల మందికి వైద్య పరీక్షలు జరపాలనే లక్ష్యాన్ని అధికారులకు సీఎం నిర్దేశించారు. వైద్య పరీక్షల ఫలితాలను వాట్సప్ ద్వారా నేరుగా 48 గంటల్లో వారికి అందిం చాలని చెప్పారు. అయితే ఇందుకోసం 904 మొబైల్ మెడికల్ యూన్సిట్ అవసరం కానున్నాయని రూ.162కోట్లు వ్యయం అవుతుందని అధికారులు వివరించగా అందుకు సీఎం >>2



## నేడు లోక్‌సభకు అమరావతి బిల్లు

### ఉభయ సభల ఆమోదం తర్వాత రాష్ట్రపతికి నివేదన

**విజయవాడ, మార్చి 31 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ ఏకైక రాజధానిగా అమరావతికి చట్టబద్ధమైన హోదా కల్పించే బిల్లు బుధ వారం పార్లమెంటులో ప్రవేశపెట్టబడుతుంది. దీని ద్వారా ఆంధ్రప్రదేశ్‌కు అమరావతి శాశ్వత రాజధానిగా గుర్తింపు లభించనుంది. ఇందుకు అనుగుణంగా బుధవారం లోక్ సభలో 'ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ (సవరణ) బిల్లు 2026'ను కేంద్ర హోం శాఖ లోక్‌సభలో ప్రవేశపెట్టనుంది. దీనిపై ఈ నెల 28న రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపింది. రాష్ట్ర ప్రభుత్వ తీర్మానానికి అనుగుణంగా బిల్లును పార్ల మెంట్‌లో ప్రవేశపెట్టేందుకు కేంద్రం ముందడుగు వేసింది. లోక్ >>2

## నేడు నెల్లూరు, కడప జిల్లాల్లో సిఎం పర్యటన

### సాయంత్రం ఒంటిమిట్టలో సీతారాముల కల్యాణానికి హాజరు

**విజయవాడ, మార్చి 31 ప్రభాతవార్త ప్రతినిధి:** నెల్లూరు, కడప జిల్లాల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బుధవారం పర్య టించనున్నారు. ఓవైపు పేదల సేవలో, మరోవైపు భగవంతుని సేవలో అన్నట్టుగా ఒకే రోజు రెండు కార్యక్రమాల్లో సిఎం చం ద్రబాబు పాల్గొనున్నారు. మొదట నెల్లూరు జిల్లా, వింజమూరులో పేదల సేవలో కార్యక్రమంలో పాల్గొని లబ్దిదారులకు పిం ఛన్లు అందించనున్నారు. ఈ కార్యక్రమం అనంతరం సిఎం చంద్రబాబు నేరుగా ఒంటిమిట్టకు వెళ్లి సీతారాముల వారి కల్యాణ మహోత్సవం సందర్భంగా సీతా రాముల వారికి సతీసమేతంగా పట్టు వస్త్రాలు, తలంబ్రాలను సమర్పిస్తారు.

**22 నెలల్లో రూ.60,437 కోట్లు పంపిణీ**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పేదలకు నేరుగా అతిపెద్ద నగదు బదిలీ ఎన్టీ ఆర్ భరోసా పింఛన్ల పథకం ద్వారా జరు గుతోంది. 22నెలల్లోనే రూ.60,437 కోట్ల ను ప్రభుత్వం పింఛన్ల రూపంలో పేదలకు అందించింది. ఈ ఏప్రిల్ నెలలో రాష్ట్ర వ్యా ప్తంగా 62.60లక్షల మందికి పింఛను దారు లకు రూ.2,724కోట్లను విడుదల చేసింది. ఫించన్ల పంపిణీ కార్యక్ర మంలో సిఎం పాల్గొనే నెల్లూరు >>2

# టిబి డ్యామ్‌కు కొత్తగేట్లు

### ఒకే సీజన్‌లో 33 గేట్లు కొత్తగా నిర్మాణం దేశంలోనే ఓ రికార్డు

### సీమ రైతుల ప్రయోజనాలకు పెద్దపీట

### గేట్ల పనులను ఎమ్మెల్యే కాలువ శ్రీనివాసులుతో కలిసి పరిశీలించిన మంత్రి పయ్యావుల



టిబి డ్యాం వద్ద కొత్త గేట్లు అమర్చు పనులను పరిశీలిస్తున్న మంత్రి పయ్యావుల, ఎమ్మెల్యే కాలువ శ్రీనివాస్, ఇతర అధికారులు

**అనంతపురం, మార్చి 31 ప్రభాతవార్త బ్యూరో:** కర్ణా టకలోని హోస్పేట వద్ద ఉన్న తుంగభద్ర డ్యామ్ గేట్ల నిర్మాణ పనులను మంగళవారం రాష్ట్ర ప్రభు త్వ విప్ కాలవ శ్రీనివాసులు, తుంగభద్ర బోర్డు అధికారులతో కలిసి రాష్ట్ర ఆర్థికప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాలశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పరిశీలించారు. ఈ సంద ర్భంగా తుంగభద్రడ్యామ్ గేట్ల మార్పిడి మరియు కాలువల ఆధునీకరణ పనుల పురోగతిని ప్రెస్ మీట్‌లో మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ 'గోఆల్ అవుట్' అని సీఎం చంద్రబాబు నాయుడు చెప్పిన పదమే తుంగభద్ర డ్యాం కొత్త గేట్ల నిర్మా ణానికి కారణమన్నారు. ఒక సీజన్‌లో డ్యాం 33 గేట్లు తొలగించి, కొత్తవి నిర్మించడం దేశంలోనే ఓ రికార్డు అన్నారు. గడువుకంటే ముందే నిర్మాణ సంస్థ పనులు పూర్తి చేయనుందన్నారు. వచ్చే సీజన్‌కి డ్యాం 33గేట్లు అమరిక పూర్తి అవుతుం దన్నారు. రైతుల ప్రయోజనాలు కాపాడటానికి ప్రభుత్వం ఎంత వరకు అయినా వెళుతుంది అన డానికి ఇక్కడ జరుగుతున్న పనులు నిదర్శన మన్నారు. గత సీజన్‌లో హంద్రీనీవా వెడల్పు పనులు పూర్తిచేసి చూపించామన్నారు. మాటలతో కాదు చేతులతో పనులు చేసి చూపిస్తున్నా మన్నారు. గత ప్రభుత్వ హయాంలో గేట్లు, డ్యాంలు కొట్టుకుపోయినా స్పందించలేదని, టీబీ డ్యాంలో ఒక్కగేటు కొట్టుకుపోతే పారుతున్న నీటికి అడ్డుకట్టవేసి అప్పట్లో రైతుల ప్రయోజ నాలు కాపాడగలిగామని, రాయలసీమ రైతుల ప్రయోజనాలకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోం దన్నారు. తుంగభద్ర ఆనకట్టలోని గేట్ల ప్రస్తుత పరిస్థితిపై నిపుణుల కమిటీ మరియు అధికారులు ఆందోళన వ్యక్తం చేశారని, >>2

### చల్లపల్లి పిఎస్‌లో పేలుడు..

## నలుగురు పోలీసులకు గాయాలు

### ఇద్దరి పరిస్థితి విషమం

**విజయవాడ,మార్చి31,ప్రభాతవార్తప్రతినిధి:** కృష్ణాజిల్లా చల్లపల్లి పోలీస్ స్టేషన్‌లో సీజ్ చేసిన టపాసులు పరిశీలిస్తుండగా పేలుడు సంభవించింది. పేలుడు దాటికి స్టేషన్ భవ నం ధ్వంసమైంది. ఈ ఘటనలో నలుగురు పోలీసులకు తీవ్ర గాయాలయ్యాయి, ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. పోలీసులు బయట నుంచి టపాసులు, మందు గుండి సామాగ్రిని తీసుకొచ్చారు. వీటిని స్టేషన్లో పరిశీలిస్తుండగా పేలుడు సంభవించిందని చెబుతున్నారు. దంపనబోయిన దుర్గాంజ నేయులు, డ్రైవర్, మరో ఇరువురు కానిస్టే బుల్స్ పరిశీలిం చేటప్పుడు అక్కడ ఉన్నా రు. డ్రైవర్‌కి తీవ్ర గాయాలు కాగా ఇరువురు కానిస్టేబుల్స్ గాయాలపాలైనట్లు తెలు స్తోంది.ఈ ఘటనలో చల్లపల్లి ఎస్సైకి కూడా తీవ్ర గాయాలయ్యాయి. వీరిని వెం టనే స్థానికంగా ఉన్న కీర్తిహాస్పిటల్‌కి తర లించి చికిత్స అందిస్తున్నారు. ప్రమా దంలో ఒక కారు కూడా దగ్ధమైంది. >>2

### పంచాయతీరాజ్‌కు

## 5 జాతీయ అవార్డులు

### 24 నుంచి అగ్రస్థానానికి ఎపి

### ఎంతో ఆనందంగా ఉంది: డి.సిఎం పవన్

**విజయవాడ, మార్చి 31 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్‌శాఖ జాతీయ స్థాయిలో సత్తా చాటింది. డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ నేతృత్వం వహిస్తున్న ఈ శాఖకు ఏకంగా ఐదు జాతీయ పురస్కారాలు లభించాయి. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, స్థానిక సంస్థల బలోపేతం, సేవల విస్తరణలో కనబరిచిన అత్యుత్తమ పని తీరుకుగానూ కేంద్ర గ్రామీణాభివృద్ధి, పంచా యతీరాజ్ శాఖ ఈ అవార్డులను ప్రకటించింది. వివరాల్లోకి వెళితే రాష్ట్రీయ గ్రామస్వరాజ్ అభి యాన్, జల్ సంచయ్‌జన్ భాగీదారి అనే రెండు కీలక విభాగాల్లో ఎపి దేశంలోనే ప్రథమస్థానంలో నిలిచింది. మరో విభాగంలో ద్వితీయ స్థానం, ఇంకో రెండు విభాగాల్లో తృతీయ స్థానం దక్కిం చుకుని మొత్తం ఐదు అవార్డులను కైవసం చేసు కుంది. గ్రామ పంచాయతీలను స్వయం సమృ ద్ధిగా తీర్చిదిద్దడం, ప్రణాళికాబద్ధమైన అభివృద్ధిని ప్రోత్సహించే రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభి యాన్‌లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పనితీరు విశే షంగా మెరుగుపడింది. గత ప్రభుత్వ హయాం లో ఇదే విభాగంలో 24వస్థానంలో ఉన్న రాష్ట్రం, ఇప్పుడు దేశంలోనే మొదటి స్థానంలో నిలవడం గమనార్హం. ముఖ్యంగా మహిళలకు స్నేహపూ ర్వక వాతావరణం గల పంచాయతీగా తిరుపతి



జిల్లా శ్రీకాళహస్తి మండల పరిధిలోని బొక్కసం పాలెం జాతీయ స్థాయిలో ప్రథమ స్థానం గెలు చుకుంది. సుపరిపాలనలో విశాఖపట్నం జిల్లా శృంగవరం గ్రామ పంచాయతీ మొదటి స్థానంలో నిలిచింది. గ్రామ స్థాయిలో పేదరిక నిర్మూలన, మెరుగైన జీవనోపాధి అంశాల్లో వైఎస్ఆర్ కడప జిల్లా చెమ్ముళ్లపల్లి గ్రామం రెండో స్థానం దక్కిం చుకుంది. మౌలిక సదుపాయల కల్ప నలో స్వయం సమృద్ధి సాధించిన >>2





### అమెరికా బహుళజాతి సంస్థలే

# ఇక ఇరాన్ టార్గెట్

### గూగుల్, మైక్రోసాఫ్ట్, మెటా ఇతర సంస్థల జాబితా రెడీ

### మహాన్ ఎయిర్‌పై ఇజ్రాయెల్ దాడులు

### యుద్ధం ముగింపునకు ట్రంప్ సానుకూలం!

### గల్ఫ్‌దేశాలపై యుద్ధ వ్యయం మోపే ప్లాన్

**టెహ్రాన్,టెల్‌అవీవ్,వాషింగ్టన్, మార్చి 31:** ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్‌ల దాడులు ఉగ్రరూపం దా ల్చాయి. యురేనియం నిల్వలు దాచి ఉంచారన్న అనుమానంతో ఇరాన్‌లోని అత్యంత రద్దీనగరం ఇష్ఫహాన్‌పై అమెరికా బంకర్‌బస్టర్ బాంబులతో దాడులుచేసింది. ఇరాన్ ఈప్రాంతంలో 540 కిలోల శుద్ధిచేసిన యురేనియం దాచి ఒంచిదన్న అనుమానంతో ఈ దాడులుచేసారు. అయితే ఇరాన్ కూడా అందుకు ధీటుగా గల్ఫ్‌దేశాల్లోని అమె రికా స్థావరాలే లక్ష్యంగా దాడులకు దిగింది. మరోపక్క ఇజ్రాయెల్ కూడా ఇరాన్‌లోని మిలిటరీ మౌలికవనరులే టార్గెట్‌గా దాడులకు దిగింది. ఇరాన్ సైతం తన క్షిపణి, డ్రోన్ దాడులు గల్ఫ్ దేశాలన్నింటిపైనా ఉధృతం చేసింది. ఇదిలా ఉంటే అమెరికా తన యుద్ధవిమానాలను దిం చేందుకు కొన్ని యూరోప్ దేశాలు అంగీకరిం చకపోవడం ఆశ్చర్యకరం. తాజాగా సౌదీ అరేబియా కూడా అమెరికాకు తన గగన >>2

# నేతన్నలకు 'వెలుగు'లు

### నేటి నుంచి ఉచిత విద్యుత్ అమలు : మంత్రి సవిత

**సచివాలయం,మార్చి 31,ప్రభాతవార్త:** రాష్ట్రంలో చేనేత పరిశ్రమల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుంది.నేతన్నలకు వ్యక్తిగత లబ్ధి కలిగించేలా ఒకవైపు సంక్షేమ పథకాలు అమలు చేస్తూనే,మరో పరిశ్రమ అభివృద్ధికి పాల సీలు తీసుకొస్తుంది. ఆనాడు ఎన్టీఆర్ కూడు, గూడు, గుడ్డ నినాదంతో చేనేత రంగానికి అండగా నిలచారు.ఆయన స్పూర్తితో పాలన సాగిస్తున్న సీఎం చంద్రబాబు చేనేత రంగాభివృద్ధికి ఎన్నో ప్రణాళికలు రూపొందిస్తున్నారు.నూతన టెక్స్ టైల్స్ పాలసీలు అమలు చేయడం, మెగా క్లస్టర్లు, టెక్స్‌టైల్స్ పార్కులు ఏర్పాటు చేయడంతోపాటు నేతన్నలకు వ్యక్తిగత లబ్ధి కలిగేలా సంక్షేమ కార్య క్రమాలు అమలు చేస్తున్నారు.దీనిలో భాగంగానే బుధవారం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న లక్షా నాలుగువేల కుటుంబాలకు మేలు కలిగే ఉచిత విద్యుత్ పథకానికి కూటమి ప్రభుత్వం శ్రీకారం చుడుతోంది.ఈ పథకం ద్వారా ఏటా రూ. 150కోట్ల భారం ప్రభుత్వంపై పడనుంది.

**కూటమి రాకతో చేనేతకు మహర్దశ**

జగన్ ప్రభుత్వ తీరుతోపూర్తిగా నీర్వీర్యమైపోయిన చేనేత రం గానికి 2024లో సీఎం చంద్రబాబు ఏర్పాటుతో మహర్దశ ప్రారంభమైంది.నేతన్నకు ఏడాది పాటు ఉపాధి కల్పనే లక్ష్యంగా సీఎం చంద్రబాబు నా యుడు ప్రణాళికలు అమలు



చేస్తున్నారు.ఎన్టీఆర్ భరోసా పెన్షన్ కింద 92,724మంది నేతన్నలకు రూ.3వేల నుంచి రూ.4వేల వరకు పెన్షన్ మొత్తం పెంచారు.రాష్ట్రవ్యాప్తంగా విస్తృతంగా క్లస్టర్లు ఏర్పాటు చేస్తున్నారు.చేనేత రంగాభివృద్ధి కోసం ముడి సరుకులపై సబ్సిడీ,నెట్ ఫండ్ అం దజేస్తూ,ఆధునిక డిజైన్లపై శిక్షణ అంది స్తున్నారు.పనిముట్ల కొనుగోలుకు 90శాతం వరకు సబ్సిడీతో అందజేస్తున్నారు.

**అవార్డుల వెల్లువ**

కూటమి ప్రభుత్వ ప్రొత్సా హంతో ఏపి చేనేతరంగం అభివృద్ధి పథంలో దూసుకెళు తుంది.వన్ డిస్ట్రిక్ట్- వన్‌ప్రొడక్ట్ పథకం కింద రాష్ట్రానికి వచ్చిన 10అవార్డుల్లో 4అవార్డులు చేనేత రంగానికే దక్కడం విశేషం. ఆప్కోలో డిజిటలైజేషన్ చేపట్టేందుకు ప్రతిష్టాత్మక స్కోచ్ అవార్డు లభించింది.ఫోన్‌పే ద్వారా వస్త్రాలు కొనుగోలు,విధుల్లో పారదర్శ కతకు ముఖాధారిత హాజరు,కొనుగోలు చేసిన వస్త్రాలకు కంప్యూటర్ బిల్లింగ్‌వంటి ఎన్నో సాంకేతికతను ప్రవేశపెట్టాం. ఈ నేపథ్యంలో ఆప్కో చేపట్టిన డిజిటలైజేషన్ కు కేంద్ర ప్రభుత్వం స్కోచ్ అవార్డు ప్రకటించింది.

**ఉచిత విద్యుత్ నేతన్నలకు ఆర్థిక పరిపుష్టి**

నేతన్నల కటుంబాల్లో వెలుగులు నింపేలా కూటమి ప్రభుత్వం కీలకమైన ఉచిత విద్యుత్ పథకానికి శ్రీకారం చుడుతోంది.ఏప్రిల్ 1నుంచి ఉచిత విద్యుత్ పథకాన్ని అమలు చేయడానికి ప్రణా ళికలు సిద్ధం చేసింది.మగ్గం పై నేసే నేతన్నలకు 200యూనిట్లు,పవర్ లూమ్ మగ్గాల నేతన్నలకు 500యూనిట్లు వరకు ఉచిత విద్యుత్ అందజేయబోతున్నాం.ఈ పథకం ద్వారా ఏడాదికి మగ్గం నేతన్నలకు రూ.8,640లు, మర మగ్గం నేతన్నలకు రూ.21,600లు ఆదా అవుతుంది. 1,04,000మంది చేనేత కుటుంబాలు ఉచిత విద్యుత్ పథకం ద్వారా లబ్ధి పొందుతాయి.ఈ పథ కం అమలైతే నేతన్నలకు ఆర్థిక వెసులుబాటు కలుగుతుందనటంలో సందేహం లేదు.

## ఎన్టీఆర్ వైద్యసేవలు నేటి నుంచి నిలిపివేత

### పేరుకు పోయిన బకాయిలే కారణం

**విజయవాడ,మార్చి31,ప్రభావార్తప్రతినిధి:** రాష్ట్ర వ్యాప్తంగా ఏప్రిల్ 1 నుంచి ఎన్టీఆర్ వైద్యసే వలు నిలిపివేస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ స్పెషా లిటీ హాస్పిటల్స్ అసోసియేషన్ ఆషా రాష్ట్ర కార్యవర్గం ప్రకటించింది. పేరుకుపోయిన బకాయిలను విడుదల చేయకపోవటం, నెలల తరబడి విన్నవిస్తున్నా రాష్ట్ర ప్రభు త్వం స్పందించడం లేదని నిరసన వ్యక్తం చేస్తూ ఈ నిర్ణయం తీసుకుంది. ఎన్టీఆర్ వైద్య సేవ పథకం కింద పేదవర్గాల ప్రజ లకు అందించిన వైద్య సేవలకు రాష్ట్రంలో నెట్‌వర్క్ ఆసుపత్రులకు >>2

## గిరిజన సంక్షేమ అధికారికి జైలుశిక్ష

**అనంతపురం క్రైమ్, మార్చి 31 ప్రభాతవార్త:** అవినీతి కేసులో గిరిజన సంక్షేమ శాఖ అధి కారి నాగభూషణంకు జైలు శిక్ష విధించినట్లు ఏసీబీ డీఎస్పి ప్రసాద్ రెడ్డి వెల్లడించారు. రాయదుర్గంకు చెంది నఫిర్యాదుదారుడు కె.అజ్మీత్ 2014 సంవత్సరంలో ఇతర కులానికి చెందిన అనసూయమ్మను ప్రేమిం చి, కర్ణాటక రాష్ట్రంలోని చిత్రదుర్గం జిల్లా మొలకల్మూరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో కులాంతర వివాహం చేసుకున్నారు. 2016 సంవత్సరంలో కులాంతర వివాహాలకు గిరి జన సంక్షేమశాఖ ద్వారా రూ.50,000/ ప్రో త్సాహకంగా ఇస్తారని తెలుసుకున్నాడన్నారు. సంబంధిత పత్రాలతో అనంతపురం గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయంలో >>2

5లో 8వ కేంద్ర వేతన సంఘం ఏర్పాటు

1-4pg2exHMNWJQE.qxd:1-4pg2exHMNWJQE.qxd 1/1/02 7:13 AM Page 1





మంగళవారం తుంగభద్ర డ్యామ్‌కు కొత్త గేట్లు అమర్చుతున్న దృశ్యం

# టిబి డ్యామ్‌కు కొత్తగేట్లు

>> గత ప్రభుత్వాల హయాంలో గేట్లు సరిగా లేవని నివేదికలు వచ్చినా, వాటిని పట్టించుకోలేదన్నారు. ఒకే సీజన్‌లో పాత గేట్లను తొలగించి, కొత్త గేట్లను తయారు చేసి, వాటిని అమర్చడం ఒక పెద్ద ప్రక్రియ అని, 60 అడుగుల పొడవు గల ఈ గేట్లను రవాణా చేయడం కూడా ఒక సవాలుతో కూడుకున్న పని అన్నారు. గేట్ల పునరుద్ధరణ విషయంలో నిపుణులు కన్నయ్య నాయుడు వంటి నిపుణుల సలహాలను తీసుకున్నామని, సి.డబ్ల్యు.సి మరియు ఇతర నిపుణుల కమిటీలు కూడా ఈ ప్రక్రియలో భాగమయ్యాయన్నారు. కర్ణాటక ప్రభుత్వంతో కూడా సంప్రదింపులు జరిపి, తగిన నిర్ణయాలు తీసుకున్నారన్నారు. మొత్తం 33 గేట్లను మార్చాలని నిర్ణయించుకోగా, ప్రస్తుతం కొన్ని గేట్ల పనులు పూర్తి కావచ్చాయని, డ్యామ్ వద్ద మొత్తం 18 గేట్లను విజయవంతంగా అమర్చారని, ప్రస్తుతం వెల్డింగ్ పనులు ప్రారంభం కానున్నాయన్నారు. పనులను మే నెల నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ, పనుల వేగం చూస్తుంటే అంతకంటే ముందే పూర్తయ్యే అవకాశం ఉందన్నారు. 2014-19 మధ్య కాలంలోనే ఈ పనుల కోసం ప్రయత్నాలు జరిగాయిని, అప్పటి ముఖ్యమంత్రులు చంద్రబాబు నాయుడు, సిద్ధరామయ్య (కర్ణాటక) మధ్య జరిగిన చర్చల ఫలితంగా, ఒక్క చుక్క నీరు కూడా వృథా కాకుండా ఆధునీకరణ చేయడానికి అంగీకారం కుదిరిందన్నారు. కాలువల ఆధునీకరణలో కర్ణాటక బోర్డర్ పరిధిలోని కిలోమీటర్లను ఆధునీకరించారని, 37వ కిలోమీటర్ వద్ద ఉన్న టన్నెల్ లో పేరుకుపోయిన అడ్డంకులను తొలగించి, నీటి ప్రవాహానికి ఆటంకం లేకుండా చర్యలు తీసుకున్నారన్నారు. ఈ గేట్ల మార్పిడి వల్ల రాబోయే 50 ఏళ్ల వరకు ఎటువంటి ఇబ్బంది ఉండదని, రైతులకు నమ్మకాన్ని కలిగించడమే తమ ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు. గేట్లతో పాటు పాత చైన్లను కూడా మార్చాలని అధికారులు నిర్ణయించారన్నారు. తొమ్మిది గేట్లు 100 శాతం వెల్డింగ్ పూర్తి చేసుకున్నాయని, మరో తొమ్మిది గేట్లు కూడా త్వరలోనే పూర్తవుతాయని చెప్పారు. ఈ 33 గేట్లు అన్నీ పూర్తి చేసి మే నెల కల్లా నీళ్ల నిల్వ చేసేలా చూస్తామన్నారు. ఈ పనులు పూర్తయిన తర్వాత టెక్నికల్ కమిటీ వచ్చి అప్రూవల్ ఇస్తుందనే నమ్మకాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు మాట్లాడుతూ చాలా సంతోషకరమైన శుభ సమయం ఇది అన్నారు. 1958లో తొలిసారి క్రస్ట్ గేట్లు ఆపరేట్ చేసి నీళ్లు వదిలిన సమయం నుంచి తన శక్తికి మించి సామర్థ్యానికి మించి సేవలందించిన గేట్లు ఈరోజు తుప్పు పట్టిపోయి శిథిల దశకు చేరుకున్న సందర్భంలో వాటి స్థానంలో కొత్త గేట్లు అమర్చడం అనేది చాలా పెద్ద కసరత్తు అని అన్నారు.

# ఇక ఇరాన్ టార్గెట్

>> తలం వాడుకునేందుకు అనుమతులు నిరాకరించింది. దుబాయ్ ఓడరేవులో లంగరువేసిన కువైటీ ఆయిల్‌ట్యాంకర్‌పై ఇరాన్ క్షిపణి దాడిచేయడంతో నౌక ధ్వంసం అయిందని సౌదీ ప్రభుత్వం ధృవీకరించింది. హర్ముజ్‌ను తెరవకపోయినా తాము తమ లక్ష్యాలను పూర్తిచేస్తామని, ఇప్పటికే సాధించిన లక్ష్యాలన్నీ సాధించామని ఒప్పందాలకు రాకుంటే ఇరాన్‌కు మరింత చుక్కలు చూపిస్తామంటూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరికలుచేసారు. నిజానికి ఏప్రిల్ 6వరకూ దాడులుచేయబోమని ప్రకటించడం వెనుక ట్రంప్ వ్యూహం వేరే ఉందని నిపుణుల అంచనా. ఈ రోజుల్లోనే తన బలగాలను మొత్తం పశ్చిమాసియాకు తరలించి ఆరోతేదీతర్వాతనుంచి భూతల దాడులు ముమ్మరంచేయాలన్నదే ట్రంప్ లక్ష్యమని ఇందుకు దౌత్యమార్గాల్లోచర్చలని, సంప్రదింపుల, మధ్యవర్తి దేశాలంటూ నాటకం ఆడుతున్నారని ఇరాన్ మంత్రులు విమర్శిస్తున్నారు. మరోపక్క ఆరు వారాలపాటు యుద్ధం ఉంటుందని ప్రకటించిన ట్రంప్ యుద్ధం ముగింపునకే సానుకూలంగా ఉన్నట్లు చెపుతున్నారు. ఈమేరకు వైట్‌హౌస్‌లో తన సహాయకులకు కూడా చెప్పారన్న వార్తలు వెలువడ్డాయి. భూతల దాడులుచేస్తే తమకు రష్యా, చెచెన్యా దేశాలమద్దతు ఉందని, దళాలు కూడా సిద్ధంగా ఉన్నాయంటూ ఇరాన్ అమెరికాకు వార్నింగ్ ఇచ్చింది. ఇదిలా ఉంటే మధ్యప్రాచ్యంలో జరుగుతున్న యుద్ధవ్యయం మొత్తం గల్ఫ్‌దేశాలు భరించేవిధంగా ట్రంప్ కొత్తప్రతిపాదన తెస్తున్నారు. ఇరాన్ ఓడిపోయేంతవరకూ యుద్ధం కొనసాగించాలని గల్ఫ్‌దేశాలు ట్రంప్‌ను కోరిన సంగతి తెలిసిందే. ఇదే అదునుగా ట్రంప్ తన బిజినెస్‌మ్యాన్‌ను తెరపైకి తెచ్చారు. యుద్ధ వ్యయం భరించాలని, మిత్రులను రక్షించుకునేందుకు అమెరికా సిద్ధమేనంటూ ప్రతిపాదనలు తెచ్చారని, అయితే గల్ఫ్‌దేశాలు ఎటూ తేల్చలేదని కూడా సమాచారం బయటకు పొక్కింది. ఇక ఇరాన్ ఐఆర్‌జీసీ బుధవారంనుంచి అమెరికా సంస్థలు, స్థావరాలపైనే దాడులుచేయాలనినిర్ణయించింది. యాపిల్, గూగుల్, మెటా వంటి సంస్థలే లక్షనయంగా ముందుకువెళ్లాలనినిర్ణయించింది. తమ దేశంలో కీలక నాయకులను ఎంపికచేసుకుని మరీ హత్యలుచేసిన దేశాల్లోని టార్గెట్లను వదిలివేయకూడదన్న భావనతో ఐఆర్జీసీ ఉంది. మొత్తం 18 కంపెనీల పేర్లతో జాబితానుకూడా సిద్ధంచేసినట్లు ఇరాన్‌నుంచి వార్తలు వెలువడు తున్నాయి. ఇరాన్ బడ్జెట్ ఆర్థికవ్యవహారాల అధిపతి జమ్‌షీద్ ఎషాఘికూడా ఇజ్రాయెల్ అమెరికా కాల్పుల్లో చనిపోయారని ఇరాన్ ధృవీకరించింది. మంగళవారం ఇజ్రాయెలీ దాడులు ఇరాన్ మిలిటరీ బేస్‌లను లక్ష్యంగాచేసుకుని దాడులుచేసాయి. అలాగే భారత్‌కు రావాల్సిన విమానంపై ఇజ్రాయెల్ దాడులుచేయడాన్ని కూడా ఇరాన్ తీవ్రంగా ఖండించింది. యుద్ధనియమాలను ఉల్లంఘించి యుద్ధనేరాలకు పాల్పడుతోందని మూల్యం చెల్లించుకోవాల్సిందేనని హెచ్చరించింది. తాజాగా కువైట్‌లోని చమురు ట్యాంకర్‌పై దాడిచేయడంతో గల్ఫ్‌దేశాల్లో మరింత కలవరం బయలుదేరింది. ఇరాన్‌కు మానవతా సాయం అందించేందుకు మందులు వైద్యపరికరాలను రవాణాచేస్తూమషద్ విమానాశ్రయంలో దిగిన మహాన్ ఎయిర్ పౌరవిమానంపై ఇజ్రాయెల్‌లు జరిపిన దాడిలో విమానం దెబ్బతిన్నట్లు భారత్‌లోని ఇరాన్ రాయబారకార్యాలయం ప్రకటించింది.ఏప్రిల్ ఆరు తర్వాత దాడులు మరింతగా ఉంటాయన్న సంకేతాలే ఎక్కువ కనిపిస్తున్నాయి. అందుకు అనుగుణంగానే అమెరికా తన బలగాలను రెట్టింపు సంఖ్యలో తరలిస్తుండటమే నిదర్శనం.

# టివికె చీఫ్ విజయ్‌పై కేసు

## మరో అభ్యర్థిపై లైంగిక వేధింపుల కేసు

## సిఎం స్టాలిన్ వాహనం తనిఖీ చేసిన అధికారులు

**చెన్నై, మార్చి 31:** తమిళగ వెట్రి కజగమ్ (టివికె) చీఫ్ విజయ్‌పై మంగళవారం పెరవల్లూరు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఫ్లయింగ్ స్క్వాడ్ ఆఫీసర్ కుమార్ ఫిర్యాదు మేరకు విజయ్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించి 30 లౌడ్ స్పీకర్ వినియోగించడం, ఐదే వేల మందికి పైగా ప్రజలను సమీకరించి సభ నిర్వహించడంతో ప్రజల సాధారణ జీవనానికి తీవ్ర ఆటంకం కల్గించారంటూ ఫ్లయింగ్ స్క్వాడ్ ఆఫీసర్ ఫిర్యాదు చేసినట్లు పెరవల్లూరు పోలీసులు తెలిపారు.ఇదిలా ఉండగా పూనమల్లీ అసెంబ్లీ నియోజకవర్గం టివికె అభ్యర్థి ప్రకాష్ అలియాస్ కుట్టిపై లైంగిక వేధింపుల కేసు నమోదైంది. ప్రకాష్ ప్రస్తుతం తిరువల్లూరు దక్షిణ జిల్లా కార్యదర్శిగా పార్టీ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. తిరువల్లూరులో ఓ వివాహ వేడుకకు హాజరుకాగా, ప్రకాష్ తనను లైంగికంగా వేధించాడని, ఆరోజు నుంచి వేధింపులు ఎక్కువయ్యాయని పార్టీ మహిళా ఎగ్జిక్యూటివ్ ఒకరు తిరువల్లూరు టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. తమిళనాడు ముఖ్యమంత్రి, డిఎంకె అధినేత ఎంకె స్టాలిన్ వాహనాన్ని ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీ చేసింది. ఎన్నికల ప్రచారానికి వెళ్తుండగా మంగళవారం ఉదయం తిరుచి - నాగపట్నం జాతీయ రహదారిపై స్టాలిన్ వాహనాన్ని ఫ్లయింగ్ స్క్వాడ్ సోదాలు చేసింది. అందులో అనుమానించదగ్గ వస్తువులేమీ లభించలేదని పోలీసులుతెలిపారు. వాహనం తనిఖీల అనంతరం తిరువూరు ఎన్నికల సభలో పాల్గొన్నారు.

# రాష్ట్రమంతా 'సంజీవిని'

>> అంగీకారం తెలిపారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు 3.14 లక్షల మంది సంజీవని డిజిటల్ నెర్వ్ సెంటర్ డేటాబేస్‌లో నమోదు చేసుకున్నారని అధికారులు సీఎంకి వివరించారు. వ్యక్తిగత హెల్త్ రికార్డ్ ఎప్పటికప్పుడు అప్‌డేట్ అయ్యేలా చూడాలని సీఎం అన్నారు. భవిష్యత్‌లో వైద్య ఖర్చులు తగ్గేలా సేవలు అందించగలగాలని, ప్రివెంటివ్ హెల్త్‌పై దృష్టి పెట్టాలని సూచించారు. యోగా, న్యూట్రిషన్, మెడిటేషన్, ప్రాణాయామం వంటివి తప్పనిసరిగా అనుసరించడం వల్ల చాలా వరకు ఆరోగ్య సమస్యలకు పరిష్కారం లభిస్తుందని చెప్పారు. సంజీవని ప్రాజెక్టు అమలవుతున్న చిత్తూరు జిల్లాలో ప్రజారోగ్యం ఏమేరకు మెరుగయ్యిందో పరిశీలించాలని అధికారులకు సీఎం సూచించారు. 2025-26లో ప్రత్యేక ఆరోగ్య సంస్కరణల్లో భాగంగా 'సంజీవని'ని ప్రకటించారు. ఇందులో భాగంగా డిజిటల్ హెల్త్ కార్డ్‌లను ప్రయోగాత్మకంగా 2025లో చిత్తూరు జిల్లాలోని కుప్పం నియోజకవర్గంలో ప్రారంభించామని వివరించారు.ప్రతీ పౌరుడికి డిజిటల్ హెల్త్ రికార్డ్స్ అందించడం ద్వారా మెరుగైన ఆరోగ్య సేవలు అందిచడమే దీని ప్రధాన లక్ష్యం. జబ్బు బారిన పడకముందే ముందస్తు చికిత్స చేయడమే కాకుండా, ఏఐ విశ్లేషణ ద్వారా వ్యాధిని ముందే గుర్తించడం ఈ ప్రాజెక్టు ప్రధాన ఉద్దేశం. దీంతో ప్రజలకు సులభంగా ఆరోగ్య సేవలు అందించవచ్చని నిపుణులు తెలుపుతున్నారు. సంజీవని ద్వారా ప్రజల ఆరోగ్య రికార్డులు డిజిటలైజ్ చెయ్య వచ్చు. వారి అనారోగ్య పరిస్థితుల వివరాలు తెలుసుకోవడం ద్వారా వ్యాధి సోకకముందే నివారణపై దృష్టి సారించగలిగే అవకాశం ఉంటుంది. ఏఐ ఆధారిత విశ్లేషణల ద్వారా ఎక్కువ మంది ప్రజలను ఇబ్బంది పెడుతున్న వ్యాధులను గుర్తించి, వాటి నివారణపై దృష్టి సారిస్తుంది. సంజీవని ప్రాజెక్ట్‌తో పాటు ఉచిత క్యాష్‌లెస్ హెల్త్ ఇన్స్యూరెన్స్ కూడా అమలయ్యేలా ఏర్పాటు చేశామన్నారు. ఈ ఏడాది దీన్ని రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం చర్యలు చేపట్టింది. సంజీవన్తి ద్వారా జులై నాటికి 66 లక్షల హైరిస్క్ కేసుల హెల్త్ స్క్రీనింగ్ చేయాలని ఏపీ సీఎం చంద్రబాబు సంబంధిత అధికారులను ఆదేశించారు. మళ్లీ ఏఐ విషయానికి వస్తే, వైద్య రంగంలో ఈ టెక్నాలజీ వ్యాధి నిర్ధరణను సులభతరం చేస్తుంది. ఎక్స్ రే, ఎంఆర్ఐ స్కాన్‌లను ఏఐ ద్వారా విశ్లేషించి క్యాన్సర్ వంటి వ్యాధులను ప్రాథమిక దశలోనే గుర్తించవచ్చు. గిరిజన ప్రాంతాలు, శివారు గ్రామాల్లోని ప్రజలు, ఇంటి నుంచి బయటకు వెళ్లలేని వృద్ధుల కోసం కొత్త కిట్లు అందుబాటులోకి వచ్చాయి. సులభంగా రక్తం, ఇతర ఆరోగ్య పరీక్షలు చేసేందుకు ఇవి ఉపయోగపడతాయి. ఖిఇన్‌స్టా ఐ క్లినిక్‌ఖి పేరిట రెమిడో కంపెనీ ఒక కిట్‌ను రూపొందించింది. ఈ కిట్‌తో కంటి శుక్లాలు, ఐరిస్ సమస్యలు, షుగర్ ఉన్న వారిలో వచ్చే రెటినోపతీ సమస్యలను గుర్తించవచ్చు. అలాగే ఖిమొబిల్యాబ్ కిట్‌ఖి ద్వారా 25 రకాల రక్త పరీక్షలు చేయవచ్చు. ఏఐ ఆధారంగా పనిచేసే ఈ కిట్లు నిమిషాల్లోనే రిపోర్టులు ఇచ్చేస్తాయి. రోగి పేరుతో క్లౌడ్‌లో మెడికల్ రికార్డ్ నంబరు నమోదవుతుంది. వైద్యుడి దగ్గరికి వెళ్లి ఆ నంబరు చెబితే చాలు, వారికి పూర్తి రిపోర్టు కనిపిస్తుంది. అన్నారు.

# నేడు లోక్‌సభకు అమరావతి బిల్లు

>> సభ బిజినెస్ జాబితాలో ఈ మేర చట్టసవరణ బిల్లు డ్రాఫ్ట్ అప్‌లోడ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతిని గుర్తించేందుకు, 'ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం, 2014'కు సవరణ చేయనున్నారు. ఆ చట్టంలోని 5వ సెక్షన్‌లోని ఉప సెక్షన్ (2)లో ఉన్న "ఒక కొత్త రాజధాని ఉంటుంది" అనే పదాల స్థానంలో, "అమరావతి కొత్త రాజధానిగా ఉంటుంది" అనే పదాలను చేర్చేలా సవరణ చేస్తారు. ప్రతిపాదిత సవరణ వివరణ ప్రకారం, 'అమరావతి' అనే పదంలో, 'ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ చట్టం, 2014' నిబంధనల కింద నోటిఫై చేయబడిన రాజధాని నగర ప్రాంతాలు కూడా అంతర్భాగంగా ఉంటాయి. ఈ సవరణ జూన్ 2, 2024 నుండి అమల్లోకి వచ్చినట్లుగా పరిగణించబడుతుంది. లోక్ సభ ఆమోదం తర్వాత రాజ్యసభ ముందుకు ఈ బిల్లు వెళ్లనుంది. ఉభయ సభల ఆమోదం తర్వాత రాజపత్రం (గెజిట్) విడుదల కానుంది. దీంతో అమరావతికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఏకైక రాజధానిగా అధికారికంగా గుర్తింపు దక్కుతుంది. ఈ బిల్లు ఉద్దేశాలు, కారణాల ప్రకటనలో పేర్కొన్నట్లుగా, ఆంధ్రప్రదేశ్ శాసనసభ మార్చి 28, 2026న ఒక తీర్మానాన్ని ఆమోదించింది. ఆంధ్రప్రదేశ్ వారసత్వ రాష్ట్రానికి కొత్త రాజధానిగా 'అమరావతి' పేరును చేర్చేలా, ఆ చట్టంలోని 5వ సెక్షన్‌ను సవరించాలని ఆ తీర్మానం భారత ప్రభుత్వాన్ని కోరింది. ఆంధ్రప్రదేశ్ రాజధాని విషయంలో చట్టపరమైన స్పష్టత ఇవ్వడమే ఈ సవరణ బిల్లు ప్రధాన లక్ష్యం. రాష్ట్రంలోని టిడిపి నేతృత్వంలోని ఎన్‌డియే ప్రభుత్వం ఈ దిశగా కృషి చేస్తోంది. ఇందులో భాగంగానే మార్చి 28న అసెంబ్లీలో ఒక తీర్మానం ఆమోదించబడటంతో, ఈ బిల్లు ప్రవేశానికి మార్గం సుగమమైంది. ప్రత్యేక సమావేశాల సందర్భంగా ఆమోదించిన ఈ తీర్మానం, అమరావతిని రాష్ట్ర ఏకైక రాజధాని నగరంగా ప్రకటించి, నోటిఫై చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. మార్చి 3, 2022 నాటి తన ఉత్తర్వులో హైకోర్టు ఇచ్చిన సలహా మేరకు, 'ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం, 2014' (ఎపిఆర్ఏ)లోని సెక్షన్ 5 (2)లో 'అమరావతి వద్ద (అట్ అమరావతి) అనే పదాలను చేర్చాలని, అలాగే సెక్షన్ 5 వివరణకు 'అమరావతిలో, ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి చట్టం, 2014కింద నోటిఫై చేయబడిన రాజధాని నగర ప్రాంతాలు కూడా అంతర్భాగంగా ఉంటాయి' అనే వాక్యాన్ని జతచేయాలని ఆ తీర్మానం పేర్కొంది. అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు ఆ తీర్మానాన్ని రాజ్యసభ ఛైర్మన్‌కు, లోక్‌సభ స్పీకర్‌కు, కేంద్ర హోంమంత్రికి, కేంద్ర హోం మంత్రిత్వశాఖ కార్యదర్శికి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి పంపారు.

# గిరిజన సంక్షేమ అధికారికి జైలుశిక్ష

>> దరఖాస్తు చేసుకున్నాడన్నారు. అయితే, అప్పటి అసిస్టెంట్ ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్ నాగభూషణం దరఖాస్తు ప్రాసెస్ చేయడానికి రూ.4,000/ లంచం ఇవ్వాలని డిమాండ్ చేశారు. లంచం ఇవ్వడానికి ఇష్టంలేక ఫిర్యాదుదారుడు 26042018న అనంతపురంలోని ఏసీబీ డిఎస్పీకి ఫిర్యాదు చేశారు. దానిపై క్రైమ్ నంబర్ 04/RCT-ATP/2018గా కేసు నమోదు చేయబడిందన్నారు. 27042018న ఏసీబీ అధికారులు ట్రాప్ నిర్వహించి, అనంతపురం గిరిజన సంక్షేమశాఖ కార్యాలయంలో లంచం తీసుకుంటుండగా నిందితుడిని పట్టుకుని అరెస్ట్ చేశారు. అనంతరం జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపారన్నారు. కేసు విచారణ అనంతరం ఏసీబీ కోర్టు, కర్నూలు న్యాయమూర్తి విద్య మంగళవారం తీర్పును వెలువరించారు. అందులో నిందితుడు నాగభూషణంకు Prevention of Corruption Act, 1988 లోని సెక్షన్ 7 క్రింద 5 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష సెక్షన్ 13(2)క్రింద 7సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, రూ. 2,00,000జరిమానా విధించారన్నారు. అదనంగా, జరిమానా మొత్తంలో నుంచి రూ.1,90,000/ను ఫిర్యాదుదారునికి నష్టపరిహారంగా చెల్లించాలని న్యాయస్థానం ఆదేశించిందన్నారు. తదుపరి,నిందితుడిని కర్నూలు జైలుకు తరలించారన్నారు.

# చల్లపల్లి పిఎస్‌లో పేలుడు..

>> చల్లపల్లి సీఐ కేఎస్. రావు ఘటనా స్థలాన్ని పరిశీలించి,ఆస్పత్రిలో సిబ్బందిని పరామర్శించారు.పేలుడుకు గలకారణాలను తెలుసుకున్నారు.

**స్పందించిన హోం మంత్రి అనిత**

ఈ ఘటనపై స్పందించిన హోం మంత్రి అనిత స్పందించారు.ఈ ఘటనలో గాయపడిన వారికి మెరుగైన వైద్య చికిత్స అందించాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ప్రమాదానికి గల కారణాలను తక్షణమే తెలుసుకుని పూర్తి స్థాయి విచారణ జరపాలన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా పోలీస్ స్టేషన్లలో భద్రతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. సీజ్ చేసిన పేలుడు పదార్థాల నిల్వలో నిరక్ష్యం ఉంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.జిల్లా ఉన్నతాధికారులతో మాట్లాడి పరిస్థితిపై సమీక్షించిన మంత్రి, ప్రమాదానికి గురైన ప్రాంగణంలో భద్రతా చర్యలను మరింత బలోపేతం చేయాలని సూచనలిచ్చారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రత్యేక మార్గదర్శకాలు రూపొందించాలని ఆదేశించారు. ప్రజల్లో ఎలాంటి భయం అవసరం లేదని, పరిస్థితి పూర్తిగా అదుపులో ఉందని స్పష్టం చేశారు. కృష్ణా జిల్లా ఎస్పీతో ఫోన్లో మాట్లాడి ఎప్పటికప్పుడు పరిస్థితి తెలుసుకుంటున్నట్లు మంత్రి సుభాష్ తెలిపారు. ఈ ఘటన పట్ల మంత్రి వాసంశెట్టి సుభాష్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.



మంగళవారం న్యూఢిల్లీలో నందిని సిధారెడ్డికి కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు ప్రదానం చేస్తున్న దృశ్యం



ఒంటిమిట్టలో సీతారాముల కల్యాణానికి సిద్ధమైన ప్రాంగణం

# అప్పుల భారంతో తల్లి, కుమార్తె మృతి

## తొండూరు మండలం మల్లెల గ్రామంలో విషాదం

**పులివెందుల, మార్చి 31 ప్రభాత వార్త :** వైయస్సార్ జిల్లాలోని పులివెందుల నియోజక వర్గం తొండూరు మండలం మల్లెల గ్రామంలో హృదయ విదారక ఘటన చోటుచేసుకుంది. షేక్ బీబీ (58), ఆమె కూతురు షేక్ ఇమాంబి (35) తమ నివాసంలో మృతి చెందిన ఘటన స్థానికంగా కలకలం రేపింది.గ్రామస్థుల సమాచారం మేరకు, తల్లి-కూతురు ఇంట్లోనే ఉరివేసుకుని ప్రాణాలు కోల్పోయినట్లు గుర్తించారు. సంఘటన వెలుగులోకి వచ్చిన వెంటనే స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాలను స్వాధీనం చేసుకుని విచారణ చేపట్టారు. ఇదే సమయంలో కుటుంబ పెద్ద షేక్ ఇమామ్ భాష ఇంటిలో కనిపించకపోవడం అనుమానాలకు తావిస్తోంది. కుటుంబం అప్పుల భారంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు ప్రాథమికంగా తెలిసింది.

ఈ నేపథ్యంలోనే ఈ దుర్ఘటన చోటు చేసుకుని ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు.అయితే అసలు కారణాలపై స్పష్టత కోసం పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. మృతుల కుటుంబ సభ్యులు, పొరుగువారిని ప్రశ్నించి వివరాలు సేకరిస్తున్నారు.

# లంచం తీసుకుంటూ ఎసిబికి పట్టుబడిన హెడ్‌కానిస్టేబుల్



మాట్లాడుతున్న ఏసీబీ డిఎస్పీ సోమన్న

**ఆళ్లగడ్డ, మార్చి 31, ప్రభాతవార్త:** ఆళ్లగడ్డ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఓ కేసులో స్టేషల్ బెయిల్ మంజూరు చేయడానికి హెడ్ కానిస్టేబుల్ కోటేశ్వర్‌రావు లంచం తీసుకుంటూ పట్టుబడ్డారని కర్నూలు ఏసీబీ డిఎస్పీ సోమన్న తెలిపారు. ఒక కేసు స్పేషల్ బెయిల్ మంజూరు చేయడానికి బాధితుల వద్ద నుండి రూ.35 వేలు లంచం డిమాండ్ చేసినట్లు సమాచారం వచ్చిందన్నారు. ఈపాటికే బాధితుడు రూ.20 వేలు ఇవ్వగా మిగిలిన రూ.15వేల కోసం ఒత్తిడి చేయడంతో బాధితుడు ఏసీబీని ఆశ్రయించాడన్నారు. ఈక్ర మంలో అవినీతి నిరోధకశాఖ అధికారులు వలపన్ని కోటేశ్వర్‌రావు రూ.15 వేలు లంచం తీసుకుంటుండగా పట్టుకున్నారన్నారు. ఘనటపై కేసు నమోదుచేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఆయన తెలిపారు.

# 5 జాతీయ అవార్డులు

>> పంచాయతీల్లో ప్రకాశం జిల్లా గుండమల గ్రామ పంచాయతీ మూడో స్థానంలో నిలిచింది. ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకర్గం పరిధిలోని కుప్పం మండలం జాతీయ స్థాయిలో 3వ అత్యుత్తమ మండలంగా ఎంపికయ్యింది. అలాగే, తక్కువ ఖర్చుతో వర్షపు నీటిని నిల్వ చేసే పద్ధతు లను ప్రోత్సహించే 'జల్ సంచయ్ జన్ భాగీదారీ' కార్యక్రమంలోనూ ఎపి అగ్రస్థానాన్ని కైవసం చేసు కుంది. డిప్యూటీ సిఎంగా బాధ్యతలు స్వీకరించిన పవన్ కల్యాణ్ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, అటవీ, పర్యావరణం, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖలను పర్యవేక్షిస్తున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాం తాల్లో మౌలిక వసతుల కల్పన, తాగునీటి సౌక ర్యాలపై ఆయన ప్రత్యేక దృష్టి సారించారు. ఇం దులో భాగంగానే 'పల్లెపండుగ 1.0', 'పల్లె పండుగ 2.0' వంటి కార్యక్రమాలను ప్రారంభించారు. రాష్ట్రవ్యాప్తంగా రికార్డు స్థాయిలో గ్రామసభలు నిర్వహించి, ప్రజల నుంచి నేరుగా వినతులు స్వీకరించారు. గ్రామసభలలో వచ్చిన విజ్ఞప్తుల ఆధారంగా 'పల్లెవెలుగు' కార్యక్రమాన్ని చేపట్టి గ్రామాల్లో రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటున్నారు. ఈ క్రమంలోనే శాఖ పనితీరు గణనీయంగా మెరుగుపడి, జాతీయ స్థాయిలో ఈ పురస్కారాలు దక్కడం విశేషం. ఎంతో ఆనందం ఉందన్న డిప్యూటీ సిఎం పవన్: ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ శాఖ వరుసగా రెండో ఏడాది దీనదయాళ్ ఉపాధ్యాయ పంచాయత్ సతత్ వికాస్ జాతీయ పురస్కారాలు లభించడం తనకెంతో పట్టరాన్ని ఆనందంగా కలిగించడంతో పాటు, బాధ్యతల నిర్వహణ పెంచిందని డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత ఏడాది కూడా వివిధ విభాగాల్లో ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ శాఖ 4 అవార్డులు గెలుచుకోవడాన్ని ఈ సందర్భంగా గుర్తు చేసారు.

# నేటి నుంచి నిలిపివేత

>> ఇప్పటికే 3వేల కోట్ల రూపాయలు బకాయిలు పేరుకుపోయాయని వాటిని గత డిసెంబర్ నెలాఖరు నాటికి చెల్లిస్తామని చెప్పిన ప్రభుత్వం ఇంత వరకు చెల్లించలేదని ఆషా గుర్తు చేసింది. ఒక పక్క బకాయిలు చెల్లించకుండా, మరోపక్క యూనివర్సల్ హెల్త్ స్కీం అంటూ పదే పదే ప్రభుత్వం ప్రకటనలు చేస్తోందని ఇది ఎంతమాత్రం సరైన విధానం కాదని అభ్యంతరం వ్యక్తం చేసింది. యూనివర్సల్ హెల్త్ స్కీం రూపకల్పనలో తమకు భాగస్వామ్యం లేదని అలాంటపుడు పేదలకు మెరుగైన కార్పొరేట్ వైద్యం అనే నినాదంతో ప్రభుత్వం గత్యంతరం లేని పరిస్థితుల్లో ఎన్టీఆర్ వైద్య సేవ నెట్‌వర్క్ ఆసుపత్రులు చేపడుతున్న ఆందోళనకు ప్రజలు తమ ఆవేదనను అర్థం చేసుకోవాలని ఆషా రాష్ట్ర కార్యవర్గం విన్నవించింది.

# నేడు నెల్లూరు, కడప జిల్లాల్లో సిఎం పర్యటన

>> జిల్లాలో 2.91 లక్షల మందికి రూ.128 కోట్లు, ఉదయగిరి నియోజకవర్గంలో 39,330 మందికి రూ.17.81కోట్లు, వింజమూరు మండలంలో 5,484 మందికి రూ.2.47 కోట్లను ప్రభుత్వం పింఛన్లు ఇవ్వనుంది. నెల్లూరు జిల్లా వింజమూరు పర్యటన అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు నేరుగా కడప జిల్లా, ఒంటిమిట్ట చేరుకుంటారు.ఒంటిమిట్టలో సీతారాముల కల్యాణమహోత్సతం సందర్భంగా పట్టు వస్త్రాలు, తలంబ్రాలు సమర్పిస్తారు. బుధవారం ఉదయం 10 గంటలకు అమరావతి నుంచి బయలుదేరి 11గంటలకు సిఎం చంద్ర బాబు వింజమూరు చేరుకుంటారు. వింజమూరు లోని ఉత్తర ఎస్సీ కాలనీలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేసి లబ్ధిదారుల యోగక్షేమాలను తెలుసుకుంటారు. అనంతరం మధ్యాహ్నం 12గంటలకు పాతూరు ట్యాంక్ బండ్ వద్దఏర్పాటు చేసిన ప్రజావేదిక సభలో పాల్గొంటారు.02.15 గంటలకు ఉదయగిరి నియోజక వర్గ టిడిపినేతలు, కార్యకర్తలతో సమావేశమవుతారు.

అనంతరం సాయంత్రం 04.25 గం టలకు ఒంటిమిట్టకు చేరుకొని 6.45గం.లకు కల్యాణ వేదికలో నిర్వహించే సీతారాముల వారి కల్యాణ మహోత్సవంలో పట్టువస్త్రాలు, తలంబ్రాలను అందజేస్తారు.ఈ కార్యక్రమంలో సిఎం సతీమణి భువనేశ్వరి పాల్గొంటారు. రాత్రికి అక్కడే బస చేయనున్నారు.

## వారం - వర్జ్యం

01-04-2026, బుధవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
చైత్రమాసం, ఉత్తరాయణం
వసంత ఋతువు, శుక్లపక్షం, రేవతి కార్తె
చతుర్దశి ఉ.7.07
ఉత్తరఫల్గుణి సా.4.20
వర్జ్యం : రా.1.12-రా.2.54
దు.ఉ.11.46 - మ.12.35
శుభసమయం: ఉ.8.30-9.30
రాహుకాలం - మ.12.00-4.30

## వార్తాఫలం

**మేషం :** చాలా ప్రాంతాలు పర్యటిస్తారు. విదేశీయాన యోగ్యతకూడా ఉంది. స్పెక్యులేషన్‌కు దూరంగా ఉండండి.

**వృషభం:** మానసికంగా మీకు అశాంతి కలిగించే విధంగా కొందరు వ్యక్తులు ప్రవర్తిస్తారు. ఆరోగ్యం జాగ్రత్త అవసరం.

**మిథునం:** అవివాహితులైన వారికి వివాహకాలంగా చెప్పవచ్చు. నూతన విద్యలయందు ఆసక్తి కలిగిఉంటారు.

**కర్కాటకం:** మాట నిలకడలేని మనుషులతో కలిసి పనిచేసి నష్టపోతారు. వ్యాపారాలలో అధునాతనమైన పద్ధతులు.

**సింహం:** ప్రైవేట్ కంపెనీల్లో కూడా మంచి అవకాశాలు వస్తాయి. మిత్రులను కలిసి సంతోషంగా గడుపుతారు. ధన లాభం.

**కన్య:** విదేశాలలో ఉన్న మీ సన్నిహితవర్గం తిరిగి చేరువ అవుతుంది. వివాదాలకు దూరంగా వుండండి. వస్త్రలాభం కలదు.

**తుల:** జీవితాశయం నెరవేరుతున్నట్టుగా అనిపిస్తుంది. కీలక నిర్ణయాలలో నిదానం అవసరం. నూతన విద్యావకాశాలు కలవు.

**వృశ్చికం:** అంతర్గత శత్రువులు సమస్యలు సృష్టించినా ధైర్యంగా ఎదుర్కొంటారు. సోదరుల నుండి ధనలాభం కలుగుతుంది.

**ధనుస్సు:** ముఖ్యమైన పనులు సకాలంలో పూర్తిచేస్తారు. ఆర్థిక పరిస్థితిలో చెప్పుకోదగిన ఒడిదుడుకులు ఉండవు.

**మకరం:** దీర్ఘకాలంగా వున్న శత్రువులు, మీకన్న ఉన్నత స్థానాలు సాధిస్తారు. మీరు ఏ విధంగానూ స్పందించకుండా వుండటం మేలు.

**కుంభం:** పోటీ ప్రపంచంలో ధనంతోపాటు తెలివితేటలు అవసరమని బోధించిన సన్నిహిత వర్గానికి దూరం అవుతారు.

**మీనం :** మీరు ఊహించిన రాజకీయ పదవులు లభిస్తాయి. ఆధ్యాత్మిక కార్యక్రమాలకు ప్రాధాన్యతనిస్తారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

1-4Pg7exHMNWJQE.qxdo/p:1-4Pg7exHMNWJQE.qxd 1/1/02 7:39 AM Page 1



# మేడ్ ఇన్ అమరావతి క్వాంటం హార్డ్ వేర్ లక్ష్యం

**• క్వాంటం అప్లికేషన్లతో ఎపికే తొలి ప్రయోజనాలు • ఏప్రిల్ 14న దేశంలోనే తొలి ఓపెన్ క్వాంటం కంప్యూటర్ రాజధానిలో ప్రారంభం**

**• క్వాంటం హార్డ్ వేర్ మాన్యుఫాక్చరింగ్ ఎకో సిస్టం రౌండ్ టేబుల్ సదస్సులో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు**



విజయవాడ, మార్చి 31 ప్రభాతవార్త ప్రతినిధి: రాజధాని అమరావతిలో ఏర్పాటు చేస్తున్న క్వాంటం కంప్యూటింగ్ వ్యాలీ దేశానికి ఓ నూతన దిశను అందిస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. జాతీయ క్వాంటం మిషన్ లక్ష్యాలను తొలిగా అందిపుచ్చుకుని ఏర్పాటు చేసిన అమరావతి క్వాంటం వ్యాలీ దేశానికి ప్రగతి ప్రేరకంగా మారుతుందని అన్నారు. సచివాలయంలో ఏర్పాటు చేసిన అమరావతి క్వాంటం వ్యాలీ క్వాంటం హార్డ్ వేర్ మాన్యుఫాక్చరింగ్ ఎకోసిస్టమ్‌పై నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశానికి ముఖ్యమంత్రి హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి నేషనల్ క్వాంటం మిషన్ డైరెక్టర్ జేబీవీ రెడ్డి, స్టేట్ క్వాంటం మిషన్ డైరెక్టర్ సీవీ శ్రీధర్, ఐబీఎం డైరెక్టర్ అమిత్ సింఘీ, కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు సీడాక్, సీడాట్, డీఆర్ డీఓ, నేవల్ సైన్స్ టెక్నాలాజికల్ లేబొరేటరీ, బార్క్ సంస్థల ప్రతినిధులు హాజరయ్యారు. క్యూబిట్ ఫోర్స్, క్యూబీట్స్, క్వాంటం ఏఐ గ్లోబల్, క్యూపిఐ ఏఐ, ఆటోమియోనిక్స్, తిరుపతి ఐఐటీ ప్రొఫెసర్ సత్యనారాయణ హాజరయ్యారు. మద్రాస్ ఐఐటీ ప్రొఫెసర్ కామకోటి వర్చువల్‌గా ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశానికి క్వాంటం కంప్యూటర్ పరికరాల తయారీ కంపెనీలు, క్రయోజనిక్స్, ఫోటోనిక్స్, పవర్ ఎలక్ట్రానిక్స్ కంపెనీల ప్రతినిధులు సైతం హాజరయ్యారు. వారిని ఉద్దేశించి సీఎం ప్రసంగిస్తూ రెండేళ్లలో దేశీయంగా క్వాంటం కంప్యూటింగ్ పరికరాల ఉత్పత్తి దిశగా కార్యాచరణ చేపట్టాలని సూచించారు. త్వరలో సిద్ధం కానున్న ఏక్యూవీ నుంచి క్వాంటం కంప్యూటింగ్ పరికరాలు, ఇతర హార్డ్ వేర్ ఉత్పత్తి, అల్గారిథమ్స్ రూపకల్పన వంటివి చేపట్టాలని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. 2030 నాటికి ప్రపంచ వ్యాప్తంగా 5 గ్లోబల్ క్వాంటం హబ్స్‌లో ఒకటిగా ఎపిని తీర్చిదిద్దేలా కార్యాచరణ చేపట్టాలని రౌండ్ టేబుల్ సమావేశంలో అభిప్రాయం వ్యక్తం అయ్యింది. అమరావతి క్వాంటం వ్యాలీలో దీనికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనతో పాటు హార్డ్ వేర్, ఎకోసిస్టం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. బయోఫౌండ్రీ సహా వివిధ స్టార్టప్‌ల సహకారంతో డిజైన్లు, ఆవిష్కరణలు, పరిశోధన చేపట్టాలని సమావేశంలో చర్చించారు. మేడ్ ఇన్ అమరావతి క్వాంటం కంప్యూటర్ పరికరాల ఉత్పత్తికి విస్తృత ప్రయత్నాలు చేయాలని సూచించారు.

**ఎపికే క్వాంటం తొలి ప్రయోజనాలు:** మూడు దశాబ్దాల క్రితం ఐటీని, ఇప్పుడు క్వాంటం కంప్యూటింగ్ టెక్నాలజీని ఫస్ట్ మూవర్ అడ్వాంటేజ్‌గా అందిపుచ్చుకుంటున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు వివరించారు. గతంలో ఐటీలో నిపుణుల్ని తయారుచేయడానికి ఇంజనీరింగ్ కాలేజీలు, ట్రిపుల్ ఐటీలను కూడా రాష్ట్రంలో ఏర్పాటు చేసుకున్నామని... ఇప్పుడు క్వాంటం టెక్నాలజీని అందిపుచ్చుకునేలా నిపుణులకు శిక్షణ ఇస్తున్నామని వివరించారు. వైసర్, ఐబీఎం లాంటి సంస్థల సహకారంతో యువతకు క్వాంటంలో నైపుణ్యాలు పెంచుతున్నామన్నారు. అవేర్ ద్వారా రియల్ టైమ్ డేటా సేకరించటంతో పాటు రియల్ టైమ్‌లో నిర్ణయాలు జరిగేలా చర్యలు చేపట్టామన్నారు. ఏఐ డాక్టర్, ఏఐ ట్యూటర్, ఏఐ అగ్రానమిస్ట్ లాంటి సేవలు పౌరులకు అందాల్సి ఉందన్నారు. ఆధునిక టెక్నాలజీలను తొలిగా అందిపుచ్చుకున్న వారికే ఎప్పుడూ ప్రయోజనాలు దక్కుతాయని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. రాజధాని అమరావతిలో క్వాంటం వ్యాలీలో నిర్మిస్తున్న 8 టవర్లలో క్వాంటం కంప్యూటింగ్ సెంటర్‌తో పాటు ఆవిష్కరణలు, పరిశోధనలతో పాటు స్టార్టప్‌లకు కూడా అవకాశం కల్పిస్తామని ముఖ్యమంత్రి తెలిపారు. క్వాంటం హార్డ్ వేర్ దిగుమతి కాకుండా ఇక్కడే తయారు చేసుకోవాలన్న లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలియచేశారు. క్వాంటం పరికరాలు, టెక్నాలజీ, క్రయోజనిక్స్, అల్గారిథమ్స్ ఇలా మనమే తయారు చేసుకునేలా కార్యాచరణ చేపట్టాలని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. క్వాంటం కంప్యూటింగ్ వ్యాలీతో అమరావతి ఇక భవిష్యత్ నగరంగా అత్యుత్తమ లివబుల్ సిటీగా మారుతుందన్నారు. దీనికి అవసరమైన టెక్నాలజీని, భాగస్వామ్యాన్ని అందించాలని జాతీయ క్వాంటం మిషన్ ను ముఖ్యమంత్రి కోరారు.

**ఏప్రిల్ 14న అందుబాటులోకి తొలి ఓపెన్ క్వాంటం కంప్యూటర్:** దేశంలోనే తొలి ఓపెన్ క్వాంటం కంప్యూటర్ అమరావతిలో ఏప్రిల్ 14 తేదీ నుంచి అందరికీ అందుబాటులోకి తీసుకురానున్నట్టు క్యూబిట్ ఫోర్స్ సంస్థ డైరెక్టర్ వెంకట్ సుబ్రమణ్యన్, ఎస్ఆర్ఎం యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ సతీష్ కుమార్ ముఖ్యమంత్రికి చంద్రబాబు వివరించారు. విద్యార్థులు, పరిశోధకులకు ఈ క్వాంటం కంప్యూటర్ టెస్టింగ్ కోసం సిద్ధంగా ఉంటుందని తెలిపారు. క్వాంటం ఎకోసిస్టమ్‌కు అనువుగా టెస్ట్ బెడ్స్, సర్టిఫికేషన్ లాంటివి ఉండాలని కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ సీడాక్ ఈడీ సుదర్శన్ వివరించారు. క్వాంటం సిమ్యులేటర్స్‌తో పాటు బయోసెన్సార్స్, మినరల్ సెన్సార్స్, లేజర్ అప్లికేషన్స్ అమరావతి క్వాంటం వ్యాలీలో అందించేందుకు సిద్ధమని వివిధ క్వాంటం కంప్యూటింగ్ సంస్థలు ముఖ్యమంత్రికి తెలియచేశాయి. జాతీయ క్వాంటం మిషన్ లక్ష్యాలను అందిపుచ్చుకోవటంలో ఏపీ అగ్రస్థానంలో ఉందని ఎన్‌క్యూఎం మిషన్ డైరెక్టర్ జేబీవీ రెడ్డి ముఖ్యమంత్రికి తెలిపారు. మొత్తంగా 30కి పైగా క్వాంటం కంప్యూటింగ్ పరికరాల తయారీ కంపెనీలు ఈ రౌండ్ టేబుల్ సమావేశానికి హాజరయ్యాయి. 15 కంపెనీలతో ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం అవగాహనా ఒప్పందాలను కుదుర్చుకుంది. విజయవాడలోని మేధా టవర్స్‌లో 7 సంస్థలు ఇప్పటికే తమ కార్యకలాపాలను ప్రారంభించాయి.

## ఎస్‌పిడిఎల్‌లో ఉద్యోగులకు పదోన్నతులు

తిరుపతి, మార్చి 31 ప్రభాతవార్త ప్రతినిధి: ఎస్‌పిడిసిఎల్ తిరుపతి కార్పొరేట్ కార్యాలయం పరిధిలో పలువురికి పదోన్నతులు కల్పిస్తూ ఆ సంస్థ సిఎండి శివశంకర్ లోతేటి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎస్‌పిడిసిఎల్‌లో కడప ఆపరేషన్ సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్‌గా విధులు నిర్వహిస్తున్న ఎస్.రమణకు పదోన్నతిపై కార్పొరేట్ కార్యాలయంలో కొనుగోళ్ళ విభాగపు చీఫ్ జనరల్ మేనేజర్‌గా నియమించారు. ఎస్‌పిడిసిఎల్‌లో ఓఎం విభాగపు చీఫ్ జనరల్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న ఎం.కృష్ణారెడ్డి పదవీ విరమణ చేయడంతో ప్రస్తుతం ప్లానింగ్ విభాగపు చీఫ్ జనరల్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న కె.సంపత్ కుమార్‌ను ఓఎం విభాగపు చీఫ్ జనరల్ మేనేజర్‌గా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఇక ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లుగా విధులు నిర్వహిస్తున్న ఎస్. అమర్ బాబుకు సూపరింటెండింగ్ ఇంజనీర్‌గా పదోన్నతి కల్పిస్తూ, చిత్తూరు ఆపరేషన్ సర్కిల్ ఎస్ఇగా నియమించగా, బి. హరికి పదోన్నతి కల్పిస్తూ కార్పొరేట్ ఆఫీసులో ఎనర్జీ ఆడిట్ విభాగపు జనరల్ మేనేజర్‌గా నియమించారు. కార్పొరేట్ ఆఫీసులో ఎనర్జీ ఆడిట్ విభాగపు జనరల్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న ఎస్. శ్రీనివాసులును కడప ఆపరేషన్ సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్‌గా బదిలీ చేశారు. అదేవిధంగా డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు ఐ.రవి చంద్రశేఖర్, షేక్ చాంద్ బాషా, ఎస్. రామకృష్ణలకు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లుగానూ, అసిస్టెంట్ ఇంజనీర్లు ఎం. కవిత, ఎస్.అశోక్ కుమార్, బి.రవికుమార్‌లకు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లుగా పదోన్నతులు కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

## రూ.20 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డ గుడిబండ తహసీల్దార్

గుడిబండ, మార్చి 31 ప్రభాతవార్త: శ్రీసత్యసాయి జిల్లా గుడిబండ మండల తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం ఎసిబి అధికారులు ఆకస్మికంగా సోదాలు నిర్వహించారు. ఎస్. రాయపురం గ్రామానికి చెందిన ఒక రైతు పేరిట వన్‌బి నమోదు చేయడానికి తహశీల్దారు శ్రీధర్ రూ.20 వేలు లంచం తీసుకుంటూ ఎసిబి అధికారులకు పట్టుబడ్డారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. కొంకల్లు గ్రామ పంచాయతీకి సంబంధించి 272/5 సర్వే నెంబర్‌లో 2 ఎకరాల 33 సెంట్లు భూమిని ఒన్ బి చేయడానికి లంచం అడగడంతో రైతు సాబ్జాన్ కుమారుడు సద్దాం ఎసిబి అధికారులను ఆశ్రయించారు. దీంతో రంగంలోకి దిగిన ఎసిబి అధికారులు పక్కా ప్రణాళికతో తహశీల్దారు శ్రీధర్ లంచం తీసుకుంటుండగా పట్టుకుని నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై ఎసిబి డిఎస్పీ ప్రసాద్ రెడ్డి అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో ఎసిబి డిఎస్పీ ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజల పనులు చేయడానికి ప్రభుత్వ ఉద్యోగులు లంచం అడిగితే అవినీతి నిరోధక శాఖ అధికారులకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు.

## నరసరావుపేటలో ఘోర రోడ్డు ప్రమాదం

### ఇద్దరి మృతి.. పోలీసుల అదుపులో లారీ డ్రైవర్



నరసరావుపేట (క్రైమ్), మార్చి 31 ప్రభాతవార్త: నరసరావుపేట-జొన్నలగడ్డ మధ్యనున్న గుంటూరు-కర్నూల్ హైవేపై మంగళవారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఓ లారీ ఓవర్ టేక్ చేయబోతూ ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టింది. ఈ ఘటనలో ద్విచక్రవాహనంపై వెళ్తున్న చట్ల పార్వతి (46), లారీ కిందపడి అక్కడికక్కడే మృతి చెందగా, తీవ్ర గాయాలైన చట్ల నందిని (28) హాస్పిటల్లో చికిత్స పొందుతూ మృతి చెందింది. ద్విచక్రవాహనం నడుపుతున్న చట్ల మస్తాన్ రావుకు చట్ల పార్వతి తల్లి కాగా, నందిని భార్య. ప్రమాదానికి గురైన ద్విచక్ర వాహన దారుడు మస్తాన్‌రావు ది ఫిరంగిపురం మండలం మునగపాడు గ్రామంగా గుర్తించారు. బాధితుడు చట్ల మస్తాన్‌రావు తెలిపిన వివరాల ప్రకారం బ్యాంక్ పనిపై కొడుకు, తల్లి, అతని భార్య ముగ్గురు కలిసి ద్విచక్రవాహనంపై నరసరావుపేటకు వచ్చి, పని ముగించుకుని తిరిగి వారి స్వగ్రామమైన మునగపాడు గ్రామానికి వెళ్తుండగా ప్రమాదం జరిగిందన్నారు. ప్రమాదానికి కారణమైన లారీ వినుకొండ నుండి ఏలూరుకు మొక్కజొన్న లోడుతో వెళ్తుంది. ప్రమాదానికి కారణమైన లారీడ్రైవర్ మద్యం సేవించి వున్నట్లుగా అనుమానిస్తున్నారు. సమాచారం మేరకు నరసరావుపేట గ్రామీణ పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని విచారిస్తున్నారు. ప్రమాదానికి కారణమైన లారీడ్రైవర్ కాళీకృష్ణను నరసరావుపేట గ్రామీణ పోలీసులు అదుపులోకి తీసుకుని దర్యాప్తు చేపట్టారు.



## పట్టాలు తప్పిన గూడ్స్

మనుబోలు (నెల్లూరు), మార్చి 31 ప్రభాతవార్త: నెల్లూరు జిల్లా మనుబోలు మండలం కొమ్మలపూడి రైల్వే స్టేషన్ సమీపంలో రైల్వే మిల్క్ ట్యాంకర్ బోల్తా పడింది. దీనితో పలు రైళ్లకు అంతరాయం ఏర్పడింది. విజయవాడ నుండి తిరుమలకు పాలతో వెళుతున్న రైల్వే పాల ట్యాంకర్ 152/ 11బి కిలోమీటర్ వద్ద ఉన్న రైల్వే జంక్షన్ వద్ద గూడ్స్ పట్టాలు తప్పింది. అదుపు తప్పి పాల ట్యాంకర్ బోల్తాపడింది. ఆప్ లైన్‌లో విజయవాడ నుండి చెన్నై వెళుతున్న పలు రైళ్ళకు అంతరాయం కలిగింది. ఆర్‌పిఎఫ్ పోలీస్ అధికారులు అక్కడికి చేరుకున్నారు. రైల్వే అధికారులు యుద్ధ ప్రాతిపదికన పనులు మొదలు పెట్టారు. రైళ్ల రాకపోకలను పునరుద్ధరించారు.

## సైబర్ క్రైమ్ కేసులో యువకుడి అరెస్టు

**• సైబరాబాద్ పోలీసులకు అప్పగింత • ఎమ్మార్పేట సిఐ దివాకర్ యాదవ్ వేగవంతమైన స్పందనకు కృతజ్ఞతలు తెలియజేసిన సైబరాబాద్ పోలీసులు**



విశాఖ (క్రైమ్), మార్చి 31 ప్రభాతవార్త: సైబర్ నేరాల దర్యాప్తులో అంతర్రాష్ట్ర స్థాయిలో పోలీసు విభాగాల మధ్య సమన్వయం మరోసారి వెలుగులోకి వచ్చింది. విశాఖ సిటీ ఎమ్మార్ పేట పోలీసుల సహకారంతో సైబర్ లావాదేవీల కేసులో నిందితుడిగా గుర్తించిన యువకుడిని పట్టుకుని సైబరాబాద్ పోలీసు అధికారులకు అప్పగించారు. విశాఖ నగరంలోని ఊటగెడ్డ ప్రాంతానికి చెందిన సుంకర ఈశ్వర్ (25) బట్టల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. వ్యాపారంలో నష్టాలు రావడంతో అప్పులబారిన పడ్డాడని, ఈ పరిస్థితిని ఆసరాగా తీసుకుని కొంతమంది సైబర్ నేరగాళ్లు అతనిని సంప్రదించినట్లు పోలీసులు తెలిపారు. అతని బ్యాంకు ఖాతా ద్వారా భారీ మొత్తంలో ఆన్‌లైన్ లావాదేవీలు జరిపి, వాటిలో కొంత మొత్తం ఈశ్వర్‌కు ఇచ్చినట్లు విచారణలో వెల్లడైంది. ఈ వ్యవహారంపై కేసు నమోదు చేసిన సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు, అతనిపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి అన్వేషణ ప్రారంభించారు. నిందితుడు విశాఖలో ఉన్నాడన్న సమాచారం అందడంతో విశాఖ పోలీసుల సహకారం కోరారు. సీపీ శంఖబ్రత బాగ్చి ఆదేశాల మేరకు, డీసీపీ 1 మణికంఠ విజయ్ పర్యవేక్షణలో, ఎమ్మార్పేట సీఐ దివాకర్ యాదవ్ నేతృత్వంలో ప్రత్యేక బృందం చర్యలు చేపట్టింది. ఊటగెడ్డ సమీపంలో సుంకర ఈశ్వర్‌ను అదుపులోకి తీసుకుని, అనంతరం వచ్చిన సైబరాబాద్ పోలీసులకు అధికారికంగా అప్పగించారు.

ప్రాథమిక విచారణలో ఈశ్వర్ ఖాతా ద్వారా లక్షల్లో లావాదేవీలు జరిగినట్లు తెలిసిందని, ఆ డబ్బు వివిధ మోసపూరిత లావాదేవీలకు సంబంధించినదా అనే దానిపై సైబరాబాద్ పోలీసులు మరింత లోతుగా విచారణ చేపడుతున్నట్లు సమాచారం. ఈ కేసులో ఎమ్మార్ పేట సీఐ దివాకర్ యాదవ్ అతని బృందం వేగవంతమైన స్పందనకు సైబరాబాద్ పోలీసులు కృతజ్ఞతలు తెలిపారు. రెండు పోలీసు విభాగాల సమన్వయంతో నిందితుడిని తక్షణమే గుర్తించి అప్పగించడం దర్యాప్తుకు సహకరించిందని పేర్కొన్నారు.

## గ్రూప్-1 మూల్యాంకనంలో అవకతవకలపై దర్యాప్తు చేయలేరా?

**• నెలలోగా సీల్డ్ కవర్‌లో నివేదిక సమర్పించాలి • సిట్‌కు హైకోర్టు ధర్మాసనం ఆదేశం**



విజయవాడ, మార్చి 31 ప్రభాతవార్త ప్రతినిధి: ఎపి పబ్లిక్ సర్వీసు కమీషన్ గ్రూప్-1 మూల్యాంకనం ప్రక్రియలో జరిగిన అవకతవకలపై విచారణ జరిపి, ఏప్రిల్ 30వ తేదీలోగా సీల్డ్ కవర్లో నివేదిక సమర్పించాలని హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బట్టు దేవానంద్, జస్టిస్ హరిహరనాథ శర్మతో కూడిన హైకోర్టు ధర్మాసనం సిట్‌ను ఆదేశించింది. గ్రూప్-1 ద్వారా ఎంపికైన అభ్యర్థులను నాన్ ఫోకల్ పోస్టులకు బదిలీ చేయాలని తాము గతంలో ఆదేశాలు జారీ చేశామని ధర్మాసనం గుర్తు చేసింది. ఈ నేపథ్యంలో కొంతమంది డిఎస్పీలను సిఐడి ఆఫీసుకు బదిలీ చేసినట్లు సమాచారం అందిందని తెలిపింది. సిఐడి కార్యాలయానికి ట్రాన్స్‌ఫర్ చేయడం నాన్ ఫోకల్ పోస్టు ఎలా అవుతుందని ప్రశ్నించింది. ఇక నుంచి గ్రూప్-1 జవాబు పత్రాలను ఫోరెన్సిక్ ల్యాబ్‌లకు తీసుకెళ్లి తీసుకురావడం ఆ డిఎస్పీల పనేనని పేర్కొంది. న్యాయవాది పాణిని సోమయాజి సిట్ తరఫున వాదించారు, ఈ కేసులో హైకోర్టు ఆదేశాలకు అనుగుణంగానే స్పందిస్తున్నట్లు వివరించారు. సిట్ పంపిన జవాబు పత్రాలు అన్నీ పరిశీలించడం తీవ్ర భారమని హైదరాబాద్‌లోని సెంట్రల్ ఫోరెన్సిక్ సైన్స్ లేబరేటరి తమకు తెలిపిందన్నారు. జవాబు పత్రాల్లో 167 వారి వద్ద ఉంచుకొని 500 పత్రాలను తిప్పి పంపిందన్నారు. దీనిపై ఆగ్రహం వ్యక్తం చేసిన ధర్మాసనం విచారణ బాధ్యతను సిట్‌కి అప్పగించామని గుర్తు చేసింది. దీన్ని సక్రమంగా నిర్వహించాల్సిన బాధ్యత సిట్‌దే అని న్యాయస్థానం తేల్చి చెప్పింది. కోర్టు ఆదేశం మేరకు దర్యాప్తు చేయడం సాధ్యం కాకపోతే ఆ విషయాన్ని న్యాయస్థానానికి తెలియజేయాలని ఆదేశించింది. మీ వల్ల కాకపోతే మరో దర్యాప్తు సంస్థకు బాధ్యతను అప్పగిస్తామని న్యాయస్థానం పేర్కొంది. సిట్ అధిపతిని సంప్రదించి వివరాలు న్యాయస్థానానికి తెలియజేయాలని న్యాయవాదికి కోర్టు సూచించింది. విరామం అనంతరం సిట్ తరఫు న్యాయవాది స్పందిస్తూ దర్యాప్తులో ముందుకెళతామన్నారు. ఈ నిర్ణయాన్ని సిట్ అధిపతి తమకు తెలియజేసినట్లు ఆయన వెల్లడించారు. ఈ వివరాలను పరిగణనలోకి తీసుకున్న న్యాయస్థానం విచారణ పూర్తి చేయడానికి నెల రోజులు సమయం కావాలని లిఖిత పూర్వకంగా కోర్టును గతంలో అభ్యర్థించారని గుర్తు చేసింది. అందుకు అనుమతిస్తూ న్యాయస్థానం తదుపరి విచారణను ఏప్రిల్ 30కి వాయిదా వేసింది.



## పల్నాడు జిల్లా ఎస్పీ కార్యాలయంలో హై టెన్షన్

### 4 గంటలు బైఠాయించి ఎమ్మెల్యే డా.చదలవాడ అరవింద్ బాబు నిరసన

నరసరావుపేట క్రైమ్, మార్చి 31 ప్రభాతవార్త: పల్నాడు జిల్లా ఎస్పీ కార్యాలయంలో మంగళవారం హై టెన్షన్ నెలకొంది. ఎస్పీ వర్సెస్ ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్ బాబుగా వివాదం నెలకొంది. నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు మంగళవారం 4 గంటలకు పైగా బైఠాయించారు. ఎస్పీ కృష్ణారావు తీరుపై ఆయన నిరసన తెలియజేస్తూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్పీ కార్యాలయానికి సంబంధించి లీగల్ అడ్వైజర్ పోస్టును తాము సిఫార్సు చేసిన న్యాయవాదికి ఇవ్వాలని ఎమ్మెల్యే కోరారు. గత కొన్ని నెలలుగా ఈ వ్యవహారం ఎటు తేలక పోవడంతో, ఎస్పీ కార్యాలయం నుండి సానుకూలంగా స్పందన రాకపోవడంతో ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే ఎస్పీ కార్యాలయంలో కొన్ని గంటల పాటు బైఠాయించడంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్, టిడిపి జిల్లా అధ్యక్షుడు షేక్ జాన్ సైదా, డిఐజి సర్వశ్రేష్ఠ త్రిపాఠి ఎస్పీ కార్యాలయానికి చేరుకున్నారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్ బాబుతోను, జిల్లా ఎస్పీ కృష్ణారావుతోను సమస్య పరిష్కారానికి వారు చర్చలు జరిపారు. పోలీస్ శాఖ ఉన్నత అధికారులతో పాటు, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకులు సమస్యను వివాద రహితంగా పరిష్కరించాలని సూచనలు చేశారు. ఎస్పీ కార్యాలయంలో అధికార పార్టీ శాసన సభ్యులు నిరసన నిర్వహించటం హాట్ టాపిక్‌గా మారింది. పల్నాడు జిల్లా పోలీసులు ఒకవైపు అధికార పార్టీ ఎమ్మెల్యేలు మరోవైపు నిలవడంతో అన్ని వర్గాలలో చర్చనీయాంశమైంది.



## నందివాహనంపై శ్రీదుర్గామల్లేశ్వర స్వామివార్లు

**• వేదోక్తంగా చైత్రమాస బ్రహ్మోత్సవాలు**

ఇంద్రకీలాద్రి, మార్చి 31 ప్రభాతవార్త: దుర్గమ్మవారి ఆలయంలో మూడోరోజు మంగళవారం చైత్రమాస కళ్యాణ బ్రహ్మోత్సవాలు విశేష పూజా కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం 8 గంటలకు శ్రీమల్లేశ్వర స్వామి వారి ఆలయ ప్రాంగణంలో అర్చక స్వాములు అత్యంత భక్తిశ్రద్ధలతో మూలమంత్ర హావనములను పూర్తి చేశారు. సాయంత్రం 5గంటలకు ఉపాసన, బలిహరణ, హారతి, మంత్రపుష్పం సమర్పించి, భక్తులకు ప్రసాద వితరణ చేశారు. బ్రహ్మోత్సవ వాహన సేవలో భాగంగా సాయంత్రం 5 గంటలకు శ్రీ మల్లేశ్వరస్వామివారు అమ్మవార్లతో కలిసి నంది వాహనంపై మంగళవారం భక్తులకు దర్శనమిచ్చారు. వాహన సేవను వీక్షించేందుకు భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. శ్రీస్వామి అమ్మవార్ల వాహన సేవలో పలు రకాల విన్యాసాలతో భక్తులు ముందు సాగారు. కోలాటాలు, తప్పెట్లు, సాము గిరికీలు, భజన బృందాలు, శంఖ, భేరి, ఢక్క, ఢమరుక నాదాలతో స్వామి అమ్మవార్లకు పలు భక్తబృందాలు నీరాజనాలు పలుకుతూ వాహనసేవకు ముందుగా కదులుతుండగా తమ ప్రాంతాలకు వచ్చిన శ్రీస్వామి అమ్మవార్లకు ఆయా ప్రాంత భక్తులు మంగళహారతులతో స్వాగతం పలికి పండ్లు, పూలు సమర్పించి మొక్కుకున్నారు. చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఇఓ శీనా నాయక్, పాలక మండలి, అర్చకస్వాములు, ఆలయాధికారులు పాల్గొన్నారు.

**టోల్‌గేట్ టెండర్ పాట రు.2,21,21,555:** దుర్గమ్మవారి ఆలయంలో భక్తుల వాహనాల పార్కింగ్ టోల్‌గేట్ టెండరు రు.2,21,21,555లకు ఖరారయ్యింది. విజయవాడకు చెందిన సిఎస్ఆర్ ఎంటర్‌ప్రైజెస్ ఈ టెండర్ దక్కించుకుంది. ఈ వేలంపాట ప్రక్రియలో చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఇఓ వికె శీనా నాయక్, పాలకమండలి సభ్యులు, ఎఇఒలు, అధికారులు పాల్గొన్నారు.

**తాత్కాలికంగా టోల్‌రుసుము మినహాయింపు:** దుర్గమ్మ వారి ఆలయంలో భక్తుల వాహనాల పార్కింగ్‌కు తాత్కాలికంగా టోల్‌రుసుం నుండి మినహాయింపు కల్పిస్తున్నట్లు ఇఓ వికె శీనా నాయక్ తెలిపారు. మంగళవారం టోల్ టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ దేవస్థానంకు చెల్లించాల్సిన రుసుము చెల్లించి ఉత్తర్వులు పొందే వరకు తాత్కాలికంగా రుసుము నుండి మినహాయింపు వుంటుందన్నారు.

**దేవస్థాన ఉద్యోగి విధుల నుండి తొలగింపు:** దుర్గమ్మవారి ఆలయంలో హుండీ లెక్కింపుల సందర్భంగా తన విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన డి షమ్మీ ని విధుల నుండి తాత్కాలికంగా తొలగిస్తున్నట్లు ఇఓ వికె శీనా నాయక్ మంగళవారం తెలిపారు. 30వ తేదీ జరిగిన హుండీ లెక్కింపుల సందర్భంగా విధుల్లో వున్న షమ్మీ నిర్లక్ష్యంగా వ్యవహరించారని వివరణ కోరగా సదరు ఉద్యోగి ఇచ్చిన సంజాయిషీ పరిశీలించిన ఇఓ, చైర్మన్లు దేవస్థానం ప్రతిష్టకు భంగం కలగకుండా వుండేందుకు తక్షణం ఆ ఉద్యోగిని తాత్కాలికంగా విధుల నుండి తొలగించారు.

**వైభవంగా కోదండ రామయ్యకు ద్వాదశ ప్రదక్షణలు:** ఇంద్రకీలాద్రి దిగువ భాగమున పూర్ణానందంపేటలో కొలువై ఉన్న శ్రీ కోదండ రామ దాసాంజనేయ స్వామి వార్ల దేవస్థానములో దేవస్థానం అర్చక స్వాములు శ్రీ రాఘవ గోపికష్ణమాచార్యులు ఆధ్వర్యంలో దండి బొట్ల వెంకటరమణ, అగ్నిహోత్రం నారాయణ చార్యులు వారలు మంత్రోచ్ఛాటనలతో మంగళ వాయిద్యముల నడుమ శ్రీ కోదండ సీత రాముల వారు భక్తాంజనేయ సమేతముగా ఊంజల సేవలో వోలలాడి, ఆలయంలో శ్రీ స్వామి అమ్మవార్లను పల్లకిలో ఉంచి పల్లకి ధారణ చేసి శ్రీరామ జయరామ జయజయ ద్వారములతో ద్వాదశ ప్రదక్షి ణాలు గావించారు. కార్యక్రమంలో భక్తుడు విరివిగా పాల్గొని తీర్థ ప్రసాదములు స్వీకరించారు.

## మౌనికను హతమార్చిన నిందితుడిని కఠినంగా శిక్షించాలి

**• మృతురాలు కుటుంబ సభ్యుల డిమాండ్ • పోస్టుమార్టం అనంతరం మృతదేహం అప్పగింత, అంత్యక్రియలు • హత్య కేసుపై అన్ని కోణాల్లో పోలీసుల దర్యాప్తు**



విశాఖ (క్రైమ్), మార్చి 31 ప్రభాతవార్త: విశాఖలో సంచలనం రేపిన మౌనిక హత్య కేసు మరింత విషాద వాతావరణాన్ని సంతరించు కుంది. అమానుషంగా ప్రాణాలు కోల్పోయిన యువతి మౌనికకు కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరుగా వీడ్కోలు పలికారు. కేజీహెచ్‌లో పోస్టుమార్టం పూర్తయ్యాక దారుణ హత్యకు గురైన మౌనిక భౌతికకాయాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించగా, అక్కడి వాతావరణం హృదయ విదారకంగా మారింది. ఆసుపత్రి మార్చురీ వద్ద కుటుంబ సభ్యులు, బంధువులు, పరిచయస్తులు చేరుకుని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్కసారిగా జరిగిన ఈ ఘటనను ఇప్పటికీ నమ్మలేకపోతు న్నామని, తమ ఇంట్లో ఆనందంగా ఉండే కుమార్తె ఇలా అమానుష హత్యకు గురవడం తట్టుకోలేకపోతు న్నామని కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీర య్యారు. పోస్టుమార్టం అనంతరం మౌనిక మృతదేహాన్ని జాగ్రత్తగా వాహనంలో తరలించి జ్ఞానాపురం స్మశాన వాటికకు తీసుకెళ్లారు. అక్కడ హిందూ సాంప్రదాయ పద్ధతిలో అంత్యక్రియలు నిర్వహించారు. తండ్రి వేణుగోపాలరావు స్వయంగా కుమార్తె అంతిమయాత్రలో పాల్గొని చివరి సంస్కారాలు నిర్వహించారు. కుటుంబ సభ్యుల రోదనలు అక్కడున్న ప్రతి ఒక్కరినీ కలిచివేశాయి. కుమార్తెకు చివరి చూపు చూసిన తల్లిదండ్రులు తీవ్ర ఆవేదనకు గురయ్యారు. కేజీహెచ్ మార్చురీ వద్ద మీడియాతో మాట్లాడిన మౌనిక తండ్రి వేణుగోపాలరావు, "మా లాంటి కష్టం ఎవరికీ రాకూడదు.. నా కుమార్తెను అత్యంత క్రూరంగా హత్య చేశాడు.. నిందితుడిని జీవితాంతం జైలులో పెట్టడమే కాకుండా ఉరిశిక్ష విధించాలి" అని డిమాండ్ చేశారు. కుటుంబానికి న్యాయం చేయాలని, కేసుపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. మౌనిక వద్ద ఉన్న సుమారు రెండు తులాల బంగారు ఆభరణాలు కనిపించడం లేదని కూడా కుటుంబ సభ్యులు ఆరోపించారు. హత్యకు ముందు లేదా తర్వాత అవి మాయమైన అంశాన్ని పోలీసులు ప్రత్యేకంగా విచారించాలని కోరుతున్నారు. ఈ అంశం కూడా కేసులో కీలకంగా మారే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఇదిలా ఉండగా, పోలీసులు ఇప్పటికే నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారణ కొనసాగిస్తున్నారు. హత్య జరిగిన సమయం, మృతదేహాన్ని ముక్కలు చేయడానికి ఉపయోగించిన వస్తువులు, ముందస్తు ప్రణాళిక ఉందా లేదా, ఘటన తర్వాత ఆధారాలు చెరిపివేయడానికి ఎలాంటి ప్రయత్నాలు చేశాడనే కోణాల్లో విచారణ సాగుతోంది.

1-4Pg5.qxd:1-4Pg5.qxd 1/1/02 7:14 AM Page 1



# 8వ కేంద్ర వేతనం సంఘం ఏర్పాటు



### కమిషన్ సిఫారసులకు 18 నెలల గడువు

### పార్లమెంటులో ఆర్థికశాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి

**న్యూఢిల్లీ, మార్చి 31:** కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న 8వ కేంద్ర వేతన సంఘాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ కమిషన్ తన సిఫార్సులను సమర్పించేందుకు 18 నెలల గడువు విధించింది. దీంతో లక్షలాది మంది ఉద్యోగుల జీతభత్యాలు, పెన్షన్ల సవరణకు మార్గం సుగమమైంది. కొత్త వేతనాలు 2026 జనవరి ఒకటినుంచే అమల్లోకి వచ్చే అవకాశాలున్నాయి. కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి పార్లమెంటులో అధికారికంగా వెల్లడించారు. 2025 నవంబర్ 3న 8వ వేతన సంఘాన్ని ఏర్పాటు చేసినట్లు లిఖితపూర్వక సమాధానంలో తెలిపారు. జీతాలు, అలవెన్సులు, పెన్షన్ నిర్మాణం వంటి పలు అంశాలపై ఈ కమిషన్ సమీక్షించి, 18 నెలల్లోగా ప్రభుత్వానికి తన నివేదికను సమర్పిస్తుందని వివరించారు. నివేదిక రావడానికి 2027 మధ్య కాలం పట్టే అవకాశం ఉన్నప్పటికీ, గత సంప్రదాయం ప్రకారం 2026 జనవరి 1 నుంచే బకాయిలతో సహా కొత్త జీతాలను వర్తింపజేయవచ్చని అధికారులు సూచిస్తున్నారు. ఈ వేతన సవరణలో ఫిట్‌మెంట్ ఫ్యాక్టర్ అత్యంత కీలకం కానుంది. ఉద్యోగులందరి మూల వేతనాన్ని ఒకేసారి పెంచడానికి ఈ గుణిజాన్నే ఉపయోగిస్తారు. 7వ వేతన సంఘం 2.57 ఫిట్‌మెంట్ ఫ్యాక్టర్‌ను సిఫార్సు చేయగా, దానిని ప్రభుత్వం ఆమోదించింది. దీంతో అప్పుడు కనీస మూల వేతనం రూ. 7,000 నుంచి రూ. 18,000కు పెరిగింది. గరిష్ఠ వేతనం రూ. 2.5 లక్షలకు చేరింది. ఒకవేళ 8వ వేతన సంఘం కూడా ఇదే 2.57 ఫిట్‌మెంట్ ఫ్యాక్టర్‌ను కొనసాగిస్తే, ప్రస్తుతం రూ. 18,000గా ఉన్న కనీస మూల వేతనం సుమారు రూ. 46,000కు పెరిగే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఉద్యోగుల ఆకాంక్షలు, ప్రభుత్వ ఆర్థిక పరిస్థితి మధ్య సమతుల్యం సాధించాల్సి ఉంటుందని ఓ సీనియర్ అధికారి పేర్కొన్నారు. ప్రభుత్వం సాధారణంగా ప్రతి 10 సంవత్సరాలకు ఒకసారి వేతన సంఘాన్ని ఏర్పాటు చేస్తుంది. 7వ వేతన సంఘం గడువు 2025 డిసెంబర్ 31తో ముగియడంతో ఈ కొత్త కమిషన్‌ను నియమించారు. మూల వేతనంతో పాటు ఇతర అలవెన్సులు, ప్రస్తుతం 3 శాతంగా ఉన్న వార్షిక ఇంక్రిమెంట్లు, పెన్షన్ విధానంపైనా ఈ కమిషన్ తన సిఫార్సులను అందించనుంది. కమిషన్ నివేదిక, ప్రభుత్వ ఆమోదం తర్వాతే జీతాలు ఎంతమేర పెరుగుతాయనే దానిపై పూర్తి స్పష్టత వస్తుంది.

## అభివృద్ధి అజెండాగా కేరళం బిజెపి మేనిఫెస్టో

### పార్టీ జాతీయ అధ్యక్షుడు నబిన్ చేతుల మీదుగా విడుదల



**తిరువనంతపురం, మార్చి 31:** రాష్ట్రంలో తన ప్రాబల్యాన్ని విస్తరించుకునే లక్ష్యంతో, భారతీయ జనతా పార్టీ (బిజెపి)మంగళవారం కేరళం అసెంబ్లీ ఎన్నికల కోసం తన మేనిఫెస్టోను ఆవిష్కరించింది. ఇందులో మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు, కేరళంలో ఎయిమ్స్‌ను ఏర్పాటు చేయడం, తిరువనంతపురం, కోజికోడ్‌లలో మెట్రో రైలుప్రాజెక్టులను ప్రారంభించడం, తిరు వనంతపురం నుండి కన్నూర్ వరకు హైస్పీడ్ కారిడార్‌ను అమలుచేయడం వంటివి ఈ మేనిఫె స్టోలో హామీలుగా ఉన్నాయి.

సంక్షేమ హామీలలో భాగంగా పేద కుటుంబాలకు ఏటా రెండు ఉచిత ఎల్‌పిజి సిలిండర్లు, ప్రతిఇంటికి నెలకు 20,000 లీటర్ల ఉచితతాగునీరు, పింఛన్లను రూ. 3,000కు

# మంటల్లో పశ్చిమాసియా

## ఇరాన్ ఓడిపోయే దాకా యుద్ధం ఆపొద్దు

### ట్రంప్‌ను ప్రైవేట్‌గా కోరిన గల్ఫ్ దేశాలు



**వాషింగ్టన్, మార్చి 31:** ఇరాన్ ఓడిపోయేవరకు యుద్ధం కొనసాగించాలని గల్ఫ్ దేశాలు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను కోరుకుంటున్నాయట. అలా కోరిన దేశాల జాబితాలో సౌదీ అరేబియా, యుఎఇ, కువైట్, బహ్రెయిన్ ఉన్నాయని అసోసి యేటెడ్ ప్రెస్ సంచలన కథనం వెల్లడించింది. 'నెల రోజులుగా జరుగుతోన్న యుద్ధంలో ఇరాన్ చెప్పుకోదగ్గ స్థాయిలో బలహీనపడలేదు. ఇరాన్ నాయకత్వంలో గణనీయమైన మార్పు రావాలి. అప్పటివరకు సైనిక చర్య ముగియకూడదు' అని ఆ దేశాల అధికారులు ప్రైవేటు సంభాషణలో భాగంగా ట్రంప్‌ను కోరారని ఆ వార్తా ఏజెన్సీ కథనం వెల్లడించింది. ఈ మేరకు అమెరికా, ఇజ్రాయెల్, గల్ఫ్ అధికారులను ఉటంకించింది. ఇరాన్‌పై దాడి గురించి ముందస్తు సమాచారం ఇవ్వకపోవడంపై, యుద్ధం కారణంగా సంభవించే హెచ్చరికలను పట్టించుకోకపోవడంపై ఈ చర్చల సందర్భంగా ఆయా దేశాలు అసంతృప్తి వ్యక్తం చేశాయట. ఈ ఘర్షణలు ఎలాగూ కొనసాగుతున్నాయి గనక టెహ్రాన్‌లోని మత పెద్దల పాలనను పూర్తిగా కూలదోయడానికి ఇదొక చరిత్రాత్మక అవకాశమని కొన్ని దేశాలు అభిప్రాయం వ్యక్తం చేశాయని పేర్కొంది.

**హార్ముజ్ గురించి నాకెందుకు.. ఎపిక్ ఫ్యూరీని ఆపేస్తా!**

అమెరికా 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ'తో యుద్ధ రంగంలోకి దిగడంతో ఇరాన్ హార్మూజ్ జలసంధిని మూసివేసిన సంగతి తెలిసిందే. దానిని తెరిపిస్తామని ట్రంప్ ప్రకటనలు చేశారు. అయితే ఇప్పుడు వాటికి భిన్నమైన కథనాన్ని వాల్‌స్ట్రీట్ జర్నల్ రాసుకొచ్చింది. ఇరాన్‌పై సైనిక చర్యను ముగించడానికి తాను సిద్ధంగా ఉన్నానని సన్నిహితుల వద్ద వ్యాఖ్యానించినట్లు తెలుస్తోంది. హార్మూజ్ ఇప్పటికీ మూతపడే ఉన్నా.. ట్రంప్ ఈ ఆలోచన చేస్తున్నారట. ఈ కథనాలు ఇలా ఉంటే.. మరోవైపు పశ్చిమాసియాలో అమెరికా బలగాల మోహరింపులు పెరుగుతండటం గమనార్హం.

## డిజిటల్ చెల్లింపులతోనే టోల్‌ప్లాజాల రుసుం

### నగదు చెల్లింపులకు చెక్..!

**న్యూఢిల్లీ,మార్చి 31:**దేశవ్యాప్తంగా జాతీయ రహదారులపై ప్రయాణించే వాహనదారులకు హైవేస్ అథారిటీ అప్‌డేట్ ఇచ్చింది. ఏప్రిల్ 1వ తేదీ నుంచి టోల్ ప్లాజాల వద్ద నగదు చెల్లింపులను పూర్తిగా నిలిపివేయనున్నట్లు నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా ఎన్‌హెచ్‌ఎఐ స్పష్టంచేసింది. ఇకపై టోల్ రుసుములను ఫాస్టాగ్ లేదా యూపీఐ వంటి డిజిటల్ పద్ధతుల్లో మాత్రమే చెల్లించాల్సి ఉంటుంది. దేశంలోని అన్ని జాతీయ రహదారులు, ఎక్స్‌ప్రెస్‌వేలపై కొత్త నిబంధన అమల్లోకి వస్తున్న ఈ నిబంధన కేవలం రహదారుల వ్యవస్థను ఆధునికీకరించడంలో భాగంగా తీసుకున్నట్లు హైవేస్ అథారిటీ చెపుతోంది.

## పితృత్వ సెలవును చట్టబద్ధంచేయాలి..

### పార్లమెంటులో ఆప్ ఎంపి డిమాండ్



**న్యూఢిల్లీ, మార్చి 31:** పితృత్వ సెలవును దేశ వ్యాప్తంగా అన్ని రంగాల్లో చట్టబద్ధమైన హక్కుగా మార్చాలని ఆమ్ ఆద్మీ పార్టీ రాజ్యసభ ఎంపీ రాఘవ్ చద్దా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పార్లమెంట్ సమావేశాల్లో ఆయన ఈ అంశాన్ని లేవనెత్తారు. బిడ్డ సంరక్షణ బాధ్యత కేవలం తల్లులకే పరిమితం కాదని, అది తల్లి దండ్రులిద్దరి ఉమ్మడి బాధ్యత అని ఆయన స్పష్టం చేశారు.ఎంపి రాఘవ్ చద్దా మాట్లాడుతూ బిడ్డ పుట్టినప్పుడు తల్లిదండ్రులిద్దరికీ శుభాకాంక్షలు వెల్లువెత్తుతాయి, కానీ సంరక్షణ బాధ్యత మాత్రం చట్టపరంగా తల్లిపైనే పడుతోంది. ఇది చట్టం బలవం తంగా రుద్దుతున్న సామాజిక వైఫల్యమని వ్యాఖ్యానించారు. ప్రసవానంతరం ఒక మహిళకు శారీరకంగా, మానసికంగా, భావోద్వేగపరంగా భర్త అండ ఎంతో అవసర మని ఆయన అన్నారు. ఆ సమయంలో భర్త తోడు విలాసం (లగ్జరీ) కాదు, అత్యవసరం. భార్య పట్ల భర్తకు ఉండే సంరక్షణ బాధ్యత కూడా అంతే ముఖ్యమని సభకు వివరించారు. ప్రస్తుతం దేశంలో కేవలం కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు మాత్రమే 15 రోజుల పితృత్వ సెలవు లభిస్తోందని, ప్రైవేట్ రంగంలో అలాంటి నిబంధన ఏదీ లేదని చద్దా గుర్తుచేశారు. దేశంలోని 90 శాతం మంది ఉద్యోగులు ప్రైవేట్ రంగంలోనే ఉన్నారని, దీనివల్ల అత్యధిక మంది తండ్రులు ఈ సౌకర్యానికి దూరమవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. స్వీడన్, ఐస్‌లాండ్, జపాన్ వంటి దేశాలు 90 రోజుల నుంచి 52 వారాల వరకు పితృత్వ సెలవులు కల్పిస్తున్నాయని ఉదహరించారు. బిడ్డ సంరక్షణ, ఉద్యోగం రెండింటి మధ్య తండ్రి దేన్ని ఎంచుకోవాలన్న పరిస్థితి రాకూడదని, భర్త మద్దతు లేకుండా తల్లి ప్రసవ వేదనను ఎదుర్కోకూడదని అన్నారు. కావున ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని, పితృత్వ సెలవును చట్టబద్ధమైన హక్కుగా మార్చేందుకు చర్యలు తీసుకోవాలనిఎంపి కోరారు.

## హార్ముజ్ నౌకలనుంచి టోల్ వసూలుకు ఇరాన్ నిర్ణయం

### పార్లమెంటరీ సెక్యూరిటీ కమిటీ ఆమోదం

**టెహ్రాన్, మార్చి 31:** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ, ఇరాన్ సంచలన నిర్ణయం తీసుకుంది. వ్యూహాత్మకంగా కీలకమైన హార్మూజ్ జలసంధిపై పూర్తి నియంత్రణ సాధించే దిశగా అడుగులు వేసింది. ఈ జలసంధి గుండా వెళ్లే నౌకలపై టోల్ విధించడంతో పాటు అమెరికా, ఇజ్రాయెల్ నౌకలను నిషేధించడం వంటి అంశాలతో కూడిన హార్మూజ్ జలసంధి నిర్వహణ ప్రణాళికకు ఇరాన్ పార్లమెంట్ సెక్యూరిటీ కమిటీ ఆమోదం తెలిపింది. ఈ విషయాన్ని ఇరాన్ ప్రభుత్వ మీడియా సంస్థ ఐఆర్ఐబీ వెల్లడించింది. ఈ కొత్త ప్రణాళిక ప్రకారం హార్మూజ్ జలసంధిలో భద్రతా ఏర్పాట్లు, నౌకల భద్రత, పర్యావరణ పరిరక్షణ, ఆర్థికపరమైన అంశాలపై ఇరాన్ దృష్టి సారించనుంది. ముఖ్యంగా ఈ జలసంధి గుండా ప్రయాణించే నౌకల నుంచి ఇరాన్ కరెన్సీ రియాల్ రూపంలో టోల్ వసూలు చేయను న్నారు. భారత కరెన్సీలో 18.90కోట్ల రూపా యలు ఒక్కో నౌకనుంచి వసూలు చేస్తుంది. అమెరికా, ఇజ్రాయెల్‌తో పాటు ఇరాన్‌పై ఏకపక్ష ఆంక్షలు విధిస్తున్న దేశాల నౌకలను కూడా ఈ జలసంధిలోకి అనుమతించబోమని ప్రణాళికలో స్పష్టంగా పేర్కొన్నారు. జలసంధిపై ఇరాన్ సార్వభౌమాధికారాన్ని, సాయుధ బలగాల పాత్రను బలోపేతం చేయడం, చట్టపరమైన ఫ్రేమ్‌వర్క్ రూపకల్పనలో ఒమన్‌తో సహకరిం చడం వంటివి కూడా ఈ ప్రణాళికలో భాగమని ఐఆర్ఐబీ నివేదిక తెలిపింది. **ఇరాన్ నిర్ణయంపై అమెరికా మండిపాటు**

ఇరాన్ నిర్ణయంపై అమెరికా మండిపడింది. హార్మూజ్ జలసంధిని తిరిగి తమ నియంత్రణలోకి తీసుకుంటామని, అక్కడ స్వేచ్ఛాయుత నౌకాయానాన్ని పునరుద్ధరిస్తామని యూఎస్ ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బెస్సెంట్ స్పష్టం చేశారు. "ప్రస్తుతానికి కొన్ని దేశాలు ఇరాన్‌తో వ్యక్తిగత ఒప్పందాలు కుదుర్చుకుని తమ నౌకలను పంపుతున్నాయి. కానీ, సమీప భవిష్యత్తులో అమెరికా యుద్ధ నౌకల ఎస్కార్ట్‌తో గానీ, బహుళ దేశాల కూటమి ఎస్కార్ట్‌తో గానీ జలసంధిపై నియంత్రణ సాధించి తీరుతామని ఆయన అన్నారు.

# శీతలాష్టమి దేవాలయంలో తొక్కిసలాట

### 8 మంది మృతి, 12 మందికి తీవ్రగాయాలు

**నలంద, మార్చి 31:** బీహార్‌లోని నలందలో దారుణ ఘటన చోటు చేసుకుంది. ఇక్కడి ఓ ఆలయం వద్ద జరిగిన తొక్కిసలాటలో దాదాపు ఎనిమిది మంది భక్తులు మృతి చెందారు. మృతులంతా మహిళలే కావడం విశేషం. మరోవైపు పదుల సంఖ్యలో భక్తులు తీవ్రంగా గాయపడ్డారు. నలంద జిల్లాలోని బీహార్ షరీఫ్‌కు దాదాపు 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న మఘ్రా గ్రామంలోని శీతలాష్టమి ఆలయం వద్ద ఈ తొక్కిసలాట జరిగింది. చైత్ర మాసంలోని చివరి మంగళవారం కావడంతో ఆలయానికి భారీ సంఖ్యలో భక్తులు పోటెత్తారు. ఒక్కసారిగా భక్తులు ఆలయంలోకి ప్రవేశించ డంలో పరిస్థితి అదుపు తప్పింది. అకస్మాత్తుగా తొక్కిసలాట జరగడంతో గందరగోళం నెలకొంది. ఈ తొక్కిసలాటలో ఎనిమిది మంది మహిళలు మరణించారు. 12 మంది మహిళలు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని పరిస్థితిని సర్దు మణిగేలా చేశారు. గాయపడిన వారిని హుటాహుటీన ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. గాయపడిన వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉందని అధికారులు తెలిపారు. దీంతో మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని ఆందోళనలు వ్యక్తం అవుతోంది. తొక్కిసలాట సమయంలో ఎటు చూసినా భక్తులు భయంతో హాహాకారాలు చేశారు. ప్రమాదం అనంతరం పదుల సంఖ్యలో మహిళలు నేలపై అపస్మారక స్థితిలో పడి ఉన్న వీడియోలు, ఫొటోలు ప్రస్తుతం నెట్టింట వైరల్గా మారాయి. ఈ ఫొటోల్లో ఓ వ్యక్తి ఒక మహిళ తల వద్ద వంగి ఆమెకు సీపీఆర్ చేస్తూ కనిపించాడు. మరో మహిళ స్పృహ కోల్పోయిన మహిళ ముఖాన్ని నిమురుతూ ఆమెను స్పృహలోకి తీసుకురావ డానికి ముఖంపై నీళ్ళు చల్లుతూ కనిపించింది. ఎటు చూసినా హృదయవిదారక దృశ్యాలే కనిపించాయి.



## ఆసుపత్రినుంచి సోనియా గాంధీ డిశ్చార్జి

**న్యూఢిల్లీ, మార్చి 31:** ఢిల్లీలోని సర్ గంగారామ్ ఆస్పత్రి నుంచి సోనియా గాంధీ డిశ్చార్జ్ అయ్యారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. ఈ నెల 24న అస్వస్థత కారణంగా ఆమెను ఆస్పత్రిలో చేర్పించిన విషయం తెలిసిందే. వైద్యులు కొన్ని రోజులపాటు ప్రత్యేక పర్యవేక్షణలో ఉంచి చికిత్స అందించారు. చికిత్సకు ఆమె శరీరం సానుకూలంగా స్పందించడంతో ఆరోగ్యం క్రమంగా మెరుగుపడింది. సోనియా పూర్తి విశ్రాంతి తీసుకోవాలని, తగిన జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం స్థిరంగా ఉందని, ఎలాంటి ఆందోళన అవసరం లేదని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. ఈ నేపథ్యంలో ఆమె అభిమానులు, పార్టీ నేతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతంలో కూడా సోనియా గంగారామ్ ఆసుపత్రిలో చేరి చికిత్సలు పొందారు. శ్వాసకోస ఇబ్బందులు, వయోభారంతో వచ్చే సమస్యలతోనే ఆమె ఆసుపత్రిలో చేరినట్లు వైద్యవర్గాలు వెల్లడించాయి.

## పాలస్తీనీయులకు మరణశిక్ష విధించేచట్టానికి ఇజ్రాయెల్ ఆమోదం



**టెల్ అవీవ్, మార్చి 31:** ఉగ్రవాదచర్యల్లో పాల్గొంటే పాలస్తీనా వాసులకు మరణశిక్ష విధించే చట్టాన్ని ఇజ్రాయెల్ పార్లమెంటు నెస్సెట్ ఆమోదించింది. మొత్తం 120 మంది సభ్యులు ఉన్న నెస్సెట్‌లో ఈ బిల్లుకు 62 మంది సభ్యులు ఆమోదం తెలిపారు. ప్రధాని బెంజమిన్ నెతన్యాహు నేతృత్వంలోని మితవాద ప్రభుత్వం తీసు కున్న ఈ నిర్ణయంపై అంతర్జాతీయంగా, దేశీయంగా తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. చట్టం 30రోజుల్లో అమలులోకి వస్తుంది.ఉగ్రవాద చర్యల్లో భాగంగా ఇజ్రా యెలీ పౌరులను హత్య చేసిన పాలస్తీనియన్లకు మరణశిక్ష విధిస్తారు. ఇదే నేరం చేసి పట్టుబడ్డ ఇజ్రాయెలీ పౌరులకు మాత్రం ఇదే శిక్ష విధించే వీలులేదు. దీంతో ఇది కేవలం పాలస్తీనియన్లను అణచివేసేందుకే తీసుకొచ్చిన చట్టమని మానవహక్కుల సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఈ బిల్లును ప్రధాని నెతన్యాహు గట్టిగా సమర్థించారు. ఉగ్రవాదులకు జైళ్లలో చోటు లేదు, వారికి మరణమే సరైన శిక్ష అని అన్నారు. దేశ భద్రత కోసం ఈ చట్టం అవసరమని ప్రభుత్వం వాదిస్తోంది. ఈబిల్లుపై ఐక్యరాజ్యసమితి, యూరోపియన్ యూనియన్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశాయి. అంతర్జాతీయ మానవ హక్కుల నిబంధనలకు విరుద్ధమని, పశ్చిమాసియాలో హింసను మరింత పెంచుతుందని హెచ్చరించాయి.మరోవైపు, ఈ చట్టాన్ని పాలస్తీనా అథారిటీ జాతి నిర్మూలన ప్రయత్నంగా అభివర్ణించింది. ఇజ్రాయెల్ అనుసరిస్తున్న వర్ణవివక్షకు ఇది పరాకాష్ట అని మండిపడింది. సాధారణంగా ఇజ్రాయెల్‌లో నేరాలకు మరణశిక్ష విధించే సంప్రదాయం లేదు. 1962లో నాజీ నేరస్థుడు అడాల్ఫ్ ఐచ్‌మాన్‌కు మాత్రమే అక్కడ మరణశిక్ష అమలు చేశారు. దశాబ్దాల తర్వాత ఇప్పుడు ఒక వర్గాన్ని లక్ష్యంగా చేసుకుని ఈ చట్టం తీసుకురావడంపై ఇజ్రాయెల్‌లోని ప్రతిపక్షాలు సైతం ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ చట్టం అమల్లోకి వస్తే ఉద్రిక్తతలు మరింత ముదిరే ప్రమాదం ఉంది. దీనిపై ఇజ్రాయెల్ సుప్రీంకోర్టు ఎలా స్పందిస్తుందనేది ఆసక్తికరంగా మారింది.

## భారత్‌లో సగటు మొబైల్ డేటా నెలసరి వాడకం 31జిబి

### నోకియా మొబైల్‌బ్రాడ్‌బ్యాండ్ సూచీ నివేదిక

**న్యూఢిల్లీ, మార్చి 31:** భారతీయుల మొబైల్ డేటా వినియోగం గత ఏడాది చివరి నాటికి దేశంలో ఒక్కో వినియోగదారుడి సగటు నెలవారీ డేటా వాడకం 31 జీబీ దాటింది. గత ఐదేళ్లలో ఇది ఏటా సగటున 18శాతం చొప్పున వృద్ధి చెందింది. ప్రముఖ టెలికాం పరికరాల తయారీ సంస్థ నోకియా మంగళవారం విడుదల చేసిన మొబైల్ బ్రాడ్‌బ్యాండ్ ఇండెక్స్ నివేదికలో ఆసక్తికర విషయాలు వెల్లడయ్యాయి. దేశంలో 5జీ సేవలు వేగంగా విస్తరించడం, 4కే వీడియో స్ట్రీమింగ్, క్లౌడ్ గేమింగ్, ఏఐ ఆధారిత యాప్‌ల వాడకం పెరగడమే ఇందుకు ప్రధాన కారణమని నివేదిక స్పష్టంచేసింది. 2025 నాటికి భారతదేశంలో మొత్తం మొబైల్ డేటా ట్రాఫిక్ నెలకు 27ఎక్సాబైట్లు దాటింది. ఇందులో దాదాపు 47 శాతం వాటా ఒక్క 5జీదే కావడం గమనార్హం. 5జీ డేటా ట్రాఫిక్ ఏకంగా 70 శాతం వృద్ధితో నెలకు 12.9ఎక్సాబైట్లకు చేరుకుంది. మెట్రో నగరాలు 5జీ వినియోగంలో ముందున్నాయి.

## ఇరాన్‌పై యుద్ధంకోసం అమెరికా రూ.2.63 లక్షల కోట్ల వ్యయం

### స్టాక్ హోమ్ సంస్థ సిప్రీ నివేదిక వెల్లడి

**స్టాక్‌హోమ్, మార్చి 31:** ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా చేస్తున్న యుద్ధం తీవ్ర రూపం దాల్చింది. ఈ యుద్ధం కోసం అమెరికా చేస్తున్న ఖర్చు వింటే వణుకుపుడుతోంది. స్టాక్‌హోమ్ ఇంటర్నేషనల్ పీస్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ సిప్రీ విడుదల చేసిన నివేదిక ప్రకారం ఈ యుద్ధం కోసం అమెరికా ప్రతి సెకనుకు 10,300 డాలర్లు (సుమారు రూ.9.8 లక్షలు) ఖర్చు చేస్తోంది. గతనెల 28న ప్రారంభమైన ఈ యుద్ధం 31వ రోజుకు చేరుకోగా, ఇప్పటివరకు అమెరికా ఏకంగా 27.68 బిలియన్ డాలర్లు అంటే సుమారు రూ.2.63 లక్షల కోట్లు ఖర్చు చేసింది. యుద్ధం ముగిసే సూచనలు కనిపించకపోవడంతో ఈ వ్యయం మరింత పెరిగే అవకాశం ఉంది. ఇరాన్‌పై యుద్ధానికి అమెరికా రోజుకు సగటున 890 మిలియన్ డాలర్లు భారత కరెన్సీలో సుమారు రూ.8,455 కోట్లు వెచ్చిస్తున్నట్లు సిప్రి వెల్లడించింది. ఈ రోజువారీ ఖర్చులో ఆయుధాలు, వైమానిక, నౌకాదళ కార్యకలాపాలు, క్షిపణి రక్షణ వ్యవస్థలు, నిఘా, రవాణా వంటివి ఉన్నాయి. ఈ ఖర్చులో సింహభాగం, అంటే రోజుకు 320 మిలియన్ డాలర్లు సుమారు రూ.3,040 కోట్లు, ఆయుధాలు, క్షిపణులకే వెళుతోంది. టోమహాక్ క్రూయిజ్ క్షిపణులు, జేడీఏఎం బాంబులు వంటి వాటి కోసం ఈ మొత్తాన్ని ఖర్చు చేస్తున్నారు. వైమానిక కార్యకలాపాల కోసం రోజుకు 245 మిలియన్ డాలర్లు, నౌకాదళ కార్యకలాపాల కోసం 155 మిలియన్ డాలర్లు ఖర్చవుతున్నాయి. థాడ్, పేట్రియాట్ వంటి క్షిపణి రక్షణ వ్యవస్థల కోసం రోజుకు 95 మిలియన్ డాలర్లు, నిఘా, సైబర్ ఆపరేషన్ల కోసం 45 మిలియన్ డాలర్లు వెచ్చిస్తున్నారు. భారీగా పెరుగుతున్న ఈ యుద్ధ భారాన్ని అరబ్ దేశాలతో పంచుకోవాలని ట్రంప్ యోచిస్తున్నట్టు వైట్‌హౌస్ సంకేతాలు ఇచ్చింది. 1990 గల్ఫ్ యుద్ధ సమయంలో అరబ్ దేశాలు అమెరికాకు ఆర్థికంగా సహకరించిన విషయాన్ని గుర్తుచేయగా, వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లెవిట్ స్పందిస్తూ అధ్యక్షుడు ట్రంప్ కూడా దీనిపై ఆసక్తిగా ఉన్నారని నేను భావిస్తున్నాను. ఈ విషయంపై త్వరలోనే ఆయన నుంచి ప్రకటన వెలువడవచ్చని తెలిపారు. గల్ఫ్ యుద్ధం సమయంలో మిత్రదేశాలు కలిసికట్టుగా ఉండగా, ఈసారి అమెరికా, ఇజ్రాయెల్ ఏకపక్షంగా ఇరాన్‌పై దాడికి దిగాయి. మరోవైపు యుద్ధ నష్టపరిహారం చెల్లించిన తర్వాతే చర్చలకు వస్తామని ఇరాన్ స్పష్టం చేస్తోంది. మధ్యప్రాచ్యంలోని అమెరికా స్థావరాలపై క్షిపణులు, డ్రోన్లతో దాడులు చేస్తోంది.

# ఓటర్ల జాబితాలో అక్రమాలు

### బయటి వ్యక్తులను చొప్పించేందుకు ఇసి, బిజెపి కుట్ర

### సిఇసి జ్ఞానేష్ కుమార్‌కు సిఎం మమతాబెనర్జీ లేఖ



**కోల్‌కతా, మార్చి 31:**పశ్చిమ బెంగాల్ ఓటర్ల జాబితాలోకి బయటి వ్యక్తులను చొప్పించేందుకు బిజెపి, ఎన్నికల సంఘం ప్రమేయంతో కుట్ర జరుగుతోందని ఆరోపిస్తూ తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ మంగళవారం ప్రధాన ఎన్నికల కమిషనర్ (సిఇసి) జ్ఞానేష్ కుమార్‌కు లేఖ రాశారు. ఆ లేఖను సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. తృణమూల్ కాంగ్రెస్ అధ్యక్షురాలి హోదాలో ఈ లేఖ రాసినట్లు బెనర్జీ తెలిపారు. 'బెంగాల్ ప్రజల ప్రజాస్వామ్య హక్కులకు వ్యతిరేకంగా జరుగుతున్న తీవ్రమైన కుట్రపై తీవ్ర ఆందోళనను వ్యక్తం చేస్తూ భారత ప్రధాన ఎన్నికల కమిషనర్‌కు లేఖ రాశా' అని ఆమె అన్నారు. ఇతర రాష్ట్రాల్లో ఉపయోగించిన వ్యూహాలను ఇక్కడ కూడా పునరావృతం చేయడానికి బిజెపి ప్రయత్నిస్తోందని మమత ఆరోపించారు. "బెంగాల్ ఓటర్ల జాబితాలోకి బయటి వ్యక్తులను చొప్పించే ప్రయత్నంలో, పశ్చిమ బెంగాల్ ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయంలో వేలాది నకిలీ ఫారం 6 దరఖాస్తులను సమర్పిస్తూ బిజెపి ఏజెంట్లు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. ఇది 'ఓటర్ల హైజాకింగ్' ప్రయత్నమే. బీహార్, మహారాష్ట్ర, ఢిల్లీలలో బిజెపి విజయవంతంగా ఆడిన అదే నీచమైన ఆట ఇది అని ఆమె అన్నారు. 'ఈ అప్రజాస్వామిక ప్రక్రియను భారత ఎన్నికల సంఘం తక్షణమే నిలిపివేయాలని, గౌరవనీయ సుప్రీంకోర్టు ఆదేశాలను కచ్చితంగా పాటించాలని, 2026 ఫిబ్రవరి 28న తుది ఓటర్ల జాబితా వెలువడిన తర్వాత మోసపూరిత ఓటర్లను జాబితాలో చేర్చకుండా చూడాలి. పట్టపగలు తమ ప్రజాస్వామ్యాన్ని దొంగిలించడానికి బెంగాల్ అనుమతించదు. బెంగాల్ ప్రజలు గమని స్తున్నారని మమతాబెనర్జీ పేర్కొన్నారు.

## గ్యాస్ బుకింగ్‌తో పట్టుబడిన నిందితుడు

### భార్య హత్య కేసులో నాలుగేళ్లుగా పరార్



**భోపాల్, మార్చి 31:** భార్య హత్యకేసులో నాలుగేళ్లుగా తప్పించుకుతిరుగుతున్న ఓ ఆర్మీ మాజీ కెప్టెన్ ఎట్టకేలకు పోలీసులకు చిక్కాడు. గ్యాస్ సిలిండర్ బుకింగ్ అతడిని పట్టించడం గమనార్హం. సందీప్ తోమర్ అనే ఆర్మీ మాజీ కెప్టెన్ 2013లో పంజాబ్‌లోని అబోహర్‌లో విధులు నిర్వహిస్తున్న సమయంలో తన భార్యను హత్య చేశాడు. తొలుత ఆత్మహత్య అని బుకాయించేందుకు యత్నించినా విచారణలో ప్రణాళిక ప్రకారం చేసిన హత్యగా తేలింది. ట్రయల్ కోర్టు తోమర్‌ను దోషిగా నిర్ధారించి 2014లో జీవిత ఖైదు విధించింది. 2019లో బెయిల్ రావడంతో బయటకు వచ్చాడు. అప్పీల్‌ను 2022లో హైకోర్టు కొట్టివేసినా. లొంగిపోలేదు. అప్పటి నుంచి ఎప్పటికప్పుడు తన గుర్తింపు, లొకేషన్లు మార్చుతూ తప్పిం చుకు తిరుగుతున్నాడు. ఈ క్రమంలోనే తోమర్‌ను అరెస్ట్ చేసేందుకు పంజాబ్ పోలీసులు సిట్ ఏర్పాటు చేశారు. తోమర్ పాన్ కార్డుతో అనుసంధానమై ఉన్న బ్యాంక్ ఖాతాను పోలీ సులు ఇటీవల ట్రేస్ చేశారు. ఆ అకౌంట్ ద్వారా మధ్యప్రదేశ్‌లో పాండుర్నాలో ఓ ఎల్పీజీ సిలిండర్ బుక్ చేసినట్లు బ్యాంకు స్టేట్‌మెంట్‌లో వెల్లడయింది. దీంతో పోలీసులు ఆ గ్యాస్ ఏజెన్సీని సంప్రదించి, డెలివరీ చిరునామాను తీసుకున్నారు. ఆ సమాచారాన్ని స్థానిక పోలీసులకు చేరవేయగా వారు అతడిని అరెస్ట్ చేశారు.

## శబరిమల బంగారు తాపడాల స్కాంపై ప్రధాని మోడీ ఎందుకు మాట్లాడరు?

### రాహుల్‌గాంధీ విమర్శ



**తిరువనంతపురం, మార్చి 31:** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ప్రధాని నరేంద్ర మోడీపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కేరళలోని కన్నూర్‌లో జరిగిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడుతూ సిపిఐ ఏమాత్రం వామపక్ష పార్టీ కాదని, అతివాద రైట్ వింగ్‌పార్టీ అని పేర్కొన్నారు. సిద్ధాంతాలకు వ్యతిరేకంగా ఆ పార్టీ నేతలు బిజెపితో జత కట్టారని ఆరోపించారు. అందువల్లే కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో ఎల్‌డిఎఫ్ విజయం సాధించాలని ప్రధాని కోరుకుంటున్నారన్నారు. ఇతర చోట్ల మతం, దేవుడి గురించి మాట్లాడే మోడీ కేరళలో మాత్రం ఆ విషయాలను ప్రస్తావించరన్నారు. శబరిమల ఆలయంలో జరిగిన బంగారు తాపడాల స్కాం గురించి ఇప్పటి వరకు ఆయన ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. బంగారు తాపడాలు మాయమవడం వెనుక సిపిఐ నేతల హస్తం ఉన్నందువల్లే ఈ విషయంలో బిజెపి మౌనంగా ఉందని రాహుల్ అన్నా రు. సిపిఐ బిజెపితో జత కట్టడం ఆ పార్టీలోని కొందరు సీనియర్ నేత లకు నచ్చలేదని అందువల్లే వారు యుడిఎఫ్ మద్దతు తో స్వతంత్రులుగా ఎన్నికల్లో పోటీ చేస్తున్నారని రాహుల్ ఆరోపించారు. మోడీ ప్రభుత్వం తీసుకువచ్చిన స్మార్ట్ సిటీ మిషన్ వల్ల ప్రజలకు ఎటువంటి ప్రయోజనంలేదని రాహుల్ అన్నారు. ఈ పథకం గురించి మోడీ ఎప్పుడూ గొప్పలు చెబుతుంటారు. కానీ క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితులుభిన్నంగా ఉన్నాయన్నారు. పౌరులకు ప్రాథమిక గౌరవం, స్వచ్ఛమైన నీరు, గాలి, భద్ర తను అందించడంలో ఆ నగరాలు విఫలమ వుతుండడంతో అది ఓ అసంపూర్ణ పథకంగా మిగిలిపోయిందన్నారు.

## ఇస్ఫహాన్ నగరంపై బంకర్‌బస్టర్ బాంబులతో అమెరికా దాడి

**టెహ్రాన్, మార్చి 31:** ఇరాన్‌పై అమెరికా,ఇజ్రాయెల్‌ల దాడులు ఉగ్రరూపం దాల్చాయి. అటు చర్చల పేరిట ప్రకటనలు ఇస్తూనే అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తన ధోరణి తాను అవలంభిస్తున్నారు. అమెరికా, ఇజ్రాయెల్ దళాలు మంగళవారం తెల్లవారుజామున ఇరాన్‌లోని ఇస్ఫహాన్ నగరంపై సంయుక్తంగా భారీ దాడులు జరిపాయి. ఈ దాడికి సంబంధించిన వీడియోను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్వయంగా సోషల్ మీడియాలో పంచుకోవడంతో ఉద్రిక్తతలు తారస్థాయికి చేరాయి. ఇస్ఫహాన్‌లోని ఒక ప్రధాన ఆయుధ డిపోను లక్ష్యంగా చేసుకుని ఈ దాడులు జరిగాయి. ఈ దాడిలో సుమారు రెండువేల కిలోల బరువున్న బంకర్ బస్టర్ బాంబులను ఉపయోగించినట్లు తెలుస్తోంది. ఈ బాంబు దాడితో ఆయుధాగారంలో వరుసగా శక్తిమంతమైన పేలుళ్లు సంభవించి, ఆ ప్రాంతమంతా దట్టమైన మంటలు వ్యాపించాయి. దాదాపు 23 లక్షల జనాభా కలిగిన ఇస్ఫహాన్ నగరం సైనికపరంగా చాలా వ్యూహాత్మకమైనది. ఇక్కడ బద్ర్ సైనిక విమానాశ్రయం ఉంది. ఇరాన్ తన వద్ద ఉన్న 540 కిలోల యురేనియం నిల్వలను ఇక్కడి భూగర్భ కేంద్రంలో దాచిపెట్టి ఉండవచ్చని అనుమానాలున్నాయి. ఈ దాడికి ఒకరోజు ముందు ట్రంప్ ఇరాన్‌ను తీవ్రంగా హెచ్చరించారు. యుద్ధాన్ని ముగించేందుకు వెంటనే ఒప్పందానికి రాకపోతే ఇరాన్‌లోని ఇంధన వనరులు, అణు కేంద్రాలు, నీటి ప్లాంట్లు వంటి కీలక మౌలిక సదుపాయాలను ధ్వంసం చేస్తామని హెచ్చరిక చేశారు. ఒకవైపు దాడులు జరుగుతుండగా, మరోవైపు పాకిస్థాన్, ఈజిప్ట్, సౌదీ అరేబియా, టర్కీ వంటి దేశాలు దౌత్య మార్గాల ద్వారా సంక్షోభాన్ని నివారించేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఇరాన్ అణుబాంబు తయారీకి దగ్గరలో ఉందంటూ ట్రంప్, నెతన్యాహులు చేస్తున్న ఆరోపణలను ఐక్యరాజ్యసమితి అణు పర్యవేక్షణ సంస్థ ఇప్పటివరకు ధ్రువీకరించలేదు. ఈ తాజా దాడులతో పశ్చిమాసియాలో పరిస్థితి మరింత చేయిదాటిపోయే ప్రమాదం ఉందని విశ్లేషకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

1-4Pg6exHMNWJQE.qxd:1-4Pg6exHMNWJQE.qxd 1/1/02 7:16 AM Page 1



# ఎస్‌పిడిసిఎల్‌లో 25 మంది ఉద్యోగులపై వేటు

**● విధుల నిర్వహణలో బాధ్యతారాహిత్యంతో క్రమశిక్షణా చర్యలు ● సిఎండి లోతేటి శివశంకర్ ఉత్తర్వులు ● అలసత్వం వహిస్తే ఉపేక్షించమని హెచ్చరిక**

తిరుపతి, మార్చి 31 ప్రభాతవార్త ప్రతినిధి: అత్యవసర సమయంలో, అవసరమైన సమయంలో సేవలందించి ప్రజల నుండి మన్ననలు అందుకోవడంలో ఉద్యోగులు అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని ఎస్‌పిడిసిఎల్ సిఎండి శివశంకర్ లోతేటి హెచ్చరించారు. విధుల నిర్వహణలో బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిన సంస్థ పరిధిలో 25 మంది అధికారులు, సిబ్బందిపై క్రమశిక్షణా చర్యలు తీసుకుంటూ సిఎండి శివశంకర్ లోతేటి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

సంస్థ పరిధిలోని వివిధ సర్కిళ్ళలో విధులు నిర్వహిస్తూ అవినీతి ఆరోపణలు, హెచ్‌టి సర్వీసుల రీడింగ్ నమోదులో అవకతవకలు, అనధికారికంగా పనులను చేపట్టడం తదితర అంశాలపై ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్1, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు ఏడుగురు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్/ అసిస్టెంట్ ఇంజనీర్‌లు ఆరుమంది, ఒక జూనియర్ ఇంజనీర్, ఒక సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్, ఒక అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్, ఒక జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్, ఇద్దరు లైన్ ఇన్‌స్పెక్టర్‌లు, ముగ్గురు లైన్ మెన్‌లపై, ఒకఅసిస్టెంట్ లైన్ మెన్, ఒక ఎనర్జీ అసిస్టెంట్‌పై క్రమశిక్షణా చర్యలు తీసుకున్నా మన్నారు. తిరుపతి సర్కిల్‌లో అనధికారికంగా పనుల నిర్వహణ అంశానికి సంబంధించి డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి. సాయిశంకర్, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి. విశ్వనాధంలకు రెండు ఇంక్రిమెంట్లు నిలుపుదల చేస్తూ ఆదేశాలు జారీ చేశారు.

అదేవిధంగా తిరుపతి సర్కిల్లోనే విధులు నిర్వహిస్తూ అనధికారికంగా విద్యుత్ లైన్ల మార్పు అంశంపై ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె. శ్రీనివాసమూర్తి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సి.చిన్నప్ప, అసిస్టెంట్ ఇంజనీర్ ఎస్. హేమచంద్రుడు, లైన్ ఇన్‌స్పెక్టర్ ఎం.శరత్ బాబు, లైన్ మెన్ ఎస్ఆర్ గోపాల్‌ను, అలాగే తిరుపతి సర్కిల్లో విధులు నిర్వహిస్తూ అవినీతి ఆరోపణలపై డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సి.విజయ వెంకటేష్, లైన్ మెన్ బి. శేఖర్, అసిస్టెంట్ లైన్ మెన్ కె. సురేష్, జూనియర్ లైన్ మెన్ గ్రేడ్ 2 టీ. భాగ్యరాజ్‌లను వివరణ కోరుతూ ఉత్తర్వులు జారీ చేశారు.

కర్నూలు సర్కిల్‌లో హెచ్‌టి సర్వీసుకు సంబంధించి రీడింగును నమోదు చేయడంలో అవకతవకలకు పాల్పడిన అంశంలో సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ జె. చిన్నరాఘవులుకు ఆరు నెలలపాటు పదోన్నతి నిలుపుదల చేశారు. డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వి.వి. మోహన్ కుమార్‌కు ఒక ఇంక్రిమెంటును నిలుపుదల చేశారు. మరో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఏ.రాజమోహన రెడ్డికి రెండు ఇంక్రిమెంట్లు నిలుపుదల, జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్ కె. సుబ్రమణ్యం శెట్టికి 2 ఇంక్రిమెంట్లు నిలుపుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే వినియోగదారుని సర్వీసు పేరు మార్పు అంశంలో నిరక్ష్యం వహించినందుకు అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్ జి. బాలచౌడయ్యను వివరణ కోరుతూ ఆదేశాలు జారీ చేశారు. అలాగే కడప సర్కిల్లో విధులు నిర్వహిస్తూ అనధికారికంగా విద్యుత్ లైన్ల మార్పు అంశంలో డిప్యూటీ ఎగ్జి క్యూటివ్ ఇంజనీర్ యం.కుళ్ళాయప్ప, అసిస్టెంట్ ఇంజనీర్ టి.శివకుమార్, లైన్ ఇన్‌స్పెక్టర్ అయ్యవారయ్య, లైన్ మెన్ నాగసుబ్బారెడ్డిలను వివరణ కోరుతూ ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీసత్యసాయి సర్కిల్లో విధులు నిర్వహిస్తూ అనధికారికంగా విద్యుత్ లైన్ల మార్పు అంశంలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి. విశ్వనాధం కు ఒక ఇంక్రిమెంటును నిలుపుదల చేస్తూ ఉత్త ర్వులు జారీ చేశారు. అదేవిధంగా వ్యవసాయ విద్యుత్ సర్వీసులు ఘంజూరులో నిబంధనలను పాటించనందుకు అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్. విశ్వనాధంను వివరణ కోరుతూ ఉత్తర్వులు జారీ చేశారు.

**జెఇ, ఎఎల్ఎమ్ సస్పెన్షన్**

అనంతపురం సర్కిల్లో వ్యవసాయ విద్యుత్ సర్వీసును మంజూరు చేయడంలో అవకతవకలకు పాల్పడిన అంశంపై ఇన్‌చార్జ్ అసిస్టెంట్ ఇంజనీర్‌గా విధులు నిర్వహిస్తున్న జూనియర్ ఇంజనీరు బి. బాలచంద్రను విధుల నుంచి సస్పెండ్ చేశారు. డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎం. శ్రీనివాసులు నాయుడుకు షోకాజ్ నోటీసును జారీ చేశారు. ఇక చిత్తూరు సర్కిల్లో అనధికారికంగా లైన్ల మార్పు, ట్రాన్స్ ఫార్మర్ ఏర్పాటు అంశంలో అసిస్టెంట్ లైన్ మెన్ ఎస్. రమేష్ బాబును సస్పెండ్ చేస్తూ ఎస్‌పిడిసిఎల్ సిఎండి శివశంకర్ ఆదేశాలు జారీ చేశారు.

# జగన్ అవినీతి క్రెడిట్‌ను ఎవరూ చోరీ చేయలేరు

**రాష్ట్ర ఎక్సైజ్, గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర**



సచివాలయం, మార్చి 31 ప్రభాతవార్త : వైసిపి అధినేత జగన్ క్రిమినల్ క్రెడిట్‌ను ఎవ్వరూ చోరి చేయలేరు అని రాష్ట్ర ఎక్సైజ్, గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర వ్యాఖ్యానించారు. చంద్రబాబుది అభివృద్ధి క్రెడిట్ అని,దాని దరిదాపులకు కూడా జగన్ చేరుకోలేడని అన్నారు. మంగళవారం టిడిపి కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ సిఎం చంద్రబాబు నాయకత్వంలోని అన్ని రంగాల్లో ఎపి అగ్రస్థానంలో ఉందన్నారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తూ ఒకవైపు సంక్షేమాన్ని, మరోవైపు అభివృద్ధిని చేస్తున్నారన్నారు. దేశానికి పాలనలో ఆదర్శంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిలిచిందన్నారు. అయితే ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను చంద్రబాబుపై విశ్వాసంతో రాష్ట్రానికి వస్తున్న పెట్టుబడుల క్రెడిట్‌ను కొట్టేసే పనిలో జగన్‌రెడ్డి ఉన్నారని కొల్లు రవీంద్ర దుయ్యబట్టారు. చంద్రబాబు, లోకేష్ కృషి వల్లే ఆర్సెలార్ మిట్టల్ రూ.1.35లక్షల కోట్లతో రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తే, ఆ కంపెనీతో నేనే మాట్లాడా అని జగన్ సెల్ఫ్ డబ్బా కొట్టుకొని క్రెడిట్ చోరీ చేసే ప్రయత్నం చేస్తున్నారని ధ్వజమెత్తారు. కడప స్టీల్ ప్లాంట్‌ను కూడా పూర్తి చేయలేని క్రెడిట్ జగన్‌ది అని కొల్లు రవీంద్ర వ్యాఖ్యానించారు. చంద్రబాబు బ్రాండ్‌తో రాష్ట్రానికి గూగుల్, టిసిఎస్, ఆర్సెలార్ మిట్టల్, కాగ్నిజెంట్ వంటి గొప్ప సంస్థలు వస్తున్నాయని తెలిపారు. తన అవలక్షణాలను ఎదుటివారిపై అంటగట్టి చెప్పిన అబద్ధమే 100సార్లు చెప్పి మభ్యపెట్టడమే జగన్ నైజం అని కొల్లు రవీంద్ర అన్నారు. వైసిపి హయాంలో జరిగిన మద్యం స్కామ్ దేశంలోనే అతిపెద్ద స్కామ్ అని, రూ.3500 కోట్లు దోచుకున్నారని కొల్లు రవీంద్ర ఆరోపించారు. అమరావతిపై వైసిపికి ఎందుకంత విద్వేషం అని ఆయన నిలదీశారు.

# రోడ్డు భద్రత కోసం ఆధునిక కంట్రోల్ రూమ్

**● డ్రైవర్లను ప్రత్యక్షంగా పర్యవేక్షించే వ్యవస్థ ప్రారంభానికి మంత్రి శ్రీకారం**

**● రోడ్డు భద్రత కోసం మంత్రి రాంప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక చొరవ**



సచివాలయం, మార్చి 31 ప్రభాతవార్త: రోడ్డు భద్రతను మరింత బలోపేతం చేయడానికి ఆధునిక సాంకేతికతను వినియోగిస్తున్నామని ఈ నేపథ్యంలో కార్యాలయంలో ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి, బస్సుడ్రైవర్లను ప్రత్యక్షంగా పర్యవేక్షించే విధానాన్ని ప్రారంభించామని రాష్ట్ర రవాణా, యువజన క్రీడా శాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి ప్రకటించారు. వాహనాల్లో ఏర్పాటు చేసిన డ్యాష్‌క్యామ్‌ల ద్వారా డ్రైవర్ ప్రవర్తన, వాహనం ముందు దృశ్యాలు నిరంతరం రికార్డు అవుతున్నాయని తెలిపారు. డ్రైవింగ్ సమమంలో మొబైల్‌ఫోన్ వినియోగం, ధూమపానం వంటి అనుచిత చర్యలు గుర్తించిన వేంటనే అలర్ట్‌లు వస్తాయని, వాటి ఆధారంగా కంట్రోల్ రూమ్ నుండి డ్రైవర్లను తక్షణమే హెచ్చరిస్తున్నామని, వాహనాల వేగాన్ని కూడా ఈ సిస్టమ్ ద్వారా పర్యవేక్షిస్తున్నామని పేర్కొన్నారు. ఈ డెటా 8రోజులపాటు భద్రపరచడం జరుగుతుందని తెలిపారు. ఈ వ్యవస్థకు బస్సు యజమానులతో నిర్వహించిన సమావేశం కూడా పూర్తి సహకారం అందించడానికి అంగీకరించారని చెప్పారు. ప్రస్తుతం ఐఆర్‌ఏ ట్రావెల్స్‌కు చెందిన 24 బస్సు ల్లో ఈ సిస్టమ్ అమల్లో ఉందన్నారు.

15 నుంచి 30 రోజుల్లో అన్ని బస్సులకు ఈ వ్యవస్థను విస్తరించే లక్ష్యంతో పనిచేస్తున్నా మని, త్వరలోనే అధునాతన సదుపాయా లతో పెద్దకంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేయనున్నమన్నారు.

1500బస్సుల్లో ఈ వ్యవస్థ అమలు పూర్తయిన తర్వాత అధికారిక ప్రారంభోత్సవం నిర్వహిస్తామ న్నారు. ఒక్కో బస్సుకు ఈ సిస్టమ్ అమలుకు సుమారు రూ.12,000 ఖర్చవు తుందని, నెలవారీ నిర్వహణ ఖర్చు రూ.750 వరకు ఉంటుందని తెలిపారు. ఈ వ్యయాన్ని బస్సు యజమానులే భరించడానికి ముందుకు రావడం అభినందనీయమన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణలో ఇది కీలకమైన అడుగ్గా నిలుస్తుందని మంత్రి పేర్కొన్నారు. డ్రైవర్ భద్రతతో పాటు ప్రయాణీకుల ప్రాణాలను కాపాడటంలో ఈ సాంకేతిక వ్యవస్థ ముఖ్యపాత్ర పోషిస్తుందని రాష్ట్ర రవాణా, యువజన క్రీడా శాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు.

# తిరుమల బాలాజీనగర్‌లో నివాస గృహాలు మరింత పటిష్టం



**- రూ.14 కోట్లతో ఆర్‌సిసి శ్లాబ్‌తో మరమ్మతులు**

తిరుమల, మార్చి 31 ప్రభాతవార్త ప్రతినిధి: కలియుగవైకుంఠం తిరుమలకొండపై కొన్నేళ్ళుగా స్థిరనివాసాలు ఏర్పరచుకుని నివాసముంటున్న బాలాజీనగర్ వాసుల ఇళ్ళను మరింత పటిష్టం చేసుకునే వెసలుబాటు కల్పిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇందుకోసం అవసరమైన పనులు చేపట్టాలని టిటిడి అధికారులకు ఆదేశాలిచ్చింది. సహజంగానే తిరుమలలో నివాసముండాలన్నా, కొండపై చిరు వ్యాపారాలు చేసుకుని జీవనం సాగించాలన్నా ఆ ఏడుకొండల స్వామి కరుణాకటాక్షాలు కలగాలని విశ్వాసం ప్రజల్లో బలంగా వినిపిస్తుంది. ఇలా కొన్ని వందల సంవత్సరాల క్రిందటే తిరుపతి, చంద్రగిరి, శ్రీనివాస మంగాపురం, రంగంపేట, కోడూరు తదితర ప్రాంతాల వాసులు బ్రతుకు తెరువు కోసం తిరుమలకొండపై చేరారు. ఆలయంలో స్వామివారి సేవల్లో పాల్గొనే అర్చకులు, వ్యాపారులు, స్థానికులు ఆలయానికి నాలుగు మాఢవీధుల్లో, ఆలయం ఎదురుగా పలు రకాలుగా షెడ్లలో, రేకుల షెడ్లలో తలదాచుకునేవారు. ఇప్పటికీ బాలాజీనగర్, హెచ్‌టి కాంప్లెక్స్, డిబి రోడ్డు, ఎస్వీ మ్యూజియం సమీపంలో ఆర్‌బి సెంటర్ ప్రాంతంలో స్థానికుల ఇళ్ళు ఉన్నాయి. వీరిలో బాలాజీనగర్‌లో నివాసముంటున్న వారి సంఖ్య అధికం. సుమారు 1,200వరకు కుటుంబాలు ఉన్నాయి. ఐదారు వేల మంది జనాభా ఉన్నారు. రెండున్నర దశాబ్ధాల క్రిందట తిరుమల మాస్టర్‌ప్లాన్‌లో భాగంగా మాఢవీధుల్లో ఇళ్ళను ఖాళీ చేయించి తిరుపతికి తరలించారు. ఇప్పటికీ బాలాజీనగర్‌లో స్థానికులు పాత చిన్నపాటి రేకుల పైకప్పు ఇళ్ళలోనే కాపురముంటున్నారు. కొన్ని ఇళ్ళు స్లాబ్ వేసుకున్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా తిరుమలలో నూతనంగా భూమిని తవ్వి పునాదులు వేసుకునే వీలు లేదు. పైగా ఉన్న ఇళ్ళను మరమ్మతులు చేసుకోవాలన్నా టిటిడి అనుమతి తప్పనిసరి. రేకుల ఇళ్ళను స్లాబ్ చేయాలని గతంలోనే పలుమార్లు స్థానికులు అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డికి, ప్రస్తుతం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు పలు దఫాలుగా విజ్ఞప్తి చేశారు. గతంలో తిరుపతి ఎమ్మెల్యేగా ఉన్న సినీనటుడు చిరంజీవి స్వయంగా కలుగజేసుకుని బాలాజీనగర్‌లో స్థానికుల నివాసాలకు ఆర్‌సిసి (రీన్‌ఫోర్స్డ్ సిమెంట్ కాంక్రీట్ స్లాబ్) సిమెంట్, ఇసుక, కంకర, ఉక్కు కమ్మీలను ఉపయోగించి నిర్మించే బలమైన కాంక్రీట్ పైకప్పు శ్లాబ్‌తో నిర్మించేందుకు ప్రభుత్వం నుండి ఆమోదం తెలిపారు. అప్పట్లో వెయ్యి ఇళ్ళలో సగం మాత్రమే ఈ పనులు జరిగాయి. ఇంకా చాలావరకు ఇళ్ళు ఇప్పటికీ ఆర్‌సిసి స్లాబ్ జరగనివి అలాగే ఉండిపోయాయి. పదిరోజుల క్రిందట తిరుమలకు వచ్చిన సిఎం చంద్రబాబునాయుడుకు ఇటీవల స్థానికులు సమస్యను విన్నవించారు. స్థానికుల విజ్ఞప్తితో సిఎం సానుకూలంగా స్పందించారు. ఈ నేపథ్యంలో తిరుమల బాలాజీనగర్‌లో ఉన్న స్థానికుల నివాసాలకు ఆర్‌సిసి శ్లాబ్‌తో నిర్మించేందుకు ప్రభుత్వం ఆమోదం తెలియజేసింది. 541 గృహాలకు 14 కోట్లు రూపాయలు కేటాయించేలా టిటిడికి ఆదేశాలిచ్చారు. ఈ పనులు రాబోయే 18 నెలల కాలంలో చేపట్టి పూర్తి చేసేలా చూడనుంది. కొండపై ఉంటున్న ఇళ్ళకు ఆర్‌సిసి శ్లాబ్ పనులు మొదలైతే చాలావరకు ఇబ్బందులు తప్పినట్లేనని స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఆర్‌సిసి కాంక్రీట్ పైకప్పుతో భవనాలకు అద్భుతమైన బలాన్ని, మన్నికను భద్రతను కల్పించడమే ప్రధానంగా ఉంటుంది.

# జగన్ అసెంబ్లీకి వచ్చినా రాకున్నా, జనం పట్టించుకోరు

**- లోక్‌సభలో టిడిపి పక్షనేత లావు శ్రీకృష్ణ దేవరాయలు**



విజయవాడ, మార్చి 31 ప్రభాతవార్త ప్రతినిధి: రాష్ట ప్రజలకు శాశ్వత రాజధానిగా అమరావతి ఉంటుందని లోక్‌సభలో టిడిపి పక్షనేత లావు శ్రీకృష్ణదేవరాయలు వెల్లడించారు. బుధవారం పార్లమెంట్‌లో అమరావతి చట్టబద్ధత కల్పించే బిల్లును ప్రవేశపెట్టనున్నారని తెలిపారు. ఈ బిల్లు ద్వారా రాజధాని రైతులకి మరింత భరోసా వస్తోందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. రైతులు నమ్మకంతోనే.. రాజధానికి భూములు ఇచ్చారన్నారు. రాష్ట్రంలోని పరిస్థితులను కేంద్రం అర్థం చేసుకుందని చెప్పారు. గత జగన్ ప్రభుత్వం రాజధానిని అడ్డుకోవాలని చూసిందని విమర్శించారు. జగన్మోహన్ రెడ్డి రాజధానికి 30 వేల ఎకరాలని, అధికారంలోకి వచ్చిన తర్వాత ఆయన మాట మార్చారని గుర్తు చేశారు. ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ వైఎస్ జగన్ ఇప్పుడు అసెంబ్లీకి వచ్చినా? రాకున్నా రాష్ట్ర ప్రజలు పట్టించుకోరని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు పేర్కొన్నారు. వైసిపి ఎమ్మెల్యేలకు క్లారిటీ లేదని విమర్శించారు. ఎక్కడ ఏం మాట్లాడతారో వారికే తెలియదని మండిపడ్డారు. రాజధాని అమరావతికి తాము వ్యతిరేకం కాదని వైసిపికి చెందిన సజ్జల రామకృష్ణారెడ్డి చెప్పిన విషయాన్ని ఈ సందర్భంగా ఎంపి లావు శ్రీకృష్ణదేవరాయులు గుర్తు చేశారు. వైసిపి నేతలు ఒక్కొక్కరు ఒక్కో విధంగా రాజధానిపై మాట్లాడుతున్నారని చెప్పారు. సిఎం చంద్రబాబు నాయుడు రైతులకు మాట ఇచ్చారని, ఇప్పుడు దానిని నిలబెట్టుకున్నారని వివరించారు. ఎపి పునర్విభజన చట్టంపై తాను పార్లమెంట్ ఇప్పటి వరకు 20 సార్లకు పైగా మాట్లాడానని ఎంపి లావు శ్రీకృష్ణదేవరాయులు గుర్తు చేశారు.

# ఎపి రాజధాని అమరావతిని అడ్డుకోలేరు

**- ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు**



విజయవాడ, మార్చి 31 ప్రభాతవార్త ప్రతినిధి: లోక్ సభకు రాజధాని అమరావతి బిల్లు రాబోతుందని, ఇది ఒక ఆంధ్రుడిగా తనకు గర్వంగా ఉందని విజయనగరం ఎంపి కలిశెట్టిఅప్పలనాయుడు తెలిపారు. ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రానికి అమరావతి రాజధానిగా ఉండాలని 30 వేల ఎకరాల భూములను రైతులు ఇచ్చారని వివరించారు. 2014లో సిఎం చంద్రబాబు నాయుడు పిలుపు ఇస్తే రైతులు స్వచ్ఛందంగా భూములు ఇచ్చారని చెప్పారు. దేశంలో ఎక్కడ ఇలా జరగలేదని ఈ సందర్భంగా గుర్తు చేశారు. భూసేకరణ చంద్రబాబు నాయుడు హయాంలోనే జరిగిందని, రాజధాని సైతం వారి హయంలోనే గుర్తిస్తున్నారని ఎంపి అప్పలనాయుడు వివరించారు.

అమరావతి రాజధాని నిర్మాణంపై వైసిపి అధినేత, మాజీ సిఎం జగన్‌మోహన్ రెడ్డి ఎన్నో కుట్రలు చేశారని విమర్శించారు. వైసిపి నేతలు సైతం రాజధాని నిర్మాణం జరగకుండా అడ్డుకున్నారని పేర్కొన్నారు. ఆ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి ఇది చెంపపెట్టు అన్నారు. రాజధాని అమరావతిపై జగన్ తన వక్రబుద్ధి చూపించారని చెప్పారు. అమరావతి బిల్లుకు అసెంబ్లీ ఆమోదం తెలిపిందన్నారు. ప్రపంచ స్థాయి రాజధానిగా అమరావతి రూపుదిద్దుకుంటుందని విశ్వాసం వ్యక్తం చేశారు.

సిఎం చంద్రబాబు నాయుడి దార్శనికత (విజన్) అందరికీ తెలుసునన్నారు. రాజధాని బిల్లు వెనక్కి వస్తుందని వైసిపి నేతలు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. వైఎస్ జగన్ కాదు కాదా ఎవరు వచ్చినా రాజధాని అమరావతిని అడ్డుకోలేరని ధీమాతో చెప్పారు. శాశ్వతంగా అమరావతి చట్టం అవుతుందని పేర్కొన్నారు. అమరావతి కోసం ప్రాణత్యాగం చేసిన రైతులకు ఈ సందర్భంగా పాదాభివందనం చేస్తున్నట్లు ప్రకటించారు. అలాగే ప్రధాని మోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామని ఎంపి అప్పలనాయుడు చెప్పారు.

# పేదల పక్షపాతి ప్రభుత్వం మాది

**● రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ ● ఇంటింటికి వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్న మంత్రి**

**● 40యేళ్ల నాటి సమస్యకు నెల రోజుల్లోనే పరిష్కారం ● జూన్ 13 కల్లా కోట్లాది రూపాయల అభివృద్ది పనులు పూర్తి**

**● రాష్ట్రానికి ఆదర్శంగా నెల్లూరు నగరాన్ని తీర్చిదిద్దుతాం ● లోకేష్ విజన్‌తో టిడ్కో ప్రాంగణంలో హైటెక్ పాఠశాల**



నెల్లూరు(వైద్యం), మార్చి 31 ప్రభాతవార్త: నగర అభివృద్ధిపై రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ ప్రత్యేక దృష్టి సారించారు. అందులో భాగంగా నగరంలో మంగళవారం సుడిగాలి పర్యటన నిర్వహించారు. పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ప్రధానంగా పొర్లుకట్ట ప్రాంతంలో 1.2 కోట్లతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను స్వయంగా పరిశీలించారు. 40 ఏళ్ల నాటి స్థానికుల సమస్యకు నెల రోజుల్లోనే పరిష్కారం చూపుతామన్నారు. నాణ్యతతో రాజీ పడకుండా పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రతి వీధిలో పర్యటించి ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఆత్మకూరు బస్టాండ్ వద్ద 28 లక్షలతో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఇచ్చిన మాట ప్రకారం నిర్ణీత కాలంలోనే రోడ్డు పూర్తి చేస్తామన్నారు. జేమ్స్ గార్డెన్‌లో ఎన్టీఆర్ సుజల 30వ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. భవిష్యత్తులో నగర వ్యాప్తంగా 120 ప్లాంట్లు ఏర్పాటు చేసిన ,రోజుకు 6 లక్షల లీటర్ల మినరల్ వాటర్‌ను కేవలం 2 రూపాయలకే 20 లీటర్ల చొప్పున అందజేస్తామని ప్రకటించారు. అనంతరం 53, 54వ డివిజన్‌లోని ప్రభుత్వ పాఠశాలతో పాటు టిడ్కో సముదాయంలో వైఎస్సార్‌సీపీ నిర్వీర్యం చేసిన పాఠశాల భవనాలను పరిశీలించారు. వెంకటేశ్వరపురం సచివాలయంలో అధికారులు, సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రజా సమస్యల పరిష్కారం, ప్రభుత్వ పథకాల అమలుపై దిశానిర్దేశం చేశారు. సచివాలయానికి వచ్చే దరఖాస్తులను సకాలంలో పరిష్కరించాలని, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉంటూ, ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా అంకితభావంతో పని చేయాలని సూచించారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ మాది పేదల పక్షపాతి ప్రభుత్వమని తెలిపారు. ప్రతి పేదవాడికి కూడు, గూడు నీడ కల్పించాలన్నది సీఎం చంద్రబాబు సంకల్పమన్నారు. పేదరిక నిర్మూలనకు పక్కా ప్రణాళికతో ముందుకెళ్తున్నామని, గత ప్రభుత్వం నిర్వీర్యం చేసిన 5 వేల టిడ్కో ఇళ్లను పునరుద్దరించడమే కాకుండా, యువనేత లోకేష్ విజన్‌కు అనుగుణంగా ఆ ప్రాంతంలో అంతర్జాతీయ స్థాయి పాఠశాలను నిర్మించి పేద విద్యార్థులకు అత్యుత్తన్నత విద్యను అందిస్తామని హామీ ఇచ్చారు. జూన్ 12 కల్లా నగరంలో కోట్లాది రూపాయలతో చేపట్టిన అన్ని అభివీద్ధి పనులను పూర్తి చేసి, నెల్లూరును ఒక సుందర నగరంగా తీర్చిదిద్ది రాష్ట్రానికే రోల్ మోడల్‌గా నిలబెడతానన్నారు. ఈ కార్యక్రమంలో కమీషనర్ నందన్, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, మాజీ మున్సిపల్ ఛైర్ పర్సన్ తాళ్ళపాక అనురాధ, టీడీపీ పార్లమెంట్ మహిళా అధ్యక్షురాలు కపిర రేవతి, టీడీపీ నేతలు ధర్మవరం సుబ్బారావు, పెంచల బాబు, పోకల రవి, సుజన్, జహీర్, జమీర్, జంషీద్, సుధాకర్‌రెడ్డి, కార్పొరేషన్, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.



# ఘాట్‌రోడ్లు మరమ్మతులు షురూ!

తిరుమల, మార్చి 31 ప్రభాతవార్త ప్రతినిధి: తిరుమలకు రాకపోకలు సాగించే కనుమదారుల యందు (ఘాట్ రోడ్డులలో) తారు రోడ్డు మారమ్మతు పనులు వేగంగా సాగుతున్నాయి. ఈ నేపథ్యంలో వాహనదారులు మరింత అప్రమత్తంగా వాహనాలను నడపాలని టిటిడి విజ్ఞప్తి చేసింది. శ్రీవారి భక్తులకు అసౌకర్యం కలగకుండా ఉండాలనే ఉద్దేశంతో ఘాట్ రోడ్డును మూసివేయకుండా నిర్దేశించిన సమయంలో మరమ్మతు పనులను పూర్తి చేసేందుకు టిటిడి చర్యలు చేపట్టింది. భక్తులు తమ తిరుమల ప్రయాణాన్ని తదనుగుణంగా మార్చుకుని కనీసం గంట సమయం ముందుగా ఘాట్‌లో ప్రయాణించాలని టిటిడి కోరింది. మరమ్మతుల కారణంగా వాహనదారులు నెమ్మదిగా అక్కడక్కడా కొద్దిసేపు ఆగుతూ ప్రయాణించాల్సి ఉంటుందనే విషయాన్ని భక్తులు గమనించాలన్నారు. ఈ నేపథ్యంలో భక్తులు రేణిగుంట విమానాశ్రయం, తిరుపతి రైల్వేస్టేషన్, ఆర్డీసీ బస్‌స్టాండ్ ప్రాంతాల నుండి తిరుమల విచ్చేసే వాహనదారులు ముందస్తుగా ప్రయాణ ఏర్పాట్లు చేసుకోవాలని టిటిడి సూచించింది. ఈ అంశాలను దృష్టిలో ఉంచుకుని వాహనదారులు తమ తిరుమల ప్రయాణాన్ని రూపొందించుకోవాలని టిటిడి విజ్ఞప్తి చేసింది. నిర్దేశించిన సమయంలో పనులు పూర్తికావడానికి భక్తులు, వాహదారులు సహకరించాలని టిటిడి విజ్ఞప్తి చేసింది.

# కాణిపాకం ఆలయ బంగారురథం ఎత్తు పెంపు

**● ప్రభుత్వం కేటాయించిన 18.60 ఎకరాలకు సరిహద్దులు ఏర్పాటు**

**● దళిత సత్రానికి ప్రత్యామ్నాయ కేటాయింపులు ● పాలక మండలి సమావేశంలో ఏకగ్రీవ తీర్మానం**

కాణిపాకం, మార్చి 31 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానంలో స్వామివారు ఊరేగే బంగారురథంను భక్తులందరూ వీక్షించే విధంగా రథం ఎత్తును పెంచాలని దేవస్థానం పాలక మండలి ఏకగ్రీవంగా ఆమోదిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. కాణిపాకం దేవస్థానంపాలకమండలి సమావేశం మంగళవారం స్థానిక ఇఒ కార్యాలయ సమావేశ మందిరంలో పాలక మండలి చైర్మన్ మణి నాయుడు అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధికి సంబంధించి 16 అంశాలపై సుదీర్ఘంగా చర్చించి కీలక నిర్ణయాలు తీసుకున్నారు. సమావేశం అనంతరం స్థానిక ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్ పాలకమండలిలో తీసుకున్న నిర్ణయాలను చైర్మన్ వి.మణినాయుడు, ఇఒ పెంచల కిషోర్‌లతో కలసి సమావేశం అనంతరం విలేకరులకు వివరించారు. ఈ సందర్భంగా స్వామివారు ఊరేగే బంగారురథం కార్యక్రమంను భక్తులందరూ కనులారా వీక్షించే విధంగా రథం ఎత్తును రెండున్నర అడుగుల వరకు పెంచాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు రథం స్ట్రక్చర్‌లో మార్పు లేకుండా ఎత్తును పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని, ఇందుకోసం టెండర్లును ఆహ్వానించాలని సమావేశంలో తీర్మానించినట్లు ఎమ్మెల్యే మురళీమోహన్ తెలిపారు. అలాగే దేవస్థానం అభివృద్ధిలో భాగంగా ప్రభుత్వం తిరుపతి-బెంగళూరు సిక్స్‌లేన్ రోడ్డులోని పట్నం వద్ద ప్రభుత్వం దేవస్థానంకు కేటాయించిన 18.60 ఎకరాల భూమిని సర్వే చేసి సరిహద్దులు ఏర్పాటు చేయాలని సమావేశంలో తీర్మానించినట్లు వారు తెలిపారు. ప్రధానంగా ఎన్నో ఏళ్ళుగా అపరిష్కృతంగా వున్న దళిత సత్రం విషయమై సమావేశంలో కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. దళితసత్రంకు ప్రత్యామ్నాయంగా దళిత ఉభయదారులకు దేవస్థానంకు సంభందించిన శ్రీమరగధాంభిగా కళ్యాణ మండపంలో ప్రస్తుతం ఇచ్చిన ఒక బ్లాక్‌తో పాటు అదనంగా మరో బ్లాక్‌ను ఇవ్వడంతో పాటు రూ.50 లక్షలు, మరమ్మత్తుల కోసం మరో రూ.10 లక్షలు ఇవ్వాలని సమావేశంలో తీర్మానించినట్లు తెలిపారు. దీనితో పాటు 2026-27 ఆర్థిక



సంవత్సరానికి సంభందించి నిర్వహించిన టెండర్లును ఆమోదించడానికి చర్చించి నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఇఇ వెంకటనారాయణ, డిప్యూటీ ఇఒ సాగర్‌బాబు, ఎఇఒలు ప్రసాద్, హరి మాధవరెడ్డి, ఎస్వీకృష్ణారెడ్డి, ధనుంజయ, సిఎఫ్ఓ నాగేశ్వరరావులతోపాటు బోర్డు సభ్యులు నాగరాజులు నాయుడు, నరేష్, శివప్రసాద్, కత్తి సుధాకర్ రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, సుబ్రమణ్యంరెడ్డి, సతీష్, చంద్రకళ, వసంతమ్మ, కెఎస్.అనుసూయమ్మ, సంధ్యారాణి, సూపరెండెంట్‌లు కోదండపాణి, వాసు, బాలరంగస్వామి, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

**మొదటిపేజీ తరువాయిలు**

## ప్రజలకు అవగాహన కల్పించాలి

హయత్ హోటల్ నిర్మాణాలకు సంబంధించి శంకుస్థాపనలు జరిగాయని, అతి త్వరలోనే గూగుల్ అంకురార్పణ కూడా జరుగుతుందని వివరించారు. జాబ్ క్యాలెండర్ కు అనుగుణంగా అభ్యర్థులను తయారు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని, ఇటీవల మెగా డీఎస్సీలో జిల్లాకు చెందిన చాలా మంది ఉద్యోగాలు సంపాదించారని గుర్తు చేశారు. సాస్కి నిధుల సహాయంతో జిల్లాలో మూడ వర్కింగ్ ఉమెన్స్ హాస్టళ్లను నిర్మిస్తున్నామని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కేటాయించిన నిధులను మ్యాపింగ్ చేస్తూ పలు అభివృద్ధి పనులు చేపడుతున్నామని వివరించారు. రాష్ట్ర మొత్తం జీవీఏలో జిల్లాకు సుమారు 9.14 శాతం వాటా ఉందని, గత సంవత్సరంతో పోలిస్తే 11.27 శాతం వృద్ధి నమోదైందని వెల్లడించారు. ట్రేడ్, హోటల్స్, రెస్టారెంట్స్, తయారీ, నిర్మాణం, రవాణా, నిల్వ వంటి ఉపరంగాలు జిల్లాలో ఆర్థికాభివృద్ధికి ప్రధాన ఆధారంగా నిలుస్తున్నాయని కలెక్టర్ చెప్పారు.సమావేశంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు, ఎమ్మెల్యేలు గణబాబు, వెలగపూడి రామకృష్ణబాబు, విష్ణుకుమార్ రాజు, వంశీకృష్ణ శ్రీనివాస్ విలువైన సూచనలు చేశారు. పోలీస్ కమిషనర్ శంకబ్రత బాగ్చి, జీవీఎంసీ, వీఎంఆర్డీఏ కమిషనర్లు కేతన్ గార్గ్, తేజ్ భరత్, డీఆర్వో విశ్వేశ్వరనాయుడు, ఆర్డీవో సంగీత్ మాధుర్ ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

## డీమార్ట్-బ్రిడ్జ్ వద్ద దాటాలంటే దడే



ట్రాఫిక్ పూర్తిగా ఆగిపోయే పరిస్థితులు తరచూ కనిపిస్తున్నాయి.అండర్ బ్రిడ్జ్ ప్రాంతంలోని ఫుట్‌పాత్‌లు కూడా ప్రస్తుతం పాదచారుల ప్రయాణానికి కాకుండా చిన్నచిన్న వ్యాపారాల కేంద్రంగా మారినట్లు స్థానికులు చెబుతున్నారు. ఫుట్‌పాత్‌పై చిరు వ్యాపారాలు కొనసాగుతుండటంతో కొనుగోలు కోసం నిలిచే ప్రజలు రహదారిపైనే ఉండాల్సి వస్తోంది.దీంతో ఒకవైపు వాహనాలు, మరోవైపు పాదచారులు, మధ్యలో కొనుగోలు దారులు కలిసి రహదారిని మరింత ఇరుకుగా మార్చుతున్నాయి. బ్రిడ్జ్ దిగువ ప్రాంతం సాయంత్రం వేళల్లో చిన్న మార్కెట్‌లా మారిపోతుండటంతో ట్రాఫిక్ ఒత్తిడి పెరుగుతోంది.ట్రాఫిక్ నియంత్రించాల్సిన సమయంలో ట్రాఫిక్ పోలీసులు తగిన స్థాయిలో కనిపించడం లేదని వాహనదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రద్దీ తీవ్రంగా ఉన్న సమయంలో కంట్రోల్ చేయాల్సిన సిబ్బంది కొన్నిసార్లు అక్కడ లేకపోవడం, కొన్నిసార్లు సెల్‌ఫోన్లతో వాహనాల ఫోటోలు తీస్తూ చలానాల నమోదుపైనే దృష్టి పెడుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ట్రాఫిక్ నిలిచిపోయినా ముందుగా దాన్ని క్లియర్ చేయకుండా ఉల్లంఘనలపై చర్యలకే ప్రాధాన్యత ఇస్తున్నారని అంటున్నారు.ఉదయం, సాయంత్రం వేళల్లో రెగ్యులర్‌గా ట్రాఫిక్ సిబ్బంది ఉంటే సమస్య తీవ్రత గణనీయంగా తగ్గుతుందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ఆటోలకు ప్రత్యేక నిలుపుదల స్థలం, బస్సులకు క్రమబద్ధమైన స్టాప్, డీమార్ట్ వద్ద ప్రవేశ-నిష్క్రమణకు స్పష్టమైన మార్గదర్శకాలు, ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు వంటి చర్యలు తీసుకుంటే పరిస్థితి మెరుగుపడుతుందని సూచిస్తున్నారు.నగరంలో అనేక సమస్యలకు వేగంగా స్పందిస్తున్న పోలీసు యంత్రాంగం ఈ అంశాన్ని కూడా ప్రాధాన్యంగా తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ముఖ్యంగా సీపీ శంఖబ్రత బాగ్చి స్వయంగా సమీక్షించి ట్రాఫిక్ నిర్వహణపై స్పష్టమైన ఆదేశాలు జారీ చేస్తే శాశ్వత పరిష్కారం సాధ్యమవుతుందని అభిప్రాయపడుతున్నారు. ప్రతిరోజూ వందలాది మంది ప్రయాణికులు ఎదుర్కొంటున్న ఈ సమస్యపై ఉన్నతాధికారులు వెంటనే స్పందించాలని డిమాండ్ చేస్తున్నారు.

## మంచి మనసుకు..విలువలకు చిరునామా కలెక్టర్ హరేంధిర ప్రసాద్..

సదుపాయాలు కల్పించారన్నారు. 20 నెలల కాలంలో జిల్లాకు, జిల్లా ప్రజలకు అందించిన ఆయన సేవలు చిరస్థాయిగా నిలిచిపోతాయని ఉద్ఘాటించారు. యోగాంధ్ర, పార్టనర్ షిప్ సమ్మిట్, ఎఫ్ఐఆర్ నిర్వహణలో బృందస్ఫూర్తిని అందరిలో నింపారని పేర్కొన్నారు.విశాఖ ప్రజలతో.. అధికారులతో నాది విడదీయలేని అనుబంధం: జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్విశాఖపట్నం జిల్లాలో 20 నెలల పాటు పని చేశానని.. ఈ కాలంలో జిల్లాతో, జిల్లా ప్రజలతో విడదీయరాని బంధం ఏర్పడిందని జిల్లా కలెక్టర్ గా పని చేసి బదిలీపై వెళ్ళిపోతున్న ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు. "మీ అందరి మద్దతుతో ఇన్ని కార్యక్రమాలు విజయవంతంగా చేశాను. భయపెట్టి పని చేయించటం నా నైజం కాదు. సహకారంతో, మద్దతుతో చేయించటమే నాకు తెలుసు. నాతో చిన్న మాట కూడా అనిపించుకుండా అందరూ మంచి పనితీరు కనబరిచారు. స్ఫూర్తి కొనసాగించారు. ఆర్డీవోలు, డిప్యూటీ కలెక్టర్లు మంచి సహకారం అందించారు. యోగాంధ్రలో అధికారుల సహకారం మరువలేనిది. అందరి సహకారంతో ఎన్నో రకాల మంచి పనులు చేపట్టగలిగామని" చెప్పారు. పరిపాలనాపరమైన ఎన్నో అంశాల్లో అధికారులు, సిబ్బంది సహకరించారని పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియ, ఇతర కార్యక్రమాల నిర్వహణలో సమష్టి కృషితో ముందుకు సాగామని గుర్తు చేసుకున్నారు. మంచి మనస్సుతో ప్రయత్నిస్తే దేవుడు కూడా సహకరిస్తాడని నమ్ముతున్నా అని అన్నారు. వసతి గృహాల నిర్వహణలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపించారని కలెక్టర్ ప్రశంసించారు. రెవెన్యూపరమైన అంశాల్లో ఎలాంటి ప్రతికూలతలు రాకుండా పని చేశామన్నారు. చాలా కంపెనీలకు భూ కేటాయింపులు చేయగలిగామన్నారు. నా సీనియర్స్ నుంచి నేను చాలా నేర్చుకున్నా.. అవే ఇక్కడ అమలు చేశాను అని చెప్పారు. విశాఖ రూపురేఖలను మార్చేందుకు కేతన్ గార్గ్, తేజ్ భరత్ లాంటి యువ అధికారుల అవసరం ఎంతైనా ఉందన్నారు. మాస్టర్ ప్లాన్ రోడ్లు కూడా వేగంగా చేస్తున్న తేజ్ కు అభినందనలు, రానున్న ఐదు సంవత్సరాల్లో విశాఖకు మంచి భవిష్యత్తు ఉందని జోస్యం చెప్పారు. విశాఖపట్నం జిల్లా ప్రశాంతతకు మారుపేరు అని, ఇక్కడి ప్రజలు కూడా సౌమ్యులని అన్నారు. ఇప్పటి వరకు చాలా చోట్ల పని చేశానని అన్నిటి కంటే విశాఖ జిల్లా ప్రత్యేకంగా నిలుస్తుందని అన్నారు. తన పరిపాలనా కాలంలో అన్ని విధాలుగా సహకరించిన ప్రజలకు, ప్రజా ప్రతినిధులకు, అధికారులకు, పేషీ సిబ్బందికి పేరుపేరునా ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలుపుతూ కంటతడి పెట్టారు.మాలాంటి ఎందరికో ఆదర్శంగా.. స్ఫూర్తిగా నిలిచారు: ఐఏఎస్ అధికారులుఒక వైపు సేవా దృక్పథం కనబరుస్తూ.. మరో వైపు పరిపాలనా దక్షత చూపుతూ అందరి మన్ననలు అందుకున్న కలెక్టర్ గా హరేంధిర ప్రసాద్ నిలిచిపోతారని జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి, జీవీఎంసీ, వీఎంఆర్డీఏ కమిషనర్లు కేతన్ గార్గ్, తేజ్ భరత్ లు పేర్కొన్నారు. ఆయన నుంచి ఎన్నో విషయాలు నేర్చుకున్నామని గుర్తు చేశారు. న్యూ డివిజన్స్, కోర్టు కేసుల గురించి స్పష్టంగా వివరించారని జేసీ చెప్పారు. మానవతా విలువలను పాటిస్తూ.. పరిపాలనా దక్షత ప్రదర్శించారని కొనియాడారు. భవిష్యత్తులో మరొక సారి తనతో కలిసి పని చేసే అవకాశం రావాలని కోరుకుంటున్నానని జేసీ అన్నారు. వీఎంఆర్డీఏ కమిషనర్ మాట్లాడుతూ "హరేంధిర ప్రసాద్ నాకు 2017 నుంచి బాగా తెలుసు. ఆయన ఎలాంటి విషయంలోనైనా చాలా సానుకూలంగా స్పందిస్తారు. ఎన్నికల సమయంలో అదనపు సీఈవోగా ఆయన పనితీరు మరింత అద్భుతం. నాకు ఎంతో సహకరించారు. అభిమానంతో, ప్రేమతో పని చేయించే నైపుణ్యం ఉన్న వ్యక్తి జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్. రాష్ట్ర ముఖ్యమంత్రి కూడా బాగా నమ్మి యోగాంధ్ర లాంటి కార్యక్రమాన్ని అప్పగించారు. విశాఖ నుంచి వెళ్ళిపోవటం కొంచెం బాధాకరమే అయినా.. జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ మాట్లాడుతూ "ఆయన్ని నేను ఫస్ట్ టైమ్ కె.ఆర్.పురంలో కలిశాను. ఆయన ఆతిథ్యం ఎన్నటికీ మరువలేను. చాలా సాఫ్ట్ గోయింగ్ పర్సన్. క్రికెట్ చాలా బాగా ఆడతారు. అలాగే మంచి పరిపాలన కూడా చేస్తారు. నాయకుడు సరిగ్గా ఉంటే మిగతా వాళ్ళంతా బాగా ఉంటారు. మంచి ఆలోచన, మంచి విజన్ ఉన్న వ్యక్తి హరేంధిర ప్రసాద్" అని కొనియాడారు. ఎంత ఒత్తిడి ఉన్నా సహనం కోల్పోకుండా తనదైన పనితీరును ప్రదర్శించారని, చాలా గణాంకాలను గుక్క తిప్పుకోకుండా చెప్పేవారని, విశాఖపట్నంలో అణువణుపై ఆయన పట్టు సాధించారని ప్రశంసించారు. కలెక్టర్ అనే పోస్ట్ కు నిజమైన అర్హత కలిగిన వ్యక్తి అని కమిషనర్ కొనియాడారు. ఏయూ వీసీ జి.పి. రాజశేఖర్ మాట్లాడుతూ "యోగాంధ్ర సమయంలో తనతో కలిసి పని చేశాను. అద్భుత నాయకత్వం, దక్షత నాకు స్ఫూర్తిని ఇచ్చాయి. ఏయూలో జరిగిన కొన్ని ప్రతికూల సంఘటనల సమయంలో ఆయన గైడెన్స్ నాకు బాగా ఉపయోగపడ్డాయి. ఆకస్మిక బదిలీ కొంచెం బాధ కలిగించింది అని" పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ సతీమణి దివ్యప్రసాద్ మాట్లాడుతూ "ఎప్పుడూ చిరాకు ప్రదర్శించరు. కొప్పడరు. ఏం చెప్పినా ఓపిగ్గా వింటారు. మీరంతా ఇచ్చిన మద్దతు వల్లే ఆయన ఇంత మంచి పనితీరు ప్రదర్శించ గలిగారని నమ్ముతున్నాను" అని అన్నారు. ప్రసంగాల అనంతరం వివిధ విభాగాల జిల్లా స్థాయి అధికారులు, రెవెన్యూ అసోసియేషన్, ఎంప్లాయిస్ అసోసియేషన్ సభ్యులు తదితరులు కలెక్టర్ దంపతులను దుశ్శాలువాలు, పుష్పగుచ్ఛాలు అందజేసి సత్కరించారు.కలెక్టర్ ను సత్కరించి అభినందనలు తెలిపిన వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్దసపల్లా హోటల్ లో జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో జరిగిన అభినందన వేడుకకు విచ్చేసి జిల్లా కలెక్టరును వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్ దుశ్శాలువా కప్పి సత్కరించారు. ఆయనతో పాటు పట్టాభి, కోరాడ రాజబాబు ఉన్నారు.

## సైబరాబాద్ పోలీసులకు విశాఖ పోలీసుల సహకారం

నమోదు చేసిన సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు, అతనిపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి అన్వేషణ ప్రారంభించారు. నిందితుడు విశాఖలో ఉన్నాడన్న సమాచారం అందడంతో విశాఖ పోలీసుల సహకారం కోరారు. సీపీ శంఖబ్రత బాగ్చి ఆదేశాల మేరకు, డీసీపీ 1 మణికంఠ విజయ్ పర్యవేక్షణలో, ఎమ్మార్పేట సీఐ దివాకర్ యాదవ్ నేతృత్వంలో ప్రత్యేక బృందం చర్యలు చేపట్టింది. ఊటగెడ్డ సమీపంలో సుంకర ఈశ్వర్‌ను అదుపులోకి తీసుకుని, అనంతరం వచ్చిన సైబరాబాద్ పోలీసులకు అధికారికంగా అప్పగించారు. ప్రాథమిక విచారణలో ఈశ్వర్ ఖాతా ద్వారా లక్షల్లో లావాదేవీలు జరిగినట్లు తెలిసిందని, ఆ డబ్బు వివిధ మోసపూరిత లావాదేవీలకు సంబంధించినదా అనే దానిపై సైబరాబాద్ పోలీసులు మరింత లోతుగా విచారణ చేపడుతున్నట్లు సమాచారం. ఈ కేసులో ఎమ్మార్ పేట సీఐ దివాకర్ యాదవ్ అతని బృందం వేగవంతమైన స్పందనకు సైబరాబాద్ పోలీసులు కృతజ్ఞతలు తెలిపారు. రెండు పోలీసు విభాగాల సమన్వయంతో నిందితుడిని తక్షణమే గుర్తించి అప్పగించడం దర్యాప్తుకు సహకరించిందని పేర్కొన్నారు.ఇటీవల సైబర్ నేరాల్లో బ్యాంకు ఖాతాలను అద్దెకు ఇవ్వడం, ఇతరుల ఖాతాలను వాడటం వంటి ఘటనలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అపరిచితుల ఆఫర్లకు లోనుకాకూడదని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

## జీవీఎంసీలో 9 మంది ఉద్యోగుల ఉద్యోగ విరమణ

**విశాఖపట్నం, మార్చి 31, ప్రభాతవార్త**



మహా విశాఖపట్నం నగర పాలక సంస్థలో ఎంతో బాధ్యతగా సుదీర్ఘకాలం ఉద్యోగ విధులు నిర్వహించి నేడు ఉద్యోగ విరమణ పొందుతున్న ప్రతి ఒక్కరి ఉద్యోగి శేష జీవితం ఆనందదాయకంగా ఉండాలని కోరుకున్నట్లు జీవీఎంసీ వ్యయ పరిశీలకలు సి.వాసు దేవరెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆయన మహా విశాఖపట్నం నగర పాలక సంస్థ లో వివిధ హోదాలలో విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందుతున్న ఉద్యోగులను జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఈ ఎన్ వి నరేష్ కుమార్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పి. పద్మజ లతో కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా వ్యయపరిశీలకలు మాట్లాడుతూ ప్రతి ఉద్యోగి తన ఉద్యోగ కాలంలో తన కుటుంబము కంటే అధిక కాలాన్ని సంస్థ కొరకు పని చేశారని పేర్కొన్నారు. నేడు ఉద్యోగ విరమణ పొందుతున్న 9 మందిలో యు సి డి ప్రాజెక్టు డైరెక్టర్ సరోజిని తో పాటు ఇద్దరు టాక్స్ కలెక్టర్లు, ఐదుగురు పిహెచ్ వర్కర్లు , ఒక ఎంటిఎస్ ఉద్యోగి మొత్తం తొమ్మిది మంది ఉద్యోగుల శేష జీవితాలు ఆనందదాయకంగా ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. యు సి డి ప్రాజెక్టు డైరెక్టర్ సరోజిని అనకాపల్లి మెప్మా డైరెక్టర్ గా, యు సి డి ఇంచార్జ్ ప్రాజెక్టు డైరెక్టర్ గా ఎనలేని సేవలు అందించారని , ఆమె శేష జీవితం ఆనందంగా గడపాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. అనంతరం జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి మాట్లాడుతూ ప్రతి ఉద్యోగికి ఉద్యోగ విరమణ తప్పనిసరి అని ఉద్యోగ విరమణ అనంతరం వారి శేష జీవితం ఆనందదాయకంగా ఉండాలని, ప్రతి ఒక్కరూ ఏదో ఒక వ్యాపకం పెట్టుకొని ఆనందంగా జీవించాలన్నారు. అనంతరం ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులను పూలమాలలతో సత్కరించి, నూతన వస్త్రాలను, జ్ఞాపికలను అందించి అభినందనలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ లు రియాజ్, సన్యాసిరావు, శ్రీనివాసరావు, జెమ్స్ యూనియన్ నాయకులు, జివిఎంసి ఉద్యోగులతో పాటు మాజీ ఉద్యోగులు, ఉద్యోగ విరమణ పొందుతున్న ఉద్యోగుల కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## దేశానికి రూపం ఇచ్చి మన రాజధాని రూపు కోల్పోయాం

*- రాష్ట్ర భవిష్యత్తుకు దిశా నిర్దేశం చేసిన ఎన్డీఏ చారిత్రాత్మక నిర్ణయం*

*- బీజేపీ జనతా వారధి కోకన్వీనర్ మూల వెంకటరావు*

**మాధవధార మార్చి 31 ప్రభాతవార్త**



అమరావతిని శాశ్వత రాజధానిగా గుర్తించేలా అసెంబ్లీలో చేసిన చారిత్రాత్మక తీర్మానాన్ని గర్వంగా స్వాగతిస్తున్నామని మూల వెంకటరావు అన్నారు.ఇది కేవలం సాధారణ నిర్ణయం కాదని,రాష్ట్ర భవిష్యత్తుకు దిశా నిర్దేశం చేసే చారిత్రాత్మక నిర్ణయమన్నారు.గతంలో ఉన్న అనిశ్చితికి స్వస్తి పలుకుతూ స్పష్టతతో ముందుకు సాగేందుకు ఈ తీర్మానం బలమైన పునాది వేస్తుంది. అమరావతి ఆంధ్రుల ఆత్మగౌరవ ప్రతీక, భవిష్యత్ తరాలకు ఆశ. మనలోని ఉప ప్రాంతీయ భావనను వదిలించుకోవాలని ఆయన తెలిపారు. ఇంకా ఉత్తరాంధ్ర, రాయలసీమ, గోదావరి జిల్లాలనే భావన వద్దు. అన్నీ కలిస్తేనే ఆంధ్రప్రదేశ్. అందరం తెలుగువాళ్ళమే కదా,ఉప ప్రాంతీయ భావనను పెట్టుకుంటే రాష్ట్రం ఎప్పటికీ అభివృద్ధి చెందదని మూల వెంకటరావు అభిప్రాయపడ్డారు.దేశానికి రూపం ఇచ్చి మన రాజధాని రూపు కోల్పోయాం.. మనదంతా ఒకటే నేల, ఒకటే రాష్ట్రం, ఒకటే భాష, ఒకటే జాతి అని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలి అని మూల వెంకటరావు తెలిపారు. సుస్థిర ఆదాయాన్ని ఇచ్చే రాజధాని లేక కేంద్రం వద్దకు వెళ్లి అడగాల్సి వస్తుంది. కేంద్ర సంస్థలు రావాలన్నా, కేంద్రాన్ని ప్రశ్నించాలన్నా, మన గొంతు బలంగా ఉండాలి. రాష్ట్రం ఏర్పడిన 12 ఏళ్ల తర్వాత మళ్లీ రాజధాని అమరావతి చట్టబద్ధత గురించి చర్చించాల్సి రావడం దురదృష్టకరమని ఆయన అన్నారు. అమరావతి అభివృద్ధికి భాజపా కట్టుబడి ఉంది..అందుకే ప్రధానమంత్రి మోదీ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్, నిరంతరం రాష్ట్రానికి ఏమి కావాలన్నా తక్షణమే అందిస్తున్నారు. కావున రాష్ట్ర ప్రజలంతా మనమందరం మంచి రాజధానిని త్వరలో చూద్దామని మూల వెంకటరావు అన్నారు.

## డాగ్ స్క్వాడ్‌తో గంజాయి పట్టివేత

*- పెందుర్తి రైల్వే స్టేషన్ వద్ద 35 కిలోల గంజాయి స్వాధీనం*

*- ఇద్దరు నిందితులు అదుపులో*

**(విశాఖ క్రైమ్, ప్రభాతవార్త)**



మాదక ద్రవ్యాల నియంత్రణలో భాగంగా విశాఖ సిటీ పోలీసులు ప్రత్యేక తనిఖీలు ముమ్మరం చేసింది. పెందుర్తి రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల్లో డాగ్ స్క్వాడ్ సహాయంతో నిర్వహించిన తనిఖీల్లో మొత్తం 35 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.సీపీ శంఖబ్రత బాగ్చి ఆదేశాల మేరకు ఆర్.ఐ భగవాన్ ఆధ్వర్యంలో ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. నగరంలో గంజాయి, ఇతర నార్కోటిక్ డ్రగ్స్ రవాణా, నిల్వ, విక్రయాలను అడ్డుకునేందుకు రైల్వే స్టేషన్లు, ఆర్టీసీ కాంప్లెక్స్, బీచ్ రోడ్ తదితర ప్రాంతాల్లో డాగ్ స్క్వాడ్ బృందాలు నిత్యం తనిఖీలు నిర్వహిస్తున్నాయి.ఈ క్రమంలో పెందుర్తి రైల్వే స్టేషన్ వద్ద అనుమానాస్పదంగా ఉన్న నాలుగు ప్యాకెట్లను నార్కోటిక్ డాగ్ గుర్తించడంతో తనిఖీ చేయగా, అందులో భారీగా గంజాయి ఉన్నట్లు తేలింది. ఒక తనిఖీలో 15 కిలోలు, మరో తనిఖీలో 20 కిలోలు మొత్తంగా 35 కిలోల గంజాయి పట్టుబడింది.ఈ కేసుల్లో ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకుని, స్వాధీనం చేసుకున్న గంజాయితో కలిసి తదుపరి విచారణ కోసం పెందుర్తి పోలీస్ స్టేషన్ కు అప్పగించారు.గంజాయిని గుర్తించడంలో కీలక పాత్ర పోషించిన నార్కోటిక్ డాగ్, డాగ్ హ్యాండ్లర్, తనిఖీల్లో పాల్గొన్న పోలీసు సిబ్బందిని సీపీ బాగ్చి ప్రత్యేకంగా అభినందించారు.నగరంలో మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రత్యేక చొరవ తీసుకుంటున్న పోలీసు శాఖ, జిల్లా పరిపాలనతో సమన్వయం చేసుకుని అదనపు డాగ్ స్క్వాడ్ బృందాలను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు అధికారులు తెలిపారు. జీవీఎంసీ జిల్లా అధికారుల సహకారంతో ఈ చర్యలు మరింత విస్తరించనున్నాయి. నగరాన్ని డ్రగ్స్ రహితంగా మార్చే లక్ష్యంతో తనిఖీలు మరింత కట్టుదిట్టం చేయనున్నట్లు పోలీసులు స్పష్టం చేశారు.

## విద్యార్థులలో సృజనాత్మకత అవసరం

**విశాఖపట్నం, మార్చి 31 ప్రభాతవార్త**



సెయింట్ అలోషియస్ ఆంగ్లో ఇండియన్ హై స్కూల్లో మంగళవారం ఒక డిపార్ట్మెంట్ ఎక్స్పో నిర్వహించబడింది, ఇది ప్రిన్సిపల్ రేవ్. ఫాదర్ డి. జయప్రకాశ్ ఆధ్వర్యంలో విద్యార్థుల లో సృజనాత్మకతను పెంపొందించడా నికి ఏర్పాటు చేయబడింది. ఈ కార్యక్రమం విద్యార్థులలో సృజనాత్మకత ప్రతిభను ప్రోత్సహించ దానికి నిర్వహించబడింది. విద్యార్థులు ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభ ఆధారంగా ప్రజెంటేషన్లను సృష్టించారు.

## నేటి నుంచి శబలా భోజనాల సంబరాలు

**విశాఖపట్నం, మార్చి 31 ప్రభాతవార్త**

ఏప్రిల్ 1 నుండి 5 తేది వరకూ నిర్వహించె శబల భోజనాలనం జయప్రదం చేయండి మిల్లెట్స్ రాంబాబు. శబల భోజనాలను జయప్రదం చేయండి అని మిల్లెట్స్ రాంబాబు పిలుపునిచ్చారు. మంగళవారం మధ్యాహ్నం విశాఖపట్నం లోని సింహాచలం కొత్త గోశాల వద్ద శబల భోజనాల పండుగ గురించి సేవ్ సంస్థ నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సేవ్ సంస్థ ఆధ్వర్యంలో ఐదు రోజులు పాటు ఉచితంగా నిర్వహించె శబల భోజనాల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఇందుకు గాను అన్ని ఏర్పాట్లు పూర్తి చేసాం అని అన్నారు. ఈ కార్యక్రమంలో సేవ్ సంస్థ కో ఆర్డినేటర్ సురేంద్రనాద్ మాట్లాడుతూ ఈ శబల భోజనాలు పండుగను జయప్రదం చేయాలని కోరారు. వేలాది మంది ఈ భోజనాలు పండుగను, వివిధ ఉత్తరాంధ్ర కళ రూపాలు ప్రదర్శన, సంప్రదాయ చేతి వృత్తుల ప్రదర్శన, చెక్క గానుగ, ఆర్గానిక్ విత్తనాలు, ఉత్పత్తుల స్టాల్స్ వివిధ కార్యక్రమలను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎపి నర్సరీస్ అసోసియేషన్ అధ్యక్షులు ఆకుల చలపతి రావు, తులసి నేచురల్స్ సత్యనారాయణ, ఉత్తరాంధ్ర జర్నలిస్ట్ ఫ్రంట్ అధ్యక్షులు డాఖి ఎం.అర్.ఎన్.వర్మ , ప్రకృతి వ్యవసాయదారుల సంఘం అధ్యక్షులు వర్మ, మేంగొ మేన్ అప్పాజీ, గ్రీన్ క్లైమేట్ టీం కార్యదర్శి జె.వి రత్నం తదితరులు పాల్గొన్నారు.

## సోషల్ మీడియా శక్తిని సమాజ మార్పుకు వినియోగించాలి

- ఇన్ఫ్లుయెన్సర్లతో సీపీ శంఖబ్రత బాగ్చి ప్రత్యేక సమావేశం

**(విశాఖ క్రైమ్ ప్రభాతవార్త)**



ప్రజల్లో అవగాహన పెంపు, భద్రతా చర్యల విస్తరణ, సమాజంలో సానుకూల మార్పు తీసుకురావడమే లక్ష్యంగా విశాఖ సిటీ పోలీసులు వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చి ఆధ్వర్యంలో సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్లతో ప్రత్యేక కొలాబరేషన్ సమావేశం నిర్వహించి, సమాజ సమస్యలపై అవగాహన కల్పించడంలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. నగర పోలీసు సమావేశ మందిరంలో మంగళవారం జరిగిన ఈ కార్యక్రమంలో సుమారు 35 మంది సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్లు, పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీపీ బాగ్చి మాట్లాడుతూ, పోలీస్ శాఖ ప్రజల్లో అవగాహన పెంచేందుకు నిరంతరం కృషి చేస్తున్నప్పటికీ, సోషల్ మీడియా వేదికల ద్వారా ఇన్ఫ్లుయెన్సర్లకు మరింత విస్తృతమైన చేరువ ఉందని పేర్కొన్నారు. పోలీసు శాఖతో కలిసి పనిచేస్తే సమాజంలో గణనీయమైన మార్పు తీసుకురాగలమని చెప్పారు. విద్యార్థుల్లో పరీక్షల ఫలితాలపై ఒత్తిడి పెరిగి తీవ్ర నిర్ణయాలకు దారితీస్తున్న పరిస్థితిని మార్చాల్సిన అవసరం ఉందని సీపీ తెలిపారు. మార్కులు మాత్రమే జీవిత విజయానికి ప్రమాణం కాదని, పట్టుదలతో కృషి చేస్తే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చనే సందేశాన్ని మీ కంటెంట్ ద్వారా విద్యార్థులకు చేరవేయాలని కోరారు. ఐపీఎల్ సమయంలో పెరుగుతున్న బెట్టింగ్ మోసాలపై ప్రత్యేకంగా ఆందోళన వ్యక్తం చేశారు. ఆన్‌లైన్ గాంబ్లింగ్, బెట్టింగ్ యాప్‌లు అనేక కుటుంబాలను ఆర్థికంగా దెబ్బతీస్తున్నాయని, డబ్బు కోసం ఇలాంటి యాప్‌లను ప్రమోట్ చేయడం చట్టవిరుద్ధమని స్పష్టం చేశారు. బెట్టింగ్ యాప్‌లపై సమాచారం అందిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.డ్రగ్స్ సమస్య సమాజానికి తీవ్రమైన ముప్పుగా మారుతోందని, యువతను రక్షించడానికి అవగాహన అత్యవసరమని పేర్కొన్నారు. డ్రగ్స్‌కు సంబంధించిన సమాచారం ఉంటే ఈగల్ టోల్ ఫ్రీ నంబర్ 1972 లేదా పోలీసు అధికారులకు తెలియజేయాలని సూచించారు.సైబర్ నేరాలు, ముఖ్యంగా ఫోటోలు, వీడియోలతో బ్లాక్‌మెయిలింగ్ కేసులు పెరుగుతున్నాయని, బాధితులు భయపడకుండా వెంటనే పోలీసులను సంప్రదించేలా ప్రోత్సహించాలని కోరారు. సైబర్ అవగాహన వీడియోలను విస్తృతంగా పంచాలని సూచించారు. రోడ్డు భద్రతపై కూడా సీపీ బాగ్చి దృష్టి సారించారు. నగరంలో స్పీడ్ లేజర్ గన్స్ ఏర్పాటు తర్వాత ప్రమాదాలు తగ్గుతున్నాయని, హెల్మెట్ వినియోగం, డ్రైవింగ్ సమయంలో మొబైల్ ఫోన్ వాడకంపై ప్రజల్లో అవగాహన పెంచాలని కోరారు.ఇళ్లలో సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేయడం, అద్దెదారులు, పనిమనుషులపై పోలీస్ వెరిఫికేషన్ తప్పనిసరి చేయడం భద్రతకు తోడ్పడుతుందని తెలిపారు. చిట్ ఫండ్ మోసాలు, అక్రమ పెట్టుబడులపై అప్రమత్తంగా ఉండాలని, ప్రభుత్వ అనుమతి ఉన్న సంస్థలపైనే నమ్మకం ఉంచాలని ప్రజలకు తెలియజేయాలని సూచించారు.రోడ్డు ప్రమాద బాధితులను ఆసుపత్రికి తరలించే వారికి రూ.25 వేలు ప్రోత్సాహకం ఉందని, అత్యవసర సమయాల్లో మానవత్వంతో ముందుకు రావాలని కోరారు. నగరాన్ని భిక్షాటన రహితంగా, మరింత సురక్షితంగా తీర్చిదిద్దడంలో ప్రజల భాగస్వామ్యం అవసరమని చెప్పారు.సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలకు దూరంగా ఉండి, నిజమైన సమాచారాన్ని మాత్రమే పంచాలని, విశాఖ నగర ఖ్యాతి పెంపొందేలా పనిచేయాలని సీపీ శంఖబ్రత బాగ్చి సూచించారు.

## ట్రాఫిక్ ఉల్లంఘనలపై ఉక్కుపాదం

- 30వ తేదీ ఒక్కరోజే 2,388 ఈచలాన్లు
- డ్రంక్ అండ్ డ్రైవ్‌కు రూ.8.58 లక్షల జరిమానా
- మద్యం మత్తులో డ్రైవింగ్..13 మందికి జైలు శిక్ష
- నియమాలు అతిక్రమిస్తే జరిమానాలు తప్పవు
- ట్రాఫిక్ ఏడిసిపి ప్రవీణ్ కుమార్

**(విశాఖ క్రైమ్ ప్రభాతవార్త)**



విశాఖ నగరంలో పెరుగుతున్న వాహనాల సంఖ్యతో పాటు ట్రాఫిక్ ఉల్లంఘనలు అధికమవుతున్న నేపథ్యంలో విశాఖ సిటీ ట్రాఫిక్ పోలీస్ విభాగం కఠిన తనిఖీలు చేపట్టింది. సోమవారం ఒకేరోజులో భారీ స్థాయిలో ఉల్లంఘనలను గుర్తించి 2,388 ఈ చలాన్లు విధించారు.ట్రాఫిక్ నియంత్రణ, ప్రమాదాల నివారణ లక్ష్యంగా మార్చి 30న నగరంలోని ప్రధాన కూడళ్లలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఇందులో హెల్మెట్ లేకుండా ప్రయాణించిన 1,217 మందిపై కేసులు నమోదు చేయగా, పిలియన్ రైడర్ హెల్మెట్ లేకుండా ప్రయాణించిన 235 మందిపై చర్యలు తీసుకున్నారు. ట్రిబుల్ రైడింగ్ చేసిన 69 మందిని కూడా గుర్తించి చలాన్లు విధించారు.అధిక వేగంతో వాహనాలు నడిపిన వారిపై ఇంటర్‌సెప్టర్ వాహనాల ద్వారా 184 కేసులు నమోదు చేశారు. డ్రైవింగ్ సమయంలో సెల్‌ఫోన్ మాట్లాడిన 28 మందిపై, లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపిన ఇద్దరిపై, మైనర్లు వాహనాలు నడిపిన ముగ్గురిపై కేసులు పెట్టారు.రాంగ్ పార్కింగ్ కారణంగా ట్రాఫిక్ అంతరాయం కలిగించిన 103 మందిపై చలాన్లు విధించగా, టోయింగ్ ద్వారా 32 వాహనాలను తరలించారు. మద్యం సేవించి వాహనాలు నడిపిన 34 మందిపై కేసులు నమోదు చేసి మొత్తం 56 వాహనాలను సీజ్ చేశారు. ఇతర మోటారు వాహన చట్ట ఉల్లంఘనలకు సంబంధించి మరో 515 కేసులు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. ఏపీ ట్రాన్స్‌పోర్ట్ డిపార్ట్మెంట్ తో కలిసి నిర్వహించిన సంయుక్త తనిఖీల్లో 37 ప్రైవేట్ సీసీ బస్సులు, ఏపీఎస్ఆర్టీసీ బస్సులను పరిశీలించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో 91 మందిని కోర్టులో హాజరుపరచగా, మెజిస్ట్రేట్ మొత్తం రూ.8,58,000 జరిమానా విధించారు. ఒకరికి 30 రోజుల జైలు శిక్ష, ముగ్గురికి 20 రోజులు, ఒకరికి 13 రోజులు, ఏడుగురికి 10 రోజులు, మరొకరికి 7 రోజుల జైలు శిక్ష విధించినట్లు తెలిపారు.నగరంలో బైక్ రేసింగ్, రాష్ డ్రైవింగ్, మోడిఫై చేసిన సైలెన్సర్ల వినియోగంపై కూడా కఠిన చర్యలు కొనసాగుతున్నాయని ట్రాఫిక్ అధికారులు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా అదనపు డీసీపీ ట్రాఫిక్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ, ట్రాఫిక్ నియమాలు ప్రతి వాహనదారుడి బాధ్యత అని, హెల్మెట్, సీట్‌బెల్ట్, స్పీడ్ నియంత్రణ, మద్యం సేవించి డ్రైవింగ్ చేయకపోవడం వంటి నియమాలను కచ్చితంగా పాటించాలని విజ్ఞప్తి చేశారు. జీవితంలో స్పీడ్‌గా ఎదగాలని కోరుకోండి.. కానీ డ్రైవింగ్‌లో స్పీడ్ లిమిట్ తెలుసుకోండి" అనే సందేశంతో ప్రజలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.

## సమాజంలో సహాయం కోసం షీల్డ్ సొసైటీ

**విశాఖపట్నం, మార్చి 31 ప్రభాతవార్త**



సామాజిక మానవ హక్కుల పరిరక్షణ, పర్యావరణ సంరక్షణ, న్యాయ సహాయం సమాజ అభివృద్ధి లక్ష్యాలతో షీల్డ్ సొసైటీ అనే సేవా సంస్థను ఘనంగా ప్రారంభించారు. సామాజిక మానవ హక్కుల సమావేశ పర్యావరణ న్యాయ సహాయ అభివృద్ధి సేవా సంస్థ ముఖ్య ఉద్దేశంతో పని చేస్తుందన్నారు. ఈ సంస్థ ద్వారా సమాజంలోని బలహీన వర్గాలకు న్యాయం అందించడం, ప్రజల్లో హక్కులపై అవగాహన కల్పించడం, పర్యావరణ పరిరక్షణపై చర్యలు చేపట్టడం ప్రధాన లక్ష్యంగా ఉందని స్థాపకులు తెలిపారు. ఈ సందర్భంగా స్థాపకులు జెర్రిపోతుల అప్పారావు, చిన్నమ్మలు పిల్లా సత్యస్వాతి, బిజెపి నాయకులు, పిడుగురాళ్ళ, పల్నాడు జిల్లా, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఆత్మకూరి కాశీ విశ్వనాథం, ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ ఆదిత్య రంగనాథ్ వెంపల, తదితరులు మాట్లాడుతూ, సమాజంలో సమానత్వం, న్యాయం, బాధ్యతాయుత జీవన విధానం ఏర్పడేందుకు షీల్డ్ సొసైటీ కృషి చేస్తుందని తెలిపారు. అదనంగా, భవిష్యత్తులో న్యాయ అవగాహన శిబిరాలు, పర్యావరణ కార్యక్రమాలు, సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి స్థానిక ప్రముఖులు, సామాజిక కార్యకర్తలు, ప్రజలు హాజరై సంస్థకు తమ మద్దతు తెలిపారు. సమాజ సేవలో ఆసక్తి ఉన్న ప్రతి ఒక్కరూ ఈ సంస్థలో భాగస్వాములు కావాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు.


**వార్త VAARTHA CLASSIFIEDS**

**CHANGE OF NAME**

★ I, **KONA JYOTHI SITA KRISHNA KUMARI** W/O KONA VIJAYA KUMAR previously called KONA JYOTHI R/O FLAT NO. 302, 58-21-14, ALLU SRI BALAJI RESIDENCY, GOPALA PATNAM, VISAKHAPATNAM, now changed my name from KONA JYOTHI to KONA JYOTHI SITA KRISHNA KUMARI. Henceforth I will be called as **KONA JYOTHI SITA KRISHNA KUMARI** for all purposes.
(Ro.No.49383)

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.

ong-9_ong-9.qxd 4/1/2026 12:36 AM Page 1



## ఇంటి కాపలాదారుడే దొంగ

- తాళం వేసిన ఇంటిపై కన్నేసిన వాచ్‌మన్ - బాల్కనీ గడియ విరగొట్టి చోరీ
- వెండి వస్తువుల అపహరణ నిందితుడి అరెస్ట్

**(విశాఖ క్రైమ్ ప్రభాతవార్త)**



పీ.ఎం.పాలెం క్రైమ్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఇంటి చోరీ కేసును పోలీసులు ఛేదించారు. ఇంటి భద్రత బాధ్యతలు చూసే వాచ్‌మన్‌నే చోరీకి పాల్పడినట్లు దర్యాప్తులో బయటపడటంతో స్థానికులు ఆశ్చర్యానికి గురయ్యారు. బక్కన్నపాలెంకు చెందిన పాకాల బాలాజీ ఈ ఏడాది జనవరి 11న తన ఇంటికి తాళం వేసి కాకినాడకు వెళ్లి రాత్రి ఆలస్యంగా తిరిగి వచ్చాడు. ఇంట్లోకి వెళ్లి చూడగా గదుల్లోని వస్తువులు చిందరవందరగా పడి ఉండటంతో పాటు బాల్కనీ వైపు ఉన్న తలుపు గడియ విరిగిపోయినట్లు గుర్తించాడు. ఇంట్లో ఉంచిన బంగారం, వెండి వస్తువులు కనిపించకపోవడంతో చోరీ జరిగిందని అనుమానించి వెంటనే పీఎంపాలెం క్రైమ్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు.ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసిన పోలీసులు పలు కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. అపార్ట్మెంట్ పరిసరాలు, అక్కడ పనిచేసే సిబ్బంది వివరాలు, గతంలో వచ్చిన వ్యక్తుల కదలికలు పరిశీలించగా అదే అపార్ట్మెంట్‌లో వాచ్‌మన్‌గా పనిచేస్తున్న మోకర వెంకటరమణపై అనుమానాలు కలిగాయి.. పోలీసుల విచారణలో వెంకటరమణ తన స్నేహితుడు తోటపల్లి గోపిని విజయవాడ నుంచి తీసుకువచ్చి ఇద్దరూ కలిసి చోరీ చేసినట్లు తేలింది. ఇంటి పరిస్థితులు, యజమాని రాకపోవడాన్ని ముందుగానే తెలుసుకుని నేరానికి పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు.ఇదిలా ఉండగా, వెంకటరమణ విజయవాడలో మరో బండి చోరీ కేసులో పట్టుబడగా అక్కడి పోలీసుల విచారణలో పీఎం పాలెం చోరీ విషయం కూడా బయటపడింది. ఆ సమాచారంతో విశాఖ పోలీసులు అతన్ని కస్టడీలోకి తీసుకుని విచారించగా పీఎం పాలెం కేసులో తన ప్రమేయాన్ని అంగీకరించినట్లు తెలిసింది.నిందితుడి వద్ద నుంచి సుమారు అర కిలో వెండి పూజా సామాగ్రి, ఒక వెండి గ్లాసును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దొంగతనానికి గురైన వస్తువులలో కొంత భాగాన్ని రికవరీ చేయగా, మిగతా వస్తువుల కోసం అన్వేషణ కొనసాగుతోంది.కేసులో ప్రధాన నిందితుడైన వెంకటరమణను న్యాయస్థానంలో హాజరుపరచి జైలుకు తరలించారు. అతనితో కలిసి నేరానికి పాల్పడిన తోటపల్లి గోపి పాత్రపై కూడా పోలీసులు మరింత విచారణ కొనసాగిస్తున్నారు.ఇంటి భద్రత బాధ్యతలు చూసే వ్యక్తులే నేరాలకు పాల్పడటం ఆందోళనకరమని, వాచ్‌మన్‌ల నియామకంలో పూర్తి వివరాలు నమోదు చేసుకోవాలని పోలీసులు అపార్ట్మెంట్ యజమానులకు సూచిస్తున్నారు.

## బెట్టింగ్ ముఠాలపై సీపీ ఉక్కుపాదం

- సాంకేతిక నిఘాతో ఇద్దరు బుకీలు అరెస్ట్
- యువతను మోసం చేస్తున్న ఆన్‌లైన్ జూదంపై దెబ్బ

**(విశాఖ క్రైమ్, ప్రభాతవార్త)**





క్రికెట్ బెట్టింగ్ పేరుతో అమాయకులను ఆకర్షిస్తూ అక్రమ లావాదేవీలు నిర్వహిస్తున్న ముఠాలపై విశాఖ సిటీ పోలీసులు కఠిన చర్యలు కొనసాగిస్తోంది. నగరంలో ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ బెట్టింగ్ కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి పెట్టిన పోలీసులు మరోసారి సాంకేతిక నిఘాతో ఇద్దరు బుకీలను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. దేశవ్యాప్తంగా ఆన్‌లైన్ బెట్టింగ్, జూద కార్యకలాపాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠినంగా వ్యవహరిస్తున్నప్పటికీ, పలు ప్రాంతాల్లో అక్రమంగా నెట్‌వర్క్‌లు కొనసాగుతున్న నేపథ్యంలో విశాఖ సిటీ పోలీసులు ప్రత్యేక ఆపరేషన్ చేపట్టారు. సీపీ శంఖబ్రత బాగ్చి ఆదేశాల మేరకు నగర సైబర్ క్రైమ్ పోలీసులు బెట్టింగ్ ముఠాలపై పర్యవేక్షణ పెంచారు. సైబర్ క్రైమ్ సీఐ కే భవాని ప్రసాద్ ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టగా, నగర సైబర్ క్రైమ్ పరిధిలో [illegible] అనే ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్ ద్వారా అక్రమ క్రికెట్ బెట్టింగ్ కొనసాగుతున్నట్లు గుర్తించారు. ఈ యాప్ ద్వారా ఎక్కువ లాభాలు వస్తాయని నమ్మించి పలువురిని బెట్టింగ్‌లోకి దింపుతున్నట్లు పోలీసులు నిర్ధారించారు. దర్యాప్తులో భాగంగా మాడుగుల ప్రాంతానికి చెందిన పుట్ట కళ్యాణ్ శ్రీనివాసరావు, చింతాడ రాజు అనే ఇద్దరు వ్యక్తులు బుకీలుగా వ్యవహరిస్తున్నట్లు బయటపడింది. వీరు స్వయంగా బెట్టింగ్ ఆడటమే కాకుండా ఇతరులకు ప్రత్యేక లింకులు, ఐడీలు అందించి ఆన్‌లైన్ బెట్టింగ్‌లో పాల్గొనేలా ప్రోత్సహిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు.ఇద్దరిపై ప్రత్యేక నిఘా ఉంచి, వారి కదలికలు, డిజిటల్ ట్రాన్సాక్షన్లు, వినియోగిస్తున్న కమ్యూనికేషన్ ఆధారాలను సేకరించిన అనంతరం సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల వద్ద నుంచి బెట్టింగ్ కార్యకలాపాలకు వినియోగిస్తున్న మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.కేసును భారతీయ న్యాయసంహిత(బిఎన్ఎస్), ఐటీ చట్టం, ఆంధ్రప్రదేశ్ గేమింగ్ చట్టం కింద నమోదు చేసి నిందితులను న్యాయస్థానంలో హాజరుపరచగా, కోర్టు 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. తక్కువ పెట్టుబడితో భారీ లాభాలు వస్తాయని ఆశ చూపించి ప్రజలను బెట్టింగ్ యాప్‌లలోకి దింపడం, తరువాత వారి వద్ద ఉన్న మొత్తం డబ్బు కోల్పోయేలా చేయడం ఈ ముఠాల పని అని పోలీసుల దర్యాప్తులో తేలింది. ముఖ్యంగా యువత, ఉద్యోగార్థులు, తక్కువ సమయంలో డబ్బు సంపాదించాలనుకునే వారిని లక్ష్యంగా చేసుకుని ఈ నెట్‌వర్క్‌లు పనిచేస్తున్నాయని అధికారులు హెచ్చరిస్తున్నారు.ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ బెట్టింగ్ నిర్వహించినా, ఇతరులను ప్రోత్సహించినా, లింకులు పంచినా చట్టపరమైన చర్యలు తప్పవని పోలీసులు స్పష్టం చేశారు. ప్రజలు ఇటువంటి యాప్‌లకు దూరంగా ఉండాలని, ఎక్కడైనా బెట్టింగ్ జరుగుతున్న సమాచారం తెలిసినా వెంటనే తెలియజేయాలని సూచించారు.సైబర్ నేరాలపై ఫిర్యాదుల కోసం నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ లో నమోదు చేయవచ్చని, 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు కాల్ చేయవచ్చని తెలిపారు

## ఉక్కునగరంలో ఉత్సాహంగా స్వచ్ఛ పథ్ వాకథాన్

**గాజువాక,మార్చి 31,ప్రభాతవార్త**




విశాఖ ఉక్కు కర్మాగారంలో "స్వచ్ఛతా పక్వాడా2026లో భాగంగా మంగళవారం ఉక్కునగరంలో "స్వచ్ఛ పథ్ వాకథాన్ నిర్వహించారు. సుమారు 400 మంది ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్న ఈ నడకను ఉక్కు స్టేడియం నుండి ప్రారంభించారు. ముఖ్య అతిథిగా హాజరైన డైరెక్టర్ (పర్సనల్) డాక్టర్ రాకేష్ నందన్ సహాయ్ మాట్లాడుతూ ఆరోగ్యం, పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. అనంతరం జాతీయ స్థాయి పోటీల్లో రాణించిన ఉక్కు కబడ్డీ, బ్యాడ్మింటన్ క్రీడాకారులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్లాంట్ ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అనారోగ్యంతో బాధపడుతున్న మహిళ అదృశ్యం

- పునరమ హిల్స్ సెలబ్రిటీ టవర్ నుంచి

తెల్లవారుజామున బయటకు వెళ్లిన మహిళ కోసం గాలింపు

**(విశాఖ క్రైమ్, ప్రభాతవార్త)**



అనారోగ్య సమస్యలతో బాధపడుతూ మానసిక ఆందోళనలో ఉన్న మహిళ ఇంటి నుంచి ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లిపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. ఈ ఘటన పునరమ హిల్స్ పరిధిలోని సెలబ్రిటీ టవర్‌లో చోటుచేసుకుంది.పోలీసుల వివరాల ప్రకారం, బొబ్బర దుర్గాదేవి అలియాస్ సుజాత అనే మహిళ గత కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతూ మానసికంగా కూడా కొంత అస్వస్థతకు గురవుతున్నారు. కుటుంబ సభ్యులు చికిత్స కోసం ఆసుపత్రికి తీసుకెళ్తున్నప్పటికీ, ఆమెకు ఆసుపత్రులంటే తీవ్ర భయం ఉండటం, నిద్రలేమి సమస్యలు కొనసాగుతున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో మార్చి 31 తెల్లవారుజామున సుమారు 4.30 గంటల సమయంలో ఇంట్లో ఉన్న రెండు బ్యాగులు తీసుకుని ఎవరికీ తెలియకుండా బయటకు వెళ్లినట్లు కుటుంబ సభ్యులు గుర్తించారు. ఇంట్లో వెతికినా కనిపించకపోవడంతో వెంటనే పిఎంపాలెం పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు.ఫిర్యాదు అందుకున్న వెంటనే సిఐ బాలకృష్ణ నేతృత్వంలో సిబ్బంది కేసు నమోదు చేసి మహిళ కోసం గాలింపు చర్యలు ప్రారంభించారు. పరిసర ప్రాంతాల్లో సీసీ కెమెరా దృశ్యాలు పరిశీలిస్తూ ఆమె వెళ్లిన దిశపై సమాచారం సేకరిస్తున్నారు. మహిళ ఆచూకీ తెలిసిన వారు సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా కుటుంబ సభ్యులకు సమాచారం అందించాలని సిఐ బాలకృష్ణ కోరారు.

## ప్రైవేట్ బస్సులపై ప్రత్యేకతనికి డ్రైవ్

**మాధవధార, మార్చి 31 ప్రభాతవార్త**




అనుమతులు లేకుండా తిప్పుతున్న బస్సులపై ఆర్టీవో అధికారులు కొరడా జులిపించారు. ఈనెల 21 నుండి నుండి మంగళవారం వరకు కాంట్రాక్ట్ క్యారేజ్ (సీసీ) బస్సులపై ప్రత్యేక తనిఖీ డ్రైవ్ నిర్వహించారు ప్రత్యేక తనిఖీలలో మొత్తం 16 కేసులు నమోదు చేయబడగా, వాటి ద్వారా రూ. 6, 94,000/ చలానా విధించినట్లు అధికారులు తెలిపారు. అనుమతులు లేకుండా నడపడం, పర్మిట్ నిబంధనలు ఉల్లంఘించడం, పన్నులు చెల్లించకపోవడం, ఎమర్జెన్సీ డోర్స్ పనిచేయకపోవడం తోపాటు ఇతర మోటారు వాహన చట్ట ఉల్లంఘనలపై కేసులు నమోదు చేసినట్లు తెలియజేశారు. ప్రజల భద్రత దృష్ట్యా ప్రత్యేక తనిఖీలు కొనసాగుతాయని అధికారులు తెలిపారు.

## ప్రతిభావంతులైన విద్యార్థినులకు మలబార్ నగదు ప్రోత్సాహకం

- 112 మందికి రూ. 8.96 లక్షల పంపిణీ
- మలబార్ చారిటబుల్ ట్రస్ట్ సేవా కార్యక్రమంపై ప్రశంసలు జల్లు

**గాజువాక,మార్చి 31,ప్రభాతవార్త**



సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా మలబార్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదివిన ప్రతిభావంతులైన బాలికలకు నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. మంగళవారం గాజువాక బీసీ రోడ్డులోని స్వామి కన్వెన్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 112 మంది విద్యార్థినులకు రూ. 8.96 లక్షల నగదుతో పాటు ప్రశంసా పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి హాజరైన వక్తలు మాట్లాడుతూ.. వ్యాపార రంగంలో రాణిస్తూనే, సామాజిక బాధ్యతగా ఏటా కోట్లాది రూపాయలు వెచ్చించి సేవ చేయడం అభినందనీయమన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని అందిస్తున్న ఈ ఆర్థిక తోడ్పాటు వారిలో చైతన్యాన్ని నింపుతుందని, ఉన్నత చదువులకు ఎంతో ఆసరాగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గాజువాక తహసీల్దార్ శ్రీనివాస్, మాజీ డిప్యూటీ మేయర్ దల్లి గోవిందరాజు, కార్పొరేటర్లు పల్లా శ్రీనివాసరావు, పులి లక్ష్మీబాయి పాల్గొన్నారు. మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ ప్రతినిధులు మొహమ్మద్ షాహీన్ ఇషాక్, ఎన్.ఎల్. అనూష, అనకాపల్లి డీఐఈఓ వినోద్ బాబు, ఎంఈఓ త్రినాథరావు, పరవాడ,గాజువాక,ఇస్లాంపేట తదితర పాఠశాలలకు చెందిన విద్యార్థినిలు హాజరయ్యారు.

## మోనికకు కన్నీటి వీడ్కోలు

- పోస్టుమార్టం అనంతరం అంతిమయాత్ర..
- నిందితుడికి కఠిన శిక్ష విధించాలని కుటుంబ సభ్యుల డిమాండ్

**(విశాఖ క్రైమ్ ప్రభాతవార్త)**



విశాఖలో సంచలనం రేపిన మోనిక హత్య కేసు మరింత విషాద వాతావరణాన్ని సంతరించుకుంది. అమానుషంగా ప్రాణాలు కోల్పోయిన యువతి మోనికకు కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరుగా వీడ్కోలు పలికారు. కేజీహెచ్ లో పోస్టుమార్టం పూర్తయ్యాక దారుణ హత్యకు గురైన మోనిక భౌతికకాయాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించగా, అక్కడి వాతావరణం హృదయ విదారకంగా మారింది. ఉదయం నుంచే ఆసుపత్రి మార్చురీ వద్ద కుటుంబ సభ్యులు, బంధువులు, పరిచయస్తులు చేరుకుని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్కసారిగా జరిగిన ఈ ఘటనను ఇప్పటికీ నమ్మలేకపోతున్నామని, తమ ఇంట్లో ఆనందంగా ఉండే కుమార్తె ఇలా అమానుష హత్యకు గురవడం తట్టుకోలేకపోతున్నామని కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. పోస్టుమార్టం అనంతరం మోనిక మృతదేహాన్ని జాగ్రత్తగా వాహనంలో తరలించి జ్ఞానాపురం స్మశాన వాటిక కు తీసుకెళ్లారు. అక్కడ హిందూ సాంప్రదాయ పద్ధతిలో అంత్యక్రియలు నిర్వహించారు. తండ్రి వేణుగోపాలరావు స్వయంగా కుమార్తె అంతిమయాత్రలో పాల్గొని చివరి సంస్కారాలు నిర్వహించారు. కుటుంబ సభ్యుల రోదనలు అక్కడున్న ప్రతి ఒక్కరినీ కలిచివేశాయి. కుమార్తెకు చివరి చూపు చూసిన తల్లిదండ్రులు తీవ్ర ఆవేదనకు గురయ్యారు. కేజీహెచ్ మార్చురీ వద్ద మీడియాతో మాట్లాడిన మోనిక తండ్రి వేణుగోపాలరావు, "మా లాంటి కష్టం ఎవరికీ రాకూడదు.. నా కుమార్తెను అత్యంత క్రూరంగా హత్య చేశాడు.. నిందితుడిని జీవితాంతం జైలులో పెట్టడమే కాకుండా ఉరిశిక్ష విధించాలి" అని డిమాండ్ చేశారు. కుటుంబానికి న్యాయం చేయాలని, కేసుపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు.మోనిక వద్ద ఉన్న సుమారు రెండు తులాల బంగారు ఆభరణాలు కనిపించడం లేదని కూడా కుటుంబ సభ్యులు ఆరోపించారు. హత్యకు ముందు లేదా తర్వాత అవి మాయమైన అంశాన్ని పోలీసులు ప్రత్యేకంగా విచారించాలని కోరుతున్నారు. ఈ అంశం కూడా కేసులో కీలకంగా మారే అవకాశం ఉందని భావిస్తున్నారు.ఇదిలా ఉండగా, గాజువాకలో జరిగిన ఈ హత్య నగరవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. నేవీలో పనిచేస్తున్న వ్యక్తి ఇంత అమానుషానికి పాల్పడటం ప్రజలను కలవరపరుస్తోంది. ప్రేమ, పరిచయం, వ్యక్తిగత విభేదాలు చివరకు ప్రాణాంతకంగా మారిన ఘటనగా ఇది నిలిచింది. పోలీసులు ఇప్పటికే నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారణ కొనసాగిస్తున్నారు. హత్య జరిగిన సమయం, మృతదేహాన్ని ముక్కలు చేయడానికి ఉపయోగించిన వస్తువులు, ముందస్తు ప్రణాళిక ఉందా లేదా, ఘటన తర్వాత ఆధారాలు చెరిపివేయ డానికి ఎలాంటి ప్రయత్నాలు చేశాడనే కోణాల్లో విచారణ సాగుతోంది. గాజువాక ప్రాంత ప్రజలు ఈ ఘటనతో తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సాధారణ నివాస ప్రాంతంలో ఇంత దారుణం జరగడం భయాందోళన కలిగిస్తోందని అంటున్నారు. నిందితుడిపై కఠిన చర్యలు తీసుకుని ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.ఇటీవల అనేక చోట్ల కుటుంబ సంబంధాలు, వివాహేతర బంధాలు, అనుమానాలు, క్షణికావేశాలు నేరాలకు దారితీస్తున్న ఘటనలు పెరుగుతున్న నేపథ్యంలో ఈ సంఘటన మరోసారి సమాజాన్ని ఆలోచింపజేస్తోందని నిపుణులు అభిప్రాయపడు తున్నారు. చిన్నపాటి విభేదాలు చర్చల ద్వారా పరిష్కరించుకునే సహనం తగ్గిపోవడం, భావోద్వేగ నియంత్రణ లోపించడం వల్లే ఇటువంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయని విశ్లేషిస్తున్నారు.

## పోలీస్ స్టేషన్‌లపై సీపీ నిఘా

- హార్బర్ పోలీస్ స్టేషన్‌లో ఆకస్మిక తనిఖీ
- రికార్డులు, విధుల నిర్వహణ, శుభ్రతపై సమీక్ష. అధికారులకు ఆదేశాలు

**(విశాఖ క్రైమ్ ప్రభాతవార్త)**



(విశాఖ క్రైమ్ ప్రభాత వార్త) నగరంలో శాంతిభద్రతల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారిస్తున్న విశాఖ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పోలీస్ స్టేషన్ల పనితీరును స్వయంగా పరిశీలిస్తున్నారు. ఈ క్రమంలో నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చి మంగళవారం రాత్రి హార్బర్ పోలీస్ స్టేషన్ ను ఆకస్మికంగా సందర్శించారు.స్టేషన్‌కు చేరుకున్న సీపీ అక్కడ విధుల్లో ఉన్న అధికారులు, సిబ్బంది పనితీరును సమీక్షించారు. స్టేషన్ పరిధిలో నమోదైన కేసుల వివరాలు, రికార్డుల నిర్వహణ, పెండింగ్ అంశాలపై ఆరా తీశారు.ప్రజలకు మెరుగైన సేవలు అందేలా పోలీస్ స్టేషన్ నిర్వహణ ఉండాలని సూచిస్తూ, రికార్డులు సక్రమంగా నిర్వహిస్తున్నారా లేదా అన్నది స్వయంగా పరిశీలించారు. స్టేషన్ పరిసరాలు, భద్రతా ఏర్పాట్లు, సిబ్బంది స్పందన తీరును కూడా పరిశీలించారు.మరుగుదొడ్ల శుభ్రతపై ప్రత్యేకంగా దృష్టి పెట్టిన సీపీ, పరిశుభ్రతలో ఎటువంటి నిర్లక్ష్యం ఉండకూడదని సంబంధిత అధికారులకు స్పష్టం చేశారు. పోలీస్ స్టేషన్ ప్రజలకు నమ్మక కేంద్రంగా ఉండాలని, కేసుల పరిష్కారంలో వేగం, విధుల్లో క్రమశిక్షణ, పరిసరాల్లో శుభ్రత తప్పనిసరిగా పాటించాలని ఆదేశాలు జారీ చేశారు.



## జిల్లా కలెక్టర్‌గా హరేంధిర ప్రసాద్ సేవలు అభినందనీయం

**మాధవధార, మార్చి 31 ప్రభాతవార్త**



జిల్లా కలెక్టర్‌గా ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ అందించిన సేవలు అభినందనీయమని జిల్లా ఇన్చార్జి మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి పేర్కొన్నారు. ఆయనను దుశ్శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు.కార్యక్రమంలో ఎమ్మెల్యే, బీజేపీ ఫ్లోర్ లీడర్ విష్ణు కుమార్ రాజు పాల్గొన్నారు. గత 20 నెలల కాలంలో ప్రజలకు అనేక విధాలు గా ఉత్తమ సేవలు అందించిన హరేంధిర ప్రసాద్ పరిపాలనలో ప్రత్యేక ముద్ర వేశారు అని మంత్రి తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారంలో చురుకుగా వ్యవహరించి, సహనంతో, శాంతియుత వాతావరణంలో అందరి ప్రశంసలు అందుకున్నారు అన్నారు. ప్రపంచ స్థాయి కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించడం ద్వారా జిల్లాకు మంచి గుర్తింపు తీసుకువచ్చారని, ప్రజల పట్ల గౌరవం, బాధ్యతతో విధులు నిర్వహించారని కొనియాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు మాట్లాడుతూ, హరేంధిర ప్రసాద్ ప్రజల మనసుల్లో చిరస్థాయిగా నిలిచే కలెక్టర్‌గా గుర్తింపు పొందారని అన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు, ఎమ్మెల్యేలు గణబాబు, రామకృష్ణ బాబు, ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్ట్ చైర్మన్ సీతంరాజు సుధాకర్ పాల్గొని కలెక్టర్ సేవలను ప్రశంసించారు. అంతకుముందు మాట్లాడుతూ నేమ్‌బోర్డుపై ఎంతమంది కలెక్టర్ల పేర్లు ఉన్నా, ప్రజల హృదయాల్లో మాత్రం హరేంధిర ప్రసాద్ పేరు నిలిచిపోతుందని పేర్కొన్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయి కార్యక్రమాల నిర్వహణలో ఆయన ప్రత్యేక ప్రతిభ కనబరిచారని, బృందస్ఫూర్తితో సమర్థవంతమైన పాలన అందించారని అభినందించారు. చివరగా జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ తన విధి నిర్వహణలో ప్రభుత్వం, ఇన్చార్జి మంత్రి, ప్రజా ప్రతినిధులు మరియు అధికారుల సంపూర్ణ సహకారం అందిందని తెలిపారు. అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

## యువత భవితకు భరోసా ఏఐఫస్ట్ బి.టెక్ ప్రోగ్రామ్..

- ఏఎస్‌బీఎం యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ మన్మథనాథ్ సమంతరాయ్

**విశాఖపట్నం, మార్చి 31, ప్రభాతవార్త**



విద్యా వ్యవస్థలో సాంకేతిక రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా బి టెక్ విద్యార్థులను తీర్చిదిద్దేందుకు ఒరిస్సా ఏఎస్బీఎం యూనివర్సిటీ మరియు బ్లాక్‌బక్స్ సంస్థలు సరికొత్త ఏ ఐ విద్యా విధానాన్ని ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా వారు సంయుక్తంగా రూపొందించిన భారతదేశపు మొట్టమొదటి అవుట్‌కమ్‌బేస్డ్ "ఏఐ ఫస్ట్ బి.టెక్ ప్రోగ్రామ్ బ్రోచర్‌ను మంగళవారం నగరంలో పౌరగ్రంథాలయంలో ఘనంగా ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బ్లాక్‌బక్స్ గ్రూప్ ఫౌండర్ అండ్ సీఈఓ అనురాధ తోట,డైరెక్టర్ రాజ్‌కుమార్ బోనగిరి, ఏ ఎస్ బి ఎం యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ మన్మథనాథ్ సమంతరాయ్ పాల్గొని మాట్లాడారు .. విద్యార్థులను కేవలం గ్రాడ్యుయేట్లుగా కాకుండా, ఇండస్ట్రీకి అవసరమైన "ఎక్స్‌పీరియన్స్డ్ ఫ్రెషర్స్"గా తయారు చేయడమే ఈ కోర్సు లక్ష్యమని తెలిపారు.తాము ప్రవేశపెట్టిన ఈ కోర్స్ లో 247 ఏ ఐ మెంటర్ మద్దతు తో పాటు ప్రతి సంవత్సరం తప్పనిసరి ఇంటర్న్‌షిప్‌లు, 3వ సెమిస్టర్ నుంచే లైవ్ ప్రాజెక్ట్‌లు ఈ ప్రోగ్రామ్ ప్రత్యేకతలని వివరించారు. డెలాయిట్ వంటి వెయ్యికి పైగా దిగ్గజ కంపెనీలతో అనుసంధానం కావడం ద్వారా విద్యార్థులకు గరిష్టంగా వార్షిక ప్యాకేజీ పొందే అవకాశం ఉందన్నారు. తల్లిదండ్రులు విద్యార్థుల ప్రగతిని పర్యవేక్షించేలా ప్రత్యేక డాష్‌బోర్డ్ సౌకర్యం కల్పించామని చెప్పారు.ఈ కోర్సు యువత భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తుందని వారు ధీమా వ్యక్తం చేశారు.అడ్మిషన్ కోసం తమ వెబ్సైటును సంప్రదించాలని కోరారు.

## డిజిటల్ భారతానికి రక్షణ కవచం

- సిటిజన్ ఫోర్స్, టెమా, సిఎంఏఐ, సిఎస్ఏఐ మధ్య అవగాహన ఒప్పందం
- లక్షలాది యువతకు శిక్షణ ఇవ్వడమే లక్ష్యం
- సైబర్ సురక్షిత భారత్ లక్ష్యంగా కీలక అడుగు
- సైబర్ సెక్యూరిటీపై జాతీయ స్థాయి అవగాహన కార్యక్రమాల ప్రారంభం
- భారత టెలికాం పితామహుడు ప్రొఫెసర్ ఎన్.కె.గోయల్ నేతృత్వంలో, సిటిజెన్ ఫోర్స్ తో ప్రతిష్టాత్మక ఒప్పందం
- కార్యక్రమంలో పాల్గొన్న సీపీ శంకబ్రతబాగ్చీ తదితర ప్రముఖులు

**విశాఖపట్నం, 31 మార్చి, ప్రభాతవార్త**



సైబర్ సురక్షిత భారత్ లక్ష్యంగా కీలక అడుగు పడింది. డిజిటల్ భారతానికి రక్షణ కవచంలా, జాతీయ స్థాయి సైబర్ సెక్యూరిటీ అవగాహన కార్యక్రమాలకు శుభారంభం పలుకుతూ సిటిజన్ ఫోర్స్, టెమా, సిఎంఏఐ, సిఎస్ఏఐ సంస్థల మధ్య అవగాహన ఒప్పందం సంతక కార్యక్రమం మంగళవారం నగరంలోని హోటల్ ఎలిగెంట్‌లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమం దేశవ్యాప్తంగా ప్రజల్లో సైబర్ భద్రతపై అవగాహన పెంపు, యువతకు శిక్షణ, భవిష్యత్తు డిజిటల్ సవాళ్లను ఎదుర్కొనే సామర్థ్యాన్ని పెంచడం లక్ష్యంగా ఏర్పాటు చేయబడింది. ఈ సందర్భంగా కమిషనర్ ఆఫ్ పోలీస్ డాక్టర్ శంఖ బ్రత బాగ్చి మాట్లాడుతూ డిజిటల్ యుగంలో సైబర్ నేరాలు గణనీయంగా పెరుగుతున్నాయని, వాటిని అరికట్టేందుకు ప్రజల్లో అవగాహన అత్యవసరమని అన్నారు. ముఖ్యంగా యువత సోషల్ మీడియా వినియోగంలో జాగ్రత్తగా ఉండాలని, ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్ భద్రతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు, శిక్షణా కార్యక్రమాలకు పోలీస్ శాఖ తరఫున పూర్తి మద్దతు ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా భారత టెలికాం పితామహుడు ప్రొఫెసర్ ఎన్. కె. గోయల్ మాట్లాడుతూ, భారత్ డిజిటల్ శక్తిగా ఎదుగుతున్న సమయంలో సైబర్ సెక్యూరిటీ దేశ భద్రతతో సమానమని అన్నారు. డిజిటల్ సేవలు విస్తరించడంతో పాటు సైబర్ ముప్పులు కూడా పెరుగుతున్నాయని, అందుకే ప్రతి పౌరుడికి సైబర్ అవగాహన తప్పనిసరి అయిందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన లోపం వల్ల మోసాలు ఎక్కువగా జరుగుతున్నాయని, ఈ కార్యక్రమాన్ని గ్రామ స్థాయి వరకు తీసుకెళ్లాలని లక్ష్యంగా పెట్టుకున్నామని వివరించారు. యువతపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తూ, దేశంలో ఉన్న యువశక్తిని సైబర్ సెక్యూరిటీ రంగంలో తీర్చిదిద్దితే భారత్ ప్రపంచానికి నిపుణులను అందించే కేంద్రంగా మారగలదని తెలిపారు. ఈ ఎంఓయూ ద్వారా ఒక లక్షకు పైగా యువతకు ఏఐ సైబర్ సెక్యూరిటీ రంగాల్లో ప్రాక్టికల్ ట్రైనింగ్ ఇవ్వాలని, ఇండస్ట్రీ అవసరాలకు అనుగుణంగా కోర్సులు రూపొందిస్తున్నామని చెప్పారు. అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన శిక్షణ ద్వారా భారత నిపుణులు గ్లోబల్ స్థాయిలో రాణించేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. సిటిజెన్ ఫోర్స్ ఫౌండేషన్ సీఎండీ పి. రమేష్ బాబు మాట్లాడుతూ,"సైబర్ సెక్యూరిటీ అనేది ఇప్పుడు ఎంపిక కాదు, ప్రతి పౌరుడి బాధ్యత" అని అన్నారు. గ్రామ స్థాయి నుంచి నగరాల వరకు ప్రతి ఒక్కరికి సైబర్ భద్రతపై అవగాహన కల్పించడమే తమ ప్రధాన లక్ష్యమని, ప్రజల భాగస్వామ్యంతో ఈ కార్యక్రమం విజయవంతమవుతుందని తెలిపారు. దేశ ప్రధాని నరేంద్ర మోదీ "డిజిటల్ యుగంలో సైబర్ సెక్యూరిటీ అనేది అత్యవసరం" అనే సందేశాన్ని ఆయన ప్రస్తావించారు. అలాగే ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు యువతలో ఏఐ, సైబర్ సెక్యూరిటీ నైపుణ్యాల అభివృద్ధిపై దృష్టి పెట్టాలని చేసిన పిలుపును ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఈ ఎంఓయూ ద్వారా పాఠశాలలు, కళాశాలలు, కార్పొరేట్ సంస్థలు, ప్రభుత్వ విభాగాల్లో సైబర్ అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం, ప్రత్యేక శిక్షణ మాడ్యూల్స్ రూపొందించడం, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్స్ చేపట్టడం వంటి కీలక నిర్ణయాలు తీసుకున్నామని వివరించారు. మొత్తంగా, విశాఖపట్నంలో ప్రారంభమైన ఈ జాతీయ స్థాయి సైబర్ సెక్యూరిటీ ఉద్యమం దేశవ్యాప్తంగా డిజిటల్ భద్రతను బలోపేతం చేసే దిశగా ఒక కీలక అడుగుగా నిలుస్తుందని రమేష్ బాబు పేర్కొన్నారు. సైబర్ సెక్యూరిటీపై జాతీయ శిక్షణ, అవగాహన కార్యకారణాల ప్రణాళికలను ఆయన మీడియాకు వివరించారు. ఈ కార్యక్రమంలో నేషనల్ లా యూనివర్సిటీ పూర్వ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై. సత్యనారాయణ, సిటిజెన్ ఫోర్స్ ఫౌండర్ డైరెక్టర్ పి. ఉమామహేశ్వరి, శ్రీ విశ్వ విద్యాసంస్థల చైర్మన్ కె. ధర్మరాజు, లెండి ఇంజనీరింగ్ కాలేజీ చైర్మన్ పి. మధుసూదన రావు, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కె. శివరామకృష్ణ, శ్రీ విశ్వ, లెండి విద్యార్థులు పాల్గొన్నారు.

## గ్యాస్ సరఫరాలో నిర్లక్ష్యం సహించం

**గాజువాక,మార్చి 31,ప్రభాతవార్త**



గ్యాస్ సరఫరాలో నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త, రాష్ట్ర సివిల్ సప్లై డైరెక్టర్ ప్రసాదుల శ్రీనివాస్ హెచ్చరించారు. గాజువాక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు.గ్యాస్ నిల్వలు ఉన్నప్పటికీ గృహిణులకు సకాలంలో అందించకుండా, పక్కదారుల్లో వ్యాపారులకు మళ్లిస్తున్నారనే ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. భారత ప్రభుత్వం మార్గదర్శకాల ప్రకారం హెచ్ పి , ఇండియన్, భారత్ గ్యాస్ ఏజెన్సీలు ప్రజలకు ఇబ్బందులు కలగకుండా వెంటనే సరఫరా చేయాలని ఆదేశించారు. గ్యాస్ ఇంటెలిజెన్స్, సివిల్ సప్లై విభాగాలు గోప్యంగా తనిఖీలు నిర్వహించి అక్రమాలను అరికట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో తమ్మిరే శివప్రసాద్, డి.వి. సత్యారావు, సింగూరు అనంతు, మూలకలపల్లి పెంటయ్య, వంగలపూడి అప్పలరాజు, షేక్ రెహమాన్, ఉరుకుటి అప్పలరాజు, నక్కా గంగరాజు సాయిరామ్ తదితరులు పాల్గొన్నారు.

## షీలానగర్‌లో నేడు అయ్యప్ప స్వామి జన్మోత్సవ వేడుకలు

**గాజువాక,మార్చి 31,ప్రభాతవార్త**



గాజువాక షీలానగర్ శ్రీ మణికంఠ జ్యోతి భక్త సేవా సంఘం ఆధ్వర్యంలో శ్రీ అయ్యప్ప స్వామి వారి 24వ సంవత్సర ఫంగుణి ఉత్తరంఖి (జన్మదినం) వేడుకలు బుధవారం అత్యంత వైభవంగా జరగనున్నాయి. మూడు రోజుల పాటు సాగుతున్న ఈ ఉత్సవాల్లో భాగంగా ఇప్పటికే సోమ, మంగళవారాల్లో విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు స్థానిక పాఠశాలల నుంచి విద్యార్థులు భారీగా తరలివచ్చారు. బుధవారం ఉదయం 10 గంటల నుంచి గవరజగ్గయ్యపాలెంకు చెందిన ఖిరోహిణి ప్రియ కూచిపూడి డాన్స్ అకాడమీఖి కళాకారులచే సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయి. అనంతరం మధ్యాహ్నం 12 గంటలకు స్వామివారి జన్మోత్సవ వేడుకలు నిర్వహించి, పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేస్తారు. మధ్యాహ్నం 12:30 గంటల నుంచి భక్తులకు అన్న సమారాధన ఏర్పాటు చేసినట్లు సంఘం ప్రతినిధులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

## చోడమాంబిక అమ్మవారిని దర్శించుకున్న మాజీ పార్లమెంటు సభ్యులు పప్పల చలపతిరావు



అచ్యుతాపురం మార్చి 31 ప్రభాతవార్త

అచ్యుతాపురం మండలం చోడపల్లి గ్రామంలో శ్రీ చోడమాంబిక అమ్మవారి పండుగ సందర్భంగా మాజీ పార్లమెంట్ సభ్యులు పప్పల చలపతిరావు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎలమంచిలి మార్కెట్ కమిటీ డైరెక్టర్ కూనిశెట్టి రమణ, సీనియర్ నాయకులు కర్రీ వెంకటరమణ, వడిసిల శ్రీనివాసరావు, కూంద్రపు వెంకునాయుడు, లాలం సత్తిబాబు, ధర్మిరెడ్డీ నాయుడుబాబు, అల్లు దేముడు, జనసేన నాయకులు వడిసెల నాయుడు, బిజెపి నాయకులు కుంద్రపు నాయుడు, సీరా చిరంజీవి ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## అచ్యుతాపురంలో ఉచిత పాలిటెక్నిక్ కోచింగ్

అచ్చుతాపురం,మార్చి 31, ప్రభాతవార్త

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాంకేతిక విద్యా మండలి ఆదేశాల మేరకు అచ్యుతాపురంలోని ప్రశాంతి పాలిటెక్నిక్ కళాశాలలో ఉచిత పాలిటెక్నిక్ కోచింగ్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు తెలిపారు. ఈ కోచింగ్ తరగతులు ఏప్రిల్ 3, 2026 (శుక్రవారం) నుండి ప్రారంభమవుతాయని ఆయన చెప్పారు. ప్రతి రోజు ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు తరగతులు నిర్వహించబడ తాయని పేర్కొన్నారు. పదవ తరగతి పరీక్షలు రాసిన ఆసక్తి గల విద్యార్థులు ఈ ఉచిత కోచింగ్‌కు హాజరుకావచ్చని తెలిపారు. కోచింగ్‌కు హాజరయ్యే అభ్యర్థులకు ప్రభుత్వం ద్వారా ఉచిత స్టడీ మెటీరియల్ కూడా అందించబడుతుందని చెప్పారు.

## అనారోగ్యంతో సర్పంచ్ లక్ష్మీకాంతం మృతి



అచ్చుతాపురం,మార్చి 31, ప్రభాతవార్త

అచ్చుతాపురం మండలం హరిపాలెం సర్పంచ్ మారిసెట్టి లక్ష్మీకాంతం (66) అనారోగ్య కారణంగా మృతి చెందారు. కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న లక్ష్మీ కాంతంనీ కిమ్స్ ఆసుపత్రిలో చేర్చుగా చికిత్స పొందుతూ ఆమె మంగళవారం తెల్లవారుజామున తుది శ్వాస విడిచారు. సర్పంచ్ లక్ష్మీకాంతం మృతితో పరిపాలనలో విషాదఛాయలు అలుముకున్నాయి. లక్ష్మీకాంతం మృతి పట్ల మండలంలో నీ ఇతర పార్టీ నాయకులు కార్యకర్తలు ఎంపీటీసీలు సర్పంచులు సంతాపం తెలిపారు.

## పదవీ విరమణ పొందిన పోలీస్ అధికారులకు ఘన వీడ్కోలు



అనకాపల్లి, మార్చి 31,ప్రభాతవార్త

పోలీసు శాఖలో దశాబ్దాల పాటు నిస్వార్థ సేవలు అందించి, క్రమశిక్షణతో కూడిన విధి నిర్వహణతో ఆదర్శంగా నిలిచిన ముగ్గురు అధికారులకు అనకాపల్లి జిల్లా పోలీసు శాఖ ఘనంగా వీడ్కోలు పలికింది. జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు, జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం ఆత్మీయ వీడ్కోలు సభ నిర్వహించారు. పదవీ విరమణ పొందిన వారిలో బి.మల్లికార్జున రావు (అదనపు ఎస్సై, దేవరపల్లి పి.ఎస్), పి.సత్యనారాయణ (ఏఆర్ఎస్ఐ), పి.వెంకటరావు (హెచ్.సీ, పరవాడ పి.ఎస్) ఉన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అదనపు ఎస్పీ ఎల్. మోహన రావు, పదవీ విరమణ పొందిన అధికారులను వారి కుటుంబ సభ్యులను శాలువాలతో సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు వృత్తి ఎంతో ఒత్తిడితో కూడు కున్నది. అటువంటి బాధ్యతాయుతమైన రంగంలో 42 ఏళ్లు (మల్లికార్జున రావు, సత్యనారాయణ), 35 ఏళ్ల (వెంకటరావు) పాటు నిబద్ధతతో పనిచేయడం సామాన్యమైన విషయం కాదన్నారు. ఉమ్మడి జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లలో వీరు అందించిన సేవలు శాఖకు గర్వకారణం అన్నారు. విశ్రాంత జీవితం కుటుంబ సభ్యుల తో కలిసి ఆరోగ్యంగా, ప్రశాంతంగా సాగాలని, విశ్రాంత జీవితంలో కూడా జిల్లా పోలీసు శాఖ ఎల్లప్పుడూ వారికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ వేడుకలో ఏ.ఓ. సి.హెచ్.తిలక్ బాబు, ఇన్స్పెక్టర్లు లక్ష్మి, మన్మథరావు, ఆఫీస్ సూపరింటెండెంట్లు దేవరాజు, ప్రతాప్ శేషయ్య, సీనియర్ అసిస్టెంట్ అప్పల రాజు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొని రిటైర్డ్ అధికారులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

## దొంగతనాలు పట్ల ప్రజలను అప్రమత్తం చేస్తున్న రూరల్ పోలీసులు

ఎలమంచిలి మార్చి 31, ప్రభాతవార్త



జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు సర్కిల్ ఇన్స్పెక్టర్ ధనుంజయ్ రావు రూరల్ ఎస్సై ఉపేంద్ర రూరల్ సిబ్బందికి రూరల్ గ్రామాలలో దొంగతనాలపై ప్రజలను అప్రమత్తంగా ఉండే విధంగా మైకుల్లోనూ గోడ పత్రికల ద్వారా ప్రచారం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా వేసవికాలంలో దొంగతనాలు ఎక్కువగా జరిగే అవకాశాలు ఉన్న నేపథ్యంలో ప్రజల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆటోపై ప్లెక్సీలు ఏర్పాటు చేసి మైకులలో గ్రామాల్లో ప్రచారం నిర్వహిస్తున్నారు. అనుమానస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీస్ స్టేషన్కు సమాచారం అందించారు సూచించారు. గ్రామాలలో ప్రధాన జంక్షన్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాల్సిందిగా గ్రామ పెద్దలకు సూచించారు. ఈ కార్యక్రమంలో రూరల్ పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## పోలీస్ శాఖకు 25 రోడ్డు స్టాపర్ అందజేసిన మైహోమ్ సిమెంట్ ఫ్యాక్టరీ

ఎలమంచిలి, మార్చి 31, ప్రభాతవార్త



మండలంలోని ములకలాపల్లి గ్రామంలో మైహోమ్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ (సిమెంట్ ఫ్యాక్టరీ) యాజమాన్యం సర్కిల్ ఇన్స్పెక్టర్ ధనుంజయ్ రావు,ఎస్. ఐ ఉపేంద్ర, నేషనల్ హైవే కూడలిలో జరుగుతున్న ప్రమాధములు నిర్మూలించాలనే ఉద్దేశ్యంతో రూ 1,50,000 ఖర్చుతో 25 రోడ్ స్టాపర్స్ సి.ఎస్.ఆర్ నందు భాగంగా పోలీస్ శాఖకు అందజేసిన ఫ్యాక్టరీ యూనిట్ హెడ్ బి.రామస్వామి.ఈ కార్యక్రమములో ఫ్యాక్టరీ యూనిట్ హెడ్ శ్రీ బి.రామస్వామి గారు, సీనియర్ డి.జి.ఎమ్ (పి.అండ్.ఎ) ఎల్.శ్రీనివాసరావు , సి.ఎస్.ఒ. డి. వెంకటరావు , రూరల్ పోలీస్ స్టేషన్ ఎస్.ఐ ఉపేంద్ర పాల్గొన్నారు.

## మామిడి, జీడి తోటల పెంపకంపై అవగాహన..

### పోలవరం జిల్లా ఉద్యానవన కేంద్రాన్ని సందర్శించిన రైతులు...

ఎలమంచిలి ,మార్చి 31, ప్రభాతవార్త:



పోలవరం జిల్లాలో ఎలమంచిలి రైతులకు అభ్యుదయ రైతులను శిక్షణ ట్రైనింగ్ కొరకు పోలవరం జిల్లాలో ఉద్యానవన కృషి విజ్ఞాన కేంద్రాన్ని సందర్శించారు. జిల్లా వ్యవసాయ అధికారి ఎం ఆశా దేవి జండా ఊపి రైతు రథాన్ని ప్రారంభించారు. అభ్యుదయ రైతులను ధ్యాన వన వర్సిటీలో తాటి పండ్లు నీరా గురించి శాస్త్రవేత్త ప్రవీణ్ తెలియజేశారు. మామిడి జీడి తోటలు పెంపకం గురించి అంతుపట్టు విధానం ఇంప్రూవ్డ్ వెరైటీలు గురించి పూర్తిగా విశ్లేషించారు. ఆయిల్ ఫామ్ తోటలో సత్య రక్షణ చర్యలు ఈ ప్రస్తుత కాలంలో కమర్షియల్ పంటలను దృష్టిలో పెట్టుకుని ఆయిల్ ఫామ్ పంటలను పండించాలని తద్వారా అధిక దిగుబడులు పొందాలని ప్రస్తుత మార్కెట్లో పామాయిల్ కు మంచి దిగుబడి ఉందని తెలియజేస్తూ ఆయిల్ ఫామ్ నర్సింలు సందర్శించి వాటి యొక్క రకములు అభ్యుదయ రైతులకు ఆసక్తిగా తిలకించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు మోహన్ రావు, సౌజన్య, శంకర్ గౌడ్ విస్తరణాధికారి దేవుడు, నారాయణరావు, రైతులు పాల్గొన్నారు.

## అచ్చుతాపురం మండలంలో ఘనంగా పలు గ్రామదేవతల పండుగ



అచ్చుతాపురం మార్చి 31, ప్రభాతవార్త

అచ్చుతాపురం మండలంలో పలు గ్రామాల్లో గ్రామదేవతల పండుగ వైభవంగా జరిగాయి. చోడపల్లి, మోసయ్యపేట, రామన్న పాలెం, అచ్చుతాపురం గ్రామాలలో చోడమాంబిక అమ్మవారి పండగ తంతడి రాజన్న పాలెం వాడపాలెం గ్రామాల్లో పైడితల్లమ్మ అమ్మవారి 13 రోజుల జాతర ఘనంగా జరిగింది. అలాగే చీమలపల్లి అప్పన్నపాలెం గ్రామంలో పారి పుల్లమ్మ అమ్మవారి పండగ అంగ రంగ వైభవంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లో తెల్లవారుజాము నుంచి భక్తుల భక్తులు దీప ధూప నైవేద్యాలతో గ్రామదేవతలు కుంకుమ పూజలు భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా క్యూలైన్ ఏర్పాటుచేసి మజ్జిగ, పులిహోర, చల్లని పానీయములు, అన్న ప్రసాదములు ఏర్పాటు చేశారు. పలు సంస్కృతి కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. అమ్మవారి దర్శనము కొరకు జిల్లాలో పలు పార్టీలు నాయకులు కార్యకర్తలు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## భక్తజనసంద్రం రేబాక..

### భక్తులతో నిండిపోయిన క్యూ లైన్లు -ఆచార, సంప్రదాయల మేరకు ఊయల సేవ -15వేలమందికి రమణయ్యపేట గ్రామస్తుల అన్నదానం

నక్కపల్లి, మార్చి31, ప్రభాతవార్త



మండలంలోని రేబాక గ్రామం గూడుపమ్మతల్లి జాతర సందర్భంగా సోమవారం నుంచి మంగళవారం సాయంత్రం వరకూ భక్తజనసంద్రంగా మారిపోయింది. సోమవారం ఈ గ్రామంలో జాతర ప్రారంభమైంది. మంగళవారం తెల్లవారుజాము నుంచి గూడుపమ్మ ఆలయంలో భక్తుల దర్శనాలు ప్రారంభమయ్యాయి. అనేక ప్రాంతాల నుంచి భక్తులు ఆలయానికి తరలివచ్చారు. ఆల యం బయట, లోపల వున్న క్యూ లైన్లన్నీ భక్తులతో నిండిపోయాయి. వేల సంఖ్యలో భక్తులు తరలి రావడంతో దర్శనానికి గంటన్నర నుంచి రెండు గంటల సమయం పట్టింది. మహిళలు అమ్మవారికి పసుపు, కుంకుమలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఉదయం గ్రామ ప్రధాన జంక్షన్లో ఉత్సవ ఆచార, సంప్రదాయల ప్రకారం ఊయల సేవ నిర్వహించారు. సుమారు 60 అడుగులకు పైగా పొడవైన స్తంభాల (చెట్ల)ను గ్రామస్తులంతా పైకి ఎత్తారు. ఊయల సేవ నిర్వ హించారు.





రేబాక గూడుపమ్మ ఆలయం వద్ద మధ్యాహ్నం సుమారు 15 వేల మంది భక్తులకు రమణయ్య పేట గ్రామస్తులు అన్నప్రసాదాలు పంపిణీ చేశారు. ఉత్సవాల్లో భాగంగా జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోట నగేశ్, జనసేన నియోజకవర్గం ఇన్చార్జి గెడ్డం బుజ్జి, మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు, వైసీపీ రాష్ట్ర కార్యదర్శి వీసం రామకృష్ణ. టీడీపీ నియోజకవర్గం కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేశ్, ఎస్ఐ సన్నిబాబు తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు. గ్రామ పెద్దలు, పూజార స్త్రీలు ఆధ్వర్యంలో ఈ సంవత్సరం ఘనమైన ఏర్పాట్లు చేపట్టారు. నక్కపల్లి మండలం సీతంపాలెం, చినదొడ్డిగల్లు గ్రామాల్లో కూడా మంగళవారం గూడుపమ్మతల్లి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. అన్నదానాలు నిర్వహించారు. అనేక మంది భక్తులు ఈ గ్రామాల్లో అమ్మవారిని దర్శించుకున్నారు.

## భర్త జైలు జీవితంపై మనస్థాపం చెంది భార్య బలవన్మరణం



అచ్చుతాపురం మార్చి 31 ప్రభాతవార్త

అచ్యుతాపురం మండల కేంద్రంలో వివాహిత ఉరివేసుకొని బలవన్మరణానికి పాల్పడిందని స్థానిక పోలీసులు తెలిపారు, పోలీసుల కథనం మేరకు కూరపాటి రజనీకుమారి (50) తన సొంత ఫ్లాట్లో ఉరి వేసుకొని మరణించిందని, తెలిపారు. ఏడు నెలల క్రితం మృతురాలి భర్త గోపాల్ రావు(54)సెజ్‌లో ఉన్న అవార్క్ డ్రగ్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో పనిచేస్తున్నప్పుడు (డిఆర్ఐ) నమోదు చేసిన ఎన్డిపిఎస్ కేసులో అరెస్టు అయ్యి విశాఖపట్నం జైల్లో శిక్ష అనుభవిస్తున్నాడు అని అన్నారు, మృతురాలు తన భర్తను విశాఖపట్నం కారాగారంలో కలిసి అనారోగ్యానికి సంబంధించిన మందులు ఇచ్చి తిరిగి అచ్చుతాపురం తన ఇంటికి చేరుకుంది, అలాగే తన భర్తను విడిపించాలంటూ తన కొడుకు ద్వారా లాయర్ తో మాట్లాడి పిటిషన్ దాఖలు చేయించారు, మృతురాలి కుమారుడు ఏలూరు జిల్లా చింతలపూడి పట్టణంలో మెడికల్ షాప్ నిర్వహిస్తున్నాడు, సోమవారం మృతురాలు కుమారుడు ఫోన్ చేయగా ఆమె లిఫ్ట్ చేయకపోవడంతో అపార్ట్మెంట్ సెక్యూరిటీ కి తన కుమారుడు ఫోన్ చేయగా తలుపులు తెరిచి చూడగా హాల్లోని సీలింగ్ ఫ్యాన్ కు తాడుతో ఉరి వేసుకుని మృతి చెందిందని తెలిపారు,ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ఒంటరిగా ఉన్న ఆమే భర్త జైలు జీవితం పై మనస్థానికి గురై ఆత్మహత్యకు పాల్పడి ఉంటుందని కుమారుడు కుటుంబ సభ్యులు పోలీసులకు తెలపడంతో బి/ం194 దీచీూా కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

## నేడు నక్కపల్లికి హోం మంత్రి అనిత రాక

(అడ్డరోడ్డు ప్రభాతవార్త)



రాష్ట్ర హోం శాఖ మంత్రివర్యులు వంగలపూడి అనిత బుధవారం ఉదయం నక్కపల్లి కి రానున్నట్లు టిడిపి పాయకరావుపేట నియోజకవర్గం కొప్పిశెట్టి వెంకటేష్ మంగళవారం ప్రకటనలో తెలిపారు . నక్కపల్లి శివారు అప్పల పాయకరావుపేట గ్రామంలో మంత్రి చేతుల మీదుగా పింఛన్లు పంపిణీ కార్యక్రమం జరగనున్నదని పేర్కొన్నారు. అనంతరం మండలంలోని పెద్ద బోదిగలంలో ఆర్ అండ్ ఆర్ కాలనీలో గృహాల ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రి పాల్గొంటారని కార్యక్రమాలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. మంత్రితోపాటు జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ హాజరవుతారని తెలిపారు.

## అనకాపల్లిలో నేడు చాగంటి ఆధ్యాత్మిక ప్రవచనాలు



అనకాపల్లి,మార్చి 26, ప్రభాతవార్త

ప్రముఖ ఆత్యాత్మిక వేత్త చాగంటి కోటేశ్వర రావు బుదవారం అనకాపల్లికి విచ్చేస్తున్నారు. ఉత్తరాంధ్ర ఇలవేల్పు నూకాంబిక అమ్మవారి కొత్త అమావాస్య నెల పండగ జాతర మహోత్సవాలలో బాగంగా ఇక్కడి మున్సిపల్ గ్రౌండ్‌లో బుదవారం రాత్రి ఆత్యాత్మిక ప్రవచనాలుగా విస్తారు. మాజీ మంత్రివర్యులు, శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ నేతృత్వంలో ప్రముఖ ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు ప్రవచనాల కార్యక్రమం సాయంత్రం 6 గంటలకు ప్రారంభం అవుతుంది. నూకాంబికా దేవస్తానం చైర్మెన్ పీలా నాగశ్రీను ఈ విషయం తెలిపారు.

## పలు దేవాలయాల్లో వైకాపా నాయకులు పూజలు







నక్కపల్లి రూరల్, ప్రభాతవార్త

మండలంలోని సీతంపాలెం, రేబాక ,చిన్నదొడ్డి గల్లు గ్రామాలలో గూడుపమ్మ తల్లి పండగ సందర్భంగా వైకాపా నాయకులు దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇదిలా ఉండగా చినదొడ్డి గల్లు ఆంజనేయ స్వామి పండగ సందర్భంగా స్వామివారి దర్శించుకుని పూజలు నిర్వహించారు. నిర్వాహకులు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. ఈ పండుగలు సందర్భంగా చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చారు. దర్శించుకున్న వారిలో మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు, రాష్ట్ర వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి, దక్షిణ నియోజకవర్గ ఇన్చార్జ్ వీసం రామకృష్ణ ,గొర్ల గోవిందు, గొర్ల నాగ అప్పలరాజు తదితరులు ఉన్నారు. రేబాకా సర్పంచ్ సాది రెడ్డి శ్రీను అమ్మవారు చిత్రపటాన్ని వారికి అందజేశారు.

## శత శాతం ఇంటి పన్నులు వసూలు చేసేందుకు కార్యదర్శులు పని చేయాలి

ఎస్.రాయవరం మార్చి 31, ప్రభాతవార్త

మండలంలోని గెడ్డపాలెం.ధర్మవరం అగ్రహారం, వమ్మవరం. తిమ్మాపురం.గోకులపాడు గ్రామాలలో జరుగుతున్న ఇంటి పన్నులు వసూలు ప్రక్రియలో డిప్యూటీ ఎంపిడిఓ బంగారు సత్యనారాయణ మంగళవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శత శాతం ఇంటి పన్నులు వసూలు చేసేందుకు మండలంలోని ప్రతి పంచాయతీ కార్యదర్శి పనిచేయాలని.. తద్వారా పంచాయతీలకు ఆదాయ వనరులు అందుబాటులోకి వస్తాయని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శిలు ప్రసాద్ శివాగణేష్.ఝాన్సీ రాణి.వమ్మవరం మాజీ ఎంపీటీసీ పల్లెల జగ్గారావు,గ్రామస్తులు పాల్గొన్నారు.






## సత్యను సత్కరించిన నాయకులు

నక్కపల్లి ప్రభాతవార్త



పి- ఫోర్ కార్యక్రమంలో భాగంగా పలు కుటుంబాలకు ఆదర్శంగా నిలిచేందుకు ముందుకు వచ్చిన ప్రముఖ వ్యాపారవేత్త సత్యను పి ఫోర్ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో టిడిపి పాయక రావుపేట నియోజకవర్గ కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్ నాయకత్వంలో అధికారుల తోపాటు రాష్ట్ర సివిల్ సప్లై కార్పొరేషన్ డైరెక్టర్ బోడపాటి శివ దత్తు, మండల పార్టీ అధ్యక్షులు గింజల లక్ష్మణరావు, చించెలుపు పద్దు తదితరులు ఘనంగా సత్కరించారు .ఇది ఇలా ఉండగా అడ్డరోడ్డుకు చెందిన కొరుప్రోలు పిఏసిఎస్ అధ్యక్షులు గుర్రం రామకృష్ణను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో న్యాయం పూడి పాఠశాలకు చెందిన విద్యార్థులు రచించిన గీతం పలువురిని ఆకట్టుకుంది. సర్పంచ్ రెడ్డి వరహాలు బాబు వారిని అభినందించారు.



## మత్స్యకారుల సమస్యలను పరిష్కరించండి : సిపిఎం

అచ్చుతాపురం మార్చి 31 ప్రభాతవార్త



అచ్చుతాపురం మండలం పూడిమడక గ్రామంలో సమస్యల పరిష్కారానికై ఏప్రిల్ 2 అనకాపల్లి కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాలో పూడిమడక గ్రామ మత్స్యకారులు పాల్గొని జయప్రదం చేయాలని పూడి మడక గ్రామంలో సిపిఎం పర్యటించడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం పూడిమడక శాఖ కార్యదర్శి చేపల తాతయ్య మాట్లాడుతూ గ్రామంలో కొత్త పడవలకు రిజిస్ట్రేషన్ చేయాలని అధికారులు చుట్టూ తిరుగుతున్న బోటు రిజిస్ట్రేషన్ చేయడం లేదని దీనివలన వేట నిషేధ కాలంలో ఈ ఏడాది మత్యకారులకు మత్స్యకార భరోసా నష్టపోతారని వెంటనే బోట్లు రిజిస్ట్రేషన్ చేయాలని, జెట్టి నిర్మాణం చేపట్టాలని, ఏపీఐఐసీ పెండింగ్ ప్యాకేజీ లు లక్ష ఇరవై ఐదు వేలు ఇవ్వాలని, కాలుష్యం వలన సముద్రంలోకి పరిశ్రమ వ్యర్థాలు కలవడం వలన మత్స్య సంపద తగ్గిపోయి చేపలు చనిపోతున్నాయని దీంతో ఉపాధి లేక మత్స్యకారులు నానా ఇబ్బందులు పడుతున్నారని స్థానిక పరిశ్రమలలో పూడిమడక యువత, ప్రజలకు ఉపాధి కల్పనకు చర్యలు తీసుకోవాలని అర్హులైన మత్స్యకారులకు పింఛన్లు ,రేషన్ కార్డులు ఇవ్వాలని ,గ్రామంలో వీధిలైట్లు వెలగక రాత్రులు వృద్ధులు, పిల్లలు ఇబ్బందులు పడుతున్నారని వెంటనే వీధిలైట్లు వేయాలని, మత్స్యకారులకు సబ్సిడీపై ఇంజన్లు ,వలలు, గంపలు, ఐస్ బాక్సులు పంపిణీ చేయాలని, ఇంటింటా కొళాయిలను వేసిన నీరు సక్రమంగా సరఫరా సక్రమంగా రాక మంచినీటికి ఇబ్బందులు పడుతున్నారని పై సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో మత్స్యకారులు సిపిఎం కన్వీనర్ ఆర్ రాము, మండల కమిటీ సభ్యులు కే సోమనాయుడు, మత్స్యకారులు గంగేరి అప్పలరాజు, గనగల అమ్మోరయ్య, కనగాల అప్పన్న ,నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

## అమరావతిపై అవగాహన లేని బొత్స

### మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీష్



అనకాపల్లి మార్చి 31,ప్రభాతవార్త

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిపై వైసీపీ రాష్ట్ర అధ్యక్షులు జగన్ రెడ్డి ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి మండల ప్రతిపక్ష నాయకుడు బొత్స సత్యనారాయణ ప్రతిపక్ష పార్టీగా తమ వైఖరి ఒక్కొక్కరు ఒక్కొక్క విధంగా అవగాహన రాహిత్యంతో మాట్లాడుతున్నారని వైసిపి వైఖరి అమరావతిపై ఏమిటి అన్న విషయంపై రాష్ట్ర ప్రజలకు సమాధానం చెప్పాలని మాజీ శాసనమండలి సభ్యులు బుద్ధ నాగ జగదీశ్వరరావు జగన్ రెడ్డిని డిమాండ్ చేశారు. మంగళవారం తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ శాసనమండలి ప్రతిపక్ష నేతైన బొత్స సత్యనారాయణకి తీర్మానానికి బిల్లుకు కనీసం అవగాహన లేకుండా శాసనసభ్యులుగా పనిచేసిన సుదీర్ఘ అనుభవం ఉన్న బొత్స సత్యనారాయణ అమరావతికి చట్టబద్ధత లేదని, తీర్మానం పనికిరాదని ఆవాకులు చవాకులు మతిభ్రమించిన మాటలు మాట్లాడుతున్నారని నాగ జగదీశ్ ఎద్దేవా చేశారు. రాజధాని విషయంలో భవిష్యత్తులో ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దాన్ని మార్చుకోకుండా కొనసాగించే చట్ట సవరణకు అవకాశం కేంద్రం ప్రధాని పీఎంఓ ఆఫీస్ రాష్ట్రానికి లేఖ రాసిందని దాని ప్రకారమే శాసనసభలో తీర్మానం చేయడం జరిగిందని, ఈ ఒక్క విషయం కూడా వైసీపీకి తెలియకపోవడం వింతగా ఉందని, ఇంకా రాష్ట్రాన్ని భవిష్యత్తు లేకుండా చేయాలనే కుట్ర చేస్తున్నారని ఆరోపించారు.

## సేవలకు గుర్తింపుగా లుపిన్ కంపెనీకి అవార్డు

అగనంపూడి,ప్రభాతవార్త



అగనంపూడి ఏరియా హాస్పిటల్‌లో లుపిన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రోగులకు ఉపయోగపడే విధంగా మౌలిక వసతులు కల్పించారు. పేషెంట్స్ వేచి ఉండే విధంగా షెడ్లో వేయడం, థియేటర్లకు పరికరాలు, అత్యవసరమైన విభాగాలకు పరికరాలు అందించారు. దీన్ని గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం, ఆరోగ్యం మౌలిక వసంతుల అభివృద్ధి కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పి ఫోర్ షాప్ ఫౌండేషన్, ఎస్ఎపిఎఫ్ సంయుక్తంగా గుర్తించి, లుప్పిన్ కంపెనీ హెడ్ పిఒస్ విక్టర్‌కు జిల్లా ఇన్చార్జి మంత్రి బాల వీరాంజనేయులు, గంటా శ్రీనివాసరావు చేతుల మీదుగా అవార్డు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హరేంద్ర ప్రసాద్, జీవీఎంసీ కమిషనర్ కేతన్కర్ తదితరులు పాల్గొన్నారు.

## వైఎస్ జగన్మోహన్ రెడ్డిని కలిసిన శేషారత్నం



నక్కపల్లి, ప్రభాతవార్త

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డిని మంగళవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో నక్కపల్లి మాజీ ఎంపీటీసీ, జిల్లా మహిళ నాయకురాలు జనపరెడ్డి శేషారత్నం తన కుమార్తె శ్రావణితో కలిసి మర్యాదపూర్వకంగా కలిశారు. ఆ సందర్భంగా జగన్మోహన్ రెడ్డి శేషారత్నం అక్క బాగున్నావా.. అంటూ పలకరించి భవిష్యత్తు మనదే పార్టీ కోసం కష్టపడి పని చేయండి అని ధైర్యం చెప్పారు. నేను మీకు అండగా ఉన్నంత సేపు ఏమి పరవాలేదని పార్టీని ముందుకు నడిపించమని శేషారత్నం సూచించారు. శేషారత్నం విలేకరులతో మాట్లాడుతూ మా నాయకుడు జగన్ మోహన్ రెడ్డి ని కలవడం మరిచిపోలేని రోజు అని సంతోషం వ్యక్తం చేశారు.

## వాహనాలు తనిఖీ చేసిన కసింకోట పోలీసులు

కసింకోట, మార్చి 31, ప్రభాతవార్త



కసింకోట పోలీస్ స్టేషన్ పరిధిలో, సిఐ అల్లు స్వామి నాయుడు ఆదేశాల మేరకు కసింకోట మండలం జాతీయ రహదారిపై తరచుగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను దృష్టిలో ఉంచుకొని మంగళవారం ఎస్ఐ మనోజ్ కుమార్ సిబ్బందితో ప్రత్యేక వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో ఎస్సై మనోజ్ కుమార్, సిబ్బంది పాల్గొని, రాంగ్ పార్కింగ్, రాంగ్ రూట్‌లో వాహనాలు నడపడం, సీట్ బెల్ట్ లేకుండా డ్రైవింగ్ చేయడం, హెల్మెట్ లేకుండా వాహనాలు నడపడం వంటి ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలకు పాల్పడిన వాహనదారులపై భారీ జరిమానాలు విధించారు. అలాగే వాహనదారులకు ట్రాఫిక్ నియమాలు తప్పనిసరిగా పాటించాలని, భద్రతతో వాహనాలు నడపాలని వాహన డ్రైవర్లకు అవగాహన కల్పించారు.

## పునః ప్రారంభమైన ఇంధన విక్రయాలు



గూడెం కొత్తవీధి,మార్చి 31, ప్రభాతవార్త

మండల కేంద్రంలో గిరిజన సహకార సంస్థ (జి.సి.సి) ఐ.టీ.డీ.ఏ నిర్వహిస్తున్న హెచ్.పి పెట్రోల్ బంక్‌లు గత ఐదు రోజులుగా ఇంధనం లేక విక్రయాలు నిలిచిపోయాయి. ఈ ఐదు రోజులుగా ఇంధనం లేక వాహనదారులు ఇబ్బందులకు గురి కావడంతో అధికారులు హెచ్.పి సంస్థకు ముందస్తుగా నిధులు చెల్లించి ఇంధనాన్ని సరఫరా చేయించారు. దీంతో మంగళవారం నుండి తిరిగి పెట్రోల్,డీజిల్ విక్రయాలను ప్రారంభించినట్లుగా బంక్ సూపర్వైజర్ శ్రీనివాసరావు తెలిపారు.

## 'మన ఊరు - మన జెండా' 6న బీజేపీ ఆవిర్భావ దినోత్సవం

గూడెం కొత్తవీధి, మార్చి 31, ప్రభాతవార్త



గూడెం కొత్తవీధి మండలం రాష్ట్ర అధ్యక్షులు పి.వి.ఎన్ మాధవ్, జిల్లా అధ్యక్షులు మఠం శాంత కుమారి ఆదేశాల మేరకు ఏప్రిల్ 6వ తేదీన పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రతి బిజెపి కార్యకర్త ఇంటిపైన లేదా పంచాయతీ పరిధిలో మరియు మండల కేంద్రంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవం నాడు భారతీయ జనతా పార్టీ జెండా ఎగరవేయాలని బిజెపి మండల అధ్యక్షుడు కాకురు శేఖర్, ఎం.రామ్‌కిరణ్ కుమార్ పిలుపు నిచ్చారు. పార్టీ ఆవిర్భావం నుంచి ఇప్పటివరకు ఎంతోమంది కార్యకర్తల నాయకుల కృషి వల్లనే ప్రతి పట్టణంలో పల్లెల్లో దేశ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రవేశపెట్టిన పథకాలన్నీ అందుతున్నాయని తెలియజేశారు. మన ఊరు మన జెండా ఈ కార్యక్రమాన్ని అందరూ భాగస్వామ్యం చేయాలని పిలుపునిచ్చారు.

## ఆరోగ్యంపై అవగాహన



గూడెం కొత్తవీధి మార్చి 31, ప్రభాతవార్త

గూడెం కొత్తవీధి మండలం, సంకాడ పంచాయతీ గ్రామ సచివాలయంలో మంగళ వారం కేంద్ర ప్రభుత్వం వారి ఆధ్వర్యంలో వి.హెచ్.ఎస్.ఎన్.సి (విలేజ్ హెల్త్ శానిటేషన్ అండ్ న్యూట్రిషన్ కమిటీ) ఆరోగ్య అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలకు ఆరోగ్య పరిరక్షణ, శుభ్రత, పోషకాహారం మరియు ప్రభుత్వ ఆరోగ్య సేవలపై అవగాహన కల్పించారు. గ్రామ స్థాయిలో ఆరోగ్యాభివృద్ధికి వి.హెచ్.ఎస్.ఎన్.సి కమిటీలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంకాడ జనసేన పార్టీ అధ్యక్షులు ఊలం ఈశ్వర్‌రావు, పిసా అధ్యక్షులు లోచల భీమరాజు, వి.హెచ్.ఎస్.ఎన్.సి స్పెషల్ ఆఫీసర్ తేజ, సర్పంచ్ దేశగిరి నాగులమ్మ, ఎం.ఎల్.హెచ్.పి సిబ్బంది, ఆశ వర్కర్లు మరియు వార్డ్ మెంబర్లు పాల్గొన్నారు.

## రెవెన్యూ అంశాలపై సత్వర పరిష్కారం- అలసత్వం వహిస్తే కఠిన చర్యలు

పాడేరు, మార్చి31, ప్రభాతవార్త



జిల్లాలో రెవెన్యూ సంబంధించిన అంశాలపై సత్వరమే చర్యలు తీసుకోవాలని, గ్రామ స్థాయిలో రెవెన్యూ సమస్యల పరిష్కా రంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించా లని, విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఇంచార్జి జాయింట్ కలె క్టర్ తిరుమని శ్రీపూజ రెవెన్యూ అధికారులకు, సిబ్బందికి హెచ్చరించారు. మంగళవారం కలెక్టర్ట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి అల్లూరి జిల్లాలోని రెవెన్యూ అధికారులతో ఆమే రెవెన్యూ సమస్యలు, పిజిఆర్ఎస్, ఐవిఆర్ఎస్ కాల్స్, కెవైసి, కే సర్టిఫికెట్స్, రేషన్ పంపిణీ, పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ, స్మార్ట్ కార్డ్స్ పంపిణీ పై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సామీక్ష సమావేశంలో జాయింట్ కలెక్టర్(ఇంచార్జి) శ్రీపూజ మాట్లాడుతూ అవగాహన సదస్సులు గ్రామ స్థాయిలో రెవెన్యూ సమ స్యలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేకసదస్సులు నిర్వహించాలన్నారు. ఇచ్చిన ఫిర్యాదును క్షున్నగా పరిశీలించి, ఫిర్యాదును దారునితో చర్చించి వారి సమస్యకు పరిష్కార మార్గం చూపాలన్నారు. పరిష్కారం అనంతరం ఐ విఆర్ఎస్ కాల్స్ పై రెవెన్యూ సదస్సులు ద్వారా గ్రామస్తులకు అవగాహన కల్పించాల న్నారు. పీజీఆర్ఎస్ ద్వారా వచ్చే ఫిర్యాదులపై పూర్తి అవగాహనతో అధికారులు ఉండాలని, ఫిర్యాదును అత్యంత శ్రద్ధ వహించి సమస్యల పరిష్కారం జరిగే విధంగా వేగవంతం చేయాలన్నారు. రీ సర్వే, న్యూటేషన్స్ ఫైల్స్ వివిధ స్థాయిల్లో పెండింగ్ లో ఉన్న పిటిషన్ వెంటనే క్షేత్ర స్థాయిలో పరిశీలించి సమస్యలను పరిష్కరించాలని,అలాగే పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి తక్షణమే పరిష్కరించాలని పేర్కొన్నారు. పూర్తిగా పరిశీలించి వచ్చిన రాజముద్ర పట్టాదార్ పాస్ పుస్తకాలను ఎటువంటి సవరణలు,లోపాలు లేకుండా చూసుకొని కార్యాలయంలో నిల్వ ఉంచుకోకుండా ఎప్పటికప్పుడు పట్టాదారులకు పంపిణీ ప్రక్రియను చేపట్టాలని ఆదేశించారు. తహశీల్దార్, విఆర్ఓ లాగిన్‌లో ఉన్న పెండింగ్లో అప్లికేషన్లు వెంటనే ఎప్పటికప్పుడు పరిశీలించి, తదుపరి స్థాయాధికారులకు పంపించాలని సూచించారు. అలాగా లేనియెడల అప్లికేషన్లు పెండింగ్లో పెట్టుకుని ఉన్న వారిపై చర్యలు ఉంటాయని తెలిపారు. ఇంచార్జి ఆర్డీవో ఎంవీఎస్ లోకేశ్వరరావు, కలెక్టరేట్ పరిపాలన అధికారి ప్రసాదరావు,జిల్లా పౌరసరి పరాల అధికారి , వివిధ మండలాల తహశీల్దార్లు, డిప్యూటీ తాసిల్దార్, వీఆర్వోలు,రెవెన్యూ సిబ్బంది, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## సహకార చట్టాలపై అవగాహనతోనే పారదర్శక సేవలు : డీసీఓ ఎం.వి.రామకృష్ణం రాజు



పాడేరు,మార్చి,31,ప్రభాతవార్త

సహకార సంఘాల బలోపేతానికి, పారదర్శక పాలనకు సహకార చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా సహకార అధికారి ఎం.వి. రామకృష్ణం రాజు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ కోఆపరేటివ్ యూనియన్ సారథ్యంలో, రామదాసు సహకార శిక్షణా కేంద్రం పరిధిలోని అల్లూరి సీతారామరాజు జిల్లా సహకార శాఖ సిబ్బందికి, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల సీఈఓలకు మరియు గిరిజన కోఆపరేటివ్ సహకార సంస్థల సిబ్బందికి మంగళవారం ఉదయం ఉదయం ఐటీడీఏ పరిధిలో గల కోపరేటివ్ కార్యాలయంలో స్వల్పకాలిక శిక్షణా కార్యక్రమన్ని రామదాసు కోఆపరేటివ్ సమస్త ప్రిన్సిపల్ డి శ్రీనివాసరావు నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమంలోని ముఖ్యాంశాలను బీడీపీసీ, సహకార సంఘాల ఆడిట్ పై ఈ శిక్షణా కార్యక్రమంలో నిర్వహించారు. విధులు, బాధ్యతలు,ప్యాక్స్ సీఈఓలు మరియు విభాగాధిపతులు చట్టపరమైన నిబంధనలను పాటిస్తూ రైతులకు, సంఘ సభ్యులకు మెరుగైన సేవలు ఎలా అందించాలో ఈ కార్యక్రమం ద్వారా వివరించారు. సమస్యల పరిష్కారం, సహకార సంఘాల నిర్వహణలో ఎదురయ్యే సాంకేతిక మరియు చట్టపరమైన ఇబ్బందులను చట్ట పరిధిలో ఎలా పరిష్కరించుకోవాలో ఈ శిక్షణ ద్వారా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ రిజిస్ట్రర్లు పి. కృష్ణ, పి సుబ్బారావు, లావణ్య, మరియు జిల్లాలోని వివిధ మండలాల నుండి వచ్చిన సహకార శాఖ సిబ్బంది, ప్యాక్స్ సీఈఓలు, జిపిసిఎంఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

## అమ్మవారి భక్తులకు అన్నసమారాధన

పాడేరు,మార్చి31,ప్రభాతవార్త



గిరిజన ఆరాధ్య దైవం పాడేరు శ్రీమోదకొండమ్మ అమ్మ వారి సన్నిధిలో ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వర రాజు ఆదేశాల మేరకు మంగళవారం మాజీ జిల్లా పరిషత్ చైర్ పర్సన్ వంజంగి కాంతమ్మ, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్న సమారాధన కార్యక్రమం నిర్వహిం చారు. అమ్మవారిని దర్శించుకున్న భక్తులు అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. జరిగినది ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కిల్లు కోటిబాబు,సభ్యులురామకృష్ణ, బోనంగి వెంకటరమణ, కిల్లు చంద్రమోహన్ కుమార్, గూడెపు సూర్య ప్రకాష్, కూర రాము, లకే రత్న బాయ,పలాసి రమణమ్మ మరియు కిల్లు శ్రావణ్ కుమార్ నాగమణి దంపతులు పాల్గొన్నారు.

## మనస్థాపానికి గురై వ్యక్తి ఆత్మహత్య...

ఎలమంచిలి, మార్చి 31, ప్రభాతవార్త



పట్టణంలో ద్వారకా నగర్‌లో నివాసం ఉంటున్న ఒక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు పట్టణ ఎస్ఐ సావిత్రి తెలిపారు. ఎస్ఐ సావిత్రి తెలిపిన వివరాలు ప్రకారం పట్టణంలోని ద్వారకా నగర్‌లోని నివాసముంటున్న తెరపల్లి నూకరాజు (43) మంగళవారం మధ్యాహ్నం సమయంలో ఇంటిలో ఉరి వేసుకుని ఉండగా అతని భార్య కు వచ్చిన సమాచారం మేరకు ఇంటికి వెళ్లి చూడగా ఉరి వేసుకున్న నూకరాజును ఎలమంచిలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారని ఈ మేరకు మృతిని భార్య ఇచ్చిన ఫిర్యాదు పై కేసు నమోదు చేస్తున్నట్లు పట్టణ ఎస్సై సావిత్రి తెలిపారు. ఉరి వేసుకోవడానికి కారణం మృతుని కుమారుడికి ఆరోగ్య పరిస్థితి బాగో లేకపోవడంతో ఎలమంచిలి ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించగా సోమవారం రాత్రి ఆసుపత్రిలో సెల్ఫోన్ కనిపించకపోవడంతో ఆసుపత్రిలో వెతకగా అక్కడ వారు ఇతనిపై కోపపడినట్లు ఈ ఘటన కారణంగా మనస్థాపానికి ఇప్పుడే మృతుడు నూకరాజు తన తమ్ముడికి ఫోన్ చేసి ఆత్మహత్య చేసుకోవాలని ఉద్దేశాన్ని వ్యక్తం చేసినట్లు అతన్ని తమ్ముడు ని భార్యకు సమాచారం ఇచ్చారని అందుకని భార్య ఇచ్చిన సమాచారంపై పూర్తి స్థాయిలో దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## సహకార చట్టాలపై అవగాహనతోనే పారదర్శక సేవలు

### -డీసీఓ ఎం.వి. రామకృష్ణం రాజు



పాడేరు,మార్చి,31,ప్రభాతవార్త

సహకార సంఘాల బలోపేతానికి, పారదర్శక పాలనకు సహకార చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా సహకార అధికారి ఎం.వి. రామకృష్ణం రాజు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ కోఆపరేటివ్ యూనియన్ సారథ్యంలో, రామదాసు సహకార శిక్షణా కేంద్రం పరిధిలోని అల్లూరి సీతారామరాజు జిల్లా సహకార శాఖ సిబ్బందికి, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల సీఈఓలకు మరియు గిరిజన కోఆపరేటివ్ సహకార సంస్థల సిబ్బందికి మంగళవారం ఉదయం ఉదయం ఐటీడీఏ పరిధిలో గల కోపరేటివ్ కార్యాలయంలో స్వల్పకాలిక శిక్షణా కార్యక్రమన్ని రామదాసు కోఆపరేటివ్ సమస్త ప్రిన్సిపల్ డి శ్రీనివాసరావు నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమంలోని ముఖ్యాంశాలను బీడీపీసీ, సహకార సంఘాల ఆడిట్ పై ఈ శిక్షణా కార్యక్రమంలో నిర్వహించారు. విధులు, బాధ్యతలు, ప్యాక్స్ సీఈఓలు మరియు విభాగాధిపతులు చట్టపరమైన నిబంధనలను పాటిస్తూ రైతులకు, సంఘ సభ్యులకు మెరుగైన సేవలు ఎలా అందించాలో ఈ కార్యక్రమం ద్వారా వివరించారు. సమస్యల పరిష్కారం, సహకార సంఘాల నిర్వహణలో ఎదురయ్యే సాంకేతిక మరియు చట్టపరమైన ఇబ్బందులను చట్ట పరిధిలో ఎలా పరిష్కరించుకోవాలో ఈ శిక్షణ ద్వారా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ రిజిస్ట్రర్లు పి.కృష్ణ, పి సుబ్బారావు, లావణ్య, మరియు జిల్లాలోని వివిధ మండలాల నుండి వచ్చిన సహకార శాఖ సిబ్బంది, ప్యాక్స్ సీఈఓలు, జిపిసిఎంఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

## రూప రిసార్ట్స్ యాజమాన్యంపై తక్షణమే చర్యలు తీసుకోవాలి

### సీఆర్పీఎఫ్ స్టేట్ కో- కన్వీనర్ కాంగు శుభ



పాడేరు,మార్చి 31,ప్రభాతవార్త:

కొన్ని నెలల క్రితం అరకు ప్రధాన కేంద్రంలోని రూపా రిసార్ట్‌లో పనిచేసే కొంతమంది గిరిజన యువకులతో రిసార్ట్స్ యాజమాన్యం గంజాయి రవాణా చేయించగా ఆ యువకులు గంజాయితో విజయవాడలో పట్టుబడగా, వారి మీద కేసులు నమోదు అయ్యాయని సీఆర్పీఎఫ్ స్టేట్ కో- కన్వీనర్ కాంగు.శుభ పేర్కొన్నారు. స్థానిక బాలల పరిరక్షణ వేదిక కార్యాలయంలో రాష్ట్ర కో-కన్వీనర్ కాంగు.శుభ స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఈ ఘటనపై స్పందించిన బాలల పరిరక్షణ వేదిక సభ్యులు ఆనాడు అరకు పరిసర ప్రాంతాల్లోని రూపా రిసార్ట్స్‌ను సందర్శించి, అక్కడి పరిస్థితులను పరిశీలించినట్లు ఆమె చెప్పారు. గిరిజన యువకులతో అక్రమ కార్యకలాపాలు చేయించిన యాజమాన్యం మీద కేసు నమోదు చేసి, రిసార్ట్స్‌ను సీజ్ చేయాలని శుభ డిమాండ్ చేశారు. ఈ విషయంపై సంబంధిత అధికారులకు అప్పట్లో ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఆమె విమర్శించారు. తాజాగా జిల్లా కలెక్టర్ మరియు ఐటిడిఏ పీఓకు ఫిర్యాదు చేయగా, తక్షణ చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు ఆమె అన్నారు. అయితే ఏజెన్సీ ప్రాంతాల్లో కొంతమంది గిరిజనులకు చిన్న మొత్తంలో డబ్బు ఆశ చూపించి, వారి పేర్లపై రిసార్ట్స్ నిర్వహిస్తూ కోట్ల రూపాయల వ్యాపారం చేస్తున్నారని ఆరోపించారు. ఈ రిసార్ట్స్ వెనుక అక్రమ కార్యకలాపాలు జరుగుతున్నాయని ఆమె ఆరోపించారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించకపోతే, గిరిజనులతో కలిసి గ్రామ స్థాయిలో ఆందోళనలు చేపట్టి, కార్యాలయాలను ముట్టడి చేస్తామని రాష్ట్ర కో-కన్వీనర్ కాంగు.శుభ హెచ్చరించారు.

## చెడు వ్యసనాలకు బానిస కావద్దు - భవిష్యత్‌ను పాడు చేసుకోవద్దు

అరకులోయ, మార్చి 31, ప్రభాత వార్త



గంజాయి, నాటు సారా వంటి చెడు వ్యసనాలకు లోను కావద్దని, బంగారు భవిష్యత్తును పాడు చేసు కోవద్దని మానవ హక్కుల నేర నిరోధక సంఘం రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు కమిడి కృష్ణకుమారి అవగాహన పరిచారు. మంగళవారం మండలంలోని పద్మాపురం మేజర్ పంచాయతీ పరిధిలోని, యండపల్లివలస గ్రామంలో కృష్ణకుమారి కాలనీ వాసులతో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గంజాయి రవాణా, సాగు చేయడం వంటివి చేయకూడదని, నాటు సారాకు ఎవరు బానిస కాకూడదని, ముఖ్యంగా యువత తమ బంగారు భవిష్యత్తును పాడు చేసుకోవద్దని హితవు పలికారు. తల్లిదండ్రులు తమ పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ఉన్నత చదువులు చదివించాలని కోరారు. అదేవిధంగా మైనర్ యువకులను పనులకు పంపించవద్దని విజ్ఞప్తి చేశారు. యువత క్రమశిక్షణతో నడుచుకొని ఉన్న ఊరుకు, దేశానికి తల్లిదండ్రులకు మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో యండపల్లివలస గ్రామస్తులు పాల్గొన్నారు.

## గిరిజన ఉద్యోగుల సంఘం అరకు వ్యాలీ మండల కార్యవర్గ ఎన్నికలు ఏకగ్రీవం

పాడేరు,మార్చి31,ప్రభాతవార్త:



అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం అరకు మండల నూతన కార్యవర్గం ఎన్నికలు జిల్లా అధ్యక్షులు మసాడా ఈశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎన్నిక అధికారిగా కిల్లు రామూర్తి నాయుడు వ్యవహరించి ఎన్నికలు నిర్వహిం చారు. ఈ ఎన్నికలలో అరకు మండల అధ్యక్షులు గా పెటేలి ఆనందరావు, ప్రధాన కార్యదర్శిగా డి.త్రినాథరావును ఎన్నుకన్నారు. ఈ ఎన్నికల ప్రక్రియలో జిల్లా కార్యవర్గ సభ్యులు జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ మఠం వెంకట రమణ,కోశాధికారి వలసనైని కొండలరావు, జిల్లా ఉపాధ్యక్షులు నందోలి మహేష్, జిల్లా జాయింట్ కార్యదర్శి జన్ని సింహాచలం జిల్లా ఉపాధ్యక్షులు పాంగి నందో, ఎపిటిఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ధనర్జయ్, ఎన్.టీ.ఎ జిల్లా ప్రధాన కార్యదర్శి పౌల్,యూటీఎఫ్ నాయకులు చిట్టిబాబు,ఉద్యోగ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## అంగన్వాడి సమస్యల పరిష్కారం కోరుతూ నిరసన

పాడేరు,మార్చి31,ప్రభాతవార్త:



అంగన్వాడి సమస్యల పరిష్కారం చేయాలని కోరుతూ పాడేరు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ ఆఫీసు వద్ద నిరసన మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి అంగన్వాడీ హెల్పర్సన్ మరియు వర్కర్స్ యూనియన్ సిఐటియు కార్యదర్శి వి.భాగ్యలక్ష్మి,జిల్లా సహాయ కార్యదర్శి చిన్నారి, సిఐటియు జిల్లా సహకార దర్శి లింగేరి సుందర రావు మాట్లాడుతూ అంగన్వాడి కార్మికులకు కనీస వేతనం( పెరుగుతున్న ధరలు కనుగుణంగా ) 26,000 చెల్లించాలని, మే నెల మొత్తం వేసవి సెలవులు ఇవ్వాలని, గ్రాడ్యుయేటెడ్ గైడ్లెన్స్ ఇవ్వాలని, వేతనంతో కూడిన మెడికల్ నువ్వు సౌకర్యం కల్పించాలని, 1810 మినీ సెంటర్లు మెయిన్ సెంటర్లుగా అప్డేట్ చేయాలని చెప్పి, 50% ప్రమోషన్ ఇవ్వాలనేది రద్దు చేయాలని వారు డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో పాడేరు ప్రాజెక్టు అంగన్వాడి కార్యకర్తలు దేవి ఇంద్ర, ఛాయాదేవి, శ్రీదేవి, అధిక సంఖ్యలో ఆయాలో మినీ మేన్ టీచర్లు పాల్గొన్నారు.అనంతరం వినతి పత్రం అందజేసారు.

## గిరిజనుల తొలి పండగ 'ఇటుకల పండగ' కుమ్మరపల్లిలో వెల్లివిరిసిన ఉత్సాహం



గూడెం కొత్తవీధి మార్చి 31, ప్రభాతవార్త

మండలంలోని సంకడ పంచాయతీ పరిధిలోని కుమ్మరపెల్లి గ్రామంలో ఇటుకల పండగను గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. గ్రామస్తుల ఆహ్వానం మేరకు పలువురు నాయకులు, ప్రముఖులు ఈ పండగకు హాజరై వేడుకల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకుడు ఊలం ఈశ్వర్ రావు పాల్గొని గ్రామస్తులతో కలిసి పండగను ఆనందంగా జరుపుకున్నారు.అలాగే గ్రామ పెద్దలు వంతల గురు, వంతల బుజ్జిబాబు, కొర్ర చిన్నయ్య, కొర్ర పరమేశ్వరరావు,వంతల రామారావు, పాంగి చిరంజీవి, వంతల బాలకృష్ణ, వంతల బాలయ్య, కొర్ర సుబ్బారావు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.గ్రామస్తులంతా ఐక్యంగా కలిసి సంప్రదాయ బద్ధంగా పండగను నిర్వహించుకోవడం విశేషంగా నిలిచింది.

## ప్రభుత్వ మహిళా డిగ్రీకళాశాలలో ఘనంగా వార్షికోత్సవం -వీడ్కోలు వేడుకలు

అరకు రూరల్, మార్చి 31, ప్రభాతవార్త



అరకులోయ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళా శాలలో మంగళవారం వార్షికోత్సవం మరియు వీడ్కోలు వేడుకలు అత్యంత ఘనంగా మరియు ఆనందోత్సాహాల మధ్య జరిగాయి. ఈ కార్య క్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ పట్టాసి.చలపతి రావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థినులను ఉద్దేశించి మాట్లాడుతూ, విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు, ఉన్నత లక్ష్యాలు, క్రమశిక్షణ, పట్టుదల, ఆత్మవిశ్వాసం గురించి ప్రేరణాత్మక సందేశాన్ని అందించారు. విద్యార్థినులు తమ జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. అలాగే, 2025-26 విద్యా సంవత్సరంలో అత్యుత్తమ విద్యా ప్రతిభ కనబరిచిన విద్యార్థినులకు ప్రిన్సిపాల్ ప్రశంసాపత్రాలు, పతకాలు ను అందజేసి అభినందించారు. విద్యా రంగంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థినులను ఈ సందర్భంగా ప్రత్యేకంగా సత్కరించారు. ఈ వేడుకల్లో విద్యార్థినులు సాంస్కృతిక కార్యక్రమాలు, పాటలు, నృత్యాలు మరియు ఇతర వినోదాత్మక ప్రదర్శనలతో అందరినీ అలరించారు. వీడ్కోలు కార్యక్రమం భావోద్వేగభరితంగా సాగి, విద్యార్థినులు తమ కళాశాల జ్ఞాపకాలను పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.




## గిరిజన ప్రాంత అభివృద్ధి పథకం బలమైన పునాదులపై ఆధారపడి ఉండాలి

### పార్లమెంట్‌లో అరకు ఎంపీ గుమ్మా తనూజ



పాడేరు,మార్చి31,ప్రభాతవార్త

మూల కారణాలపై దృష్టి సారించి గిరిజన సమాజాలకు భూమి అటవీ హక్కులను కల్పించి..జి ఓ నెంబర్ 3ని పునరుద్ధరించడం వంటి చర్యల ద్వారా ఉపాధి, జీవనోపాధి అవకాశాలను విస్తరించాలని ఇది స్థానికీకరణ ద్వారా గిరిజన విద్యార్థులకు యువతకు ఉపాధి అవకాశాలను మెరుగు పరుస్తుందనీ పార్లమెంట్‌లో అరకు ఎంపీ గుమ్మా తనూజ ప్రస్తావించారు. పార్లమెంట్‌లో ఎంపీ ప్రస్తావించిన అందాలు.. పీసా చట్టం వంటి స్థానిక పాలనా వ్యవస్థలను.. ఆంధ్రప్రదేశ్‌లో మా వైసిపి ప్రభుత్వ హయాంలో అమలు చేసినట్లుగా, గ్రామస్థాయి వాలంటీర్లు, సచివాలయాల మోడల్ ద్వారా సేవలను బలోపేతం చేసామని ఎంపీ గుర్తు చేశారు.అమ్మ ఒడి, నాడు నేడు వంటి కార్యక్రమాలతో నాణ్యమైన విద్యను అందరికీ అందించాలన్నారు. డోలీ మోత'వంటి దయ నీయ పరిస్థితులు ఇంకా ఉన్న చోట, ప్రాథమిక ఆరోగ్య వ్యవస్థను మెరుగుపరచాలన్నారు. కాగితాల మీద కాకుండా, క్షేత్రస్థాయిలో నిజమైన మార్పు తీసుకురావడానికి, వాస్తవ పరిస్థితులను మార్చే విధానాలను రూపొందించాలన్నారు. గిరిజన ప్రాంత సమస్యల ముఖ్య అంశాలు.. గిరిజనుల హక్కులు.. అటవీ హక్కుల గుర్తింపు చట్టాన్ని పటిష్టంగా అమలు చేయడం. ఉపాధి.. జీవో నెం.3 పునరుద్ధరణ ద్వారా స్థానిక గిరి జను లకు 100 శాతం ఉపాధి ఉపాధ్యాయ ఇతర పోస్టులు కల్పించాలన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా గ్రామ స్థాయిలో సేవలను అందించడం, పేస చట్టాన్ని బలోపేతం చేయడం.బివిద్య: నాణ్యమైన విద్య కోసం 'నాడు-నేడు', ఆర్థిక సాయం కోసం 'అమ్మ ఒడి'ని కొనసాగించడం. ఆరోగ్యం..మారుమూల గిరిజన ప్రాం తాల్లో 'డోలీ మోత'ను నిర్మూలించి, మెరుగైన వైద్యం అందించాలని ఎంపీ తనూజ పార్లమెంట్‌లో ప్రస్తావించారు.

## ఆర్భాటపు ప్రచారాలు తప్ప.. ఆదివాసీలకు ఒరిగిందేమీ లేదు

### పీఎం జన్మన్ గృహ నిర్మాణంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఘోర వైఫల్యం -సిపీఎం అల్లూరి జిల్లా కమిటీ ఆగ్రహం

అరకు రూరల్, మార్చి 31, ప్రభాతవార్త




అత్యంత వెనుకబడిన ఆదివాసీ తెగలు పివీటిజి కోసం ఉద్దేశించిన 'పీఎం జన్మన్' పథకం అమలులో కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నాయని సిపీఎం అల్లూరి జిల్లా కమిటీ కార్యదర్శి పి.అప్పల నరస తీవ్రంగా విమర్శిం చారు. మంగళవారం అరకు పార్టీ జిల్లా కార్యాలయం లో పార్టీ జిల్లా కార్యకర్తల జిల్లా స్థాయి సమావేశంను పార్టీ జిల్లా కమిటీ సభ్యులు వంతలా దాస్ అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి పి.అప్పల నరస మాట్లాడుతూ, గణాంకాలతో సహా ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టారు. అంకెల్లో అసలు నిజాలు - పక్కా ఇళ్ల నిర్మాణంలో... జిల్లాలో మొత్తం 25 వేల578 గృహాలు అవసరం ఉండగా, ఇప్పటివరకు పూర్తయినవి కేవలం 589 లోపేనని అప్పల నరస గుర్తుచేశారు. "12 వేల 440 గృహాలను నిర్మాణం ఇంకా ప్రారంభమే కాలేదు. వేల సంఖ్యలో ఇళ్లు పునాదులు, గోడల దశలోనే ఆగిపోయాయి. కేంద్ర ప్రభుత్వం పిఎంఏవై -జి కింద రూ. 2 లక్షల39 వేల రూపాయలు ఇస్తుంటే, రాష్ట్ర ప్రభుత్వం తన వాటాగా ఎస్టీ సబ్ ప్లాన్ నుండి ఇవ్వాల్సిన రూ. 1 లక్ష రూపాయలను ఇప్పటివరకు ఒక్క పైసా కూడా విడుదల చేయకపోవడం గిరిజన ద్రోహమేనని విమర్శించారు. గృహ ప్రవేశాలు చేసిన ఇళ్లకు సంబంధించి దాదాపు రూ. 35 కోట్ల బకాయిలు పెండింగ్‌లో ఇంకా ఉన్నాయి.బిల్లులు రాక మేస్త్రీలు, కూలీలు, మెటీరియల్ సరఫరాదారులు పనులు నిలిపివేశారు. బకాయిలు చెల్లించలేక లబ్ధిదారులు అప్పుల ఊబిలో కూరుకుపోయారు. అట్టహాసపు ప్రకటనలు తప్ప ఆచరణలో మాత్రం చిత్తశుద్ధి ప్రభుత్వానికి లేదు. "ధర్తీ ఆబా జన్ భగీదరి అభియాన్"లో అల్లూరి జిల్లా దేశంలోనే నంబర్ వన్ అని ప్రచారం చేసుకుంటున్న పాలకులు, క్షేత్రస్థాయిలో ఆదివాసీలు గుడిసెల్లో, తాత్కాలిక షెడ్లలో పడుతున్న ఇబ్బందులను ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. మార్చి లోపు గృహప్రవేశాలు చేస్తామని ప్రగల్భాలు పలికే అధికారులు, అసలు నిధుల విడుదలపై నోరు మెదపడం లేదని ధ్వజమెత్తారు. ఏప్రిల్ నాటికి పూర్తి నిర్మాణం ప్రారంభం కాని 12 వేల440 గృహాలు సహా మిగిలిన అన్ని ఇళ్లను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి ఏప్రిల్ నెలాఖరుకల్లా గృహప్రవేశాలు చేయించాలి. పథకం అమలులో జరుగుతున్న జాప్యం, నిధుల మళ్లింపుపై స్వతంత్ర విచారణ చేపట్టాలి. ఆదివాసీల ఆత్మగౌరవాన్ని, జీవన ప్రమాణాలను దెబ్బతీస్తున్న ఈ ఉదాసీనతను సిపీఎం సహించ బోదని, వెంటనే ప్రభుత్వం స్పందించకపోతే జిల్లా వ్యాప్తంగా గిరిజనులను ఏకం చేసి భారీ ఆందోళనలు చేపడతామని అప్పల నరస హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పోతురాజు, వి ఉమామహేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు వివి జయ సిపీఎం అరకు మండల సెక్రటరీ కె. రామారావు పాడేరు మండల కార్యదర్శి సోమల చిట్టిబాబు సాగిన ధర్మానపడాల్, ఇతర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలసి ఈవీఎం గోదామును తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ ఏఎస్ దీనిష్ కుమార్

పాడేరు,మార్చి31,ప్రభాతవార్త:



స్థానిక డిగ్రీ కళాశాల రూమ్ లో భద్రపరిచి ఉన్న ఈవీఎం గోదామును జిల్లాలో గల వివిధ ప్రధాన రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి ఈవీఎం గోదాంలో ఈవీఎంలను జిల్లా కలెక్టర్ ఏ ఎస్ దీనిష్ కుమార్ తనిఖీ నిర్వహించారు. త్రైమాసిక తనిఖీల్లో భాగంగా మంగళవారం ఉదయం ఈవీఎం గోదాము ప్రధాన ద్వారం సీల్ ఓపెన్ చేయించి రూమ్ లో భద్రపరిచి ఉన్న ఇవిఏంలను, ఇ వి ఏం బాక్సులను ప్రధాన రాజకీయ పార్టీలతో కలిసి పరిశీలించి, ఆయన అక్కడ పరిస్థితులను గమనించారు. సీసీ కెమెరాల పనితీరును అడిగితెలుసుకున్నారు.తిరిగి ఈవిఏం గోదాం ప్రధాన ద్వారానికి ఉన్న సీళ్లను వేయించి పరిశీలించారు. భద్రతా ప్రమాణాలపై అక్కడ అధికారులకు, పోలీస్ సిబ్బందికి పలు సలహాలు సూచనలు చేశారు. ఈ తనిఖీలో భాగంగా విజిటింగ్ రిజిస్టర్ ను పరిశీలించినట్లుగా సంతకం చేశారు. టిడిపి, బిజెపి, వైఎస్ఆర్ సిపి ప్రధాన పార్టీల ప్రతినిధులు, పాడేరు మండల్ తాసిల్దార్ బి.అరుణ్ చంద్ర, కలెక్టరేట్ సూపరిండెండెంట్ లక్ష్మయ్య, ఎలక్షన్ సెల్ అధికారులు, రెవిన్యూ సిబ్బంది, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## వేతనాలు పెంచాలని కోరుతూ అంగన్వాడీల నిరసన..



ముంచంగిపుట్టు, మార్చి 31, ప్రభాతవార్త

అల్లూరి సీతారామరాజు జిల్లా ముంచింగి పుట్టు మండలంలో సిఐటియు మండల కార్యదర్శి కె శంకర్ రావు అధ్వరంలో స్థానిక ముంచింగి పుట్టు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం వద్ద, అంగన్వాడీల వేతనాలు పెంచాలని కోరుతూ అంగన్వాడీ కార్యకర్తలంతా మంగళవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. సిఐటియు మండల కార్యదర్శి కె శంకర్ రావు మాట్లాడారు, మంగళవారం దేశవ్యాప్తం అంగనవాడిలా పలు డిమాండ్ సమస్య పరిష్కారానికై అన్ని( ఐ సి డి ఎస్) ప్రాజెక్టులలో నిరసన కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందన్నారు, ఈ నేపథ్యంలో, అంగనవాడిలా వేతనాలు పెంచాలని మే నెలలో అంగన్వాడి సెంటర్ లకు వేసవి సెలవులు ఇవ్వాలని అంగన్వాడీలకు వేతనాలు పెంచుతామని ఇచ్చిన హామీ కూటమి సర్కార్ నిలబెట్టుకోవాలని సుప్రీంకోర్టు గైడ్ లైన్ అమలు చేసి కనీస వేతనం 26,000 వేతనాలు చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. రోజు మెనూ ప్రకారం ఆహారం ఇవ్వాలంటే ప్రభుత్వం ఇప్పుడున్న ధరలకు మెనూ చార్జీలు ఇవ్వాలని గ్యాస్ ప్రభుత్వమే సరఫరా చేయాలని ఇచ్చిన హామీల అమలు చేయాలని, వేతనాలు పెంచేదాకా అంగనవాడి యూనియన్ సిఐటియు ఉద్యమం ఎవరు ఆపలేరన్నారు. భవిష్యత్తులో దశాల వారికి ఉద్యమం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అంగనవాడి యూనియన్ నాయకులు, ఎస్ ఈశ్వరి వి గంగాభవాని, ఆర్ విజయ గంగ భవని, కే అమ్మా జి,వి సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రతపై అవగాహన సిఐ హిమగిరి

డుంబ్రిగూడ, మార్చి 31, ప్రభాతవార్త



రోడ్డు భద్రతతో పాటు ప్రమాదాల నివారణతో పాటు మాదకతవ్యాల వల్ల కలిగే ప్రమాదాలపై మండలంలోని ఆ డప వలస గ్రామంలో అవగాహన కార్యక్రమా న్ని నిర్వహించడం జరిగిందని అరకు సర్కిల్ ఇన్స్పెక్టర్ హిమగిరి చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ఎస్పీ అమిత్ బర్ధర్ ఆదేశాల మేరకు రోడ్డు భద్రత ప్రమాదాల నివారణపై ప్రజలు పాటించాల్సిన జాగ్రత్తలు సే నోటు గంజాయి వంటి కార్యక్రమం పై అవగాహన కల్పించడం జరిగిందని ఆయన తెలిపారు. ఈ నేపథ్యంలోనే అంతరి గూడ మలుపు అరకు పీనరీ అడపవలస గ్రామం వద్ద గల ప్రమాదపు స్థలాల్లో స్టాపర్స్ ఏర్పాటు చేయడమైనది సిఐ తెలిపారు. అదేవిధంగా గంజాయి పండించడం రవాణాకు తోడ్పాటు ఇవ్వడం వంటి కార్యకలాపాలకు పాల్పడితే వారిపై పీడీ యాక్ట్ జైలుకు పంపించడం జరుగుతాదని సీఐ స్పష్టం చేశారు. స్థానిక ఎస్సై సురేష్ గ్రామ పెద్దలు మూర్తి సూర్యనారాయణ మోహన్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## వైయస్ జగన్మోహన్ రెడ్డి కలిసిన మత్స్యకార నాయకుడు ఎరుపల్లి నగేష్

నక్కపల్లి రూరల్, ప్రభాతవార్త



రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి ప్రతిపక్ష నేత వైయస్ జగన్మోహన్ రెడ్డిని మండలంలోని రాజయ్యపేట గ్రామానికి చెందిన వైకాపా నాయకుడు ఏరుపల్లి నగేష్ మంగళగిరి సమీపంలో ఉన్న తాడేపల్లి క్యాంపు కార్యాల యంలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి దృష్టికి మత్స్యకారుల సమస్యలతో పాటు కాలుష్యరహిత పరిశ్రమల పరిస్థితులను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. నగేష్ తోపాటు ఉపమాక గ్రామానికి చెందిన వైకాపా నాయకుడు సిద్ధ బత్తుల నూకతాత కూడా జగన్ మోహన్ రెడ్డిని కలిశారు. వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని కలవడం పట్ల నగేష్, నూక తాత సంతోషం వ్యక్తం చేశారు.

## విజయరామరాజుపేటలో పడకేసిన పారిశుధ్యం - పట్టించుకోని అధికారులు

బుచ్చయ్యపేట, మార్చి 31, ప్రభాతవార్త



మండలంలోని మేజర్ పంచాయతీ విజయ రామరాజుపేటలో పారిశుధ్యం క్షీణించి అపరిశుధ్యం విలయతాండవం చేస్తుంది. అయినా పంచాయతీ అధికారి నిర్లక్ష్యంగా రోజులు గడిపేస్తున్నారు. గుడి బడి నివాస ప్రాంతాలు తేడా లేకుండా గ్రామంలో అనేకచోట్ల చెత్తకుప్పలు తోపాటు వీధి గుండా ప్రవహించే పంట కాలువ పరిస్థితి మరీ అధ్వానంగా వర్ణించడానికి కూడా వీలు లేని విధంగా దుర్గంధంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నా సరే సంబంధించిన పంచాయతీ శాఖ అధికారి చోద్యం చూస్తున్నారు గాని పారిశుధ్య పనులు చేపట్టడం లేదని గ్రామ ప్రజలు వాపోతున్నారు. గ్రామంలో డ్రైనేజీల వెంబడి దోమల మందు పిచికారి చేయడం బ్లీచింగ్ చల్లడం కానీ పారిశుద్ధ్య పనుల విషయంలో కనీసం కనుచూపుమేర చేపట్టాల్సిన పనులు వెతికినా కనిపించే దాఖలాలు లేవనే చెప్పాలి. గ్రామం మధ్యలో నుండి ప్రవహించే పంట కాలువ చెత్త, వివిధ రకాల వ్యర్థాలతో కూడికపోయి దుర్గంధం వెదజల్లుతుండడంతో దోమలు పేటిరేగి పోతున్నాయని గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పగలు ఈగల మోత రాత్రులు దోమల వాతలతో కంటిమీద కునుకు లేకుండా పోతుందని ప్రజలు విష జ్వరాల బారిన పడుతున్నారని పంచాయతీ అధికారులు ఇకనైనా కళ్ళు తెరిచి తమ సమస్యను పరిష్కరించకపోతే జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని పారిశుధ్య మెరుగుపరచమని పంచాయతీ కార్యదర్శి గ్రామ ప్రజలు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఎటువంటి చొరవ చూపడం లేదని గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## ఉపాధి పనులలో తేడాలు వస్తే సహించేది లేదు

కసింకోట, మార్చి 31, ప్రభాతవార్త



మండలంలోని జరుగుతున్న ఉపాధి పనులలో తేడాలు వస్తే సహించేది లేదని సోషల్ ఆడిన అధికారులు హెచ్చరించారు. మంగళవారం కసింకోట మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఇదివరకు జరిగిన ఉపాధి పనుల సోషల్ ఆడిట్ జరిగింది. ఈ కార్యక్రమానికి ఫైనాన్స్ మేనేజర్ రవీంద్ర, జిల్లా విజిలెన్స్ అధికారిని లలిత, అంబడ్స్ మాన్ వేణుగోపాల్, క్లస్టర్ ఏపీ డి మణికుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండలంలో జరిగిన ఉపాధి పనుల రికార్డులను పరిశీలించారు. మండలంలో జరిగిన 1748 పనులకు గాను 19.19 కోట్లతో పనులు జరిగే అని తెలిపారు. ఈ పనులలో మేట్ల జరిగిన అవకతవకలలో ఉపాధి కూలీల యొక్క హాజరు దిద్దుబాట్లు, కొలతల్లో తేడాలు గుర్తించారు. అవకతవకలలో జరిగిన గ్రామాలలో 12వేల రూపాయలు రికవరీ చేయుటకు ఆదేశించారు. ఫీల్డ్ అసిస్టెంట్లు అన్ని పంచాయతీలలో రికార్డులు సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. ప్రతి గ్రామపంచాయతీలలో 2000 మందితో పనిచేయించవలసిందిగా తెలియజేశారు. పరిపూర్ణులకు పనిచేసే ప్రదేశాలలో ఎండ దెబ్బకు గురవకుండా పందిరిలు, మంచినీరు సదుపాయం ఏర్పాటు చేయాలన్నారు. అలాగే ఫస్ట్ ఎయిడ్ బాక్సులు అందుబాటులో ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కలగా లక్ష్మీ గున్నయ్య నాయుడు, ఏపీఓ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## సర్పంచ్, పాలకవర్గంకు సన్మాన సభ

ఎస్.రాయవరం మార్చి 31 ప్రభాతవార్త



మండలంలోని మంగళవారం పెనుగొల్లు పంచాయతీ పాలకవర్గముకు ఘనంగా సన్మానించారు. ఐదు సంవత్సరాల పూర్తి అయిన సందర్భంగా గ్రామపంచాయతీ పరిధిలో పంచాయతీ సర్పంచ్ నాగ శ్రీదేవితో పాటు వార్డు సభ్యులను సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి సహకరించిన ప్రజలతోపాటు అధికారులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ, పార్టీ నాయకులు సూర్య నారాయణ, బాబి వార్డు మెంబర్లు, పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ అంతరాయం

బుచ్చయ్య పేట మార్చి 31 ప్రభాతవార్త

బుచ్చయ్య పేట మండలం బుచ్చయ్య పేట సెక్షన్ పరిధిలోగల వడ్డాది సబ్ స్టేషన్ గల 11కె.వి బంగారు మెట్ట ఫీడర్ కింద వచ్చు గ్రామాలకు తేదీ 01- 04-2026న లోపూడి, బంగారు మెట్ట, ఎల్‌బి పి.అగ్రహారం, పొట్టి దొరిపాలెం, కోమల్ల పూడి,గంటి కోర్లం,ఎల్ సింగవరం గ్రామాలకు చెట్టు కొమ్మల తొలగింపు పనులు కారణంగా ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్తు నిలిపివేస్తున్నట్టు నర్సీపట్నం విద్యుత్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్ రామకృష్ణ తెలియజేశారు కావున ఈ గ్రామ ప్రజలంతా సహకరించాలని కోరారు.

## పింఛన్లు పంపిణీకి సర్వం సిద్ధం



గొలుగొండ మార్చి 31 ప్రభాతవార్త

మండలంలో ఏప్రిల్ ఫస్టు పింఛన్ పంపిణీకీ అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు ఎంపీడీవో ఉలబాల శ్రీనివాసరావు తెలిపారు. మండల వ్యాప్తంగా ఎన్ని సామాజిక పింఛన్లు కలిపి 8321 కాగా వీటి నిమిత్తం మూడు కోట్ల 53 లక్షల 50 వేల ఐదు వందలు నగదు ఇప్పటికే బ్యాంకు నుండి విత్ డ్రా చేసి సంబంధిత సిబ్బందికి అప్పగించడం జరిగిందన్నారు. మార్చి నెలలో నూతనంగా పింఛన్లుగా 8 పింఛన్లు వీటిని ఏప్రిల్ ఒకటి నుండి పంపిణీ జరుగుతుందన్నారు. ఉదయం 6:30 నుండి నీ ప్రారంభమవుతుందని, ప్రతి కంపెనీ ప్రదేశాన్ని స్వయంగా సందర్శించి పరిశీలిస్తున్నట్లు తెలిపారు.

## నేషనల్ బాక్సింగ్ టోర్నమెంట్‌కు హరిని

నర్సీపట్నం,మార్చి 31,ప్రభాతవార్త



జూనియర్ ఉమెన్ నేషనల్ బాక్సింగ్ టోర్నమెంట్ కు నర్సీపట్నం ప్రభుత్వ బాలికల హైస్కూల్ విద్యార్థిని సకిరెడ్డి హరిని ఎంపిక య్యారు. ఈ మేరకు ఏప్రిల్ 4 నుంచి 10వ తేదీ వరకు మహారాష్ట్ర నాగాపూర్ లో జరుగు 7వ జూనియర్ మెన్, ఉమెన్ నేషనల్ బాక్సింగ్ ఛాంపియన్ షిప్ టోర్నమెంట్లో 66 కేజీల విభాగంలో ఆంధ్రప్రదేశ్ టీం నుండి పాల్గొననుంది. గత వారం విశాఖ స్వర్ణ భారతిలో జరిగిన స్టేట్ జూనియర్ బాలికల బాక్సింగ్ పోటీలలో ప్రథమ స్థానంలో నిలిచినందుకు ఈ అవకాశం లభించింది. ఈ మేరకు హరినిని పాఠశాల ప్రధానోపాధ్యాయులు కేవీ.మాధవి, ఫిజికల్ డైరెక్టర్లు కే.రమేష్, ఎస్ఏ పిఈ ఎ.వెంకటలక్ష్మీతో పాటు పాఠశాల ఉపాధ్యాయులు కే.జనార్దన్, బి.పద్మ, బి.నాగమణి, కే.ఇంద్ర, కే.విజయలక్ష్మీ అభినందించారు. శాప్ కోచ్ అబ్బు శిక్షణలో ప్రతీ రోజు నర్సీపట్నం ఎన్టీఆర్ స్టేడియంలో తక్కువ సమయంలో బాగా కష్టపడి నేషనల్‌కు వెళుతున్నట్లు హరిని తల్లిదండ్రులు తెలిపారు.



## కొప్పిశెట్టికి సత్కారం

అడ్డరోడ్డు, ప్రభాతవార్త

మండలంలోని కాగిత గ్రామానికి చెందిన తంశెట్టి కనకేశ్వరరావు ఆధ్వర్యంలో మండలంలోని కాగిత గ్రామంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన లభించింది. ఈ సందర్భంగా వైద్యులను సత్కరించడంతోపాటు పాయకరావుపేట నియోజకవర్గం టిడిపి కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్ ను ఘనంగా సత్కరించారు. సర్పంచ్ పోతంశెట్టి రాజేష్‌తో పాటు కుటుంబీకులు ఉన్నారు.

## సమస్యలు పరిష్కరించాలని అంగన్వాడీలు ధర్నా



నర్సీపట్నం,మార్చి 31,ప్రభాతవార్త

నర్సీపట్నం ప్రాజెక్టు కార్యాలయం వద్ద ఏపీ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ (సిఐటియు) ఆధ్వర్యంలో అంగన్వాడి వర్కర్ల సమస్యల పరిష్కరించాలని మంగళవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్కర్కు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, వేసవి సెలవులు, పెండింగ్లో ఉన్న 1810 మినీ వర్కర్స్ ప్రమోషన్స్ వెంటనే ఇవ్వాలని, ఆయాల ప్రమోషన్లో ఉన్న అభ్యంతరాలను పరిష్కరించాలన్నారు. 136 సూపర్వైజర్ల ప్రమోషన్లలో తక్షణమే ఇవ్వాలని, లబ్ధిదారులకు న్యాయమైన సరుకులు అందించాలని, ప్రీ స్కూల్కు తల్లికి వందనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటియూ జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు, ప్రాజెక్ట్ లీడర్లు డి.మహాలక్ష్మి, వి.సామ్రాజ్యం, కృష్ణవేణి, వరలక్ష్మి, రేవతి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## మనోహర హాస్టల్ మేడపై నుంచి పడి యువకుడు మృతి

అచ్యుతాపురం, మార్చి 31, ప్రభాతవార్త



అచ్యుతాపురం మండల కేంద్రంలో ఉన్న మనోహర అను ప్రైవేట్ హాస్టల్ మూడో అంతస్తు నుండి పడి యువకుడు మృతి చెందాడు, విశాఖ జిల్లా ఆనందపురం గ్రామానికి చెందిన అలబాని రామకృష్ణ (22) మంగళవారం ఉదయం 6 గంటల సమయంలో పడిపోయాడు, చుట్టు ప్రక్కల ఉన్న వారు చూసి 108 అంబులెన్స్ కు ఫోన్ చేసి దగ్గరలో ఉన్న పవన్ సాయి ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు, చికిత్స పొందుతూ సాయంత్రం మూడు గంటల సమయంలో మృతి చెందాడు అని హాస్పిటల్ వర్గాలు తెలిపాయి. మృతుని తండ్రి సూర్యనారాయణ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## రేషన్ డిపోను సీజ్ చేయాలని తహశీల్దారును ఆదేశించిన సివిల్ సప్లయ్ కార్పొరేషన్ డైరెక్టర్ శివదత్

పాయకరావుపేట, మార్చి 31, ప్రభాతవార్త



పట్టణంలోని ఎల్ టి కాలనీలో మూడవ నెంబర్ రేషన్ డిపోను వెంటనే సీజ్ చేసి డీలర్ పై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర సివిల్ సప్లయి కార్పొరేషన్ డైరెక్టర్ బోడపాటి శివదత్ తహసిల్దార్ వి ఎ మహేశ్వరరావును ఆదేశించారు. మంగళవారం 106 కిలోల రాగులు డిపో నుంచి అక్రమంగా తరలిస్తుండగా వార్డు మెంబర్ దేవాది మంగాదేవి, స్థానికులు పట్టుకొని రెవిన్యూ అధికారులు, సివిల్ సప్లయి కార్పొరేషన్ డైరెక్టర్ బోడపాటి శివదత్ లకు ఫిర్యాదు చేశారు. సంఘటనా స్థలానికి చేరుకున్న శివదత్, తహసీల్దారు మహేశ్వరరావు, ఆర్ఐ త్రినాథ్ రేషన్ డిపోలో తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో 106 కిలోల రాగులు, 43 కిలోల షుగర్ తక్కువగా ఉన్నట్టు గుర్తించారు. ఈ సందర్భంగా జరిగిన విలేకరుల సమావేశంలో సివిల్ సప్లయ్ కార్పొరేషన్ డైరెక్టర్ శివదత్ మాట్లాడుతూ... ప్రభుత్వం ఎన్నో వ్యయ ప్రయాసలకు ఓర్చి నిరుపేదలకు రేషన్ డిపోల ద్వారా నిత్యవసర సరుకులు అందిస్తుంటే రేషన్ డీలర్లు ఇలాంటి అక్రమాలకు పాల్పడడాన్ని సహించేది లేదని హెచ్చరించారు. అక్రమాలకు పాల్పడిన డీలర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మూడవ నెంబర్ రేషన్ డిపోను వెంటనే సీజ్ చేయాలని తహసీల్దారు మహేశ్వరరావును ఆదేశించారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరుగకుండా చర్యలు తీసుకుంటామని శివదత్ తెలిపారు. ఇదిలాఉండగా అక్రమాలకు పాల్పడిన మూడవ నెంబరు రేషన్ డీలర్ పులగపూరి సింహాచలంను తొలగించి తాత్కాలికంగా రేషన్ డిపో నిర్వహణ బాధ్యతలను పెదరాంబద్రపురం డీలర్ గంపల చిట్టిబాబుకు అప్పగించామని సివిల్ సప్లయి డిప్యూటీ తహసీల్దార్ ఎం గణపతిరావు తెలిపారు.

## బూసిపుట్టు గ్రామంలో 'ఆపరేషన్ వజ్ర ప్రహార్'

ముంచంగిపుట్టు మార్చి 31,ప్రభాతవార్త



ఎంజాయ్ నివారణ లక్ష్యంగా పోలీస్ సోదరులు మరియు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని గంజాయి సహా ఇతర మత్తు పదార్థాల సరఫరాకు చెక్ పెట్టే దిశగా కార్యాచరణ రూపొందించామని పాడేరు డిఎస్పి ఆర్.అభిషేక్ అన్నారు. జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ ఆదేశాల మేరకు అల్లూరి సీతారామరాజు జిల్లా ముంచంగిపుట్టు మండలంలో అతి మారు మూల బూసి పుట్టు పంచాయతీ గ్రామంలో మంగళవారం ఆపరేషన్ వజ్ర ప్రహార్ కార్యక్రమాన్ని బూసిపుట్టు గ్రామంలో ప్రజలతో ఆపరేషన్ వజ్రప్రహార్ ప్రతిజ్ఞ కార్యక్రమం మరియు సైబర్ నేరాలపై అవగాహన, రోడ్ సేఫ్టీ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో వారపు సంతలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో పాడేరు డిఎస్పి అభిషేక్ మాట్లాడుతూ గంజాయి నివారణే లక్ష్యంగా పోలీసుల సోదాలు మరియు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని గంజాయి సహా ఇతర మత్తు పదార్థాల సరఫరాకు చెక్ పెట్టే దిశగా కార్యాచరణ రూపొందించామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మాదకద్రవ్యాల నియంత్రణకు చేపట్టిన ప్రత్యేక కార్యక్రమం "ఆపరేషన్ వజ్రప్రహార్" లో భాగంగా మంగళవారం బూసిపుట్టు గ్రామంలో వారపు సంతలో కార్డన్సెర్చ్ ఆపరేషన్ విస్తృతంగా నిర్వహించడం జరుగుతుందని పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించి ప్రజల వివరాలు, వాహనాల వివరాలు, అనుమానాస్పద వ్యక్తులపై పరిశీలన చేపట్టడం జరిగిందన్నారు.ఈ సందర్భంగా ప్రజలకు మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే ఆరోగ్య, సామాజిక మరియు చట్టపరమైన దుష్పరిణామాల గురించి అవగాహన కల్పించామని, గంజాయి మరియు ఇతర మాదకద్రవ్యాల వినియోగం యువత భవిష్యత్తును నాశనం చేస్తుందని, కుటుంబ వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతుందని వివరించడం జరిగిందన్నారు. సీఐ శ్రీనివాసరావు పెదబయలు ముంచంగిపుట్టు ఎస్సైలు టి వెంకటేష్, పి నాని, ఏపీఎస్పీ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## పాడేరులో ప్రజలపై తేనెటీగలు దాడి

పాడేరు,మార్చి31,ప్రభాతవార్త:



అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు పట్టణంలో స్థానికులపై తేనెటీగల దాడి చేశాయి. సోమ వారం రోడ్లపై రాకపోకలు సాగిస్తున్న సుమారు 20 మంది వాహనదారులు, పాదాచారులపై తేనెటీగలు ఒక్కసారిగా దాడి చేశాయి. హుకుం పేట మండలం సిసాయి పనుకు గ్రామానికి చెందిన ఆశా కార్యకర్త తన ఐదు నెలల బాబు భర్తతో ద్విచక్ర వాహనంపై పాత బస్టాండ్ నుండి జిల్లా ఆసుపత్రికి ద్విచక్ర వాహనంపై వస్తుండగా తేనె పట్టు విరిగిపడింది. చుట్టుపక్కలున్న కొంతమంది పై దాడి చేశాయి. బాలింత మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండడంతో పాడేరు జిల్లా ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. 17 మంది వరకు తేనెటీగల దాడిలో గాయాలు పాలైన వారిని చికిత్స అందించి పంపించారు.

## జోలా పుట్టు రిజర్వాయర్ పరివాహక ప్రాంతంలో 16.45 కోట్ల వ్యాయామంతో వాటర్ ఏరోడ్రోమ్ ప్రాజెక్ట్ నిర్మాణం

**నేడు జోలపుట్టు మత్స్యగెడ్డ పరివాహక ప్రాంతంలో వాటర్ ఏరోడ్రోమ్ ప్రాజెక్టుపై ప్రజా అభిప్రాయ సేకరణ : తాసిల్దార్ భాస్కర అప్పారావు**



ముంచంగిపుట్టు మార్చి 31, ప్రభాతవార్త

అల్లూరి సీతారామరాజు జిల్లా ముంచంగిపుట్టు మండలంలో గల ఆంధ్ర ఒరిస్సా సరిహద్దు ప్రాంతంలో గల జోలాపుట్టు రిజర్వాయర్ పరివాహక ప్రాంతంలో గల మత్స్యగడ్డ ప్రాంతంలో వాటర్ ఏరోడ్రోమ్ ప్రాజెక్ట్ నుంచేందుకు ప్రభుత్వం ప్రతిపాదించిందని అందుకు సంబంధించి ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని ఏప్రిల్ ఒకటి బుధవారం ఉదయం 11 గంటలకు జోలాపుట్టు గ్రామ సచివాలయంలో నిర్వహించనున్నామని ముంచంగిపుట్టు తహసిల్దార్ భాస్కర అప్పారావు తెలిపారు. భారత ప్రభుత్వం పర్యావరణ మరియు అటవీ మంత్రిత్వ శాఖ పర్యావరణ చట్టం 1986 కింద విడుదల చేసిన ఈ.ఐ.ఎ నోటిఫికేషన్ ఎస్.ఓ. నెంబర్ 1533 తేదీ 14.09.2006న తదుపరి సర్కులర్ ప్రకారం ఆంధ్రప్రదేశ్ ఎయిర్పోర్ట్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ కంపెనీ 16.45 కోట్ల వ్యయంతో సర్వేనెంబర్ 5లో ఈ ప్రాజెక్టును నిర్వహించనున్నారని అందుకు సంబంధించి అల్లూరి సీతారామరాజు జిల్లా ముంచంగిపుట్టు మండలంలో గల జోలాపుట్టు గ్రామంలో నిర్వహించనున్న ఈ ప్రాజెక్టుపై ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ప్రతిపాదన మేరకు నిర్వహిస్తున్నామని కావున మండల ప్రజలు, ప్రతి ఒక్కరూ ఈ ప్రజాప్రయశాకరణ కార్యక్రమానికి హాజరు కావాలని తాసిల్దార్ భాస్కర అప్పారావు, డిప్యూటీ తాసిల్దార్ భాస్కరరావు, వీఆర్వో రమేష్ రెవెన్యూ సిబ్బంది కోరారు.

## ఉపాధి పనుల ప్రగతిలో అలసత్వం వహిస్తే చర్యలు డ్వామా పీడీ విద్యాసాగర్

దుంబ్రిగుడ, మార్చి 31, ప్రభాతవార్త



ఉపాధిహామీ పనుల ప్రగతిలో అలసత్వం వహిస్తే ఎంతటి వారైన చర్యలు తీసుకోవడానికి సహించబోమని డ్వామా పీడీ విద్యాసాగర్ చెప్పారు. మండల కేంద్రంలోని మండల పరిషత్తు కార్యాలయ ఆవరణలో 16వ విడత సామాజిక తనిఖీ ప్రజా వేదికను మంగళవారం నిర్వహించారు. స్థానిక ఎంపీపీ ఈశ్వరి సమక్షంలో సామాజిక తనిఖీ బృందం జరిపిన 2024 ఐదు సంవత్సరానికి సంబంధించిన పనుల వివరాలను వివరించారు. ఉపాధిహామీ, పంచాయతీరాజ్, గిరిజన సంక్షేమశాఖ, సామాజిక పింఛన్లపై సామాజిక తనిఖీల వి వరాలతో ప్రజా వేదికను నిర్వహించారు. 2024-25మార్చి 31వరకు జరిగిన పనులపై సమగ్ర వివరాలతో ప్రజా వేదికలో పొందు పరిచారు. 2024-25ఆర్థిక సంవత్సరంలో వేతన రూపంలో రూ.2946కోట్లు, మెటిరియల్ రూపంలో రూ.74 21లక్షలతో కలిపి రూ.30.20కోట్లు జరగగా, పంచాయతీరాజ్ శాఖ ద్వారా రూ.2.98కోట్లు, గిరిజన సంక్షేమశాఖ ద్వారా రూ.14 68కోట్లతో జరిగిన పనులపై సమగ్రంగా తనిఖీ బృందంతో ప్రజా వేదికను నిర్వహించడం జరిగిందని, ఆయన తెలిపారు. జాబ్ కార్డు కలిగిన ప్రతిఒక్క లబ్దిదారుడికి పనులు కల్పించాలని, లేని పక్షంలో చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఉప ఎంపీపీ అనందరావు, ఏపీడీ పవనకుమార్, ఎంపీడీఓ విశ్వనాథ్, ఏపీవోలు సంగంనాయుడు, దొరబాబు, గిరిజన, పంచాయతీరాజ్ శాఖల అధికారులు అజయ్కుమార్, అభిషేక్, ఎన్ఆర్‌జీఎస్ సిబ్బంది ఉపాధిహామీ వేతనదారులు పాల్గొన్నారు.

## రోడ్డు నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలి..

**అరకు ఎమ్మెల్యే రేగం మత్స్య లింగం.. జర్రెల గ్రామంలో గ్రామ పంచాయతీ భవనం ప్రారంభోత్సవం**

**నూతన రోడ్డును శంకుస్థాపన చేసిన అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం**



ముంచంగిపుట్టు,మార్చి 31,ప్రభాతవార్త

రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించి నాణ్యమైన రోడ్డును నిర్మించి ప్రజలకు అందించాలని గుత్తిందారులకు అరకు ఎమ్మెల్యే రేగం మత్స్య లింగం సూచించారు. మంగళవారం అల్లూరి సీతారామరాజు జిల్లా అరకు నియోజకవర్గం ముంచంగిపుట్టు మండలం,జర్రెల గ్రామపంచాయతీలో అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపన, ప్రారంభోత్సవ కార్యక్రమంలో అరకు ఎమ్మెల్యే రేగం. మత్స్య లింగం ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ముందుగా నూతనంగా 10 లక్షల రూపాయలతో ఆధునిక అంగులతో నిర్మించిన గ్రామపంచాయతీ భవనాన్ని వైసీపీ నేతలతో కలిసి రిబ్బన్ కటింగ్ చేసి, కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. అనంతరం జర్రెల గ్రామం నుండి మండిభ గ్రామం వరకు1 కోటి 40 లక్షల రూపాయిలు, పంచాయితీ రాజ్ నిధులతో కొత్త రోడ్డు పనులకు భూమి పూజ కార్యక్రమంలో కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం మాట్లాడుతూ గతంలో గ్రామపంచాయతీ కార్యలయలు ఉండేవి కాదని,అంగన్వాడి భవనాలు ఉండేవి కాదని పాఠశాల ఉండి ఆయా పాఠశాలకు భవనాలు ఇప్పటికీ చాలా మారుమూల గిరిజన ప్రాంతాల్లో లేవని అన్నారు. పాడేరు ఐటిడిఏ పరిధిలో ఉండే పాఠశాలకు సుమారు 168 పాఠశాలలకు భవనాలు లేవని,కనీస సౌకర్యాలు లేనప్పుడు గిరిజన విద్యార్థులకు చదువు ఎలా అందుతుందని అన్నారు. గ్రామ సచివాలయాలు వ్యవస్థ అనేది మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి హయంలో,ప్రతి పంచాయతీకి లేదా రెండు పంచాయతీలు కలిపి ఒక గ్రామ సచివాలయ కార్యాలయం ఏర్పాటు చేశారని అన్నారు.వైసీపీ ముంచంగి పుట్టు మండల పార్టీ అధ్యక్షుడు పాంగి పద్మారావు.వైసీపీ పెదబయలు మండల పార్టీ అధ్యక్షుడు మజ్జి చంద్రు బాబు,ముంచంగి పుట్టు మండలం ఎంపీపీ సభ్యురాలు అరిసెల సీతమ్మ,జర్రెల గ్రామపంచాయతీ సర్పంచ్ బోరగం భాగ్యవతి,ఏనుగు రాయి గ్రామ పంచాయతీ సర్పంచ్ సిరగం నరసింగ రావు,సుజన కోట గ్రామపంచాయతీ సర్పంచ్ వేంగడ రమేష్, పెదగూడ గ్రామ పంచాయతీ సర్పంచ్ మండి బాబురావు, ఎంపీటీసీ సభ్యులు మజ్జి సుబ్బమ్మ,వైసీపీ అరకు నియోజకవర్గం కల్చరల్ వింగ్ అధ్యక్షుడు కొండల రావు,మండల ఉపాధ్యక్షులు సుబ్బారావు ,మండల ప్రధాన కార్యదర్శిలు ముక్కి రాంప్రసాద్,గొల్లూరి సన్యాసిరావు, మండల నాయకులు పాపారావు, రాజారావు, రాం ప్రసాద్,కూడ దాసు, పులి రాజు, దేవ, నైకం సురేష్, ఉప సర్పంచ్,వార్డ్ మెంబర్లు,గ్రామస్తులు పాల్గొన్నారు.

## ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు మృతి

దుంబ్రిగుడ, మార్చి: 31, ప్రభాతవార్త



పండుగను ఆనందంగా అశ్వదిద్దామని ఒకరు, మరోకరు బందువుల ఇంటి నుంచి స్వగ్రామానికి బయలుదేరి వస్తున్న క్రమంలో ఎదురెదురుగా వస్తున్న రెండు దీక్షక్రవాహనాలు ఢీకొన్న సంఘటనలో గాయాలుపాలై తనువు చాలించిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. మండలంలోని గోరాపూర్ రైల్వే స్టేషన్ సమీపంలోని ఆంధ్ర, ఒడిశా సరిహద్దు ఆంధ్ర రోడ్డులో సోమవారం అర్ధరాత్రి రోడ్డు ప్రమాదం జరిగింది. దీనికి సంబంధించి స్థానిక ఎస్సై సురేష్ తెలిపిన వివరాలు అరకులోయ మండలం మాదల పంచాయతీ తోటవలస గ్రామానికి చెందిన కిల్లో జోషప్ (23) అనే గిరిజన యువకుడు బందువుల ఇంటి నుంచి స్వగ్రామానికి బయలుదేరగా, హుకుంపేట మండలం గడుగుపల్లి గ్రామానికి చెందిన ముప్పల శ్రీను (28) అనే యువకుడు తోటి స్నేహితుడుతో చటువాలో జరుగుతున్న పండుగను చూసేందుకు బయలుదేరారన్నారు. గోరాపూర్ రైల్వే స్టేషన్ సమీపంలోని కిలోమీటరు దూరంలో రాత్రివేల రెండు బైకులు బలంగా ఢీ కొన్నాయని చెప్పారు. సంఘటన స్థలంలో శ్రీను అక్కడిక్కడే మృతి చెందగా, కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్న జోషపు అంబులెన్సో తరలిస్తుండగా మార్గ మధ్యలోని యండపల్లివలసలో ఆయన మృతి చెందారని అన్నారు. మరొకరు గాయాలతో ఉండగా ఆసుపత్రిలో చేర్పించడం జరిగిందన్నారు. మృతదేహాలను అరకులోయ ప్రాంతీయ ఆసుపత్రికి తరలించి పంచనామ నిర్వహించి మృతుల కుటుంబ సభ్యులకు అప్పగించడం జరిగిందన్నారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపారు

## పంచాయతీ నిధుల దుర్వినియోగంపై విచారణ జరిపించాలి..!

**మండల టిడిపి ఎస్టీ సెల్ కార్యదర్శి బండెని సన్యాసిరావు డిమాండ్**



కొయ్యూరు మార్చి 31 ప్రభాతవార్త

ఏప్రిల్ 2 తో పదవీకాలం ముగుస్తుండడంతో మండలంలోని పలు పంచాయతీల సర్పంచులు స్థానిక పంచాయతీ కార్యదర్శులతో కుమ్మక్కై ఆదరాబాద రాగా పంచాయతీ నిధుల దుర్వినియోగానికి పాల్పడుతున్నట్టు తెలుస్తోందని మండల టిడిపి ఎస్టీ సెల్ కార్యదర్శి బండెని సన్యాసిరావు ఒక ప్రకటనలో ఆరోపించారు. ఇంతవరకు గ్రామాలలో అవసరమైన అభివృద్ధి పనులు చేపట్టడానికి తాత్సారం చేసిన కొంతమంది సర్పంచులు, ఇప్పుడు అవే పనులు జరగకపోయినా జరిగినట్టు చూపిస్తూ నిధులు డ్రా చేయడానికి విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారని దుయ్యబట్టారు. కొన్ని పంచాయతీలలో గతంలో చేసిన పనులను కూడా కొత్తగా చూపించి నిధులు డ్రా చేయడానికి ప్రయత్నించినట్టు తెలిసిందన్నారు. నిధుల దుర్వినియోగానికి అవసరం లేని రోడ్లు, తదితర పనులను ఇప్పటికిప్పుడు ప్రారంభించడంలో ఆంతర్యం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ముఖ్యంగా వీధిలైట్లు, మంచినీటి బోర్లు పనులు పై అధికారులు నిఘా పెట్టాలన్నారు. ఉన్నతాధికారులు దృష్టి సారించి , గత నెల రోజులుగా పంచాయతీల నుండి విత్ డ్రా చేసిన నిధులపై ప్రత్యేక విచారణ నిర్వహించి, నిగ్గు తేల్చాలని కోరారు.ఈ విషయమై జిల్లా కలెక్టర్కు ఫిర్యాదు చేయనున్నట్టు బండిని సన్యాసిరావు హెచ్చరించారు.

## అంగన్వాడి కార్యకర్తలు, సహాయకురాలు పోస్టులు భర్తీకు దరఖాస్తుల ఆహ్వానం

**ఐసిడిఎస్ సిడిపిఓ యు విమల కుమారి**

ముంచంగిపుట్టు, మార్చి 31, ప్రభాతవార్త



సమగ్ర శిశు అభివృద్ధి సేవా పథకం (ఐసిడిఎస్ ప్రాజెక్ట్) అల్లూరి జిల్లా పాడేరు కార్యాలయం నుండి అంగన్వాడి కార్యకర్తలు- 2,పీఎం జన్మన్ సహాయకురాలు- 3,అంగన్వాడి సహాయకురాలు-33, మొత్తం 38 పోస్టులు భర్తీ చేసేందుకు మంగళవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. ముంచంగిపుట్టు మండలంలో ఖాళీగా ఉన్న అంగన్వాడి కార్యకర్తలు సహాయకురాలు పోస్టులు భర్తీ చేసేందుకు అర్హులైన ఎస్టి అభ్యర్థుల నుండి దరఖాస్తులు కోరుతున్నామని ఐసిడిఎస్ సిడిపిఓ, యు.విమల కుమారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 1- 04-2026 నుండి 15- 04-2026 సాయంత్రం 5 గంటల లోపు దరఖాస్తులు అందించేందుకు అవకాశం కల్పించారన్నారు. అభ్యర్థులు పదోతరగతి పాసై ఉండాలని అదే గ్రామంలో స్థానికులై వివాహం జరిగి ఉండాలన్నారు. అభ్యర్థులు1- 07- 2020 నాటికి 21 సంవత్సరాలు నుండి 35 సంవత్సరాల లోపు ఉండవలెనని ఆమె పేర్కొన్నారు. అర్హత కలిగి 21 సంవత్సరాలు నిండిన అభ్యర్థులు లేనప్పుడు 18 సంవత్సరాలు నిండిన అభ్యర్థులు దరఖాస్తులు పరిశీలించబడుతుందని ఆమె తెలిపారు. అభ్యర్థుల దరఖాస్తులు పోస్ట్ ఆఫీస్ ద్వారా గాని లేదా మండల కేంద్రం ఐసిడిఎస్ కార్యాలయంలో వచ్చి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. మరిన్ని వివరాల కొరకు ఐసిడిఎస్ ప్రాజెక్టు మున్సిపల్ వారిని సంప్రదించాలని ఆమె తెలిపారు. పోస్టుల ఖాళీల వివరాలు ఈ విధంగా ఉన్నాయి. అంగన్వాడి సహాయకురాలు పీఎం జన్మన్ పథకం ద్వారా గొద్దిపుట్టు, ఎం.బాదిపుట్టు, ముంజగూడ, అంగన్వాడి కార్యకర్తలు, జోడిగుమ్మ, పట్నపడాల్ పుట్టు, అంగన్వాడి సహాయకురాలు, అత్తికల్లు, జబడ, మినుముల పుట్టు, వరుకుగుమ్మి, బలడ, సొలగంపుట్టు, పిల్ల గండువ, తాంగుల, జి సిరగంపుట్టు, గరం, కోజిరిగూడ, దాసరిపుట్టు, లబడ పుట్టు, అలబీరు, ఆసరాడ, వలయిబీరు, మురళిపుట్టు, కుజబంగి, సరియాపల్లి, వందనపల్లి, డి కుమడ, పొర్లు బంధ, గతుమలడ, గలగండ, తోట పుట్టు,దముకిలాడి, కే కొత్తూరు, గిద్దుల పుట్టు, సిరగంపట్టు, తుమ్మిడి పుట్టు, గుర్రలబయిలు అంగన్వాడి కేంద్రాలలో పోస్ట్ ఖాళీలు ఉన్నాయన్నారు.

## జిల్లాలో తక్షణమే ఐటీడీఏ ఏర్పాటు చేయాలి : సీపీఎం



కొత్తూరు, మార్చి 31 ప్రభాతవార్త : జిల్లాలో గిరిజనుల అభ్యున్నతి కోసం కూటమి ప్రభుత్వం తక్షణమే జిల్లాలో ఐటీడీఏను ఏర్పాటు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, జిల్లా కమిటీ సభ్యులు సిర్ల ప్రసాద్ డిమాండ్ చేశారు. కొత్తూరు మండలం గొట్టిపల్లిలో మంగళవారం పర్యటించిన సందర్భంగా వారు గిరిజనులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గోవిందరావు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో జిల్లాకు ఐటీడీఏ మంజూరు చేస్తామని ఇచ్చిన హామీని ప్రభుత్వం ఎప్పుడు నెరవేరుస్తుందో వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేయాలని కోరారు. జిల్లాలో ఐటీడీఏ లేకపోవడం వల్ల గిరిజనులు తీవ్రమైన దోపిడీకి గురవుతున్నారని, వారి సమస్యలను పట్టించుకునే నాథుడే కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు నిమ్మక అప్పన్న, సుంకయ్య, రామారావు, గణపతి, ధర్మారావు, మోహనరావు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య



కంచిలి, మార్చి 31 ప్రభాతవార్త: ప్రైవేట్ పాఠశాల కన్నా ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య అందుతుందని మకరాంపురం ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు పేర్కొన్నారు. మంగళవారం కంచిలి మండలం మకరాంపురం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు వినూత్న చైతన్య కార్యక్రమాన్ని చేపట్టారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు నెయ్యిల హరికృష్ణ, ఉపాధ్యాయులు దుద్ది బాలరాజు ఆధ్వర్యంలో ఉపాధ్యాయ బృందం గ్రామంలోని ప్రతి వీధి, ప్రతి ఇంటిని సందర్శిస్తూ తల్లిదండ్రులతో ప్రత్యక్షంగా సంభాషించింది. ప్రభుత్వ పాఠశాలల్లో అందుతున్న విద్యా ప్రమాణాలు, ఆధునిక బోధన పద్ధతులు, డిజిటల్ తరగతులు, విద్యార్థులపై చూపుతున్న వ్యక్తిగత శ్రద్ధ వంటి అంశాలను వివరించి అవగాహన కల్పించారు. ప్రతి విద్యార్థి ప్రతిభను వెలికితీయడమే మా లక్ష్యం. ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యతో పాటు సమగ్ర అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నామని ఉపాధ్యాయులు తెలిపారు. అదే విధంగా ప్రభుత్వ పాఠశాలలో ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు, మధ్యాహ్న భోజనం వంటి సదుపాయాలు అందుబాటులో ఉండటంతో పాటు విద్యార్థులలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేలా బోధన కొనసాగుతుందని పేర్కొన్నారు. ప్రతి కుటుంబం తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించి బడిని బలోపేతం చేయడంలో భాగస్వాములు కావాలని ఉపాధ్యాయులు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మాధవి బెహరా, బొడ్డ స్వరూప, ప్రగడ భార్గవి, మల్లార్పు భవాని, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ మల్ల సుందరరావు, అంగన్వాడీ టీచర్ సుజాత రౌళో, తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఎమ్మెల్యే కూన పర్యటన వివరాలివే..

ఆమదాలవలస, మార్చి 31 (ప్రభాతవార్త): ఆమదాలవలస ఎమ్మెల్యే, రాష్ట్ర పియుసి చైర్మన్ కూన రవికుమార్ బుధవారం ఆమదాలవలస మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభిస్తారని రాష్ట్ర కాలింగా కార్పొరేషన్ డైరెక్టర్ తమ్మినేని చంద్రశేఖర్ మంగళవారం తెలిపారు. ఆమదాలవలస మండలం కొత్తవలస గ్రామంలో ఉదయం 8 గంటలకు పింఛన్లు పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారు. కొరపాం గ్రామంలో ఉదయం 11 గంటలకు సీసీ రోడ్లను ప్రారంభిస్తారు. అనంతరం ఆమదాలవలస మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన పశు వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తారు. వంజంగిపేట గ్రామంలో మధ్యాహ్నం 3 గంటలకు గ్రామీణ నీటి సరఫరా పథకాన్ని ప్రారంభిస్తారు. తోటాడలో సాయంత్రం 4 గంటలకు సీసీ రోడ్లు ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారు. కార్యక్రమంలో అధికారులు, కార్యకర్తలు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

## గురుకుల పాఠశాల ఆకస్మిక తనిఖీ



పాతపట్నం, మార్చి 31 ప్రభాతవార్త: స్థానిక డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలను మంగళవారం సాంఘిక సంక్షేమ గురుకుల జిల్లా సమన్వయ అధికారి వై.యశోద లక్ష్మి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె పాఠశాలలోని పలు విభాగాలను పరిశీలించి, ఉపాధ్యాయులు, విద్యార్థులతో మాట్లాడారు. పాఠశాల ఉపాధ్యాయులతో ప్రత్యేకంగా సమావేశమై విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంలో ఉపాధ్యాయులు ప్రముఖ పాత్ర పోషించాలని ఆమె సూచించారు. ప్రతి విద్యార్థి ఉన్నత శిఖరాలను అధిరోహించేలా వారిని తీర్చిదిద్దాలని, చదువులో వెనుకబడిన వారిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఆదేశించారు. అనంతరం విద్యార్థుల భోజనశాలను తనిఖీ చేశారు. విద్యార్థులకు వండి పెడుతున్న భోజన పదార్థాలను స్వయంగా పరిశీలించి రుచిచూశారు. వంటకు వాడుతున్న నిత్యావసర సరుకులు మరియు కూరగాయలను నిశితంగా పరిశీలించి, విద్యార్థులకు ఎల్లప్పుడూ నాణ్యమైన, పౌష్టికాహారాన్ని అందించాలని సిబ్బందికి స్పష్టం ఆమె చేశారు. ఈ పర్యటనలో భాగంగా పదో తరగతి విద్యార్థులతో ఆమె ప్రత్యేకంగా సమావేశమయ్యారు. పదో తరగతి పూర్తయిన తర్వాత విద్యార్థులకు ఉండే వివిధ రకాల పైచదువుల అవకాశాలు, భవిష్యత్తులో ఎంచుకోగల వివిధ రంగాల గురించి వారికి కూలంకషంగా వివరించారు. లక్ష్యాలను నిర్దేశించుకుని కష్టపడి చదవాలని విద్యార్థులకు యశోద లక్ష్మి దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ బి.భార్గవి, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## పశు సంవర్ధక రంగమే గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక : ఎమ్మెల్యే



రణస్థలం, మార్చి 31 (ప్రభాతవార్త): గ్రామీణ ప్రాంతాల్లో పశు సంవర్ధక రంగం అభివృద్ధి చెందితేనే రైతుల ఆర్థిక పరిస్థితి మెరుగుపడు తుందని, అందుకే కూటమి ప్రభుత్వం పాడి పరిశ్రమపై ప్రత్యేక దృష్టిసారించిందని ఎచ్చెర్ల శాసన సభ్యులు నడుకుదిటి ఈశ్వరరావు పేర్కొన్నారు. మంగళవారం మండలం దేరసాంలో ఎచ్చెర్ల వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత పశు వైద్య శిబిరాన్ని ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. గత వైసీపీ ప్రభుత్వం పాడి రంగాన్ని పూర్తిగా విస్మరించిందని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆగిపోయిన పశు సంవర్ధక పథకాలను పునరుద్ధరించిందని తెలిపారు. ప్రభుత్వం నిలిపివేసిన రూ.150కోట్ల రూపాయల పశువుల ఇన్సూరెన్స్ బకాయిలను, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చొరవతో ఎన్డీయే ప్రభుత్వం విడుదల చేసి రైతులకు అండగా నిలిచిందని కొనియాడారు. పాడి రైతులకు ప్రభుత్వం అందించే ఉచిత వైద్య సదుపాయాలను, బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ నిడగంట్ల పద్మ, వైస్ చైర్మన్ బురాడ రమణ, కూటమి నాయకులు పిసిని జగన్నాధం నాయుడు, డీజీఎం ఆనందరావు, ఎంపిటిసీ దన్నాన వంశీ, మండపాక కనకారావు, రౌతు శ్రీనివాసరావు, వడ్డాది శ్రీనివాసరావు, కొత్తకోట్ల సత్యం, పశు సంవర్ధక శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం



పాతపట్నం, మార్చి 31 ప్రభాతవార్త : ఉత్కళాంధ్రుల ఆరాధ్య దైవం, పాతపట్నంలో వెలసియున్న ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ నీలమణి దుర్గా అమ్మవారి దేవస్థానంలో ఏర్పాటు చేయనున్న నిత్య అన్నదాన కార్యక్రమం కొరకు స్థానిక రత్నాలపేటకు చెందిన భక్తులు శాసనపురి గోపికృష్ణ 1,01,116 రూపాయలు విరాళంగా ఇచ్చారు. ఎమ్మెల్యే మామిడి గోవిందరావు చేతుల మీదుగా ఆలయ కమిటీ ఛైర్మన్ అక్కంధ్ర సన్యాసిరావుకి ఈ విరాళాన్ని అందజేశారు. గోపి కృష్ణకు ఎమ్మెల్యే గోవిందరావు, ఆలయ కమిటీ ఛైర్మన్ అక్కంధ్ర సన్యాసిరావు, కమిటీ సభ్యులు, ఆలయ సిబ్బంది ప్రత్యేకమైన అభినందనలు తెలిపారు. అలాగే మరింత మంది భక్తులు ముందుకు వచ్చి నిత్య అన్నప్రసాద కార్యక్రమానికి, ఆలయ అభివృద్ధి పనులకు సహకరించి అమ్మవారి సేవలో పాలుపంచుకోవాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

## వల్లేవలసలో జిల్లా స్థాయి బలప్రదర్శన పోటీలు



సంతబొమ్మాళి, మార్చి 31 ప్రభాతవార్త: శ్రీరామ నవమి సందర్భంగా వల్లేవలస శ్రీచిన్మయానంద స్వామి ఆలయం వద్ద బలప్రదర్శన పోటీలు ఉత్సాహంగా జరిగాయి. జిల్లా నలుమూలల నుంచి క్రీడాకారులు వెయిట్ లిఫ్టింగ్ పురుషులు, మహిళలు, తీతసం గిడి, ఈడుపుసం గిడిలో హోరాహోరీగా తలబడి క్రీడావాతావరణాన్ని కల్పించారు. పోటీలను తిలకించేందుకు క్రీడాభిమానులు, పరిసర గ్రామ ప్రజలు తరలి వచ్చి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. వల్లేవలస శ్రీచిన్మయానంద ఆశ్రమ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు, పరిసర ప్రాంత గ్రామపెద్దలు సహాయ సహకారాలతో నిర్వహించబ డ్డాయి. పోటీలకు మాజీ జాతీయ వెయిట్ లిఫ్టర్ పిలక ధనుంజయకుమార్ మాస్టర్ వ్యవహరించారు. గెలుపొందిన క్రీడాకారులకు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు రెడ్డి అప్పన్న, గూట్ల మల్లేశ్వరరావు, సర్పంచ్ వడ్డీవాడ, సూరిబాబు మాస్టర్, సచ్చిదానందస్వామి, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు, కటారి పురుషోత్తం కుటుంబ సభ్యులు, ప్రజలు, పరిసర ప్రాంత గ్రామపెద్దలు ఆధ్వర్యంలో బహుమతి ప్రధానం జరిగింది.

## సర్పంచ్‌లకు సన్మానం



ఇచ్ఛాపురం మార్చి 31 ప్రభాతవార్త: ఏప్రిల్ 2తో పదవీ కాలం పూర్తి చేసుకున్న సర్పంచ్‌లను మండల పరిషత్ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఎంపిడిఓ ప్రభాకరరావు ఆధ్వర్యంలో ఎంపిపి బోర పుష్ప అధ్యక్షతన ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపిలు కారంగి మోహన్ రావు, దక్కత ఢిల్లీరావు, దక్కత ఏకాంబరిదేవి, పిఏసీఎస్ అధ్యక్షుడు పేదిని బాబ్జి, ఏ ఓ రామారావు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు లోపింటి పద్మనాభం, వైస్సార్సీపీ మండల అధ్యక్షుడు పాతిర్ల రాజశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా పంచాయతీ వేలం పాట

వీరఘట్టం, మార్చి 31 ప్రభాతవార్త : స్థానిక పంచాయతీ కార్యాలయం ఆవరణలో మంగళవారం పలు షాపులకు, డైలీ మార్కెట్లకు నిర్వహించిన వేలంపాట ప్రశాంతంగా జరిగింది. అంబేద్కర్ జంక్షన్‌లోని ఆరు షాపులకు గాను ఐదు షాపులకు వేలం పాటను నిర్వహించారు. రెండో నెంబర్ షాపుకు ఎవరు రానందున ఖాళీగా ఉంది. అలాగే 9, 10 ప్లాట్లు కూడా వేలం పాట జరిగింది. అలాగే కొత్త బస్టాండ్ ఆవరణలో ఎనిమిది షాపులకు గాను ఒక షాపుకు మాత్రమే వేలంపాట జరగగా ఏడు షాపులకు ఎవరు ముందుకు రాని కారణంగా ఖాళీగా ఉన్నాయి. అలాగే 9, 10 ప్లాట్‌లకు వేలంపాట జరగగా, డైలీ మార్కెట్, బస్సు కార్ స్టాండ్‌లకు కూడా వేలం పాట ముగిసింది. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బి.వెంకటరమణ ఈవో సిహెచ్ కూర్మినాయుడు, పంచాయతీ సభ్యులు సిబ్బంది, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## కొత్తమ్మతల్లి ఆలయ అభివృద్ధి పనులపై మంత్రి సూచన



కోటబొమ్మాళి, మార్చి 31, ప్రభాతవార్త: మేజర్ పంచాయతీ కోటబొమ్మాళిలో వేంచేసియున్న శ్రీ కొత్తమ్మతల్లి వారి ఆలయ అభివృద్ధి కోసం నిధులు మంజూరైన విషయం విదితమే. మంగళవారం సాయంకాలం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజ రాపు అచ్చెన్నా యుడును కొత్తమ్మతల్లి ఆలయ కార్యనిర్వహణాధికారి వాకచర్ల రాధాకృష్ణ మంత్రి క్యాంపు కార్యాలయం నిమ్మాడలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ముందుగా మంత్రికి అమ్మవారి చిత్రపటా న్ని ఈవో అందజేసి దుశ్శాలువతో సత్కరించారు. ఆలయ అభివృద్ధి పనులు గూర్చి మంత్రి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

## గట్టి భానుకు సన్మానం



సంతకవిటి, మార్చి 31 ప్రభాతవార్త: మండలంలో సంతకవిటి గ్రామ సర్పంచ్‌గా గత ఐదు సంవత్సరాలుగా పదవిని పూర్తి చేసుకున్న సందర్భంగా గ్రామ సిబ్బంది మంగళవారం గట్టి భానుబాబుకి ఘనంగా కృతజ్ఞత పూర్వకంగా దుశ్శాలువతో పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది, సర్పంచ్‌లు, తదితరులు పాల్గొన్నారు.

## చల్లా వెంకటరమణకు ఘన సత్కారం



సీతంపేట, మార్చి 31 ప్రభాతవార్త: సీతంపేట ఐటిడిఏ ఇంజనీరింగ్ విభాగంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేసిన చల్లా వెంకటరమణ పదవి విరమణ సన్మాన కార్యక్రమాన్ని ఐటిడిఏ మీటింగ్ హాల్లో ఘనంగా మంగళవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఐటిడిఏ ఏపీవో జి.చిన్నబాబు మాట్లాడుతూ వెంకటరమణ చాలా నిబద్ధతతో, నిజాయితీతో పనిచేసేవారని అన్నారు. అందరితో కలిసి మెలిసి ఉంటూ తన పనిని తాను చేసుకునేవారని అన్నారు. రిటైర్‌మెంట్ అనంతరం తన శేష జీవితాన్ని కుటుంబ సభ్యులతో సంతోషంగా గడపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఈఈ రమాదేవి, పీహెచ్‌ఓ ఎస్.వి.గణేష్, ఏవో సునీల్, డిఈ నాగభూషణ్, రాజు సిమ్మన్న, తదితరులు పాల్గొన్నారు.

## గ్యాస్ ఏజెన్సీ తీరుకు నిరసనగా హోటళ్ల బంద్




ఇచ్ఛాపురం, మార్చి 31 ప్రభాతవార్త: స్థానిక గ్యాస్ ఏజెన్సీ తీరుకు నిరసనగా ఇచ్ఛాపురం పట్టణంలో మంగళవారం హోటళ్లు ఫాస్ట్ ఫుడ్ సెంటర్‌లు సామూహికంగా బంద్ చేశారు. కమర్షియల్ సిలెండర్‌లు పంపిణీ చేయకపోవడంతో స్వేచ్ఛావతి హోటల్ ఓనర్లు యూనియన్ ఆధ్వర్యంలో బంద్ చేయడంతో ప్రజలు, ఉద్యోగులు, రోగులు, ప్రయాణీకులు ఇబ్బందులు పడ్డారు. టీ షాపులు, టిఫిన్ షాప్‌లు, భోజనం హోటళ్ళు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్‌లు మూతపడ్డాయి. నెల చివరి రోజు కావడంతో ప్రజలు భోజనం దొరకక ఇబ్బంది పడ్డారు.

## సీతారామస్వామి ఆలయానికి ఇత్తడి దీప స్తంభం వితరణ



కంచిలి, మార్చి 31 ప్రభాతవార్త : మండల కేంద్రం రైల్వే స్టేషన్ ఆవరణలో నూతనంగా నిర్మించిన సీతారామస్వామి దేవాలయానికి ప్రముఖ వ్యాపారవేత్త కిల్లంశెట్టి మోహన్‌రావు రెండు ఇత్తడి భారీ ద్వీప స్తంభాలను సోమవారం విరాళంగా అందజేశారు. సుమారు 18 వేల రూపాయల వ్యయంతో ప్రత్యేకంగా తయారు చేయించిన ఈ ద్వీప స్తంభాలను ఆయన ఆలయ కమిటీ ప్రతినిధులకు అందజేశారు. ఆలయ ఆధ్యాత్మిక వైభవాన్ని పెంపొందించడంతో పాటు సౌకర్యాల అభివృద్ధికి తన వంతు సహకారం అందించాలనే ఉద్దేశంతో ఇప్పటికే అన్ని రకాలుగా అందించిన విరాళాలతో పాటు ద్వీప స్తంభాల కూడా అందించినట్లు మోహన్‌రావు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ప్రతినిధులు ఆయన సేవా భావాన్ని ప్రశంసిస్తూ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు జగదీష్ పట్నాయక్, లోళ్ళ సూర్యనారాయణ, తదితర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయంతోనే సుస్థిర సాగు



కొత్తూరు, మార్చి 31 ప్రభాతవార్త : జిల్లా కేంద్రంలోని స్థానిక జేడీ కార్యాలయ ఎఫ్టీసీ వేదికగా ప్రకృతి వ్యవసాయంపై మూడు రోజుల పాటు నిర్వహించిన జిల్లా స్థాయి శిక్షణ కార్యక్రమం ఘనంగా ముగిసింది. జిల్లా ప్రాజెక్టు మేనేజర్ (డి.పి.ఎం) పూజారి సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయాన్ని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసే అంశంపై సుదీర్ఘంగా చర్చించారు. శిక్షణ అనంతరం మండల స్థాయిలో ఈ సాగు పద్ధతులను ఏ విధంగా ముందుకు తీసుకువెళ్లాలనే విషయంపై ఏడీఏలు, ప్రాంతీయ అధికారులు మరియు ప్రకృతి వ్యవసాయ అధికారులు సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కొత్తూరు డివిజన్ ఏడీఏ రాజ్ గోపాల్ మాట్లాడుతూ తమ డివిజన్ పరిధిలో పీఎండీఎస్ పద్ధతిని ప్రోత్సహించేందుకు అవసరమైన కిట్లను రాయితీ రూపంలో అందిస్తున్నట్లు వెల్లడించారు. ముఖ్యంగా ఈ ఏడాది ఎల్ నినో ప్రభావం ఉండే అవకాశం ఉన్నందున, రైతులు నీటి ఎద్దడిని తట్టుకొనే పంటలను ఎంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ధనుంజయరావు, ఐటీడీఏ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ స్వర్ణలత, ఏడీఏలు మధు, శ్రీనివాస్, ప్రాంతీయ అధికారులు ప్రకాష్, హేమసుందర్‌తో పాటు ఉద్యానవన అధికారులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లోనే ఉత్తమమైన విద్య




ఆమదాలవలస, మార్చి 31 (ప్రభాతవార్త): ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమమైన విద్య అందిస్తుందని, బడి ఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలని ఆమదాలవలస మండల విద్యాశాఖాధికారి రాములు తెలిపారు. మండలంలోని వంజంగి గ్రామంలో ప్రధానోపాధ్యాయులు ఉషారాణి ఆధ్వర్యంలో విద్యా ర్థులతో ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ బడుల్లో విలువలతో కూడిన నాణ్యమైన విద్యను అందించేందుకు అన్ని విధాల చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వంజంగి గ్రామంలో ఇంటింటా సర్వే నిర్వహించి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఉత్తమమైన ఉపాధ్యాయులతో విద్యార్థులకు చదువును అందించడం జరుగుతుందన్నారు. అన్ని రకాల వసతులు కల్పిస్తూ మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తున్నట్లు తెలియజేశారు. పాఠశాలల్లో అడ్మిషన్ల సంఖ్యను పెంచేందుకు తల్లిదండ్రులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు టివిటి భాస్కరరావు, పూజారి రాధాకృష్ణ, సనపల సుధాకర్, జగన్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## సిరిమాను గోడపత్రికను ఆవిష్కరించిన మంత్రి అచ్చెన్న



కోటబొమ్మాళి, మార్చి 31 ప్రభాతవార్త : హరిశ్చంద్రపురం గ్రామంలో ఏప్రిల్ 20 నుంచి 28 వరకు నిర్వహించనున్న శ్రీశ్రీశ్రీ గ్రామదేవత అనిరితల్లి సిరిమానోత్సవ మహోత్సవానికి సంబంధించిన గోడపత్రికను రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు నిమ్మాడ క్యాంప్ కార్యాలయంలో మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు, యువకులు, కమిటీ సభ్యులు ఈ ఉత్సవాలను విజయవంతం చేయడానికి కృషి చేయాలని మంత్రి సూచించారు. మంత్రిని కలిసిన వారిలో టెక్కలి నియోజకవర్గం తెలుగు మహిళ అధ్యక్షురాలు, హరిశ్చంద్రపురం మాజీ సర్పంచ్ పూజారి శైలజ, సత్యన్నారాయణ, లింగుబెరి రామప్పాడు, దోకి రమణ మూర్తి, దోకి రవి తదితరులు ఉన్నారు.

# శ్రీకాకుళం వార్త

## అంగన్‌వాడీ కేంద్రానికి జారుడు బల్ల, ఉయ్యాల వితరణ



సంతబొమ్మాళి, మార్చి 31, ప్రభాతవార్త : బోరుభద్రలో చమల్లా తస్వికృష్ణ పుట్టినరోజు సందర్భంగా స్థానిక అంగన్వాడీ కేంద్రానికి ఒక జారుడు బల్ల, పిల్లలు ఆడుకునే ఉయ్యాల గిఫ్ట్‌గా అందించారు. ఈ సందర్భంగా కేంద్రంలో పిల్లలు సమక్షంలోనే తస్వి కృష్ణ పుట్టినరోజు వేడుకలు జరుపుకోవడం, కేక్ కట్ చేసి తోటి పిల్లలకు మిఠాయి పంచిపెట్టారు. ఈ సందర్భంగా పిల్లలు తల్లిదండ్రులు మాట్లాడుతూ చిన్నపిల్లలకు ఉపయోగపడే వస్తువులు ఇవ్వడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ విధంగా ఏదైనా మంచి కార్యక్రమం చెయ్యడానికి అవకాశము కల్పించిన భగవంతునికి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ స్కూల్ సిబ్బంది గోవిందరావు, భవాని అంగన్వాడీ సిబ్బంది జలజ, సూర్యకుమారి, ఆశా సహాయకురాలు వాణి, పిల్లలు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే కూటమి ధ్యేయం : అచ్చెన్న



కోటబొమ్మాళి, మార్చి 31 ప్రభాతవార్త : ప్రజా సంక్షేమమే పరమావధిగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. మంగళవారం నిమ్మాడలోని తన క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. నందిగాం, టెక్కలి మండలాల నుండి పెద్ద ఎత్తున తరలివచ్చిన ప్రజల నుంచి వినతులను మంత్రి స్వయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రజా దర్బార్‌కు వచ్చిన వినతుల్లో అత్యధికంగా భూమి సమస్యలకు సంబంధించిన ఫిర్యాదులు ఉన్నాయని తెలిపారు. గత ప్రభుత్వ పాలనలో జరిగిన తప్పిదాల వల్ల, రెవెన్యూ అధికారుల నిర్లక్ష్య కారణంగా అనేకమంది పేదల భూములు ఇతరుల పేర్లకు మార్చిడి అయ్యాయి. బాధితులకు న్యాయం జరిగేలా రెవెన్యూ అధికారులతో మాట్లాడి ప్రతి ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించి న్యాయం జరిగేలా చేస్తామని తెలిపారు. మౌలిక సదుపాయాలకు పెద్దపీట గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి పేర్కొన్నారు. ఇందులో భాగంగా రహదారుల నిర్మాణం, గ్రామాల్లో సీసీ రోడ్లు లేని గ్రామం ఉండకూడదని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రజా సంక్షేమమే ప్రథమ ప్రాధాన్యత విద్య, వైద్యం మరియు ఆరోగ్య రంగాలకు ప్రభుత్వం అత్యున్నత ప్రాధాన్యత ఇస్తుందని, సామాన్య ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పారదర్శక పాలన అందిస్తామని మంత్రి అచ్చెన్నాయుడు పునరుద్ఘాటించారు. సమస్య ఏదైనా సరే, నేరుగా తన దృష్టికి తీసుకురావచ్చని ప్రజలకు భరోసా ఇచ్చారు.

## బాలబాలికల స్వీయరక్షణే శక్తి టీమ్ లక్ష్యం



కోటబొమ్మాళి, మార్చి 31 ప్రభాతవార్త : బాలబాలికల స్వీయ రక్షనే శక్తి టీం ప్రధాన లక్ష్యమని కోటబొమ్మాళి పోలీస్ హెడ్ కానిస్టేబుల్ కిల్లి గణేష్ అన్నారు. మంగళవారం కోటబొమ్మాళి శ్రీనివాస ఏ.పీ.ఆర్జే.సీ కోచింగ్ సెంటర్, పాత పోస్ట్ ఆఫీస్ భవనంలో శక్తి టీం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యంగా బాలబాలికలు వారి యొక్క స్వీయ రక్షణ నిమిత్తము, ఏదైనా ఇబ్బందికర పరిస్థితులు ఎదురైనప్పుడు వారికి సహాయంగా పోలీస్ హెల్ప్ లైన్ నెంబర్స్ గూర్చి, నేషనల్ హైవే మరియు రూరల్ రోడ్లపై ప్రతి ఒక్కరూ విధిగా హెల్మెట్లు ధరించాలని, విధిగా లైసెన్స్ తీసుకోవాలని, మైనర్లు డ్రైవింగ్ చేయడం నేరం, ప్రమాదాలు చెప్పి రావు గనక, మద్యం సేవించి వాహనం నడుపుట ప్రమాదం, హెల్మెట్లు ధరించడం వలన ఉపయోగాలు గూర్చి ఎవేర్నెస్ ప్రోగ్రాం, నేషనల్ హైవే హెల్ప్ లైన్ నెంబర్ 1033, పోలీస్ హెల్ప్ లైన్ నెంబర్స్ 181, 112, 1091, నెంబర్లు యొక్క వినియోగం గూర్చి, వేధింపులు గృహహింస, ఫోక్సో కేసులు అంతేకాకుండా 1930 సైబర్ మోసానికి గురైనట్లయితే ఈ నెంబర్ మరియు మారకద్రవ్యాలు సరఫరా వినియోగం కోసం 1972 (యాంటీ డ్రగ్స్), 1098 బాల్య వివాహాలు, బాల కార్మికుల కొరకు విద్యార్థులకు తెలియపరచడం జరిగింది. కార్యక్రమం నందు టెక్కలి హెడ్ కానిస్టేబుల్ ఎం.గిరిధర్, కోటబొమ్మాళి హెడ్ కానిస్టేబుల్, కె.గణేష్, మహిళా కానిస్టేబుల్స్, ఎం.చామంతి, ప్రిన్సిపాల్ దేవాది శ్రీను, సిబ్బంది పాల్గొన్నారు.

## సీసీ రోడ్లను ప్రారంభించిన ఎమ్మెల్యే ఎన్ఈఆర్



రణస్థలం, మార్చి 31 (ప్రభాతవార్త): మండల కేంద్రం, రణస్థలం పంచాయతీలో గల రూ.40 లక్షల అంచనా వ్యయంతో నూతనంగా నిర్మించిన ఐదు సీసీ రోడ్లను ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ, రాష్ట్ర పంచాయతీరాజ్ ఛాంబర్స్ అధ్యక్షులు వైవీబీ రాజేంద్రప్రసాద్‌తో కలిసి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి పెద్దపీట వేస్తోందని, ప్రజల సౌకర్యార్థం మౌలిక సదుపాయాల కల్పనకై కృషి చేస్తోందన్నారు. పంచాయతీ పరిధిలోని అంతర్గత రహదారుల నిర్మాణంతో ప్రజలకు రవాణా కష్టాలు తీరుతాయని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షులు పిన్నింటి బానోజీ నాయుడు, కూటమి నాయకులు పిషిణి జగన్నాధం నాయుడు, డిజిఎం ఆనందరావు, మండపాక కనకారావు, మజ్జి పండు, కెల్ల హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీ కలిశెట్టికి అభినందనలు తెలిపిన గ్రామీణ వైద్యుల సంఘం



రణస్థలం, మార్చి 31 ప్రభాతవార్త : గ్రామీణ వైద్యుల సేవలను వెలకట్టలేమని వారికి కమ్యూనిటీ పారామెడిక్స్ సిబ్బందికి కమ్యూనిటీ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్లుగా ప్రభుత్వం గుర్తింపుని ఇవ్వాలని విజయన గరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు న్యూఢిల్లీ లోకసభలో రూల్ 377 కింద నోటీస్ ఇచ్చిన కోరడంపై ఎచ్చెర్ల నియోజక వర్గం రణస్థలం ఏరియా గ్రామీణ వైద్యుల సంఘం అధ్యక్షులు గురజాపు రాము ప్రధాన కార్యదర్శి కొత్తకోట సింహాద్రి నాయుడు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు ఎంపీ కలిశెట్టికి కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం వారు స్థానిక విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ గ్రామీణ వైద్యుల సేవలను ఎంపీ గుర్తించి గిరిజన గ్రామీణ ప్రాంతాల్లో గ్రామాల్లో ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్న వీరికి శిక్షణ నైపుణ్య అభివృద్ధి కల్పించి వారి జీవనోపాధి సాగే విధంగా ప్రభుత్వం తగు చర్యలు తీసుకోని ఆదుకోవాలని పార్లమెంట్‌లో తెలియజేయడం పట్ల ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అభినందనలు తెలిపారు.

## పాతపట్నం బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా దాలయ్య




పాతపట్నం, మార్చి 31 ప్రభాత వార్త : పాతపట్నం బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా రెండవ సారి ఉర్లాన దాలయ్యను అసోసియేషన్ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే జనరల్ సెక్రెటరీగా రెండోసారి మద్దిలి రమణను, ఉపాధ్యక్షులుగా గొంటి రామ్మోహన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జాయింట్ సెక్రటరీగా గంగు కామేశ్వరరావు, స్పోర్ట్స్ సెక్రటరీగా లకలాపు యుగంధర్, ట్రెజరర్‌గా ముల్లు రామారావు, లైబ్రేరియన్‌గా ఏనుగుతల చంద్రభూషణ్, ఎగ్జిక్యూటివ్ బాడీ మెంబర్లుగా సలాన దండాసి, మెట్ట రామారావు, గేదెల సూర్యారావు, బుద్ధుల ఈశ్వర సత్యన్నారాయణ, రౌతు సూర్య ప్రకాశరావు, పద్ద అప్పలనాయుడులు ఎన్నుకోబడ్డారు. కార్యక్రమంలో లాయర్లు సంపతిరావు రవికుమార్, చెంచల రామకృష్ణ, బాడాన వెంకటప్పల నాయుడు, శిస్టు షణ్ముఖరావు, కుర్మాపు రామారావు, దుంపల గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

# రికార్డు సంఖ్యలో సూర్య నమస్కారాలు..



**యోగ సాధనతో ఎన్ని ప్రయోజనాలో! ముఖ్యంగా మహిళల్లో వచ్చే అనేక అనారోగ్యాలకు యోగాతో చెక్ పెట్టొచ్చు. నిర్మలారాణి జిల్లెలమూడి ఇదే సమయంలో చెప్పాలనుకున్నారు. అందుకోసమే రికార్డు సంఖ్యలో సూర్య నమస్కారాలు చేశారామె.**

సొంతూరు గుంటూరు... నాన్న ఉద్యోగరీత్యా నాగార్జునసాగర్‌లో పెరిగాను. చిన్నప్పుడే యోగా నా జీవితంలో భాగమైంది. దీనివల్ల ప్రయోజనాలవల్ల ఇప్పటికీ యోగ సాధనను కొనసాగిస్తున్నా. ఇందుకు మావారు సత్యనారాయణ ప్రోత్సాహమూ ఉంది. 2016లో యోగాలో ఏడాది వ్యవధిలో డిప్లొమా చేశాను. అప్పుడే రాష్ట్రస్థాయి పోటీలకు వెళ్లి మూడో స్థానంలో నిలిచా. ఎమ్మెస్సీ, ఈడీ పూర్తిచేశా ప్రస్తుతం విశాఖపట్నంలోని తిరుమల విద్యా సంస్థల డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఇక్కడికి చక్ర హీలింగ్ ప్రాక్టీసు చేయిస్తాను, మంత్రోచ్చరణతో వాళ్లలో చాలా అనారోగ్య సమస్యలు వస్తాయి. హార్మోన్ల అసమతుల్యత పరిష్కారమవుతుంది. ప్రస్తుతం 30లోనే మహిళల్ని అనారోగ్యాలు చుట్టుముడుతున్నాయి. వీటి పరిష్కారానికి యోగసాధన మేలు చేస్తుంది. ఇదే పరిశీలన మహిళల్లోకి తీసుకెళ్లాలనుకున్నా..

**యోగసాధనలో భాగంగా...** సూర్య నమస్కారాలు ఎక్కువగా చేస్తుంటారు. వీటితో కాళ్లు, వెన్ను, భుజాలు... దాదాపు శరీర భాగాలన్నింటిపైనా ప్రభావం ఉంటుంది. అందుకే నిర్ణీత సమయంలో వీటిని చేసి రికార్డు నెలకొల్పేందుకు ఏడాది కిందట లక్ష్యం పెట్టుకున్నా. మొదట్లో 50 సూర్య నమస్కారాలు చేయడానికి గంట పట్టేది. క్రమంగా మెరుగుపర్చుకుంటూ వచ్చా. 22 నిమిషాల్లో 100 సూర్య నమస్కారాలు చేయడంతో ఘనత సాధించిన మహిళగా ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్, ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ చోటు దక్కింది. వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ నుంచి గుర్తింపు రానుంది. ప్రస్తుతం 20 నిమిషాల్లో 111 వరకు సూర్య నమస్కారాలు చేయగలుగుతున్నా. మహిళలు లక్ష్యం నిర్దేశించుకోవాలేగానీ, సాధించలేనిదంటూ ఉండదు. ప్రస్తుతం ఎంబీఏ చేస్తున్నా. వృత్తిలో రాణిస్తూ, ఉన్నత చదువులవైపు వెళ్లగలగడానికి కారణం ☐

# రాత్రి వేళ అలా వద్దు !



**మార్నింగ్, నైట్ రొటీన్లు...** ఇప్పుడు చాలామంది పాటిస్తున్నదే! అంటే పగలు ఒక క్రీము, రాత్రి ఒక క్రీము ఇలాగన్నమాట. ఇంకా ఆసక్తి ఉన్నవాళ్లు హెవీ క్రీములు, నూనెలు, ఓవర్నైట్. మాస్కులు అంటూ ఇంకా చాలా ప్రయత్నిం చండి. వీటన్నింటితో చర్మం ఇంకా బాగా రిపేర్ అవుతుంది అనుకుంటారు. కానీ అది వాస్తవం కాదు అంటున్నారు నిపుణులు, పగలు వేడి, దుమ్ము... చర్మం ఇలా ఎన్నింటి బారిన పడుతుందని తెలుసు? రిపేర్ దానికి రాత్రి బాగా సాయపడుతుంది. ఆ సమయంలో కంటి పునరుత్పత్తి కొలమాన పెరుగుదల, చర్మం తిరిగి పునరుత్తేజం పొందడం జరుగుతాయి. అయితే అందుకు తగిన తేమ, పోషకాలు కావాలి. ఇలా చర్మంపై పేరుకుని పోయినట్లుగా ఉండేవి కాదు. పొడి చర్మం వాళ్లయితే సెరమైడ్స్, ఫ్యాటీ యాసిడ్లు ఉన్నవి వాడొచ్చు. అదే జిడ్డు, మొటిమలు ఎక్కువగా వచ్చేవాళ్లు వాడితే మొటిమలు పెరుగుతాయి. కాబట్టి, మీ చర్మానికి తగ్గట్టుగా అలా ఏం కావాలో తెలుసుకోండి. అలాగే వృద్ధాప్య ఛాయలు రావొద్దంటూ చాలామంది రెటినాయిడ్స్‌ని వాడుతున్నారు దాంతోపాటు ఎక్స్‌ఫోలియేటింగ్ యాసిడ్ ఉన్నవి రాస్తే సమస్య తగ్గకపోగా పెద్దదవుతుంది. రెటినాల్తోపాటు బెంజైల్ పెరాక్సైడ్, విటమిన్ సి స్థిర వాడినా సమస్య. దానికి హైలురోనిక్ యాసిడ్, గ్లిజరిన్, నియాసిన మైడ్, పెప్టైడ్లు ఉన్న క్రీములు జతగా వాడుకోవచ్చు. కాబట్టి, ఏవి అనువైనవో తెలుసు కోండి. జోడీ కుదురు తుందా అన్నదీ గమనించు కోండి. అలాగే అన్నీ ఒక్కసారిగా రాస్తూ వెళ్లకండి. నిపుణుల సాయంతో ఎంచుకోండి. మొత్తంగా మీరు రాసేవి చర్మం తిరిగి కోలుకోవ దానికి సాయపడాలే కానీ దానికి ఇబ్బంది కలిగించేదిగా మారొద్దు. ☐

# నీరు వృథా చేయరాదు !



ఎవరైనా తాగడానికి నీళ్లు లేక ఇబ్బందులు పడుతున్నా... అలాంటి కబురు విన్న మనసు చివుక్కుమంటుంది కదూ! అమ్మో నీళ్లు జాగ్రత్తగా వాడుకోవాలి, అస్సలు వృథా చేయొద్దుఖ అని అనుకుంటాం. మహా అయితే ఒకటీ రెండు రోజులు గమనించుకుంటా మేమో! తరవాత మర్చిపోయో, పనుల హడావుడిలో పడో కావాలని వృథా చేయకపోయినా యధారిత పనులు చేసుకుంటూ వెళతాం. తరవాతెప్పుడో గమనించినప్పుడు అనిపిస్తుంది. 'అరెరే ఇక్కడ నీటి వాడకం తగ్గించాల్సింది' అని! అందుకే నిజంగా ఆదా చేయాలనుకుంటే నీటిని పొదుపు చేయాలి అని అసలే అనుకోవద్దు. అదేంటి అని ఆశ్చర్యపోకండి. ఇలా మనం ఇప్పుడు కొత్తగా అనుకుంటున్నామా ఏంటి? లేదు కదా! ఎన్నోసార్లు మనసుకి చెప్పుకోనీ మెదడుకి అలవాటైపోయి ఉంటుంది. అందుకే అదీ సీరియస్ గా తీసుకోదు. ప్రతి పనిలో ఎంత తక్కువ నీళ్లు వాడగలను అన్న సవాలు ఇవ్వండి. అప్పుడు మెదడు అలర్ట్ అవుతుంది. దీనితో పరిష్కారాల కోసం వెతుక్కుం టుంది. అప్పుడు బ్రష్ చేస్తున్నప్పుడు ట్యాప్ కట్టేయడం, ట్యాప్ కింద కాకుండా గిన్నెలోకి నీళ్లు పట్టి కూరగాయలు కడగడం, వంటగదిలో వాడిన నీటి మొక్కలకు పోవడం... ఇలా ఎన్నెన్ని సలహాలను ఇస్తుందో. కొన్నాళ్లు ఈ సవాలు ఇస్తూ వెళితే సరి. తరవాత అలవాటుగా మారడం మీరే గమనిస్తారు. ఒక్కసారిగా ఫలితం కనిపించలేదు. కానీ దీర్ఘకాలంలో మీరు ఊహించలేనంత ఆదా చేసినట్టే దీన్నే సైకాలజీలో రివర్స్ థింకింగ్ ట్రిక్ అంటారు. చూడటానికి చిన్నగా అనిపిస్తుంది కానీ...చూపే ప్రభావం మాత్రం చాలా ఎక్కువ. నీటి ఆదాకి మీరూ దీన్ని ప్రయత్నించి చూడండి మరి! ☐

# ఉపవాసం ఎందుకంటే..

ఉపవాసం గురించి అధ్యాత్మికవేత్తలు మనసు ఎంత నిలకడలేనిదో నాలుక కూడా అంతే చంచలమైంది. అది ఎన్నెన్నో రుచులు కోరుకుంటుంది. ఏవేవో తినాలనిపిస్తుంది. అలాంటి జిహ్వాచాపల్యాన్ని తగ్గిస్తుంది. ఉపవాసం. అంటే కేవలం ఆహారం తీసుకోకపోవడమే కాదు, పుణ్య దినాల్లో దైవాన్ని స్మరిస్తూ గడపటం. ఉండకూడదు అంటూ హితవు పలికారు. ఉపవాసంతో తోటివారి ఆకలి బాధ అర్థమవుతుందనే అంతర్యమూ ఉంది. దాంతో అన్నదానం చేస్తేనే స్ఫూర్తి కలుగుతుంది. ఇది అత్యుత్తమ దానం. ఆకలితో ఎవరూ తపించకూడదన్నదే ఉద్దేశం సాటి మనుషులే కాదు, చుట్టూ ఉన్న మూగజీవాల ఆకలి తీర్చడమూ కర్తవ్యమే.

భక్తి పేరుతో ఉన్న ఈ ఆచారం శాస్త్ర ప్రకారమూ మంచిదే, ఉపవాసం ఉపకారి అని మనం గుర్తుంచుకోవాలి ఉపవాసం శారీరకంగా, మానసికంగా చురుగ్గా ఉండేలా చేస్తుంది. ఉప వాసం పూర్తయ్యాక భక్తిశ్రద్ధలతో దైవాన్ని స్మరించుకోవాలి. తర్వాత.. ఆయా కాలాలకు తగ్గట్టు ఆహారం తీసుకోవాలి. పూర్వం రుషులు కందమూలాలు మాత్రం తిని, సరోవరంలో తేటనీరు సేవించి.. సంవత్సరాల తరబడి తపస్సు చేసుకునేవారు. ఉపవాసం మంచిదైనప్పటికీ బాలలు, వృద్ధులు, రోగులు అభోజనంగా



అన్నం మినహాయించిన పండ్లు, ఫలహారాలు అతిగా సేవించడం ఉపవాసం అనిపించుకోదు. ఇది పెద్దల ఉద్దేశానికి ఆటంకమే. అలాగే దేవుడికి కొబ్బరికాయ, పండ్లు, బెల్లం లాంటివి నైవేద్యంగా సమర్పించడంలో ధర్మసూక్ష్మం ఉంది. అవి ప్రసాదంగా తీసుకోవడం వల్ల నీరసం పోయి శక్తి చేకూరు తుంది. ఆహారం అధికమయ్యే కొద్దీ వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. పొట్టలో కొంత భాగం ఖాళీగా ఉంటే జీర్ణప్రక్రియ సవ్యంగా ఉంటుంది. అనారోగ్యాలు దరిచేరవు. తామసగు ణాన్ని పెంచే ఆహారం, సూర్యాస్త మయం తర్వాత తినకూడదు లాంటివి భక్తి ఆచారం పేరుతో శ్రేయోదాయకం. ☐

# నట్స్ మహారాణి మెకడేమియా !



నోట్లో వేసుకుంటే కరిగిపోతూ... వెన్న రుచిని అందజేసే మెకడేమియాతో మహిళలకు బోలెడు ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని తెలుసా! ఒకప్పుడు విదేశాల నుంచి దిగుమతి చేసుకునేవాళ్లం దీన్ని. ఇప్పుడు మన దేశంలోనూ పండు తున్నాయి. వీటిలో ఉండే మోనో అన్ శాచురేటెడ్ కొవ్వులు, చెడు కొవ్వులను తగ్గించి గుండె జబ్బుల్ని దూరం చేస్తుంది. వీటిలో పీచు పదార్థాలు, ప్రొటీన్లు ఎక్కువగా ఉంటాయి. ఆకలిని తగ్గించి బరువుని నియంత్రణలో ఉంచుతాయి. ముఖ్యంగా కీటో డైట్ పాటించే వాళ్లకి ఇవి మంచి ఎంపి వీటిలో ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు మెండుగా ఉంటాయి. ఇవి మెదడును రక్షించి జ్ఞాపకశక్తిని పెంచుతాయి. అంతేకాదు, ఈ గింజల్లో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు చర్మాన్ని మెరిసేలా చేస్తాయి. ముడతలను దూరం చేస్తుంది. కీళ్ల నొప్పులు, ఆర్థరైటిస్ ఉన్నవాళ్లు మేకడేమియా గింజలు తీసుకుంటే మంచిది. వీటిలో ఉండే మాంగనీస్, మెగ్నీషియం, ఫాస్ఫరస్ ఎముకలకు బలాన్నిస్తాయి. హార్మోన్ల హెచ్చుతగ్గులను సమతౌల్యం చేస్తుంది. పీసీఓడీ, పీసీఓఎస్‌ని తగ్గించి నెలసరిని గాడిలో పడేలా చేసింది. ☐

# బహుమతులతో నైపుణ్యాలు!

హోంవర్క్, క్లాస్ వర్క్ అన్నీ బాగా చేస్తారు. పరీక్షల్లోనూ మంచి మార్కులే తెచ్చుకుంటారు. కానీ టీచర్ ప్రశ్న అడిగినప్పుడు, లెక్క బోర్డు మీద ఇచ్చి... సమాధానం ఎవరు రాస్తారు? అన్నప్పుడు చాలా మంది పిల్లలు భయపడ తారు. కారణం... వేదిక మీదకు వెళ్లే ధైర్యం లేకనే. ఈ భయం వాళ్లని తరగతులు పెరిగినా వెంటాడుతుంటుంది. అలాకాకుండా మీ పిల్లలు గదిలో చురుకుగా వ్యవహరించా లంటే వాళ్లకి ఈ 'వుడెన్ టు ఇన్ వన్ బోర్డ్'ను బహుమతిగా ఇవ్వండి. ఇంట్లో చదువుకునేటప్పుడు దీన్ని ఉపయోగించమని చెప్పండి. దీనివల్ల వాళ్లకు బోర్డు మీద రాసే భయం పోతుంది. పోల్డబుల్ మోడల్‌లో వస్తున్నాయి కాబట్టి స్థలభావ సమస్య కూడా ఉండదు. ఇంట్లో గలగలలా మాట్లాడే పిల్లలు... సబ్జెక్ట్ తెలుసా, వాళ్లకు వచ్చిన అంశమే అయినా స్టేజ్ ఎక్కి మాట్లాడమంటే భయపడతారు. తప్పులు దొర్లుతాయేమో, తోటి స్నేహితులు హేళన చేస్తారేమో, అందరూ నావైపే చూస్తారు లాంటి భయాలు. వాటిని పోగొట్టా లంటే ఈ 'ఎక్స్ రాబిట్ కిడ్స్ మైక్రోఫోన్'ను ఇచ్చి చూడండి. ఇది వైర్లెస్. మైక్రోఫోన్, బ్లూటూత్ స్పీకర్ పనిచేస్తుంది. వాయిస్నీ రికార్డు చేస్తుంది. ఒక్కసారి ఛార్జ్ చేస్తే... సుమారు 56 గంటల వరకూ పనిచేస్తుంది. దీంతో ఆడుతూ పాడుతూ పబ్లిక్ స్పీకింగ్ నైపుణ్యాలను ఇట్టే నేర్చు కుంటారు పిల్లలు. వాయిస్ రికార్డు చేసు కునే వెసులుబాటూ ఉంది కాబట్టి తమ గొంతు తామే వింటూ ఇంకా ఉత్సాహంగా మాట్లాడుతుంటారు. ఒక మంచి వ్యాసం ఇచ్చి దాన్ని ఇంటి దగ్గరే ప్రాక్టీసు చేయిస్తే... వక్తృత్వ పోటీల్లో పాల్గొనే ధైర్యాన్ని నేర్పిన వారవుతారు. ఇదంతా డిజిటల్ యుగం. చిన్నపిల్లలూ ఇన్ఫ్లుయెన్సర్లుగా మారిపోతు న్నారు. నచ్చిన వీడియోలు, దీని ఫొటోలు తీసి సామాజిక మాధ్యమాల వేదికగా పంచుకుంటున్నారు. కానీ దీనివల్ల



సమస్యలే ఎక్కువ తెరలకు బానిసలవు తున్నారు. మీ పిల్లలు అలా కాకూడదంటే ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ మీద వాళ్లకున్న ఆసక్తిని కోల్పోకుండా ఈ కెనాన్ పవం హెట్ ఏ70 కెమెరాను ఇచ్చి చూడండి. చర్చిత్వఇది రెట్రో లుక్ ఫొటోలని ఇస్తుంది. ఆప్టికల్ జూమ్ లెన్స్, ఏ సైజ్ బ్యాటరీలతో పనిచేస్తుంది. వీటిని పిల్లలకు ఇవ్వడం వల్ల ప్రపంచాన్ని ఓ కొత్త కోణంలో చూపించిన వారవుతారు. ☐

## 'పిఠాపురంలో' 'పట్టుకో బాబా' పాట



'పిఠాపురంలో' 'పట్టుకో బాబా' పాట ఆవిష్కరించిన ప్రముఖ దర్శకుడు కొరటాల శివ ఈ సందర్భంగా కొరటాల శివ మాట్లాడుతూ... "చంద్ర మహేష్ గారు అప్పట్లో తీసిన బ్లాక్ బస్టర్ ప్రేయసి రావేఖి కి నేను రైటింగ్ అసిస్టెంట్ గా పని చేశాను. ఆ తర్వాత ఆయన తీసిన మరికొన్ని చిత్రాలకు కూడా నేను పని చేశాను. అందుకే ఈ పాటను ఆవిష్కరిస్తున్నం దుకు చాలా ఆనంద పడుతు న్నాను. దర్శకుడు మహేష్ చంద్ర మాట్లా డుతూ "ఇటీవల విడుదల చేసిన ట్రైలర్ కి సూపర్ రెస్పాన్స్ వచ్చింది. అన్ని ఏరియాల పంపిణీ దారులు చాలా ఆసక్తి కనబరు స్తున్నారు. సినిమా ఫస్ట్ కాపీతో సహా సిద్ధమయింది. ఏప్రిల్‌లో ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తాం" డా. రాజేంద్రప్రసాద్, పృధ్వీరాజ్ ,కేదార్ శంకర్, మణిచందన, జయవాహిని, అన్నపూర్ణమ్మ, దాసరి పద్మ, సన్నీ అఖిల్, విరాట్, సాయి ప్రణీత్, శ్రీలు, ప్రత్యూష, రెహానా, ర్ఫి. పవన్ కళ్యాణ్, J.D.V ప్రసాద్, KA పాల్ రాము, జబర్దస్త్ శేషు ఇందులో ప్రధాన తారాగణం.

# అనుష్కశెట్టి ప్రధాన పాత్రలో 'కథనార్' ట్రైలర్ విడుదల



గోకులం మూవీస్ బ్యానర్ మీద గోకులం గోపాలన్ నిర్మాతగా రొజిన్ థామస్ తెరకెక్కిం చిన చిత్రం 'కథనార్'. ఈ సినిమాలో జయ సూర్య, అనుష్క శెట్టి, ప్రభుదేవా, సనూప్ సాన్ వంటి వారు కీలక పాత్రల్ని పోషిం చారు. ఈ మూవీకి సంబం ధించిన ట్రైలర్‌ను విడుదల చేశారు. విజ్ఞానం యొక్క రూపం మూలం ఎలా ఉన్నా కూడా.. కాంతూర్ శాలయలో దాన్ని ఆహ్వానిస్తారు.. ఇంద్రజాలాన్ని నేను నమ్మను.. అవగాహనతో రహస్య మార్గాలలో వాళ్లు దాన్ని పరిశోధిస్తు న్నారు.. ఎవరి ఊహకి అందని.. అందరూ ఆశ్చర్యంతో చూసే ఒక మాయా జాలం.. మన ఆత్మతో కలిసి మన జ్ఞాపకాలతో ఐక్యం కాబోయే ఒక సంఘటన.. చేర మహారాజుకి కుంచమున్ తరుపున శుభాకాం క్షలు..చూసినది విన్నది ఏదీ రాదు.. వచ్చేది ఒక్కటే.. ఆపత్కాలంలో వచ్చే మహా మనిషి అగ్ని ఒక్కటే.. కరం కలిస్తే ఆప్యాయిత.. కరం వెడిస్తే నాశనమే బలం.. ఒక శరీరాన్ని అదుపు చేసే ఎక్కువ శక్తిని మీరు నియం త్రించగలిగారు.. ఎలాగా?..మేం చెప్పేది నమ్మండి. వేనాడు ఆపదలో ఉంది.. మాయ.. ప్రపంచమే మాయ్య అంటూ సాగిన డైలాగ్స్‌తో ట్రైలర్ అద్భుతంగా ఉంది.ఇక ఈ ట్రైలర్‌లో జయ సూర్య, అనుష్క శెట్టి, ప్రభుదేవా, సనూప్ సాన్, శాండీ, దేవిక, నితీష్ భరద్వాజ్, వినీత్, హరీష్ ఉత్తమన్, శ్రీకాంత్ మురళి, కులప్రీత్ యాదవ్‌లను చూపించిన తీరు, ఒక్కో పాత్ర, వారి లుక్‌ను రివీల్ చేసిన తీరు అద్భుతంగా ఉంది. ఇక ఇందులోని యాక్షన్ సీక్వెన్స్, విజువల్స్, వీఎఫ్ఎక్స్ వర్క్ అద్భుతంగా ఉందనిపిస్తోంది. ఈ ట్రైలర్‌ను చూస్తుంటే ఇండియన్ సినీ లవర్స్‌కి నెవ్వర్ బిఫోర్ అనిపించేలా సినిమాటిక్ ఎక్స్‌పీరియెన్స్‌ను అందించబోతోన్నట్టుగా కనిపిస్తోంది.

# గద్దర్ స్పెషల్ జ్యూరీ అవార్డు గెలుపొందిన '23' చిత్ర బృందానికి అభినందనలు




ఈ చిత్రాన్ని ఖైదీలకు ప్రదర్శించేం దుకు ఏర్పాటు చేస్తాం: ప్రెస్ మీట్ లో జైళ్లశాఖ డైరెక్టర్ జనరల్ సౌమ్య మిశ్రామల్లేశం, మెట్రో 8 వంటి ఆలోచనత్మక సినిమాలను రూపందించిన దర్శకుడు రాజ్ రాచకొండ రూపొందించిన చిత్రం 23(ఇరవై మూడు). నేరస్థుల పరివర్తన, నేరలను తగ్గిస్తుందనే కథంశంతో రూపొందిన '23' గతఏడాది విడుదలై విమర్శకుల ప్రశంసలు అందుకుంది. విమర్శకుల ప్రశంసలతో పాటు గద్దర్ స్పెషల్ జ్యూరీ అవార్డును దక్కించుకుంది. ఈ సందర్భంగా చిత్ర బృందానికి జైళ్లశాఖ డైరెక్టర్ జనరల్ సౌమ్య మిశ్రా ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన సభకు ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన సభ లో సౌమ్య మిశ్రా మాట్లాడుతూ.. ఈ సినిమా నిర్మాణం అత్యంత బాధ్యత తోనూ, కష్టం తోనూ కూడుకున్నది. ఈ సినిమా చూసాను అది చాలా ప్రభావవంతంగా ఉంది. ఈ ప్రయత్నం చేసిన టీంని అభినందిస్తున్నాను. దర్శకుడు రాజ్ మాట్లాడుతూ.. ఈ ప్రయాణంలో తోడు ఉన్న టీంకి కృతజ్ఞ తలు. ఈ సినిమా ప్రయాణం చాలా ప్రత్యేకం. గద్దర్ అవార్డ్స్ జ్యూరీ కి థాంక్స్. దర్శకుడు బి.నర్సింగ రావు.. '23' వంటి సినిమా లను ప్రభుత్వం ప్రోత్సహం ఇవ్వాలి. మాభూమి, దాసి వంటి వాస్త వికత దృక్పథం ఉన్న సినిమాలు తర్వాత ఆ పరంపర కొనసాగలేదు. ఇప్పుడు '23' వంటి సినిమాలు వస్తునం దుకు ఆనందంగా ఉంది.డా. బీనా మాట్లాడుతూ.. '23' సినిమాలో జైలు రీఫార్మ్ ప్రోగ్రామ్‌ను చేర్చేందుకు దర్శకుడు రాజ్ ఎంతో పట్టుదలగా ప్రయత్నించారు. ప్రతి ఖైదీ కథ కూడా ఒక సినిమా కథ లాంటిదే. తెలంగాణ, తిహార్ జైళ్లలో రీఫార్మ్ కార్యక్రమాలను నిర్వహించిన ప్రొఫెసర్ బీనా, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, సిద్ధోజి మాట్లాడుతూ.. సినిమాలు కూడా సున్నితమైన అంశాలను స్పృశించగలవని రాజ్ నిరూపించారు. "23" తెలుగు సినిమాల్లో ఎవరూ తాకని విషయాన్ని ధైర్యంగా ప్రస్తావించిన అరుదైన చిత్రం.

# నటి హేమకు క్లీన్ చీట్



తెలుగు ఫిలిం ఛాంబర్ లో ఫిలిం క్రిటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన మీట్ ది ప్రెస్ కార్యక్రమంలో నటి హేమ మాట్లాడుతూ.... డ్రగ్స్ కేసులో తనపై వచ్చిన ఆరోపణలు తనను తీవ్రంగా మానసికంగా కలచివేశాయని చెప్పారు. ఆ సమయంలో నేను చచ్చిపోవాలనిపించింది. అంతగా మానసికంగా కుంగిపోయాను" డ్రగ్స్ వ్యవహారం లో కొందరు మీడియా సంస్థలు తనపై నిరాధార ఆరోపణలు చేస్తూ బురదజల్లాయని ఆమె ఆరోపిం చారు. ఆ వార్తల కారణంగా తన వ్యక్తిగత జీవితం మాత్రమే కాకుండా కుటుంబ సభ్యులు కూడా తీవ్రంగా బాధపడ్డారని చెప్పారు.నా కుటుంబం చాలా సఫర్ అయింది. మాకు ఇది చాలా కఠినమైన కాలం" అని ఆమె పేర్కొన్నారు. ఫిలిం క్రిటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అధ్యక్షులు బత్తుల ప్రసాద్ రావు మాట్లాడుతూ... మీడియా విషయంలో నటి హేమ ఆవేదనతో ఉన్నారు. తన మనసులోని మాటను పంచుకునేందుకు ఈరోజు ఫిలిం చేసిన మీట్ ది ప్రెస్ కు ఆహ్వానించాము. ఆమె అభిప్రాయాలను మీడియా ముఖంగా పంచుకునే వేదిక ఇది. హేమ చెబుతున్నట్టు, ఆమెనే కాదు, మేము జర్నలిస్టులం కూడా వివక్ష ఎదుర్కొన్నాం." అని ఆయన అన్నారు. ఫిలిం క్రిటిక్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు ప్రభు మాట్లాడుతూ... చిత్ర పరిశ్రమతో మీడియా ఎప్పుడూ స్నేహపూర్వకంగానే ఉంటూ వచ్చింది. స్పందించలేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.ఈ మీట్ ది ప్రెస్ కార్యక్రమంలో పలువురు ఫిలిం క్రిటిక్స్ అసోసియేషన్ సభ్యులు, మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం సందర్భంగా హేమ తనపై వచ్చిన వివాదాలపై వివరణ ఇవ్వడంతో పాటు, తాను ఎదుర్కొన్న అనుభవాలను పంచుకున్నారు.

# ఏప్రిల్ 3న రాబోతోన్న 'రాకాస'

జీ స్టూడియోస్ సమర్పణలో పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ బ్యానర్‌పై ఉమేష్ కుమార్ బన్సాల్‌తో కలిసి నిహారిక కొణిదెల నిర్మించిన చిత్రం'రాకాస' మానస శర్మ తెరకెక్కించిన ఈ సినిమాలో సం గీత్ శోభన్, నయన్ సారిక జంటగా నటిం చారు. ఇప్పటి వరకు రిలీజ్ చేసిన గ్లింప్స్, టీజర్, ట్రైలర్, పాటలు ఇలా అన్నీ కూడా ప్రేక్షకుల్ని ఆకట్టు కున్నాయి. ఈ మూవీని ఏప్రిల్ 3న రిలీజ్ చేయబోతోన్నా రు. ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహిం చారు. ఈ కార్యక్రమం లో.. నిహారిక కొణిదెల మాట్లాడుతూ.. 'జీ స్టూడియో తో, దివ్య గారితో కలిసి పని చేయడం ఆనం దంగా ఉంది. యూట్యూబ్‌లో మ్యాడ్ హౌస్ అని ఓ సిరీస్ చేశాం. ఆ టైంలో మానసగారి డైలాగ్స్ మొదటగా విన్నాను. ఆ తరువాత మానస గారిని చూశాను. ఆమె తక్కువ మాట్లాడుతుంది. కానీ చాలా ఆలోచి స్తుంటుంది. 24 గంటలు సినిమా గురించి, కథ గురించే ఆలోచిస్తుంటుంది. అన్నారు...సంగీత్ శోభన్ మాట్లాడుతూ.. గత ఏప్రిల్‌లో నేను, మానస గారు, నిహారిక గారు కలిసి ఓ ఫోటో దిగి ఇన్ స్టాలో షేర్ చేశాను. ఏప్రిల్ 3న మా సినిమా రాబోతోంది. నయన్ సారిక మాట్లాడుత .. 'నిహారిక గారి పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్‌లో ఇది నాకు మూడో ప్రాజెక్ట్. హలో వరల్డ్‌తో నా సినీ ప్రయాణం మొదలైంది. నిహారిక గారితో పని చేస్తే లక్ కలిసి వస్తుంది.




రాకాసతో మళ్లీ ఆమెతో పని చేయడం ఆనం దంగా ఉంది.. దర్శకురాలు మానస శర్మ మాట్లాడుతూ నిహారికగారు మా లక్కీ ఛార్మ్. పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ లో సిరీస్‌ను డైరెక్ట్ చేస్తే.. ఆ వెంటనే సినిమా డైరె క్షన్ ఛాన్స్ కూడా వస్తుంది. నా 'బెంచ్ లైఫ్' తరువాత నాకు రాకాస్త అవకాశం వచ్చింది. .యదు వంశీ మాట్లాడుతూ .. 'నిహారిక గారు నా మీదే కమిటీ కుర్రోళ్లు కోసం 9 కోట్లు పెట్టారు. రాకాస బడ్జెట్ విని షాక్ అయ్యాను. నిహారిక గారికి నిహారిక గారే ధైర్యం. ..గెటప్ శ్రీను మాట్లాడుతూ . 'రాకాస' ఏప్రిల్ 3న రాబోతోంది. ఫ్యామిలీ అంతా కలిసి మా మూవీని చూడండి. . అనుదీప్ దేవ్ మాట్లాడుతూ రాకాస మ్యూజిక్ విషయంలో నాకు సపోర్ట్ చేసిన నా టీం మెంబర్లకు థాంక్స్.

# 'చెన్నై లవ్ స్టోరీ'లో 'గుర్తుందా..' సాంగ్ లాంచ్



హీరో కిరణ్ అబ్బవరం, శ్రీ గౌరి ప్రియ జంటగా "కలర్ ఫొటో", "బేబి" వంటి కల్ట్ క్లాసిక్ మూవీస్ ప్రేక్షకులకు అందించిన మేకర్స్ ఎస్ కేఎన్, సాయి రాజేశ్ కాంబినేషన్ లో రూపొందుతున్న "చెన్నై లవ్ స్టోరీ" సినిమాకు బిజినెస్ పరంగా మంచి క్రేజ్ ఏర్పడుతోంది. ఈ చిత్రాన్ని అమృత ప్రొడక్షన్స్, మాస్ మూవీ మేకర్స్ బ్యానర్స్ పై ఎస్ కేఎన్, సాయి రాజేశ్ నిర్మిస్తున్నారు. సాయి రాజేశ్ కథను అంది స్తున్న ఈ చిత్రానికి రవి నంబూరి దర్శకత్వం వహిస్తు న్నారు. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ తుది దశలో ఉంది. మెలొడీ బ్రహ్మ మణిశర్మ "చెన్నై లవ్ స్టోరీ" సినిమాకు సంగీతాన్ని అందిస్తున్నారు. ఈ రోజు ఈ సినిమా నుంచి గుర్తుందా సాంగ్ లాంఛ్ ఈవెంట్ ను హైదరాబాద్ లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం లోఎడిటర్ సంతోష్ నాయుడు మాట్లాడుతూ మణిశర్మ నా ఫేవరేట్ మ్యూజిక్ డైరెక్టర్. ఆయన మ్యూజిక్ చేస్తున్న "చెన్నై లవ్ స్టోరీ" మూవీ టీమ్ లో నేను వర్క్ చేయడం సంతోషంగా ఉంది. ఎడిటర్ విప్లవ్ మాట్లాడుతూ గుర్తుందా పాట మీ అందరికీ నచ్చిందని నమ్ముతున్నాను. నటుడు మహేందర్ మాట్లాడుతూ నా లైఫ్‌లో విన్న ఎక్కువ మ్యూజిక్ మణిశర్మ గారిదే. డీవోపీ విశ్వాస్ డేనియల్ మాట్లాడుతూ నేను కిరణ్ అబ్బవరం గారితో చేస్తున్న ఐదో చిత్రమిది. లిరిసిస్ట్ అనంత శ్రీరామ్ మాట్లాడుతూ మేము చెప్పింది గొప్ప అనే అహాన్ని మరచి ప్రతి ఒక్కరూ ఈ సినిమా కోసం పనిచేశారు. ఎవరు ఏం చేసినా, ఏం చెప్పినా సినిమా కోసమే అనుకున్నారు.

1vzm15:1vzm15.qxd 31-03-2026 23:40 Page 1



## జిందాల్ బాధితులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే



శృంగవరపుకోట, మార్చి31, ప్రభాతవార్త... జిందాల్ బాధితులను ఆదుకోవలసిన భాద్యత ప్రభుత్వనిదేనని ఏపీ టూరిజం బోర్డు డైరెక్టర్ ఎస్.కోట వైస్ ఎంపీపీ ఇందుకూరి సుధారాణి తెలిపారు. మంగళవారం ఎస్.కోటలో ఆమె విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం సుధారాణి మాట్లాడుతూ బొడ్డవర ప్రాంతంలో 2007లో అల్యూమినియం పరిశ్రమను ఏర్పాటు చేస్తామని జిందాల్ సంస్థ రైతుల నుంచి వందలాది ఎకరాలు భూముల తీసుకుని నేటికీ 18ఏళ్ళు అయినా పరిశ్రమ ఏర్పాటు చేయలేదని భూముల తీసుకుని జిందాల్ యాజమాన్యం రైతులను నడిరోడ్డుపై ఆర్థికంగా అన్ని రకాలుగా మోసం చేసిందని ఆమె ఆరోపించారు. సోమవారం ఎస్.కోటలో జరగవలసిన బహిరంగ సభకు ఎస్టీ కమిషన్ సభ్యులు రాకపోవడం వలన ఆమె ఆవేదన వ్యక్తంచేశారు.జిందాల్ రైతులు తమకు జరిగిన నష్టానికి శాంతి యుతంగా నిరసనలు తెలియజేస్తే పోలీసులు ఎప్పటికప్పుడు జిందాల్ బాధితులను అడ్డుకోవడం తగదన్నారు.రెవిన్యూ అధికారులు కూడా జిందాల్ సంస్థకు అనుకూలంగా పనిచేస్తున్నారని ఆమె ఆరోపించారు.జిందాల్ నిర్వాసితులకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని ఆమె కోరారు.కార్యక్రమంలో ఎంపీపీ సోమేశ్వరావు,ఎస్.కోట సర్పంచ్ సంతోషికుమారి,నాయకులు గోవిందా పాల్గొన్నారు.

## చీపురుపల్లిలో కమ్యూనిటీ భవనం ప్రారంభం



చీపురుపల్లి, మార్చి 31 ప్రభాతవార్త : చీపురుపల్లి పట్టణంలోని పోలీస్ స్టేషన్ ఎదురుగా గల ఎస్సీ కమ్యూనిటీ హాల్ను మంగళవారం నాడు చీపురుపల్లి ఎంపీపీ ఇప్పిలి వెంకట నరసమ్మ, జడ్పిటిసి వలి రెడ్డి శిరీష, తదితరులు ప్రారంభించారు. జిల్లా పరిషత్ నుండి సుమారు 15 లక్షల రూపాయలతో నిర్మించిన కమిటీ భవనాన్ని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు అభిమానుల మధ్య కోలాలంగా ప్రారంభం నిర్వహించారు. దళితులకు అవసరమైన సమావేశాలు శుభకార్యాలు ఈ కమ్యూనిటీ హాల్ ద్వారా ఏర్పాటు చేసుకోవచ్చని ఈ సందర్భంగా పలురు వక్తులు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఇప్పిలి వెంకట నరసమ్మ తో పాటు సర్పంచ్ మంగళగిరి సుధారాణి, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇప్పిలి అనంతం వలి రెడ్డి శ్రీనివాస నాయుడు మీసాల వరహాల నాయుడు బెల్లాన వంశీ, పతివాడ రాజారావు, కో ఆప్షన్ సభ్యులు ముజకీర్ అహ్మద్, పతివాడ రాజారావు, గవిడి సురేష్, దళిత నాయకులు గంటాన అప్పారావు, అడ్డూరి కృష్ణ, మిరియాల కృష్ణారావు, రౌతు పైడురాజు, పలువురు దళిత నాయకులు స్థానిక వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## టిడ్కో చెల్లింపుల విషయంలో దళారులను నమ్మొద్దు : ఎమ్మెల్యే



చం ద్ర పార్వతీపురం, మార్చి 31, ప్రభాతవార్త: టిడ్కో గృహాల నగదు చెల్లింపులో దళారులను నమ్మి ఎవరు మోసపోవద్దని ఎమ్మెల్యే విజయ్ చంద్ర అన్నారు.మంగళవారం పురపాలక సంఘం కార్యాలయం వద్ద ఆయన విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అసెంబ్లీలో టిడ్కో గృహాలు లబ్ధిదారులకు త్వరిత గతిన లబ్ధి చేకూరేలా ప్రణాళిక చేసిందన్నారు. 201419 మధ్య మూడు రకాల టిట్కో గృహాలు మంజూరు చేయడం జరిగిందన్నారు అందులో కొంతమంది 500, మరి కొంతమంది 12,000, కొంతమంది 25000, మరి కొంతమంది 50000 నగదు చెల్లించారని ఎమ్మెల్యే వివరించా రు. కొన్ని అనివార్య కారణాలవల్ల స్థలం విషయంలో జరిగిన జాప్యం కారణంగా ఆ సమయంలో ఇళ్ళ నిర్మాణాలు పూర్తి కాలేదు అన్నారు. తర్వాత వచ్చిన వైకాపా ప్రభుత్వం ఆ టిట్కో గృహాలను పూర్తి చేయకుండా లబ్ధిదారులు చెల్లించిన నగదు వేరే దానికి మళ్లించి అన్యాయం చేశారన్నారు. ఆ విషయాన్ని గుర్తించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గతంలో నగదు చెల్లించిన లబ్ధిదారులకు న్యాయం చేయాలని అందుకు సంబంధించిన నగదు..2.25 కోట్లు పురపాలక సంఘ ఖాతాకు జమ చేయడం జరిగిందన్నారు ఆర్జెడీ నిధులు జమ అయ్యాయని ఆ నగదు లబ్ధిదారులకు చెక్కు రూపంలో ఇవ్వాలా, ఖాతాలో వెయ్యాలన్న నిర్ణయం చేయవలసి ఉందని ఆయన అన్నారు. ఈ విషయాన్ని తెలిసి కొంతమంది హడావిడి చేస్తూ ప్రజలకు తప్పుడు సమాచారం ఇస్తూ లబ్ధి విషయంలో ఆందోళన కలిగించే విధంగా హడావిడి చేస్తు, ప్రజలను రోడ్డుకెక్కిస్తున్నారని అది మంచి పని కాదని ఎమ్మెల్యే అన్నారు. ప్రభుత్వం చేసే పనిని మెచ్చుకోకుండా , తామే చేశామని చెప్పుకోవడం విడ్డూరంగా వింతగా ఉందని అటువంటి వారి మాటలను ప్రజలు నమ్మవద్దని ఎమ్మెల్యే వివరించారు. ప్రభుత్వం చేస్తున్న పనులు అభివృద్ధిపై చర్చించేందుకు వస్తే తాము కూడా అభినందిస్తామని అటువంటి వారికి ప్రత్యేక అభినందనలు తెలియజేస్తామని ఎమ్మెల్యే అన్నారు. అలా కాకుండా ప్రభుత్వం చేసిన పనిని తాము చేశామన్నట్లుగా చెప్పుకుంటూ లబ్ధిదారుల నుంచి ఎంతో కొంత లబ్ధి పొందాలనే ఆలోచనతో హడావిడి చేయడం సరికాదని టిడ్కో లబ్ధిదారులు ఈ విషయంలో ప్రలోభాలకు లోను కావద్దని ఎమ్మెల్యే సూచించారు. అదేవిధంగా ఇదివరకే గృహ నిర్మాణం పనులు పూర్తి చేసుకున్న టిడ్కో ఇండ్ల పంపిణీ కార్యక్రమం కొన్ని మోలిక సదుపాయాలు పూర్తి కావాల్సి ఉన్నందున జూన్ నెలాఖరిలోగా అవి పూర్తి చేసి లబ్ధిదారులకు అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు కోలా మధు, కార్యదర్శి మజ్జి వెంకటేష్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## బడిఈడు పిల్లలను బడిలో చేర్పించాలి



మెరకముడిదాం, మార్చి 31: మండలం చిన్న బంటుపల్లి ఎంపీయుపి స్కూల్ ఉపాధ్యాయులు సిబ్బంది గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి బడి ఈడు గల పిల్లలను బడిలో చేర్పించుటకు కాన్వెంట్లో చదువు తున్న విద్యార్థులను చినబంటుపల్లి ప్రాథమిక ఉన్నత పాఠశాలలో తిరిగి చేర్పించమని ఇంటింటికి వెళ్లి తల్లిదండ్రులను మోటివేట్ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు రాంబాబు మిగిలిన ఉపాధ్యాయులు తల్లిదండ్రులతో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో మీ విద్యార్థులను చేర్చినట్లయితే వారికి నాణ్యమైన విద్యను అందజేస్తామని చెప్పారు ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు దీటుగా మా పాఠశాల విద్యార్థులు చదువుతున్నారని వేరే పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు మా పాఠశాలకు వచ్చి మా పిల్లల యొక్క విద్యాస్థాయిని వారి పిల్లల యొక్క విద్యా స్థాయిని కంపేర్ చేసుకుని అప్పుడు మా పాఠశాలలో ఆ విద్యార్థులను చేర్చమని తెలియజేశారు ప్రభుత్వం పాఠశాలల బలోపేతానికి చేస్తున్న కార్యక్రమాలను వారికి వివరించారు గ్రామంలో ప్రభుత్వ పాఠశాలను బలోపేతం చేయమని కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఆల్తి రాంబాబు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఉద్యోగ విరమణ చేసిన సత్యశ్రీనివాస్‌కి సత్కారం



గరివిడి, మార్చి31, ప్రభాతవార్త : శ్రీరామ్ నగర్(గరివిడి)ఉన్నత పాఠశాలలో ఆంగ్లోపాధ్యాయులు గా పనిచేస్తూ ఉద్యోగ విరమణ చేసిన ఆలమూరు సత్య శ్రీనివాస్ కి పాఠశాల ప్రాంగణంలో ఘన పౌర సత్కారం జరిగింది. వేలాదిమంది ప్రజానీకం, నాయకులు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, యూటీఎఫ్,ఎపిటీఎఫ్ సంఘాలు ప్రతినిధులు, సత్య శ్రీనివాస్ దంపతులకు పూలమాలలతో ముంచె త్తారు. దుస్సాలువతో సత్కరించి ఆయన సేవలను కొనియాడారు. వేద పండితులు మంత్రోచ్ఛారణ మంగళ వాయిద్యాల నడుమ వేదాశీర్వచనాలతో పండితులు నిండు దీవెనలు అందించారు. శ్రీను మాష్టారు సత్కార కార్యక్రమం ఒక ఉత్సవంలా ఉత్సాహ వాతావరణం లో సాగింది. సత్కార,వీడ్కోలు సభలో ప్రజాప్రతినిధులు ,ఉపాధ్యాయ సంఘాలు నాయకులు, వైకాపా, టిడిపి నాయకులు బమ్మిడి అప్పల స్వామి, మీసాల విశ్వేశ్వర రావు, బమ్మిడి కార్తీక్, వాకాడ శ్రీనివాసరావు, కుచ్చర్లపాటి త్రిమూర్తులు రాజు, బెల్లాన వంశీ, యజ్జిపురపు సత్యం, నిర్మల, వలిరెడ్డి లక్ష్మణ్, శివుకు కాంతారావు, గొర్లె పద్మావతి, ఉప్పు శ్రీను ,రెడ్డి మోహన్, వలిరెడ్డి రవీంద్ర, ఎం వి ఎస్ ఎన్ రాజు ,పి.కుమార్ ,తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆలమూరు సేవలను కీర్తించారు.ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్క ృతిక కార్యక్రమాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి.

## ప్రభుత్వ భూమిలో రోడ్డు వేసిన అక్రమార్కులు



దత్తిరాజేరు, మార్చి 31, ప్రభాత వార్త : మండలంలోని వంగర గెడ్డ అంచు నుండ ప్రభుత్వ భూమినీ ఆనుకుని పొలాలకు వెళ్లడానికా లేక భూమి అమ్మకాలు కొనుగోలు జరపడం కోసం భూ దందా దారులు రోడ్డు వేశారు బ్రిడ్జి అంచున నాలుగు సెంట్లు జిరాయితి భూమిని తీసుకొని కానాలు వేశారు. మిగతా భూమంతా ప్రభుత్వానిదేనని స్థానిక ప్రజలు గ్రామాల్లో చెవులు కొరుక్కుంటున్నారు. ప్రతిరోజు ప్రభుత్వ కార్యాలయాలకు అధికారులు వంగర్ బ్రిడ్జి మీద నుండి వెళ్తారు గెడ్డ అంచునమట్టి రోడ్డు కళ్ల ముందు కనిపించిన రోడ్డు మాది కాదన్నట్టుగా అధికారులు వెళ్లిపోతుంటారు మండలంలోని ఇలా చాలాచోట్ల ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురైనట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎవరైనా ఫిర్యాదు చేస్తే అధికారులు స్పందిస్తారు... తప్ప ఫిర్యాదు లేకపోతే ప్రభుత్వ స్థలాలు ఎంత ఆక్రమించుకున్న పరవాలేదు అన్న నమ్మకం జనాల్లో బాగా పాకిరింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి సదరు వ్యక్తులు ఎవరైనా ప్రభుత్వ స్థలాలు ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. వివరణ కోసం గ్రామ రెవెన్యూ అధికారికి ఫోన్ చేస్తే ఆయన ఫోన్ కలవడం లేదన్నారు.

## ఘనంగా మహావీరుడి జయంత్యుత్సవాలు

శృంగవరపుకోట, మార్చి 31, ప్రభాతవార్త : ఎస్.కోట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహావీరుడు వర్ధమాన జయంతి ఉత్సవాలను మంగళవారం ఘనంగ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్ కేశవరావు మాట్లాడారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎంపీ కలిశెట్టికి అభినందనలు



రామభద్రపురం, మార్చి 31, ప్రభాత వార్త : గ్రామీణ వైద్యుల గుర్తింపు కోసం పార్లమెంట్ లో ప్రస్తావించిన యమ్ పి కలిశెట్టికి అభినందనలు ఐయుకేయఫ్ కన్వీనర్ మమ్ముల దేశ వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రాథమిక వైద్యం అందిస్తూ ప్రజల ఆరోగ్యం కోసం క్రుషి చేస్తున్న ఆర్ యమ్ పి, పి యమ్ పిలను గుర్తిస్తూ కమ్యూనిటీ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్లుగా నియమించాలని లోక్ సభ స్పీకర్ ఓం ప్రకాష్ బిర్లాకు విజయనగరం పార్లమెంట్ సభ్యుడు కలిశెట్టి అప్పలనాయుడు విజ్ఞప్తి చేయడమే కాకుండా వారి సేవలను గుర్తించాలని పార్లమెంట్‌లో ప్రస్తావించడం అభినందనీయమని ఇంటర్నేషనల్ యునైటెడ్ కలాం ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షుడు,ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం జోనల్ గౌరవ అధ్యక్షుడు మమ్ముల తిరుపతిరావు హర్షం వ్యక్తం చేస్తూ యమ్పీ కలిశెట్టికి ధన్యవాదాలు తెలిపారు.ఈ మేరకు స్థానిక విలేఖర్లకు పత్రికా ప్రకటన విడుదల చేసారు.దేశంలో మారుమూల గిరిజన ప్రాంతాల్లోనూ, పేదలకు వైద్య సౌకర్యాలు కల్పిస్తూ వైద్య సౌకర్యాలు అందుబాటులో లేని ప్రాంతాల్లో కూడా వైద్య సదుపాయం కల్పిస్తున్న వారి సేవలు చాలా గొప్పవని, వారికి తగిన గుర్తింపు ఇవ్వాల్సిందేనని లోక్ సభలో విజ్ఞప్తి చేసారు. జాతీయ ఆరోగ్య ల్క్ష్యి కార్యక్రమాల్లోనూ, టిబి,కేన్సర్ ఎయిడ్స్ వ్యాధి నివారణ అవగాహనా కార్యక్రమాల్లో వారి చురుకైన పాత్రను గుర్తు చేసారు. ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు జంగం జోషి, జోనల్ ప్రధాన కార్యదర్శి గెద్ద చిరంజీవి, సలహాదారు కోన ప్రకాష్ మరియు తన ఆధ్వర్యంలో బృందం సంఘం వార్షిక కేలండర్ విడుదల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు గ్రామీణ వైద్యుల గుర్తింపు కోసం పార్లమెంట్‌లో ప్రస్తావించడం ఆనందదాయకమని ఉత్తరాంధ్ర గ్రామీణ వైద్యులు ఆయనకు తమ క్రుతజ్ఞతలు తెలుపుకుంటున్నారని తెలిపారు.

## మన్యం జిల్లా అఖిల భారత యాదవ సంఘం అధ్యక్షుడిగా రామారావు



బలిజిపేట, మార్చి 31, ప్రభాతవార్త : పార్వతీపురం జిల్లా బలిజిపేట మండలం మిర్చి వలస గ్రామానికి చెందిన శాలీల రామారావు అఖిలభారత యాదవ సంఘం పార్వతీపురం జిల్లా అధ్యక్షునిగా ఎన్నికయ్యారు పార్వతీపురం నియోజకవర్గం శాసనసభ్యులు బోనాల విజయ్ చంద్ర మరియు బలిజపేట మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పెంకి వేణు నాయుడు అభిమానముతో జిల్లా మండల తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు నాయకులు అభిమానముతో ఎన్నికైనట్లు తెలిపారు. ఇతడు మిర్చి వలస గ్రామానికి చెందిన సామాన్య యాదవ కుటుంబానికి చెందినవాడు ఈ గ్రామానికి సర్పంచ్‌గా ఏడు సంవత్సరములు తెలుగుదేశం పార్టీ నుండి అరకు పార్లమెంట్ యాదవ సంఘం కన్వీనర్ గా నాలుగు సంవత్సరములు ఎన్నికయ్యారు. ప్రస్తుతం పార్వతిపురం జిల్లా అఖిల భారత యాదవ సంఘం అధ్యక్షునిగా ఎన్నిక అయినందున జిల్లా మండల కార్యకర్తలకు ప్రజలకు అభివందనములు తెలియ తెలియజేశారు.

## ప్రసాద్‌ను ప్రశంసించిన ఎమ్మెల్యే మాధవి



నెల్లిమర్ల, మార్చి 31 ప్రభాతవార్త : నెల్లిమర్లకు చెందిన జనసేన పార్టీ నాయకుడు, విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ జనా త్రివేణి వెంకట వరప్రసాద్ (జనా ప్రసాద్) ను ఎమ్మెల్యే లోకం నాగ మాధవి ప్రశంసించారు. ముంజేరులోని మిరాకిల్ ఇంజనీరింగ్ కళాశాల ఆడిటోరియంలో జరిగిన పి 4 తొలి వార్షికోత్సవ కార్యక్రమంలో బంగారు కుటుంబాల మార్గదర్శిగా జన ప్రసాదను ఎమ్మెల్యే నాగ మాధవి సత్కరించారు. జ్ఞాపికను ప్రశంస పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా తమ కూటమి ప్రభుత్వం గత ఏడాది పి4 కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని అన్నారు. పేదల ఆర్థిక అభ్యున్నతికి ఈ కార్యక్రమం దోహదపడుతుందని, ఆర్థికంగా మెరుగైన స్థితిలో ఉన్నవారు పేద కుటుంబాలకు అండగా నిలవాలని అన్నారు. నెల్లిమర్ల గాంధీనగర్ కాలనీలో సుమారు 40 బంగారు కుటుంబాలు వారికి భరోసాగా నిలుస్తున్న జన ప్రసాద్ ఆదర్శనీయమన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ ప్రత్యేక అధికారి వెంకటేశ్వరరావు, టిడిపి నాయకుడు కంది చంద్రశేఖర రావు, జనసేన నాయకుడు బంటుపల్లి వాసుదేవరావు, బాసి దుర్గ నాలుగు మండలాల అధికారులు పాల్గొన్నారు.

## కాలనీల్లో పంచాయతీ పాలకవర్గం పర్యటన



రామభద్రపురం, మార్చి 31, ప్రభాతవార్త : మేజర్ పంచాయతీ వార్డ్‌లో పర్యటించిన సర్పంచ్, వైస్ సర్పంచ్ చింతల రామకృష్ణ రామభద్రపురం మేజర్ పంచాయతీ ఎస్ సి కాలనీ, బీసీ కాలనీ ఈ దినము ప్రెసిడెంట్ రవ్వ ఈశ్వర్ రావు , వైస్ ప్రెసిడెంట్ చింతల రామకృష్ణ పాలక వర్గ సభ్యులు పర్యటన చేసారు. వీరు మాట్లాడుతూ ప్రతి కుటుంబం సమస్యలు తెలుసుకుంటారు వార్డ్‌లో మంచి నీటి కుళాయిలు, రోడ్డు నిర్మాణం,కాలవుల పరిశుభ్రత, మార్కెట్ సుబ్రపరచడం, వీధి లైట్‌లు ఏర్పాటు చేయడం గ్రామంలో పచ్చదనం పరిశుభ్రత నెల్కొలపుతాం అన్నారు. ప్రతి సమస్యను కూటమి ప్రభుత్వం అన్ని విధములు ఆదుకుంటుంది అని ప్రజలకు చేరువై అభివృద్ధి సంక్షేమం కార్యక్రమం చెపడతాం అన్నారు.

## రేగాలమ్మ గ్రామదేవత పండుగలో కురుపాం ఎమ్మెల్యే



గరుగుబిల్లి, మార్చి 31, ప్రభాతవార్త: పార్వతీపురం మన్యం జిల్లా గరుగుబిల్లి మండలం చిలకాం గ్రామంలో గ్రామదేవత శ్రీ రేగాలమ్మ తల్లి పండుగ మహోత్సవాలు భక్తి శ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా గ్రామస్తుల ఆహ్వానం మేరకు ప్రభుత్వ విప్, కురుపాం శాసనసభ్యురాలు తోయక జగదీశ్వరిమంగళవారం నాడు చిలకాం గ్రామాన్ని సందర్శించారు. గ్రామదేవత శ్రీ రేగాలమ్మ తల్లి ఆలయంలో ఎమ్మెల్యే గారు ప్రత్యేక పూజలు నిర్వహించి, అమ్మవారి ఆశీస్సులు పొందారు. అనంతరం నియోజకవర్గ ప్రజలందరూ సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో ఆనందంగా జీవించాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు మరడనా నారాయణ స్వామి, ఎంపీపీ ఉరిటి రామారావు, మరడనా తవిటినాయుడు, ద్వారపురెడ్డి సత్యనారాయణ స్థానిక నాయకులు, గ్రామ పెద్దలు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

విజయనగరం 25
పార్వతీపురం మన్యం
వార్త

## జిల్లా విజిలెన్స్ మోనటరింగ్ అమలుపై సమీక్ష




పార్వతీపురం, మార్చి 31, ప్రభాతవార్త: ఎస్సీ, ఎస్టీ వర్గాలకు ఎక్కడైనా అన్యాయం జరిగినప్పుడు వారికి అండగా నిలవడమే జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ ప్రధాన ఉద్దేశమని జిల్లా కలెక్టర్ డా ఎన్. ప్రభాకర రెడ్డి అన్నారు. మంగళవారం నిర్వహించిన జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ అమలుపై సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ బాధితులు ఫిర్యాదు చేసిన కేసులలో పురోగతిని, విచారణ తీరును, నిందితులకు శిక్ష పడేలా తీసుకుంటున్న చర్యలను కమిటీ సమీక్షిస్తుందన్నారు. సమావేశంలో ఎస్పి మాధవ రెడ్డి, ఎఎస్పి మనీషా రెడ్డి పార్వతీపురం, పాలకొండ సబ్ కలెక్టర్లు ఆర్ వైశాలి, పవర్ స్వప్నల్ జగన్నాథ్, జిల్లా రెవెన్యూ అధికారి కె. హేమలత, కమిటీ సభ్యులు, వివిధ విభాగాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శం



నెల్లిమర్ల, మార్చి 31, ప్రభాతవార్తమాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శమని ఎంపీపీ అంబళ్ల సుధారాణి అన్నారు. మండలంలోని ఒమ్మి గ్రామంలో రూ.43 లక్షల వ్యయంతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనం, రూ.26 లక్షలతో నిర్మించిన ఆయుష్మాన్ భారత్ నూతన భవనాలను మంగళవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపీపీ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత చేరువ చేయాలనే లక్ష్యంతో గత ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను అమలు చేసిందన్నారు. ప్రజలు చిన్న చిన్న పనుల కోసం పట్టణాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా, తమ ఊరిలోనే అన్ని ప్రభుత్వ సేవలు అందేలా విశాలవంతమైన భవనాలను నిర్మించారని తెలిపారు. అలాగే ఈ వ్యవస్థ ద్వారా నిరుద్యోగ యువతీ యువకులకు సచివాలయాల్లో ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించడం ద్వారా ఉపాధి అవకాశాలు పెరిగాయని చెప్పారు. సచివాలయ భవన నిర్మాణం కోసం రూ.30 లక్షల విలువైన తమ సొంత స్థలాన్ని వితరణగా ఇవ్వడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. పార్టీలకు అతీతంగా గ్రామ ప్రజల అభివృద్ధి కోసం అందరూ కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. సచివాలయ సిబ్బంది ప్రజల పట్ల బాధ్యతతో వ్యవహరిస్తూ, వారికి అవసరమైన సేవలను సకాలంలో అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ అంబళ్ల శ్రీరాములనాయుడు, నాయకులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీల న్యాయపరమైన సమస్యలు పరిష్కరించాలి



పాచిపెంట, మార్చి 31, ప్రభాతవార్త: అంగన్వాడీ కార్యకర్తలు న్యాయపరమైన సమస్యలను పరిష్కరించాలని సిఐటియు నాయకులు కే పార్వతి కోరారు. మండల కేంద్రమైన పాచిపెంట ఐసిడి ఎస్ ప్రాజెక్ట్ కార్యాలయంలో అంగన్వాడి కార్యకర్తలు మరియు సిఐటియు నాయకులు ప్రాజెక్ట్ అధికారిని, అనంతలక్ష్మికి తమ సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. సిఐటియు నాయకులు ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీ కార్యకర్తలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని రాజకీయ వేధింపులు విడనాడాలని ప్రభుత్వ సేవలు అంకితభావంతో పనిచేసిన అంగన్వాడి ఉద్యోగులను గుర్తించి సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. గత 42 రోజులు చారిత్రాత్మక సమ్మె సందర్భంగా ప్రభుత్వం నిర్ణయించి ఇచ్చిన హామీలు జీవోలు రూపంలో అమలు చేసి ఆదుకోవాలని కోరారు. అలాగే ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా వేసవి సందర్భంగా వంటిపూట బదులు నిర్వహించేందుకు పకడ్బందీగా అమలు చేయాలని కోరారు. అత్యంత ప్రమాదకరంగా మారిన పిఎస్ యాప్ లో ఇబ్బందులు తొలగించాలని అంగన్వాడీ ఉద్యోగుల సమస్యలు పరిష్కారం చేయకపోతే ఆందోళన కార్యక్రమాలు రాష్ట్రవ్యాప్తంగా చేపడుతామని తెలిపారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ నాయకులు నల్లి పైడిరాజు కే రమాదేవి , ఎం సుగుణమ్మ, ఎన్ బంగారమ్మ సాయి పూజ, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా నందీశ్వరుడి ఆలయ 3వ వార్షికోత్సవం



లక్కవరపుకోట, మార్చి 31, ప్రభాత వార్త : మండలంలోని జమ్మదేవిపేట గ్రామంలో గల నందీశ్వర ఆలయ తృతీయ వార్షి ర్షకోత్సవము మంగళవారం భోజంకి వంశీయుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగింది. అలాగే మధ్యాహ్నం సుమారు 3 వేల మందికి అన్న సమారాధన ఏర్పాటు చేశారు.

## గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తా : ఎమ్మెల్యే



కొమరాడ, మార్చి 31, ప్రభాతవార్త : గ్రామాల అభివృద్ధి కోసం తన వంతు కృషి చేస్తున్నట్లు కురుపాం ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ జగదీశ్వరి అన్నారు మంగళవారం కొమరాడ మండలం కుమ్మరి గుంట పంచాయతీలో 45 లక్షల రూపాయలతో నిర్మించిన సిసి రహదారులను ఆమె ప్రారంభించారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాలలో సిమెంట్ రహదారులు కాలువలు నిర్మాణం కూటమి ప్రభుత్వ హయాంలో విరివిగా సాగుతున్నాయని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత సంక్షేమం అభివృద్ధి పరుగులు పెడుతుందని అన్నారు. కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ కన్వీనర్,రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్ ఉదయ శేఖర పాత్రుడు, ఏఎంసి వైస్ చైర్మన్ గౌరీశంకర్, తెదేపా నాయకులు డి వెంకట్ నాయుడు పి వెంకట్ నాయుడు ఎన్ మధుసూదన్ రావు జి సుదర్శన్ రావు, సర్పంచులు గొర్లి లక్ష్మణరావు, శ్రీనివాసరావు జీ త్రినాధం భాను బలరాం రాఘవేంద్రరావు, హరి ప్రసాద్, బత్తిలి శ్రీనివాసరావు జనసేన మండల పార్టీ కన్వీనర్ శ్రీకర్, అనంత ఉపేంద్ర గోపాలకృష్ణ బిజెపి మండల పార్టీ కన్వీనర్ సురేష్ పాల్గొన్నారు.

## పరిసరాల పరిశుభ్రతే లక్ష్యం : ఎంపీపీ

గరుగుబిల్లి, మార్చి 31, ప్రభాతవార్త: గ్రామ పంచాయతీల్లో పరిసరాల పరిశుభ్రత లక్ష్యముగా ప్రభుత్వం మండలానికి స్వచ్ఛ రిక్షాలను మంజూరు చేయడం జరిగిందని మండల పరిషత్ అధ్యక్షులు ఉరిటి రామారావు వెల్లడించారు. మండల పరిధిలోని ఆయా గ్రామ సచివాల యాలకు చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలకు గ్రీన్ అంబాసిడర్లు గ్రామ పంచాయ తీల పరిధిలో ఇల్లు నుంచి సేకరించిన చెత్తను తరలించేందుకు ప్రభుత్వం మంజూరు చేసిన స్వచ్ఛ రిక్షాలను సోమవారం మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి జి పైడితల్లితో కలిసి ఎంపీపీ ఉరిటి రామారావు పంపిణీ చేశారు. అనం తరం జరిగిన సమావేశంలో మండ ల పరిషత్ అధ్యక్షులు ఉరిటి రామారావు మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో ఇల్లు నుంచి సేకరిం చిన చెత్తను గ్రీన్ అంబాసిడర్లు గ్రామ పంచాయతీల పరిధిలోని నిర్మాణం చేపట్టిన చెత్త నుండి సంపద తయా రీ కేంద్రాలకు తరలించేందుకు ప్రభు త్వం స్వచ్ఛ రిక్షాలను మంజూరు చేయడం జరిగిందన్నారు. గ్రామ పంచాయతీల పరిధిలో పరిశుభ్ర తను కాపాడేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టడం జరుగు తుందన్నారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్య దర్శులు బంటు అప్పారావు, మరడాన భార్గవ్ కుమార్, మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయం సిబ్బంది బెంకిలి శ్రీనివాసరావు, గుంట్రెడ్డి కృష్ణప్రసాద్, అలజంగి శ్రీకాంత్, గంట విజయలక్ష్మి, డాకోజు సూర్యప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

## మద్యం తాగి వాహనాలు నడిపిన వ్యక్తికి జైలు.. జరిమానా

పాచిపెంట, మార్చి 31 ప్రభాత వార్త : పాచిపెంట పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం సేవించి వాహనాలు నడిపిన ఒకరికి రెండు రోజులు జైలు శిక్ష, మరో ఇద్దరికీ 10 వేల రూపాయలు జరిమాన విధిస్తూ సాలురు కోర్టు న్యాయమూర్తి తీర్పు వెల్లడించినట్టు ఎస్ఐ. ఎల్ అర్జున్ స్థానిక విలేకరులకు తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపి పట్టుబడిన వారిపై కేసులు నమోదు చేసి సాలూరు కోర్టుకి హాజరుపరచగా కోర్టు పై విధంగా తీర్పు వెల్లడించినట్టు ఆయన తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపినట్లయితే ఎవరిని విడిచి పెట్టేది లేదని ఆయన తెలిపారు.

# గుజరాత్‌పై పంజాబ్ కింగ్





**న్యూచండీఘర్:** ఐపీఎల్‌లో బౌలర్లు మొదటిసారి డామినేట్ చేశారు. ఉత్కంఠ పోరులో గుజరాత్‌పై పంజాబ్ కింగ్స్ మూడువికెట్లతో గెలుపొంది బోణీ చేసింది. పలుమలుపులు తీసుకున్న ఈ మ్యాచ్‌లో కూపర్ ఒకే ఒక్కడుగా నిలిచాడు. 44 బంతుల్లో అజేయంగా 77 రన్స్ చేసిన కూపర్... మరో 5 బంతులుండగానే పంజాబ్‌కు గెలుపందించాడు.

163 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్ దిగిన పంజాబ్ కింగ్స్ ఆరంభంలో తడబడింది. ఓపెనర్ ప్రియాంష్ ఆర్యా(7)ను తన తొలి ఓవర్‌లోనే రబాడా పెవిలియన్‌కు పంపాడు. క్రీజ్‌లోకి వచ్చిన కూపర్‌తో కలిసి మరో ఓపెనర్ ప్రభ్‌సిమ్రాన్ సింగ్ ఇన్నింగ్స్‌ను కుదుటపరిచాడు. ఇద్దరూ గుజరాత్ టైటాన్స్ బౌలర్లపై సిక్స్‌లతో విరుచుకుప డ్డారు. పవర్ ప్లే మొదటి ఆరు ఓవర్లలో స్కోరును 55 పరుగులకు చేర్చాడు. ఆ తర్వాత కూడా ధాటిగా ఆడుతూ రెండో వికెట్‌కు 76 పరుగులు జోడించారు. 4 సిక్స్‌లతో 24 బంతుల్లో 37 రన్స్ చేసిన ప్రభ్‌సిమ్రాన్ సింగ్‌ను రషీద్‌ఖాన్... ప్రసిద్ధ్ కృష్ణ క్యాచ్‌తో అవుట్ చేశాడు. కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్(18) రెండు సిక్స్‌లతో ధాటిగా ఆడే ప్రయత్నం చేసినా అది ఎంతో సేపు కొనసా గించలేకపోయాడు. 13వ ఓవర్లో ప్రసిద్ధ్ కృష్ణ ఓ వికెట్, 14వ ఓవర్‌లో వాషింగ్టన్ సుందర్ ఓ వికెట్..15వ ఓవర్లో ప్రసిద్ధ్ కృష్ణ రెండు వికెట్లు, 18వ ఓవర్లో అశోక్ శర్మ ఓ వికెట్ తీయడంతో మ్యాచ్ ఉత్కంఠకు చేరింది. చివరి రెండు ఓవర్లలో 16 పరుగులు చేయాల్సిన దశలో బార్ట్‌లెట్ ఓ సిక్స్, కూపర్ ఓ బౌండరీతో 14 రన్స్ చేసి మ్యాచ్‌ను పంజాబ్ వైపు మరల్చారు. కూపర్ 5 ఫోర్లు, 5 సిక్స్‌లతో 72 పరుగులు చేసి పంజాబ్‌కు విజయాన్ని అందించాడు. గుజరాత్ బౌలర్లలో ప్రసిద్ధ్ కృష్ణ మూడు వికెట్లు పడగొట్టాడు.

అంతకుముందు టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్...పంజాబ్ కింగ్స్ బౌలింగ్ ధాటికి స్వల్ప స్కోరుకే పరిమితమైంది. నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 162 పరుగులు చేసింది. సాయి సుదర్శన్, శుభ్‌మన్ గిల్ తొలి వికెట్‌కు 37 పరుగులు జోడించారు. ఈ తరుణంలో జెన్సన్ చక్కని బంతితో సాయి సుదర్శన్(13)ను పెవిలియన్‌కు పంపాడు. శుబ్‌మన్ గిల్(39), జాస్ బట్లర్(38)ధాటిగా ఆడే ప్రయత్నం చేయగా చాహల్ అద్భుత స్పిన్ బంతులతోవారిని బోల్తా కొట్టించాడు. ఆ తర్వాత వైశాంక్ వంతయింది. మిడిల్ ఓవర్లలో మూడు వికెట్లు తీసి గుజరాత్‌ను బెంబేలెత్తించాడు. గ్లేన్ ఫిలిప్స్(25),వాషింగ్టన్ సుందర్ (18), షారూఖ్ ఖాన్(4)లను వెంటవెంటనే పెవలియన్‌కు పంపాడు. రాహుల్ తెవాతియా (11), రషీద్ ఖాన్ (0) అజేయంగా నిలిచారు. వైశాంక్ మూడు, చాహల్ రెండు, మార్కో జెన్సన్ ఒక వికెట్ పడగొట్టారు.








# లక్నోలో ఢిల్లీకి సవాల్

**లక్నో:** ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో నేడు మరో ఉత్కంఠ మ్యాచ్ జరగనుంది. సొంతగడ్డపై ఢిల్లీ క్యాపిటల్స్‌తో తలపడేందుకు లక్నో సూపర్ జెయింట్స్ సిద్ధమైంది. గత సీజన్‌లో ప్లే ఆఫ్ చేరడంలో విఫలమైన ఈ రెండు జట్లు కొత్త సీజ న్‌ను బోణీ ప్రారంభించాలన్న పట్టుదలతో బరి లోకి దిగుతున్నాయి. రిషబ్‌పంత్ కెప్టెన్సీలో లక్నో, అక్షర్ పటేల్ నేతృత్వంలో ఢిల్లీ క్యాపిటల్స్ జట్లు పోటీపడ నున్నాయి.

లక్నో సూపర్ జెయింట్స్ బ్యాటింగ్‌లో పటిష్టంగా ఉంది. ముఖ్యంగా మార్‌క్రమ్, మిచెల్ మార్ష్, జోష్ ఇంగ్లీష్, నికోలస్ పూరన్ వంటి టాప్ క్లాస్ విదేశీ ఆటగాళ్లు జట్టుకు బలం. బౌలింగ్ కాస్త బలహీనంగా ఉంది. మహ్మద్ షమీకు అవేష్ ఖాన్, నార్జే నుంచి లభించే తోడ్పాటుతోనే ప్రత్యర్థిని కట్టడి చేసే అంశం ఆధారపడి ఉంది. గత సీజన్‌లో రాణించిన స్పిన్నర్ దిగ్వేష్ రాఠీ నుంచి అదే ప్రదర్శనను ఆశిస్తోంది. బ్యాటింగ్ బలంతో ప్రత్యర్థిపై ఆధిపత్యం చెలాయించాలని లక్నో సూపర్ జెయింట్స్ లక్ష్యంగా పెట్టుకుంది.

మరోవైపు, అక్షర్ పటేల్ సారథ్యంలోని ఢిల్లీ క్యాపిటల్స్...గత సీజన్‌లో ఆడిన జట్టులోని కీలక ఆటగాళ్లనే కొనసాగించింది. కేఎల్ రాహుల్, నిస్సాంక, నితీష్ రాణా, ట్రిస్టన్ స్టబ్స్, డేవిడ్ మిల్లర్ రూపంలో ఢిల్లీ జట్టులో హార్డ్ హిట్టర్లు ఉన్నారు. వీరు నిలకడగా రాణిస్తే జట్టు భారీ స్కోర్లకు ఢోకా ఉండదు. డేవిడ్ మిల్లర్ ఒంటిచేత్తో మ్యాచ్‌లను గెలిపించగల సత్తా ఉన్న ప్లేయర్. పేస్, స్పిన్ అటాక్‌తో ఢిల్లీ బౌలింగ్ లైనప్ వైవిధ్యంగా ఉంది. లుంగ్గి ఎన్గిడి పేస్ అటాక్ అదనపు బలం, అక్షర్‌పటేల్, కుల్దీప్ యాదవ్, నబీ రూపంలో టాప్ స్పిన్నర్లు ఉన్నారు. గత సీజన్‌లో ఐదవ స్థానంలో నిలిచిన ఢిల్లీ... ఈ ఏడాది చక్కని విజయాలతో ప్లేఆఫ్ స్థానాన్ని దక్కించుకోవాలని ఉవ్విళ్లూరుతోంది.

**గత సీజన్ రికార్డు**

ఐపీఎల్ 2025లో లక్నో, ఢిల్లీ... రెండూ కూడా టాప్4లో చోటు దక్కించుకోవడంలో విఫలమయ్యాయి. ఢిల్లీ 5వస్థానంలో నిలిచింది. ఆడిన 14 మ్యాచ్‌ల్లో ఏడింటిలో గెలుపొందగా, 6మ్యాచ్‌ల్లో ఓడింది. ఒక మ్యాచ్ వర్షార్పణం అయింది. లక్నో 14మ్యాచ్‌లలో ఆరు విజయాలతో ఏడవ స్థానంలో నిలిచింది. ఏకంగా 8 మ్యాచ్‌ల్లో ఓడింది.

**హెడ్ టు హెడ్**

ఇరుజట్లు 7 మ్యాచ్‌ల్లో తలపడగా ఢిల్లీ ఒకింత పైచేయిగా ఉంది. నాలుగు మ్యాచ్‌ల్లో ఢిల్లీ క్యాపిటల్స్, 3 మ్యాచ్‌ల్లో లక్నో సూపర్ జెయింట్స్ గెలుపొందాయి. గత సీజన్‌లో ఇరు జట్లు ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ విజయం ఢిల్లీకే దక్కింది.

**పిచ్ రిపోర్ట్**

ఈ మ్యాచ్‌కు వేదికైన లక్నో అటల్ బిహారీ వాజ్‌పేయి క్రికెట్ స్టేడియం పిచ్ సమతుల్యంగా ఉండనుంది. బౌలర్లకు ఒకింత ఎక్కువగా అనుకూలించే అవకాశం ఉంది. తక్కువ స్కోరు నమోదయ్యే ఈపిచ్‌పై స్పిన్నర్లు ప్రభావం చూపవచ్చు.

**లక్నో సూపర్ జెయింట్స్(అంచనా)**

మిచెల్ మార్ష్, మార్‌క్రమ్, రిషబ్ పంత్ (కెప్టెన్), పూరన్, బదోని, అబ్దుల్ సమద్, నార్జే, మహ్మద్ షమీ, అవేశ్ ఖాన్, మయాంక్, దిగ్వేష్ రాఠీ; ఇంపాక్ట్ ప్లేయర్: షాబాజ్ అహ్మద్

**ఢిల్లీ క్యాపిటల్స్(అంచనా)**

నిస్సాంక, కేఎల్ రాహుల్ (వికెట్ కీపర్), నితీష్ రాణా, ట్రిస్టన్ స్టబ్స్,మిల్లర్, అక్షర్ పటేల్ (కెప్టెన్), అశుతోష్, విప్రజ్ నిగమ్, నబీ, కుల్దీప్ యాదవ్, ఎన్గిడి. ఇంఫాక్ట్ పేయర్:నటరాజన్.

# బుడ్డోడి పంచ్‌కు రికార్డులు షేక్



ఐపీఎల్2026లో మహా మహా ప్లేయర్లు ఎందరున్నా అందరి చూపు ఆ 15 ఏళ్ల కుర్రాడిపైనే. రాజస్థాన్ రాయల్స్ తరపున ఆడుతున్న అతనికి ఇది రెండో సీజన్ మాత్రమే. తొలి సీజన్‌లో అనూహ్యంగా జట్టులోకి వచ్చి మెరుపు సెంచరీతో రాత్రికి రాత్రే స్టార్ డమ్ తెచ్చుకున్నాడు. అప్పటినుంచి క్రికెట్ ప్రపంచం అతని పేరే జపిస్తోంది. మొన్నటి అండర్19 ప్రపంచకప్ అయినా అదే దూకుడు. దీంతో గౌహతి మ్యాచ్‌పైనే ప్రతి ఒక్కరిచూపు. అందని అంచనాలకు అనుగుణంగానే వైభవ్ సూర్య మెరుపు ఇన్నింగ్స్‌తో ఈ సీజన్‌లో తన ఎంట్రీ గ్రాండ్‌గా చాటాడు.

(వార్త క్రీడా విభాగం)

ఐపీఎల్ 2026 సీజన్‌ను రాజస్థాన్ రాయల్స్ ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ ఓ అసాధారణ రికార్డుతో మొదలుపెట్టాడు. చెన్నై సూపర్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో కేవలం 15 బంతుల్లోనే హాఫ్ సెంచరీ చేసి క్రికెట్ ప్రపంచం దృష్టిని ఆకర్షించాడు. ఎదు ర్కొన్న తొలి బంతికి బౌండరీతో ఖాతా తెరిచిన వైభవ్.. అదే దూకుడుగా 4 ఫోర్లు, 5 సిక్స్‌లు బాదాడు. అతి పిన్న వయసులో ఫాస్టెస్ట్ హాఫ్ సెంచ రీ చేసిన బ్యాటర్‌గా చరిత్ర సృష్టించిన వైభవ్.. గతంలో ట్రావిస్ హెడ్, అభిషేక్ శర్మ, సురేష్ రైనా, ఇషాన్ కిషన్ లాంటి దిగ్గజాల రికార్డులను అధిగమిం చాడు. దీంతో ఐపీఎల్‌లో క్రిస్ గేల్ వంటి దిగ్గజాల రికార్డులకే ఎసరు పెడుతున్నాడు. వైభవ్ టార్గెట్ చేస్తున్న ఆ 5 రికార్డులు అలాంటిలాంటివి కావు.

**ఐపీఎల్‌లో అత్యధిక వ్యక్తిగత స్కోరు**

క్రిస్ గేల్ పేరిట ఉంది. 2013లో పుణె వారియర్స్ పై కేవలం 66 బంతుల్లోనే 175రన్స్ చేసి సునామీ సృష్టించాడు. వైభవ్ ఇటీవలే అండర్19 వరల్డ్ కప్ ఫైనల్లో ఇంగ్లండ్‌పై 80 బంతుల్లో 175 రన్స్ చేసి తన సత్తా ఏంటో చూపించాడు. ఇప్పుడు ఐపీఎల్‌లో గేల్ రికార్డును దాటడమే లక్ష్యమని చాటుతున్నాడు.

**ఒకే ఇన్నింగ్స్‌లో అత్యధిక సిక్సర్లు**

గేల్(17) పేరిటే ఉంది. ఇప్పటి వరకు ఎందరో హార్డ్ హిట్టర్లు వచ్చినా ఆమార్కును అందుకోలేకపోయారు. కానీ వైభవ్ స్టైలే వేరు. ఇటీవలే ఓ యూత్ టీ20 మ్యాచ్‌లో ఏకంగా 15 సిక్సర్లు బాది అందరినీ ఆశ్చర్యపరిచాడు. ఇదే ఊపు ఐపీఎల్‌లో కొనసాగిస్తే, గేల్ సిక్సర్ల రికార్డు గాలి లో కలవడం ఖాయం.

**59 సిక్సర్లు**

2012 సీజన్‌లో క్రిస్ గేల్ ఏకంగా 59 సిక్సర్లు బాది... ఒక సీజన్‌లో అత్యధిక సిక్సర్ల రికార్డు నెలకొల్పాడు. గతేడాది 7 మ్యాచ్‌ల్లోనే 24 సిక్సర్లు బాదిన వైభవ్...ఈసారి పూర్తి సీజన్ ఆడితే ఆ 59 సిక్సర్ల రికార్డును ఈజీగాదాటే అవకాశం ఉంది.

**ఒక సీజన్‌లో అత్యధిక స్ట్రైక్ రేట్**

గత సీజన్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ ప్లేయర్ జేక్ ఫ్రేజర్ 234.34 స్ట్రైక్ రేట్‌తో పరుగులు చేసి రికార్డు సృష్టించాడు. వైభవ్ గతేడాది 206 స్ట్రైక్ రేట్‌తో బ్యాటింగ్ చేశాడు. పవర్‌ప్లేలో వైభవ్ చేసే బాదుడుకి ఫ్రేజర్ రికార్డు కూడా ప్రమాదంలో పడేలా ఉంది.

**ఒకే ఓవర్‌లో ఆరు సిక్సర్లు**

ఐపీఎల్‌లో ఇప్పటి వరకు ఏ ఆటగాడూ ఈ ఘనత సాధించలేదు. క్రిస్ గేల్, జడేజా, రింకూ సింగ్ 5 సిక్సర్ల వరకు వెళ్లారు. కానీ ఆ ఆరో సిక్సర్ మాత్రం ఎవరికీ సాధ్యం కాలేదు. సిక్సర్ల వర్షం కురిపిస్తున్న వైభవ్..ఒకే ఓవర్‌లో 6 సిక్సర్లు బాదిన మొదటి ఆటగాడిగా నిలుస్తాడేమో చూడాలి.

## ఆలిండియా పోలీస్ ఫుట్‌బాల్ ఛాంపియన్‌షిప్

# అసోం రైఫిల్స్, తెలంగాణ ముందంజ

**హైదరాబాద్, మార్చి 31(వార్త క్రీడా ప్రతినిధి):** 74వ బి.ఎన్.ముల్లిక్ స్మారక అఖిల భారత పోలీస్ ఫుట్‌బాల్ ఛాంపియన్‌షిప్‌లో లీగ్ స్టేజ్ మ్యాచ్‌లు పూర్తయ్యాయి. పురుషుల విభాగంలో తెలంగాణతో పాటు 8 జట్లు ముందంజ వేశాయి. మంగళవారం జరిగిన గ్రూప్–ఇ లీగ్ మ్యాచ్‌లో గోవా 4–0 గోల్స్ తేడాతో హర్యానాపై గెలుపొందగా.. హిమాచల్ ప్రదేశ్, అండమాన్–నికోబార్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్ 0–0తో డ్రా అయింది. మిగతా మ్యాచ్‌ల్లో కేరళ 3–1 గోల్స్‌తో జమ్మూ కశ్మీర్‌పై, ఢిల్లీ 2–1గోల్స్‌తో తమిళనాడుపై, మిజోరం 4–1 గోల్స్ తేడాతో మధ్యప్రదేశ్‌పై విజయం సాధించాయి. లీగ్ మ్యాచ్‌లు ముగిసేసరికి గ్రూప్–ఎలో మొదటి రెండు స్థానాల్లో నిలిచిన సీఐఎస్‌ఎఫ్, జార్ఖండ్ ముందంజ వేశాయి. గ్రూప్–బిలో బీఎస్‌ఎఫ్, మణిపూర్.. గ్రూప్–సిలో సీఆర్‌పిఎఫ్, గుజరాత్.. గ్రూప్–డిలో పంజాబ్, ఆర్పీఎఫ్.. గ్రూప్–ఇలో గోవా, హిమాచల్ ప్రదేశ్.. గ్రూప్–ఎఫ్‌లో అసోం రైఫిల్స్, తెలంగాణ.. గ్రూప్–జిలో కేరళ, కర్ణాటక... గ్రూప్–హెచ్‌లో మిజోరం, త్రిపుర జట్లు మొదటి రెండు స్థానాల్లో నిలిచాయి.






# ఒక్కనెలలోనే 51 లక్షల కోట్ల టర్నోవర్ నష్టం

**ముంబయి, మార్చి 31:** యుద్ధం కారణంగా ప్రపంచవ్యాప్తంగా ఉన్న స్టాక్ మార్కెట్లు భారీగా పతనం అయ్యాయి. భారత స్టాక్ మార్కెట్లకు తీవ్ర విఘాతం కలిగింది. యుద్ధం కారణంగా బీఎస్‌ఈ మార్కెట్ క్యాప్ దాదాపు రూ.51 లక్షల కోట్లకు పైగా పడిపోవడంతో, ఇన్వెస్టర్లలో భయాందోళనలు నెలకొన్నాయి. మార్చి నెలలో బీఎస్‌ఈ మార్కెట్ క్యాప్, ఆర్‌ఐఎల్ వంటి మూడు కంపెనీల మార్కెట్ క్యాప్‌కు సమానమైన మొత్తంలో పడిపోయింది. సెన్సెక్స్ 10,000 మార్కును దాటింది వాస్తవానికి, ఈ యుద్ధ కాలంలోసెన్సెక్స్ 12 శాతానికి పైగా అంటే దాదాపు 10,000 పాయింట్లు పడిపోయింది. మరోవైపు నిఫ్టీ 22,500 దిగువకు పడిపోవడం ఆందోళన కలిగిస్తోంది. ఈ పతనం కారణంగా, బీఎస్‌ఈలో నమోదైన కంపెనీల మొత్తం మార్కెట్ క్యాప్ ఫిబ్రవరిలో సుమారు రూ.463 లక్షల కోట్ల నుంచి ఇప్పుడు రూ.412 లక్షల కోట్లకు పడిపోయింది. కేవలం ఒక్క నెలలోనే సుమారు రూ.51 లక్షల కోట్ల నష్టం వాటిల్లింది. యుద్ధం ప్రపంచ చమురు ధరలలో తీవ్ర పెరుగుదలకు దారితీసింది. దీంతో ఇండియా లాంటి ప్రధాన చమురు దిగుమతిదారులపై ఒత్తిడిని పెరిగింది. ఈ అధిక చమురు ధరలు అనేవి కంపెనీల ఖర్చులను పెంచి, లాభాలను తగ్గించాయి. ఆ ప్రభావం స్టాక్ మార్కెట్‌పై నేరుగా పడి పెద్ద మొత్తంలో నష్టాలు మూటగట్టుకుంటున్నాయని మార్కెట్ వర్గాలు పేర్కొన్నాయి. రూపాయి కూడా తీవ్రంగా పతనమవుతూ, డాలర్‌తో పోల్చితే ఏకంగా రికార్డ్ స్థాయిలో 95 స్థాయిని దాటింది. మార్కెట్ పతనం లార్జ్‌క్యాప్ స్టాక్స్ కేకాకుండా మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ స్టాక్స్ కూడా గణనీయంగా పడిపోయాయి. బ్యాంకింగ్, ఆటో, వినియోగ వస్తువుల వంటి కీలక రంగాలు కూడా తీవ్రంగా ప్రభావితమయ్యాయి.

# కొత్త ఐటిఆర్ ఫారాలు నోటిఫై




**న్యూఢిల్లీ, మార్చి 31:** ఆదాయపు పన్ను చెల్లింపుదారులకు 26–27 ఆర్థికసంవత్సరానికి గాను పన్ను రిటర్నులు దాఖలుకు ఫారాలను నోటిఫైచేస్తూ ఐటిశాఖ నోటిఫికేషన్ జారీచేసింది. ఐటిఆర్ 1,4లను ఈనెల 30వ తేదీనే నోటిఫై చేస్తే ఐటిఆర్ 2, 3, 5, 6, 7 ఫారాలను ఐటిఆర్‌యును మంగళవారం నోటిఫై చేసింది.

వ్యక్తులు, వ్యాపారులు,సంస్థలు 2025–26 సంవత్సరంలో ఆర్జించిన ఆదాయానికిగాను రిటర్నులు దాఖలుచేసుకోవాలి. ఆడిట్ అవసరం లేని వ్యక్తులు వచ్చే జులై 31లోగా ఐటిఆర్ ఫైల్ చేయాలి. ఐటిఆర్‌ఫారమ్‌వన్ సహజ్‌ను ఐటిఆర్ ఫారమ్ 4 సుగమ్ అనేవి చిన్న మధ్యతరహా పన్ను చెల్లింపుదారులకోసం నిర్దేశించారు. ఐటిఆర్‌వన్ వార్షిక ఆదాయం రూ.50 లక్షలవరకూ ఉంటే ఐటిఆర్‌వన్ దాఖలుచేయాలి. జీతం, ఇంటినుంచి వచ్చే ఆదాయం ఇతర మార్గాల్లో ఏడాదికి రూ.5వేలవరకూ వ్యవసాయ ఆదాయం ఉండే వ్యక్తులు సహజ్‌ను ఎంపికచేసుకోవాలి. ఐటిఆర్4 మొత్తం వార్షిక ఆదాయం రూ.50 లక్షలు ఉండి వ్యాపారం, వృత్తి ఆదాయం పొందే వ్యక్తులు హిందూ అవిభాజ్యకుటుంబాలు సంస్థలు సుగమ్ ఫారాన్ని ఎంచుకోవచ్చు.

ఐటిఆర్ రెండు మూలధన లాభాలు, హిందూ అవిభాజ్య కుటుంబాలు ఈ ఫారం ఎంపికచేసుకుంటారు. వ్యాపారం, వృద్ధిలో ఆదాయం ఆర్జించిన వారికి ఇది పనికిరాదు. ఐటిఆర్3 వృత్తివ్యాపారం ద్వారా రాబడి వచ్చే వ్యక్తులు, హిందూ అన్‌డివైడెడ్ ఫ్యామిలీ కోసం ఈ ఐటిఆర్ ఉంది. ఐటిఆర్–5లో అయితే సంస్థలు, ఎల్ఎల్‌పిలు, సహకార సంఘాలుఈ ఐటిఆర్ దాఖలుచేయాలి. ఇక ఐటిఆర్–6 అయితే కంపెనీల చట్టంకింద నమోదయిన కంపెనీలకు వాడతారు. ఐటిఆర్–7 అయితే ట్రస్టులు, స్వచ్ఛందసంస్థలు ఈ ఫారం ఎంపికచేసుకుని రిటర్నులు దాఖలుచేయాలి.

## యేడాది ముగిసింది.. వెంటనే అప్‌డేట్ చేయండి!

# పన్ను చెల్లింపుదారులకు ఐటి వార్నింగ్




**న్యూఢిల్లీ,మార్చి 31:** ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నందున బ్యాంకులు, డీమ్యాట్, పన్నులకు సంబంధించిన కొన్ని ముఖ్యమైన పనులను పూర్తి చేయాల్సి ఉంటుంది. మార్చి31న అర్ధరాత్రి 12 గంటలలోపు ఈపనులను పూర్తి చేయకపోతే, బ్యాంకు అకౌంట్స్ పని చేయకపోవచ్చు లేదా భారీ జరిమానాను ఎదుర్కోవలసి ఉంటుందని మార్కెట్ నిపుణులు హెచ్చరిస్తున్నారు. సెబీ, ఆర్‌బీఐ నిబంధనల ప్రకారం ఇప్పుడు అన్ని బ్యాంక్,డీమ్యాట్ అంకౌట్లకు నామినీని చేర్చడం తప్పనిసరి. ఇంకా నామినీని చేర్చకపోతే, మీ ఖాతా పనిచేయకపోవచ్చు. కస్టమర్లు నెట్ బ్యాంకింగ్ లేదా, స్టాక్‌బ్రోకర్ యాప్‌ను ఉపయోగించి ఇంటి నుంచే ఇ నామి నేషన్ ప్రక్రియను పూర్తి చేయవచ్చు. నామినీ పేరు, వారితో ఉన్న రిలేషన్ పొందుపరుస్తే సరిపోతుంది. పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ)తో సహా పలు బ్యాంకులు, తమ కస్టమర్లను వారి కేవైసీ వివరాలను అప్‌డేట్ చేసుకోమని నోటిఫికేషన్లు జారీ చేశాయి. రెండేళ్లుగా ఎలాంటి లావాదేవీలు జరగని ఖాతాలను పనిచేయనివిగా ప్రకటించారు. ఖాతాల వినియోగదారులకు ఏప్రిల్ 15 వరకు గడువు ఉంది. ఈకేవైసీ ప్రక్రియను మార్చి 31వ తేదీలోగా పూర్తి చేయడం సురక్షితం. మీ ఆధార్ కార్డు, పాన్ కార్డు, మీ తాజా ఫోటోతో మీ హోమ్ బ్రాంచ్‌ను సందర్శించి ఈ ప్రక్రియను పూర్తి చేసుకోవాలి. ఆర్థిక సంవత్సరం చివరిలో పన్ను ఆదా చేసుకోవడానికి ఇదే చివరి అవకాశం. రూ. 1.5 లక్షల వరకు మినహాయింపు పొందడానికి మార్చి 31 లోపు పీపీఎఫ్, ఈఎల్‌ఎస్‌ఎస్ లేదా జీవిత బీమాలో పెట్టుబడి పెట్టండి. ఒకవేళ పాన్ కార్డ్ ఇంకా ఆధార్‌తో అనుసంధానం కాకపోతే, అది ఇన్ యాక్టివ్ గా మారి ఉండవచ్చు. వెంటనే దానిని తిరిగి అనుసంధానం చేసుకోవాలి.లేకుంటే రూ. 1,000 జరిమానా విధించబడుతుంది. అదేవిధంగా ఆదాయపు పన్ను రిటర్న్‌కూడా దాఖలు చేయలేరు.

# వొడాఫోన్, ఐడియా
# 8 నగరాలకు 5జి సేవలు

**న్యూఢిల్లీ, మార్చి 31:** టెలికాం సంస్థ వొడాఫోన్ ఐడియా (వి) తమ 5జీ నెట్‌వర్క్‌ను భారీగా విస్తరించనున్నట్లు ప్రకటించింది. మే 2026 నాటికి దేశవ్యాప్తంగా మరో 90 నగరాలకు 5జీ సేవలను అందుబాటులోకి తేనున్నట్లు వెల్లడించింది. ఈ విస్తరణతో కంపెనీ 5జీ సేవలు అందించే నగరాల సంఖ్య 43 నుంచి 133కి పెరగనుంది. ఎక్కువ 5జీ డివైజ్‌లు ఉన్న ప్రాంతాలు, అధిక డేటా వినియోగం ఉన్న పట్టణాలపై ప్రత్యేకంగా దృష్టి సారించి ఈ విస్తరణ చేపడుతున్నట్లు కంపెనీ తెలిపింది.

ఈ జాబితాలో ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతి, తెలంగాణలోని హైదరాబాద్‌తో పాటు చెన్నై, కోయంబత్తూర్, గోవా, పుదుచ్చేరి, వారణాసి, ప్రయాగ్‌రాజ్ వంటి పలు కీలక నగరాలు ఉన్నాయి. ఈ విస్తరణ కోసం ఎరిక్సన్, నోకియా, శాంసంగ్ వంటి గ్లోబల్ టెక్నాలజీ దిగ్గజాలతో భాగస్వామ్యం కుదుర్చుకుంది. ఈ విస్తరణపై వొడాఫోన్ ఐడియా చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ (సీటీఓ) జగ్బీర్ సింగ్ మాట్లాడుతూ 5జీ డివైజ్‌ల వాడకం ఎక్కువగా ఉన్న కీలక మార్కెట్లలో సేవలను విస్తరించాలన్న మా వ్యూహంలో భాగంగానే ఈ నిర్ణయం తీసుకున్నాం. ఈ దశ విస్తరణతో ప్రధాన నగరాల్లో మా 5జీ నెట్‌వర్క్‌ను గణనీయంగా పెంచుతున్నామని తెలిపారు. వినియోగదారులకు మెరుగైన అనుభూతిని అందించేందుకు, డిజిటల్ ప్రపంచంలో వారు రాణించేందుకు వీలుగా ఒక పటిష్టమైన నెట్‌వర్క్‌ను నిర్మించడానికి కట్టుబడి ఉన్నామని ఆయన వివరించారు.



# ఇండిగో కొత్త సిఇఒ విల్లీ వాల్ష్

**ముంబయి, మార్చి 31:** భారతదేశంలో అతిపెద్ద విమానయాన సంస్థ అయిన ఇండిగోలో కీలక నాయకత్వ మార్పు చోటుచేసుకుంది. పీటర్ ఎల్బర్స్ మార్చి 2026లో తన పదవికి రాజీనామా చేశారు. ప్రస్తుత సిఇఒ పీటర్ ఎల్బర్స్ రాజీనామా చేసిన తరువాత, ప్రపంచ ప్రఖ్యాత ఎయిర్‌లైన్ ఎగ్జిక్యూటివ్ విల్లీ వాల్ష్ ను కొత్త సిఇఒగా నియమించారు. ఇండిగో భారతదేశంలో సుమారు 65 మార్కెట్ షేర్ కలిగిన పెద్ద ఎయిర్‌లైన్.

ఇలాంటి కంపెనీలో దినివీ మార్పు అంటే మొత్తం విమానయాన రంగంపై ప్రభావం ఉంటుంది. కొత్త పాలసీలు, వ్యూహాలు వస్తాయి. విల్లీ వాల్ష్ అంతర్జాతీయ విమానయాన రంగంలో అనుభవజ్ఞుడు. ప్రస్తుతం అంతర్జాతీయ వైమానిక రవాణా సంఘం ఐఎటిఎ డైరెక్టర్ జనరల్‌గా పనిచేస్తున్నారు. ముందుగా బ్రిటిష్ ఎయిర్‌వేస్ సిఇఒగా పనిచేశారు. 2026 జూలై 31 వరకు ఐఎటిఎలో పని చేసి, ఆగస్టు 2026లో ఇండిగోలో బాధ్యతలు స్వీకరించనున్నారు.

ఇండిగో ఇప్పుడు గ్లోబల్ స్థాయి అనుభవం ఉన్న నాయకుడిని తీసుకువచ్చింది. గత ఏడాది ఇండిగో దేశవ్యాప్తంగానే కాకుండా అంతర్జాతీయ సర్వీసుల పరంగా కూడా తీవ్ర సంక్షోభం ఎదుర్కొన్న సంగతి తెలిసిందే. వందలాది సర్వీసులు రద్దుకావడం లేదా నిలిచిపోవడం వంటివిజరిగి ప్రభుత్వ అగ్రహాన్ని కూడా చవిచూసింది. అన్నింటినీ అధిగమించి ఇపుడిపుడే సర్దుకుంటున్న ఇండిగోను విల్లీవాల్ష్ గాడిలో పెట్టగలరన్న ధీమా వ్యక్తం అవుతోంది.



# శశిధర్ జగదీశన్‌వైపే హెచ్‌డిఎఫ్‌సి బోర్డు

**ముంబయి, మార్చి 31:** ప్రైవేటురంగ బ్యాంకింగ్ దిగ్గజం హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు సిఇఒ ఎండిగా శశిధర్ జగదీశన్‌ను పునర్నియామకం చేయాలని బ్యాంకు బోర్డు ఆమోదించనున్నది. బ్యాంకులో వరుసగా మూడోసారి ఆయన ఎండి సిఇఒగా విధులు నిర్వహిస్తున్నట్లవుతుంది. నాయకత్వ నిర్ణయాలు సంతృప్తికరమైన ఆయన కెరీర్ ఇందుకు దోహదం చేసిందని అంచనా. ఆర్‌బిఐ నిర్దేశించిన ఫిట్‌నెస్ క్రైటేరియాకు అనుగుణంగా జగదీశన్ ఉన్నట్లు బ్యాంకు భావిస్తోంది.

బ్యాంకు తదుపరి బోర్డు సమావేశం ఏప్రిల్ 18వ తేదీ జరుగుతుంది. ఆరోజే బ్యాంకు నాలుగోత్రైమాసిక ఫలితాలను ఆమోదిస్తుంది. జగదీశన్ ప్రస్తుత కాలం 2026 అక్టోబరుతో ముగుస్తుంది. ఈ బోర్డు సమావేశంలోనే జగదీశన్ పేరును ఆమోదిస్తారని ఆ తర్వాత చట్టపరంగా అనుమతులు పొందిన తర్వాత జగదీశన్ బాధ్యతలు స్వీకరిస్తారని తెలుస్తోంది. ప్రస్తుత ఛైర్మన్ అతను చక్రవర్తి హటాత్తుగా రాజీనామాచేయడంతో బ్యాంకు చీఫ్ నియామకం అత్యవసరం అయింది.

బ్యాంకు యాజమాన్యంతో అతను చక్రవర్తికి పొసగకపోవడంతోనే ఆయన రాజీనామాచేసారన్న వార్తలు విస్తృతంగా బ్యాంకింగ్‌రంగంలో వినిపించాయి. హెచ్‌డిఎఫ్‌సికి పదివేల శాఖలు, రెండు లక్షల మందికి పైగా బ్యాంకు ఉద్యోగులు ఉన్నారు. ఎలాంటి అవకతవకలు తేలినా వెంటనే చర్యలపట్ల బ్యాంకు కఠినంగా ఉంటుంది. హెచ్‌డిఎఫ్‌సి పరిణామాలతో షేర్లు 3శాతం దిగువన ట్రేడ్ అయ్యాయి. ముందురోజు బిఎస్‌ఇలో రూ.732చొప్పున ట్రేడ్ అయ్యాయి.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at Flat.No. 22, G Block ,Industrial park Auto Nagar , Gajuwaka, Visakhapatnam-530 012, Phones:2706784,2706785,2706786,2706787,2706622, Fax: 2706522, RNI No.64864/96, Editor : *Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act. Regd.No. H/SD/337/12-14.